ఈనాడు

హైదరాబాద్ 27-9-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 48

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఛాంపియన్

చెన్నైలో ఘనవిజయంతో రెట్టించిన ఉత్సాహంతో టీమ్‌ఇండియా! పుంజుకోవాలన్న తపనతో బంగ్లాదేశ్! రెండు జట్ల మధ్య మరో సమరానికి వేళైంది. కాన్పూర్‌లో నేటి నుంచే రెండో టెస్టు. క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన రోహిత్ బృందాన్ని నిలువరించడం బంగ్లాకు కష్టమైన పనే. భారత్ తిరుగులేని ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ప్రధాన ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ మెరవాలని ఆ జట్టు కోరుకుంటోంది.

భారత్‌కు ఎదురుందా?

బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు నేటి నుంచే

ఉదయం 9.30 నుంచి



ప్రాక్టీస్ సందర్భంగా సరదాగా భారత బృందం

కాన్పూర్

జోరుమీదున్న భారత జట్టు మరో పోరుకు సిద్ధమైంది. శుక్రవారం ఆరంభమయ్యే చివరిదైన రెండో టెస్టులో బంగ్లాదేశ్‌ను ఢీకొంటుంది. బంగ్లాదేశ్ పేసర్ల ధాటికి తొలి రోజు ఇబ్బందిపడ్డా.. అశ్విన్ ఆల్‌రౌండ్ జోరు, శుభ్‌మన్ గిల్ సూపర్ సెంచరీ, జడేజా చక్కటి బ్యాటింగ్, పంత్ అదిరే పునరాగమనంతో తొలి టెస్టులో భారత్ అలవోకగా పైచేయి సాధించింది.. 280 పరుగుల తేడాతో ఘనవిజయాన్నందుకుని, టెస్టుల్లో సొంతగడ్డపై తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. స్వదేశంలో రికార్డు స్థాయిలో 18వ టెస్టు సిరీస్ విజయంపై కన్నేసిన టీమ్ఇండియా.. ఇప్పుడు కాన్పూర్‌లోనూ బంగ్లాను చిత్తు చేయాలని తహతహలాడుతోంది. రోహిత్ సేనను ఆపడం బంగ్లాకు పెను సవాలే.

కూర్పులో మార్పు: బ్యాటుతో గిల్, పంత్‌ల సూపర్ ఫామ్ భారత్‌కు గొప్ప సానుకూలాంశమే. పునరాగమనంలో తొలి టెస్టులోనే పంత్ అదిరే ప్రదర్శన చేశాడు. తన ఆటకు మరో కోణాన్ని జోడించినట్లు కనిపించాడు. అవసరమైనప్పుడు తన దూకుడును తగ్గించుకోవడం ద్వారా పంత్ మరింత ప్రభావాన్ని చూపించాడు. ఇక గిల్ తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైనా రెండో ఇన్నింగ్స్‌లో శతకంతో సత్తా చాటుకున్నాడు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ కూడా ఓ చక్కని అర్ధశతకంతో టచ్‌లో ఉన్నాడు. సీనియర్ ఆటగాళ్లు కెప్టెన్ రోహిత్ శర్మ, కోహ్లిలు రాణించకపోవడమొక్కటే మొదటి టెస్టులో భారత్‌కు వెలితి. ఈ స్టార్ల ఫామ్‌పై ఆందోళనేమీ లేదు కానీ.. రెండో టెస్టులో వాళ్ల సత్తా చాటాలని జట్టు ఆశిస్తోంది. బౌలింగ్‌లో భారత్‌కు ఎలాంటి సమస్యలూ లేవు. చెన్నైలో చెలరేగిపోయిన సీనియర్ ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ మరోసారి బంతితో మాయ చేయాలని ఉవ్విళ్లూరుతున్నాడు. గ్రీన్‌పార్క్ స్టేడియంలో అనుకూలించే పరిస్థితుల్లో అతడి నేతృత్వంలోని స్పిన్ దళాన్ని ఎదుర్కోవడం బంగ్లా బ్యాటర్లకు కష్టమైన పనే. ఈ మ్యాచ్‌కు భారత జట్టులో మార్పు జరగడం ఖాయం. ఇక్కడ పిచ్ సాధారణంగా మందకొడిగా ఉంటుంది. బంతి తక్కువ ఎత్తులో వస్తుంది. ఆరంభంలో పేసర్లకు కాస్త సహకరించినా.. స్పిన్నర్లకే ఎక్కువ మద్దతు లభిస్తుంది. ఈ నేపథ్యంలో భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం ఖాయమే. అంటే ఒక పేసర్ పెవిలియన్‌కే పరిమితం కావాల్సివుంటుంది. ఆకాశ్ దీప్ స్థానంలో కుల్‌దీప్ లేదా అక్షర్ పటేల్ తుది జట్టులోకి వస్తారు. కుల్‌దీప్‌కే అవకాశాలు మెండు. ఒకవేళ జట్టు బ్యాటింగ్‌లో మరింత లోతు కావాలనుకుంటే స్థానిక హీరో కుల్‌దీప్‌ను కాదని అక్షర్‌ను ఆడించే అవకాశముంది. ఎవరున్నా భారత్ స్పిన్‌తో బంగ్లాకు కష్టాలు తప్పవు. బుమ్రా, సిరాజ్ పేస్ భారాన్ని పంచుకుంటారు.

ఒత్తిడిలో బంగ్లా: తొలి టెస్టు బ్యాటుతో విఫలమైన బంగ్లాదేశ్ తుది జట్టులో మార్పులు చేసే అవకాశముంది. ఈ మ్యాచ్‌కు షకిబ్ అందుబాటులో ఉండడంపై బంగ్లాదేశ్ జట్టు మేనేజ్‌మెంట్ భిన్నమైన ప్రకటనలిచ్చింది. వేలి గాయం కారణంగా షకిబ్ ఆడడం సందేహమే అని సెలక్టర్ చెబితే, ప్రధాన కోచ్ హతురసింఘె సెలక్షన్‌కు అతడు అందుబాటులో ఉన్నాడని అన్నాడు. పేస్ బౌలర్ నహీద్ రాణా స్థానంలో ఎడమచేతి వాటం స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్‌ను బంగ్లా తుది జట్టులోకి తీసుకునే అవకాశముంది. భారత్ ఇప్పటివరకు టెస్టుల్లో బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోలేదు. ఒత్తిడిలో ఉన్న బంగ్లా ఇప్పుడు పైచేయి సాధించాలంటే అసాధారణ ప్రదర్శన చేయాల్సిందే.

పిచ్ ఎలా ఉందంటే..

చెన్నైలో స్టేడియంలో ఎర్రమట్టి పిచ్‌పై సీమర్లు, స్పిన్నర్లిద్దరికీ మంచి బౌన్స్ లభించింది. కానీ కాన్పూర్‌లో పరిస్థితి భిన్నంగా ఉండబోతోంది. నల్లమట్టి పిచ్‌పై బౌన్స్ తక్కువగా ఉంటుంది. మ్యాచ్ సాగుతున్నకొద్దీ పిచ్ మరింత మందకొడిగా మారుతుంది. వర్షం పడితే పిచ్‌లో మార్పు ఉండొచ్చు. మ్యాచ్ వేదిక గ్రీన్‌పార్క్‌లో జరిగిన చివరి టెస్టు (2021, న్యూజిలాండ్‌తో)లో భారత్ ముగ్గురు (అశ్విన్, జడేజా, అక్షర్) స్పిన్నర్లతో ఆడింది. అయిదు రోజుల పాటు సాగిన ఆ మ్యాచ్ డ్రాగా ముగిసింది. అంతకుముందు 2016లో జరిగిన టెస్టు కూడా అయిదు రోజులపాటు సాగింది. అది కూడా కివీస్‌తోనే.

వర్షం పడొచ్చు..: కాన్పూర్ టెస్టుకు వర్షం అంతరాయం కలిగించొచ్చు. ప్రతి రోజూ ఆఖర్లో వెలుతురు సమస్య ఎదురుకావొచ్చు. వర్షం వల్ల తొలి, మూడో రోజు ఆట పూర్తిగా సాగే అవకాశాలు తక్కువే.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్, యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, కోహ్లి, పంత్, కేఎల్ రాహుల్, జడేజా, అశ్విన్, కుల్‌దీప్/అక్షర్, బుమ్రా, సిరాజ్

బంగ్లాదేశ్: షద్మాన్, జాకీర్ హసన్, నజ్ముల్ శాంటో, మొమినుల్ హక్, ముష్ఫికర్, షకిబ్, లిటన్ దాస్, మెహిదీ హసన్ మిరాజ్, తైజుల్, హసన్ మహమూద్, తస్కిన్

1 భారత్ తన టెస్టు చరిత్రలో మొదటిసారి ఓటముల (178) కన్నా ఎక్కువ విజయాలతో ఉంది. భారత్ ఇప్పటివరకు 179 టెస్టుల్లో గెలిచింది.

టెస్టుల్లో మూడొందల వికెట్ల ఘనత సాధించిన ఏడో భారతీయుడిగా నిలవడానికి జడేజాకు అవసరమైన వికెట్లు. వికెట్ పడగొడితే ఈ ఫార్మాట్లో బోథమ్ తర్వాత అత్యంత వేగంగా 300 వికెట్లు, 3 వేల పరుగులు సాధించిన రెండో ప్లేయర్‌గా అతడు నిలుస్తాడు. బోథమ్ 72 టెస్టుల్లో ఈ ఘనత సాధించాడు. జడేజా ఇప్పటివరకు 73 టెస్టుల్లో 299 వికెట్లు పడగొట్టాడు. 3122 పరుగులు చేశాడు.

129 టెస్టుల్లో 9 వేల పరుగుల మైలురాయిని అందుకోవడానికి విరాట్ కోహ్లి చేయాల్సిన పరుగులు.

టీ20లకు షకిబ్ గుడ్‌బై

కాన్పూర్ మ్యాచే తన చివరి టెస్టు కావొచ్చన్న ఆల్‌రౌండర్



షకిబ్

కాన్పూర్: బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్ గురువారం తన రిటైర్మెంట్ ప్రణాళికను వెల్లడించాడు. టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలికినట్లు ప్రకటించిన అతడు.. వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీతో వన్డే క్రికెట్‌కు గుడ్‌బై చెప్పనున్నట్లు తెలిపాడు. వచ్చే నెల సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగే టెస్టు సిరీస్‌లో ఆడలేకపోతే భారత్‌తో రెండో టెస్టే కెరీర్‌లో తన చివరి టెస్టు కావొచ్చని కూడా చెప్పాడు. "చాలా కష్టంగా ఉంది. ఆటపై నేను ఎంత దృష్టి పెట్టానో అల్లాకే తెలుసు. నాకు కూడా తెలియదు. టీ20 ప్రపంచకప్‌లో ఆడిన మ్యాచే నా చివరి టీ20 మ్యాచ్. రిటైర్ కావడానికి నాకిది సరైన సమయం. బీసీబీ గొప్ప ఆటగాళ్లను ఎంపిక చేస్తుందని, వాళ్లు బాగా రాణిస్తారని ఆశిస్తున్నా. ఛాంపియన్స్ ట్రోఫీతో నా వన్డే కెరీర్‌ను ముగిస్తా" అని అన్నాడు.

"నా చివరి టెస్టును మిర్పూర్‌లో ఆడాలనుందని బీసీబీతో చెప్పా. వాళ్లు అంగీకరించారు. నేను బంగ్లాదేశ్ వెళ్లడానికి వాళ్లు చేయగలిగినంత చేస్తున్నారు. అది జరగకపోతే కాన్పూర్ టెస్టే నా చివరి టెస్టు" అని షకిబ్ రెండో టెస్టు నేపథ్యంలో జరిగిన విలేకర్ల సమావేశంలో షకిబ్ చెప్పాడు. 38 ఏళ్ల షకిబ్.. బంగ్లాదేశ్ తరపున 70 టెస్టుల్లో 4600 పరుగులు చేసి, 242 వికెట్లు పడగొట్టాడు. 247 వన్డేల్లో 7570 పరుగులు సాధించాడు. 317 వికెట్లు చేజిక్కించుకున్నాడు. అతడు 129 టీ20ల్లో 2551 పరుగులు, 149 వికెట్లు సాధించాడు.

అసలేమైంది..?

షకిబ్ బంగ్లాదేశ్‌లో మర్డర్ కేసును ఎదుర్కొంటున్నాడు. పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ నుంచి షకిబ్ నిరుడు ఎంపీగా ఎన్నికయ్యాడు. ఇటీవల హసీనాకు వ్యతిరేకంగా జరిగిన హింసాత్మక నిరసనల సందర్భంగా జరిగిన ఓ హత్యకు సంబంధించి మరికొందరితో పాటు షకిబ్‌పై కేసు నమోదైంది. అప్పటి నుంచి అతడు స్వదేశానికి వెళ్లట్లేదు. "బంగ్లాదేశ్‌కు తిరిగెళ్లడం సమస్య కాదు. కానీ వెళ్లాక బంగ్లాను వీడడమే కష్టం. నా స్నేహితులు, కుటుంబ సభ్యులు నా భద్రతపై ఆందోళనతో ఉన్నారు" అని షకిబ్ అన్నాడు. బంగ్లాదేశ్‌లో చివరగా ఒకే టెస్టు మ్యాచ్ ఆడతానని, ఆ తర్వాత కుటుంబంతో అమెరికాకు వెళ్లి ఎప్పటికీ స్వదేశానికి తిరిగిరానని కొత్త ప్రభుత్వానికి షకిబ్ లిఖితపూర్వకంగా తెలిపినట్లు తెలుస్తోంది.

ఈసారి పుజారా లేకపోవడం లోటే: విహారి

దిల్లీ: ఆస్ట్రేలియాలో గత రెండు పర్యటనల్లో టీమ్‌ఇండియా విజయాల్లో చెతేశ్వర్ పుజారా కీలకపాత్ర పోషించాడని భారత ఆటగాడు హనుమ విహారి అన్నాడు. భారత బ్యాటింగ్‌కు అతను వెన్నెముకగా నిలిచాడని తెలిపాడు. ఈసారి ఆసీస్ పర్యటనలో పుజారా లేకపోవడం జట్టుకు లోటేనని విహారి చెప్పాడు. పుజారా.. 2018-19 సిరీస్‌లో 521.. 2020-21లో 271 పరుగులు సాధించాడు. అయిదు టెస్టుల బోర్డర్-గావస్కర్ ట్రోఫీ ఈ ఏడాది నవంబరు 22న పెర్త్‌లో ప్రారంభం కానుంది. "పుజారా లేకపోవడం అతిపెద్ద లోటు. గత రెండు సిరీస్‌లలో భారత బ్యాటింగ్‌కు పుజారా వెన్నెముకగా నిలిచాడు. బంతితో దెబ్బలు తగిలించుకున్నాడు. ఎక్కువసేపు క్రీజులో నిలిచాడు. కొత్త బంతిని ఎదుర్కొని పరుగులు రాబట్టాడు. క్రీజులోకొచ్చే మిగతా బ్యాటర్ల పని సులువు చేశాడు. ఈసారి ఆ పాత్రను ఎవరు పోషిస్తారన్నది ప్రశ్నార్థకం. ప్రస్తుతం భారత బ్యాటింగ్‌లో దూకుడు కనిపిస్తోంది. మొదటి ఆరుగురు బ్యాటర్లు షాట్లు ఆడటానికి ఇష్టపడతారు. బ్యాటింగ్ లైనప్‌లో విరాట్ కోహ్లి మిగతా వాళ్లతో కలిసి సుదీర్ఘంగా ఆడగలడు" అని విహారి పేర్కొన్నాడు.

ఆ వార్తలపై పంత్ అసహనం



పంత్

దిల్లీ: వచ్చే ఐపీఎల్‌కు తాను ఆర్సీబీకి మారడానికి ప్రయత్నించినట్లు వార్తలు రావడంపై భారత వికెట్‌కీపర్ రిషబ్ పంత్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నాడంటూ ఓ వ్యక్తిపై అతడు మండిపడ్డాడు. పంత్ ఆర్సీబీ కెప్టెనయ్యే అవకాశాలపై అతడి ప్రతినిధులు విచారించారని, చివరికి ఆర్సీబీలో చేరకూడదని అతడు నిర్ణయించుకున్నాడని ఆ వ్యక్తి ఎక్స్‌లో ఆరోపించాడు. పంత్.. ఆర్సీబీకి రావడం కోహ్లికి ఇష్టం లేదని.. భారత జట్టు, దిల్లీ క్యాపిటల్స్‌లో అతడు చేసిన రాజకీయాలే అందుకు కారణమని అతడు అన్నాడు. దీనిపై పంత్ ఎక్స్‌లో స్పందించాడు. "అది తప్పుడు వార్త. ఇలాంటి వార్తలను మీరు ఎందుకు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తారు. ఇది దారుణం. ఇలా చేయడం ఇదే మొదటిసారి కాదు. చివరిసారి కూడా కాదు. కానీ నేను స్పందించక తప్పట్లేదు. రోజు రోజుకూ ఇలాంటి తప్పుడు వార్తలు ఎక్కువవుతున్నాయి" అని అన్నాడు. పంత్ ఐపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్



శ్రీకాంత్

మకావు: మకావు ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 300 టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు కిదాంబి శ్రీకాంత్, గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఆరో సీడ్ శ్రీకాంత్ 21-13, 21-18తో ఆయుష్ శెట్టిపై విజయం సాధించాడు. క్వార్టర్స్‌లో లాంగ్ ఆగ్నస్ (హాంకాంగ్)తో శ్రీకాంత్ తలపడతాడు. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి- ట్రీసా జోడీ 22-20, 21-11తో లిన్ చున్- చున్ సున్ (చైనీస్ తైపీ) జంటను చిత్తుచేసింది. క్వార్టర్స్‌లో యున్ హ్యా- లిన్ యున్ (చైనీస్ తైపీ) జోడీతో గాయత్రి- ట్రీసా జంట అమీతుమీ తేల్చుకోనుంది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో తస్నిమ్ మీర్ 17-21, 21-13, 10-21తో తొమొక మియజాకి (జపాన్) చేతిలో ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సుమీత్‌రెడ్డి- సిక్కిరెడ్డి జోడీ 17-21, 14-21తో వాంగ్ తీన్- లిమ్ సీన్ (మలేసియా) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

శారీరక దృఢత్వం కీలకం

చెస్ క్రీడాకారులతో ప్రధాని మోదీ



దిల్లీ: ప్రతిరోజూ తీరిక లేని షెడ్యూల్‌ను సమర్థంగా నిర్వహించడంలో శారీరక దృఢత్వానిదే కీలకపాత్ర అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మానసిక క్రీడైన చెస్‌లో కూడా ఇదెంతో ముఖ్యమని తెలిపారు. చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాలు సాధించిన భారత పురుషులు, మహిళల జట్లు తనను కలిసిన సందర్భంగా క్రీడాకారులు అడిగిన ప్రశ్నకు మోదీ ఈ విధంగా స్పందించారు. "మీరు శిక్షణ తీసుకుంటూ ఉండొచ్చు. ఎలాంటి ఆహారం, పానీయాలు తీసుకోవాలో మీకు చెబుతుంటారు. గేమ్‌కు ముందు ఇంత తినాలి.. అది తినొద్దు లాంటి విషయాలన్నీ మీతో చర్చిస్తారు. ఇవన్నీ అలవాటుగా మార్చుకున్నప్పుడే అన్ని సమస్యల్నీ అధిగమించగలం. ఈ విషయంలో యోగా, ధ్యానం అత్యంత శక్తిమంతమైనవి" అని మోదీ తెలిపారు. కృత్రిమ మేధస్సు రాకతో భవిష్యత్తు చెస్ ఎలా ఉండబోతుందని ఈ సందర్భంగా మోదీ వాకబు చేయగా.. "కృత్రిక మేధస్సుతో చెస్ చాలా అభివృద్ధి చెందింది. కంప్యూటర్లు మరింత బలంగా తయారయ్యాయి. కొత్త ఆలోచనలు చూపుతున్నాయి. కృత్రిక మేధస్సు అందరికీ అందుబాటులో ఉంది. ఇది చెస్‌ను ప్రతి ఒక్కరికీ చేరువ చేసింది" అని ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతీ వివరించారు.

ఒలింపియాడ్ విజయం ఆశాజనకమే.. కానీ: ఆనంద్: చెస్ ఒలింపియాడ్‌లో భారత మహిళల జట్టు ఛాంపియన్‌గా నిలవడం ఆశాజనక ప్రదర్శన అని దిగ్గజ ఆటగాడు, అయిదు సార్లు ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ అన్నాడు. దేశంలో మహిళల చెస్ అభివృద్ధి కోసం ఇంకా చాలా కృషి చేయాల్సి ఉందని చెప్పాడు. "ఇది మంచి ఆరంభం. భారత మహిళల జట్టు నిలకడగా సత్తాచాటాలంటే ఇంకా చాలా కృషి జరగాలి. వీలైనంత ఎక్కువ మంది అమ్మాయిలు చెస్ ఆడాలి. ఒలింపియాడ్‌లో స్వర్ణం ఎంతోమంది అమ్మాయిలు చెస్ ఆడేలా స్ఫూర్తినిస్తుంది. నా ఆశ కూడా అదే. ఒలింపియాడ్‌లో భారత్ ప్రదర్శనకు గర్వంగా ఉంది. ఈ ఫలితం ఆశ్చర్యానికి గురిచేయలేదు. కొన్ని గంటల ముందే తెలుసు కాబట్టి అందుకు సిద్ధంగా ఉంటారు. అయితే భారత్ పురుషులతో పాటు మహిళల విభాగంలోనూ ఛాంపియన్ అని గ్రహించగానే చాలా సంతోషంగా అనిపించింది. ఎన్నో ఏళ్లుగా తెలిసిన స్నేహితులతో కలిసి గొప్ప అనుభూతిని ఆస్వాదించా" అని ఆనంద్ వివరించాడు.



హైదరాబాద్ చేరుకున్న అర్జున్ ఇరిగేశి. చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణం గెలిచిన అర్జున్‌కు విమానాశ్రయంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు స్వాగతం పలికారు.

ఝార్ఖండ్‌కు ప్రణవి చంద్ర



ప్రణవి చంద్ర

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు మరో క్రికెటర్ దూరం. స్టార్ క్రికెటర్ వెలగపూడి ప్రణవి చంద్ర 2024-25 సీజన్‌లో ఝార్ఖండ్ సీనియర్ మహిళల జట్టు తరపున బరిలో దిగనుంది. హైదరాబాద్ తరపున రాణించినా.. ఇక్కడ సరైన అవకాశాలు రాకపోవడంతో ఆమె జట్టును వీడాలని నిర్ణయించుకుంది. ఝార్ఖండ్ తరపున ఆడటానికి అనుమతి ఇవ్వాలంటూ ప్రణవి చంద్ర చేసుకున్న విజ్ఞప్తిని ఆ రాష్ట్ర క్రికెట్ సంఘం (జేఎస్‌సీఏ) ఆమోదించింది. వచ్చే సీజన్‌లో ఝార్ఖండ్ తరపున ప్రణవి ఆడనుండటం ఆనందంగా ఉందని జేఎస్‌సీఏ పేర్కొంది.

బేలిస్, బంగర్‌లకు పంజాబ్ గుడ్‌బై

ముంబయి: ఐపీఎల్ ఫ్రాంఛైజీ పంజాబ్ కింగ్స్ తమ జట్టు ప్రధాన కోచ్ ట్రెవర్ బేలిస్, క్రికెట్ అభివృద్ధి చీఫ్ సంజయ్ బంగర్‌లను బాధ్యతల నుంచి తప్పించింది. ఐపీఎల్‌లో పంజాబ్ పేలవ ప్రదర్శన చేస్తుండటంతో ఈ చర్యలు తీసుకుంది. 2023లో ఎనిమిదో స్థానంతో లీగ్‌ను ముగించిన పంజాబ్.. ఈ ఏడాది తొమ్మిదో స్థానానికి పడింది. ఇటీవలే పంజాబ్ కొత్త కోచ్‌గా రికీ పాంటింగ్‌ను ఎంపిక చేసుకున్న సంగతి తెలిసిందే. బేలిస్ 2022 నుంచి, బంగర్ 2023 నుంచి పంజాబ్ జట్టుకు సేవలు అందిస్తున్నారు.

మెరిసిన చండిమాల్, మథ్యూస్

శ్రీలంక 306/3.. కివీస్‌తో రెండో టెస్టు



చండిమాల్

గాలె: దినేశ్ చండిమాల్ (116; 208 బంతుల్లో 15×4) సెంచరీతో కదం తొక్కడంతో న్యూజిలాండ్‌తో ప్రారంభమైన రెండో టెస్టులో శ్రీలంక భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. చండిమాల్ శతకానికి ఏంజెలో మాథ్యూస్ (78 బ్యాటింగ్; 166 బంతుల్లో 6×4) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ తోడవడంతో మొదటి రోజు ఆటలో ఆతిథ్య జట్టు సంపూర్ణ ఆధిపత్యం కనబరిచింది. గురువారం ఉదయం టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన శ్రీలంక మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 306 పరుగులు సాధించింది. రెండు పరుగులకే ఓపెనర్ పాథుమ్ నిశాంక (1) వికెట్‌ను కోల్పోయిన శ్రీలంకను చండిమాల్, దిముత్ కరుణరత్నె (46; 109 బంతుల్లో 4×4) ఆదుకున్నారు. రెండో వికెట్‌కు 122 పరుగులు జోడించి గట్టి పునాది వేశారు. చండిమాల్, మాథ్యూస్ మూడో వికెట్‌కు 97 పరుగులు జతచేసి భారీస్కోరు బాటలు వేశారు. అనంతరం మాథ్యూస్, కమిందు మెండిస్ (51 బ్యాటింగ్; 56 బంతుల్లో 8×4, 1×6) అర్ధ సెంచరీలతో చెలరేగారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు అజేయంగా 85 పరుగులు జోడించి జట్టు స్కోరును 300 దాటించారు. కివీస్ బౌలర్లలో టిమ్ సౌథీ (1/54), గ్లెన్ ఫిలిప్స్ (1/33)కు ఒక్కో వికెట్ లభించింది.

యువ భారత్ క్లీన్‌స్వీప్

పుదుచ్చేరి: ఆస్ట్రేలియాతో జరుగుతున్న అండర్-19 వన్డే సిరీస్‌లో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. గురువారం మూడో వన్డేలో యువ భారత్ ఏడు పరుగుల తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 324 పరుగుల భారీస్కోరు సాధించింది. రుద్ర పటేల్ (77; 81 బంతుల్లో 8×4, 3×6), హర్‌వంశ్ పంగాలియా (46; 47 బంతుల్లో 5×4), కెప్టెన్ మహ్మద్ అమాన్ (71; 72 బంతుల్లో 6×4, 1×6) సత్తా చాటి జట్టుకు మంచి స్కోరు అందించారు. అనంతరం యువ ఆసీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 317 పరుగులు చేయగలిగింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ ఒలివర్ పీక్ (111; 115 బంతుల్లో 9×4, 2×6), స్టీవెన్ హోగాన్ (104; 84 బంతుల్లో 10×4, 4×6) మూడో వికెట్‌కు 180 పరుగులు జోడించి మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చారు. అయితే యువ భారత్ బౌలర్లు యుధజిత్ గుహ (2/40), కిరణ్ చోర్మాలె (2/59), హార్దిక్ రాజ్ (3/55) రాణించి ఆసీస్‌ను కట్టడి చేశారు.



మహమ్మడన్ గెలుపు

చెన్నై: ఇండియన్ సూపర్ లీగ్‌లో మహమ్మడన్ స్పోర్టింగ్ క్లబ్ తొలి విజయాన్నందుకుంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 1-0తో చెన్నయిన్ ఎఫ్‌సీని ఓడించింది. మహమ్మడన్ తరపున ఫనై (39వ) గోల్ కొట్టాడు. మహమ్మడన్ జట్టు ఈ ఏడాదే ఐఎస్‌ఎల్‌లో అరంగేట్రం చేసింది. మూడు మ్యాచ్‌లు ఆడిన ఆ జట్టు పాయింట్ల పట్టికలో అయిదో స్థానంలో ఉంది. తొలి మ్యాచ్‌లో ఓడిన మహమ్మడన్.. రెండో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది.



ఈనాడు



హైదరాబాద్ 27-9-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 48
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

కాళేశ్వరం తప్పిదాలకు బాధ్యులు ఎవరు?

అధికారులా.. నాయకులా..: సీఎం రేవంత్‌రెడ్డి సూటి ప్రశ్న

- నాణ్యంగా నిర్మించి ఉంటే ప్రాజెక్టు కూలేది కాదని వ్యాఖ్య
- నాయకుల తప్పుడు నిర్ణయాల అమలు వల్లనే సమస్య అని వెల్లడి
- గత ప్రభుత్వం రూ.2లక్షల కోట్లు ఖర్చు చేసి ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయలేదని విమర్శ
- కొత్త ఇంజినీర్లకు నియామక పత్రాల పంపిణీ



ఏఈఈ పరీక్షలో టాపర్‌గా నిలిచి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న ఎ.శ్రీనివాస్. పక్కన మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు

ఈనాడు, హైదరాబాద్: "కాళేశ్వరం విషయంలో అందరిపై చర్యలు తీసుకుంటే నీటిపారుదల శాఖే ఉండదు. చర్యలు తీసుకోకపోతే తీసుకోవడం లేదని అంటారు. కాళేశ్వరం న్యాయ విచారణలో ఈఈ చెప్పారని ఒకరు, ఎస్ఈ చెప్పారని ఇంకొకరు.. ఇలా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. రాజకీయ నాయకులు తీసుకునే తప్పుడు నిర్ణయాలను అమలు చేయకుండా ఉంటే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమయ్యేవి కావు" అని ఇంజినీర్లను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్తగా నియమితులైన 687 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు(ఏఈఈలకు) గురువారం జలసౌధలో జరిగిన కార్యక్రమంలో ఆయన నియామకపత్రాలను అందజేశారు. ...మిగతా 2లో

> నాణ్యతతో నిర్మించిన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు దశాబ్దాలుగా వినియోగంలో ఉంటే.. ఐదేళ్ల క్రితం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుడే కూలిపోయింది. నాణ్యతతో నిర్మిస్తే ఇలా ఎందుకు జరుగుతుంది? ఇంజినీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలి.
> - సీఎం రేవంత్ రెడ్డి

నెల రోజుల్లో ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డులు

- దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్ ప్రారంభోత్సవంలో సీఎం 2లో

4 అంతస్తుల భవనం 5 సెకన్లలో నేలమట్టం



- పెద్దాపూర్ చెరువులో 2013లో భవన నిర్మాణం
- తాజాగా వెల్లువెత్తిన ఫిర్యాదులు
- డిటొనేటర్లతో పేల్చిన అధికారులు
- రాయి తగిలి హోంగార్డుకు తీవ్ర గాయం

సంగారెడ్డి అర్బన్, కొండాపూర్, న్యూస్‌టుడే: చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన ఓ బహుళ అంతస్తుల భవనాన్ని అధికారులు నేలమట్టం చేశారు. 5 సెకన్లలోనే 4 అంతస్తుల భవనాన్ని డిటొనేటర్లతో పేల్చేశారు. ఈ ఘటన గురువారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ పంచాయతీ పరిధి కుతుబ్‌షాహిపేట సమీపంలో చోటుచేసుకుంది. ...మిగతా 2లో

కొండాపూర్ మండలం కుతుబ్‌షాహిపేట శివారులోని మల్కాపూర్ పెద్ద చెరువులో నిర్మించిన భవనం.. అందులోకి వెళ్లేందుకు నిర్మించిన వంతెన



డిటొనేటర్లతో నేల మట్టం చేశారిలా..

రిజిస్ట్రేషన్ల శాఖ బదిలీల్లో అక్రమాలు

- తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం
- నలుగురిపై కఠిన చర్యలు!



ఈనాడు, హైదరాబాద్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో చోటుచేసుకున్న బదిలీలకు సంబంధించిన అక్రమాలపై రాష్ట్రప్రభుత్వం కొరడా ఝుళిపించనుంది. జులై నెలాఖరు నుంచి ఆగస్టు మొదటివారంలో జరిగిన జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో పూర్తిగా నిబంధనలను పక్కన పెట్టి కొందరు ఉన్నతాధికారుల అనుయాయులకు పోస్టింగ్‌లు ఇచ్చినట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ వ్యవహారంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ క్షేత్రస్థాయిలో విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక అందించింది. దీంతో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపణలు వచ్చిన అధికారుల పోస్టింగ్‌లపై సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. బదిలీల వ్యవహారంపై మరింత సమాచారం తెప్పించుకుని కఠిన చర్యలు చేపట్టాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించినట్లు సమాచారం.

మరో ముప్పై మందిపైనా చర్యలు

రిజిస్ట్రేషన్ల శాఖలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బదిలీలు చేపట్టాలని.. సమగ్ర అధ్యయనం చేసి నిబంధనలను అనుసరించి బదిలీలు పారదర్శకంగా చేపట్టాలంటూ జులైలో ఆ శాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. ...మిగతా 2లో

హైడ్రా విధానం... సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం

- కూల్చివేతలతో పేరు తెచ్చుకోవాలనుకుంటున్నారా?
- సౌకర్యాలు కల్పించినప్పుడు అక్రమం అనిపించలేదా?
- సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ

6లో

నేటి నుంచి ఎంబీబీఎస్ వెబ్‌ఆప్షన్లు

- 29వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు అవకాశం
- అన్ని కేటగిరీల కన్వీనర్ సీట్ల భర్తీ
- కాళోజీ వర్సిటీ నోటిఫికేషన్


13లో

ఫార్మా సిటీ రద్దు వెనుక రూ.వేల కోట్ల భూకుంభకోణం

- మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపణ
- రాష్ట్ర ప్రజలనే కాకుండా హైకోర్టునూ ప్రభుత్వం మోసం చేస్తోందని వ్యాఖ్య
- రాష్ట్ర సర్కారుకు బహిరంగ లేఖ

6లో

బరువెక్కిన హృదయాలు.. భరోసా ఇస్తున్న దాతలు



బి.ఎస్.ప్రసాద్, ప్రొప్రైటర్, బి.ఎస్.కెమికల్స్, విశాఖపట్నం
విరాళం: రూ.1,11,116



చెరుకూరి సూర్యరత్నప్రసాద్, హైదరాబాద్
విరాళం: రూ.1,00,000

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో వరద బీభత్సం సృష్టించి నెల కావస్తోంది. ఆ విలయం ఆనవాళ్లు విజయవాడలో ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పంటపొలాల్లో వేసిన ఇసుక మేటలు నేటికీ రైతుల హృదయాలను బరువెక్కిస్తున్నాయి. ప్రజలు ఇప్పుడిప్పుడే ఇళ్లు, వాకిళ్లు, పంట పొలాలు సర్దుకుంటున్నా.. వారి జీవనం సజావుగా మళ్లీ పట్టాలెక్కటానికి ఎంతకాలం పడుతుందో ఎవరూ చెప్పలేనిస్థితి. బాధితులు త్వరగా కోలుకోవాలని పలువురు పెద్దమనసుతో ముందుకొచ్చి ఆర్థిక చేయూత ఇస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరపున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
డి.వెంకట్ అక్షయ్, సీహెచ్.బృహతి, హైదరాబాద్	3,00,016
కోగంటి రంగారావు, అద్దంకి, బాపట్ల జిల్లా	50,000
పోతినేని రామమోహనరావు, హైదరాబాద్	50,000
కె.వి.వి.సుబ్రహ్మణ్యం, రాజమహేంద్రవరం	20,000
బొడ్డికూర రమణయ్య, జయమ్మ, వింజమూరు, నెల్లూరు జిల్లా	10,116
చంద్రశేఖర్, విశాఖపట్నం	10,116
ఎం.భావనారాయణ (ఠాగూర్ సమితి), ఈపూరుపాలెం, బాపట్ల జిల్లా	10,116
కందర్ప శ్రీధర్, రాజమహేంద్రవరం	10,000
ఈదర సహస్ర, గుంటూరు	10,000
ఆర్.వి.మురళీకృష్ణ, బెంగళూరు	10,000
నృసింహదేవర లక్ష్మి, ఉప్పాడ, కాకినాడ జిల్లా	10,000
విజ్జపు బాలకృష్ణ, హైదరాబాద్	5,555
కంకిపాటి సురేశ్‌బాబు, కదిరి, సత్యసాయి జిల్లా	5,216
కె.నారాయణశాస్త్రి, హైదరాబాద్	5,116
జనపాలమ్మ, కాకినాడ	5,000
చెరుకూరి వేణు, గన్నవరం, బాపట్ల జిల్లా	5,000
కిలారి శ్యామల, దిల్లీ	5,000
బి.రామకృష్ణ, హైదరాబాద్	5,000
కప్పెర ఉమ, హైదరాబాద్	5,000
రజిత, హైదరాబాద్	5,000
కీనల పవన్‌కుమార్, హైదరాబాద్	5,000
పెండ్యాల రామకృష్ణారావు, కాకినాడ	5,000
జె.సుస్మిత, వనపర్తి	5,000

మీ సాయం.. పోస్తుంది జీవం

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు

ఈనాడు రిలీఫ్ ఫండ్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

అరిటాకు అందం.. 'సహ్యాద్రి' ప్రతిబింబం!



ఎత్తైన పచ్చని సహ్యాద్రి కొండలను ఆనుకుని ఉన్న నిర్మల్ జిల్లాలోని కడెం జలాశయం చూపరులను తన అందాలతో మంత్రముగ్ధులను చేస్తోంది. జలాశయం పొడవునా ఉన్న ఈ పర్వత ప్రతిబింబం నీటిలో పడటంతో భోజనం ఆరగించడానికి నేలపై అరిటాకు పరిచారా అన్నట్టు.. చూపరులకు ముచ్చటగొలుపుతోంది. నిండుగా ఉన్న నీటిపై గాలి తాకిడి లేకుండా ఉన్న సమయంలో అక్కడి అందం ఇలా కట్టిపడేస్తోంది..

– న్యూస్‌టుడే, కడెం

ఏఐ సిటీలో భవిష్యత్ టెక్నాలజీలకు ప్రాధాన్యం

- స్టార్టప్‌ల ప్రోత్సాహానికి ప్రభుత్వం చర్యలు
- అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్‌లో మంత్రి శ్రీధర్‌బాబు



గచ్చిబౌలిలోని ఈఎస్‌సీఐ ఆవరణలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్‌లో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు, అంతర్జాతీయ స్టార్టప్ ఫౌండేషన్ ఛైర్మన్ జేఏ చౌదరి తదితరులు

ఈనాడు, హైదరాబాద్: "తెలంగాణ యంగ్‌ఇండియా స్కిల్‌యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌ను ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ)లో నిర్వహించేందుకు ఆమోదం లభించింది. పాఠశాల విద్యార్థులను స్టార్టప్‌ల దిశగా ప్రోత్సహించేందుకు కొత్తగా జూనికార్న్ ప్రారంభించడం అభినందనీయం. ప్రతిపాదిత ఏఐసిటీలో భవిష్యత్ టెక్నాలజీలకు సంబంధించి అన్ని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) కేంద్రాలను ఏర్పాటు చేస్తాం" అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు ప్రకటించారు. గచ్చిబౌలిలోని ఈఎస్‌సీఐ ఆవరణలో రూ.35 కోట్లతో నిర్మించిన శతాబ్ది కన్వెన్షన్ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం అంతర్జాతీయ స్టార్టప్ ఫౌండేషన్ ఛైర్మన్ జేఏచౌదరి ఆధ్వర్యంలో "ఏఐ హయాంలో నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపక పారిశ్రామికవేత్తలు" అనే అంశంపై చేపట్టిన మూడు రోజుల స్టార్టప్ ఫెస్టివల్-2024లో పాల్గొన్నారు. సదస్సును గురువారం ఉదయం ఎంపీ సురేశ్ శెట్కార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... "ఉమ్మడి రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ పరిశ్రమలను రప్పించడానికి జేఏ చౌదరి ఎంతో కృషి చేశారు. క్యాన్సర్‌ను జయించిన ఆయన స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి నడుం బిగించారు. ఐటీ, ఫార్మా, తయారీ, ఎడ్యుకేషన్, ఫిన్‌టెక్ తదితర స్టార్టప్‌ల మధ్య సమన్వయం సాధిస్తే... మార్కెటింగ్, సప్లైచైన్‌ను పెంచుకోవచ్చు" అని తెలిపారు.

త్రీ-ఎంతో అద్భుత ప్రగతి సాధ్యం: జేఏ చౌదరి

"మనీ, మెంటార్, మార్కెట్(త్రీ-ఎం)లు లేకపోవడంతోనే మన దేశంలో ప్రారంభమవుతున్న పది స్టార్టప్‌లలో తొమ్మిది మనుగడలో ఉండటం లేదు. బెంగళూరులో నిర్వహించిన మా సంస్థ తొలి సమావేశంలో 15 స్టార్టప్‌లను ఎంపికచేసి, వాటికి త్రీ-ఎం విధానాన్ని అనుసంధానించాం. అదేతరహాలో హైదరాబాద్‌లోని స్థిరాస్తి, ఫార్మా వ్యాపారులను ప్రోత్సహించగా రూ.250 కోట్లు సమకూరాయి. ఇప్పటికే రూ.50 కోట్లను 40 స్టార్టప్‌లలో పెట్టుబడులుగా పెట్టాం" అని జేఏ చౌదరి వెల్లడించారు.

డబ్ల్యూఈఎఫ్ తరహాలో ఆర్ఈఎఫ్ ఉండాలి

అంతర్జాతీయ ఎకనామిక్ ఫోరం(డబ్ల్యూఈఎఫ్)కు దావోస్ మాదిరి... మన దేశంలో ఒక ప్రాంతాన్ని రూరల్ ఎకనామిక్ ఫోరం(ఆర్ఈఎఫ్) కేంద్రంగా తీర్చిదిద్దాలని రూరల్ ఎకనామిక్ ఫోరం రౌండ్ టేబుల్ సమావేశం అభిప్రాయపడింది. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా ఛైర్మన్ డాక్టర్ జి.రంగనాథ్, పరిపాలన మండలి ఛైర్మన్ ఎం.శ్యాంప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్ జి.రామేశ్వర్‌రావు, ఈఎస్‌సీఐ సభ్యులు, ఐఎస్ఎఫ్ సహ వ్యవస్థాపకులు శివమహేశ్ టంగుటూరి, సైయంట్ వ్యవస్థాపక ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐల్యాబ్స్ క్యాపిటల్స్ వ్యవస్థాపక ఛైర్మన్ శ్రీనిరాజు, టై అధ్యక్షుడు అమిత్‌గుప్తా, పరిశ్రమల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, సినీ నిర్మాత సురేశ్‌బాబు, హైసియా, జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఫ్రింట్ అంకుర సంస్థ వెబ్‌పేజీ

కృత్రిమ మేధతోనే ముఖాముఖీలు

విద్యార్థుల నైపుణ్యాలను కృత్రిమ మేధ(ఏఐ) అంచనా వేస్తుంది. వారికి మాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. వారు కోరుకుంటున్న ఉద్యోగానికి... అవసరమైన నైపుణ్యాలను అంచనా చేసే సాంకేతికతను అస్సాం రాష్ట్రానికి చెందిన 'ఫ్రింట్- ఫ్రింట్ యువర్ కెరీర్' అనే అంకుర సంస్థ అందుబాటులోకి తెస్తోంది. గచ్చిబౌలిలో జరిగిన స్టార్టప్ ఫెస్టివల్‌లో ఈ సంస్థ తన సేవలను ప్రదర్శించింది. ఫ్రింట్‌లో 150 స్టార్టప్‌లు భాగస్వామ్యం అయ్యాయి. ఇందులో విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నాక... వారిని స్టార్టప్ ప్రపంచానికి పరిచయం చేస్తుంది. ఆయా సంస్థలు కోరిన నైపుణ్యాలున్న వారిని ఇంటర్వ్యూ చేస్తుంది. తద్వారా విద్యార్థులు పెంచుకోవాల్సిన సామర్థ్యాలను, ఇంటర్న్‌షిప్ అవకాశాలను సూచిస్తుంది.

రెట్రో ఫిట్టింగ్... 70 కి.మీ. వేగం



ఈవీగా మారిన పాత ద్విచక్ర వాహనం

రెట్రో ఫిట్టింగ్ (సాధారణ వాహనాన్ని ఎలక్ట్రిక్‌గా మార్చడం) వాహనాల్లో వేగం పెంచుతూ హైదరాబాద్ నాగోల్‌కు చెందిన 'మార్ఫ్' అంకుర సంస్థ కొత్త ఆవిష్కరణ తీసుకొచ్చింది. 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' (ఐవోటీ) సాంకేతికతను అనుసంధానిస్తూ... 70 కిలోమీటర్ల వేగాన్ని (టాప్ స్పీడ్) అందుకునేలా విద్యుత్ వాహనాలను రూపొందించింది. ద్విచక్ర వాహనాలను, ముఖ్యంగా కాలం చెల్లిన వాటినీ పూర్తిస్థాయి ఈవీలుగా మారుస్తోంది. ఇవి 5.5 సెకన్లలో 40 కిలోమీటర్ల పికప్ అందుకుంటాయి. ప్రతి కిలోమీటరుకు 30 పైసలు ఖర్చు అవుతుంది. ఐవోటీ సాంకేతికత ద్వారా వాహనం నడిపిన క్షణకాల సమాచారమూ మొబైల్‌లో నిక్షిప్తం అవుతుంది. రోజులో వాహనం నడిపిన దారి, దాటిన స్పీడ్‌బ్రేకర్లు, లొకేషన్, తిరిగిన కిలోమీటర్లులాంటి గణాంకాలను, వాహనం ఎలా నడుపుతున్నారనే విషయాలనూ తెలుసుకోవచ్చు.

నిర్వాసితుల బాధలు నాకు తెలుసు

- మాజీ మంత్రి కేటీఆర్
- అమ్మమ్మ తాతయ్యల జ్ఞాపకార్థం నిర్మించిన పాఠశాల ప్రారంభం



తరగతి గదులను ప్రారంభిస్తున్న కేటీఆర్, సత్యం. చిత్రంలో సుంకె రవిశంకర్ తదితరులు

ఈనాడు డిజిటల్, సిరిసిల్ల, బోయినపల్లి, న్యూస్‌టుడే: ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్వాసితుల బాధలు ఎలా ఉంటాయో తాను అనుభవించినవాడినేనని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాకలో అమ్మమ్మ తాతయ్యలు కేశవరావు, లక్ష్మిల జ్ఞాపకార్థం రూ.2 కోట్లతో నిర్మించిన పాఠశాల భవనాన్ని చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి కేటీఆర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎగువమానేరు జలాశయం నిర్మాణంలో తమ నాయనమ్మ ఊరు పోసానిపల్లి, మధ్యమానేరులో తమ అమ్మమ్మ ఊరు కొదురుపాక, దిగువమానేరులో తమ ఇంకో అమ్మమ్మ ఊరు వచ్చునూరు ముంపునకు గురయ్యాయని వివరించారు. ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో విద్యావ్యవస్థ ఛిద్రమైందని, గత పదేళ్లలోనూ పెద్దప్రగతి సాధించలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఖాళీగా ఉన్న 11 వేల ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పాఠశాల భవనం నిర్మించినందుకు గ్రామం తరపున కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సిరిసిల్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళ, జోగినపల్లి శ్రీనివాస్‌రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. కొదురుపాకకు చేరుకున్న ఎమ్మెల్యేలు కేటీఆర్, సత్యంలకు భారాస, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా స్వాగతం పలికారు. తరగతి గదులను ప్రారంభించే క్రమంలో ఇరు పార్టీల కార్యకర్తల తోపులాటలతో ఎమ్మెల్యేలు ఇబ్బంది పడ్డారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా... వారిని పోలీసులు పక్కకు తీసుకెళ్లడంతో వివాదం సద్దుమణిగింది.

నాపై కోపం నేతన్నలపై తీర్చుకుంటున్నారు: కేటీఆర్

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: సిరిసిల్ల నేత కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రాజకీయంగా తనపై ఉన్న కోపాన్ని నేతన్నలపై తీర్చుకుంటున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. గురువారం సిరిసిల్లలో చాకలి ఐలమ్మ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను బంద్ చేయడంతో నేతన్నల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. బతుకమ్మ చీరల్లో అవినీతి జరిగిందని ఆరోపణలు చేసినవారు దాన్ని వెలికితీశారా అని ప్రశ్నించారు. సిరిసిల్లను తమిళనాడులోని త్రిపుర మాదిరిగా తీర్చిదిద్దాలనుకున్నానని, దురదృష్టం వల్ల తమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాలేదని చెప్పారు. సిరిసిల్లలో రేషన్ దుకాణాలను అమ్ముకున్నారని కాంగ్రెస్ నాయకులే ఆరోపణలు చేస్తున్నారన్నారు. హైడ్రా బాధితులకు తమ ప్రభుత్వ హయాంలో కట్టిన రెండు పడకగదుల ఇళ్లు కేటాయించాలన్నారు.

అధికారులు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయాలి

రేషన్ దుకాణాల విషయంలో అధికారులు చేసిన తప్పులను వెంటనే సరిదిద్దుకోవాలని, లేదంటే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చర్యలు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు. సిరిసిల్లలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ నిర్ధారణ శిబిరంలో స్థానిక ఎమ్మెల్యే ఫొటో పెట్టలేదన్నారు. ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థుల ఫొటోలు పెట్టి అధికారిక కార్యక్రమాలు నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగేళ్లలో మళ్లీ తమ ప్రభుత్వమే వస్తుందని, అప్పుడు అన్నీ రికవరీ చేయిస్తానని, ఒళ్లు దగ్గరపెట్టుకొని పనిచేయాలని అన్నారు.

21 మంది మైనర్లపై లైంగికదాడుల కేసులో వార్డన్‌కు మరణశిక్ష

టీచర్లకు జైలు..




వార్డన్ యమ్‌కెన్ బాగ్రా

ఇటానగర్: అరుణాచల్ ప్రదేశ్ పాఠశాలలో 21 మంది మైనర్ విద్యార్థులపై లైంగికదాడికి పాల్పడిన కేసులో హాస్టల్ వార్డన్‌కు మరణశిక్ష విధిస్తూ యుపియాలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం గురువారం తీర్పు చెప్పింది. శి-యోమీ జిల్లా కరో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో ఈ లైంగికదాడుల ఘటన జరిగింది. తన 12 ఏళ్ల కవల కుమార్తెలను హాస్టల్ వార్డన్ యమ్‌కెన్ బాగ్రా లైంగికంగా వేధిస్తున్నాడని గతేడాది నవంబరులో ఓ తండ్రి ఫిర్యాదు చేశారు. మరికొందరు బాధితులు ముందుకువచ్చి అవే ఆరోపణలు చేయడంతో బాగ్రాను అరెస్టు చేశారు. దీనిపై దర్యాప్తునకు ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. విచారణలో వార్డన్ అరాచకాలు బయటపడ్డాయి. 2019-22 మధ్యకాలంలో 21 మంది మైనర్లపై అతడు లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడినట్లు ఎస్పీ రోహిత్ రాజ్‌బీర్ సింగ్ తెలిపారు. బాధితులంతా 6 నుంచి 16 ఏళ్లలోపు వయసు వారు కాగా, వీరిలో ఆరుగురు బాలురు కూడా ఉన్నారు. విద్యార్థులపై వార్డన్ లైంగికదాడికి పాల్పడేముందు అశ్లీల వీడియోలు చూపించి మత్తుమందు ఇచ్చేవాడు. ఈ విషయాలు బయటకు చెబితే చంపేస్తానని బెదిరించేవాడు. వార్డన్‌కు మరణశిక్ష.. నేరం గురించి తెలిసీ దాచిపెట్టిన మాజీ ప్రధానోపాధ్యాయుడితోపాటు మహిళా హిందీ టీచరుకు 20 ఏళ్ల చొప్పున కఠిన కారాగారశిక్ష విధిస్తూ పోక్సో న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలి

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు హరీశ్‌రావు లేఖ



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులను విడుదల చేయకపోవడం వల్ల.. అభివృద్ధి నిలిచిపోయిందని, 8 నెలలుగా పారిశుద్ధ్యం కుంటుపడిందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు. పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ గురువారం ఆయన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు లేఖ రాశారు. "జాతీయ ఉపాధి హామీ పథకం తామే తెచ్చామని గొప్పలు చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణలో పథకం అమలు చేయడంలో తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తుండటం శోచనీయం. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1200 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం మెటీరియల్ కాంపొనెంట్‌కు సంబంధించిన 25 శాతం నిధులను విడుదల చేయకుండా చోద్యం చూస్తుండటం శాపంగా మారింది. ప్రభుత్వ పట్టింపులేనితనం వల్ల ఎందరో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పథకానికి సంబంధించి సెప్టెంబరు 30 లోపు యుటిలైజేషన్ సర్టిఫికెట్‌ను కేంద్రానికి అందించని నేపథ్యంలో.. రెండో విడత నిధులు కూడా విడుదల కాని పరిస్థితి నెలకొంటుంది. ఇది రాష్ట్ర ప్రయోజనాలను మరింత దెబ్బతీస్తుంది. ఇప్పటికే గ్రామాల్లో పాలన స్తంభించింది. ప్రభుత్వం స్పందించి వెంటనే పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి" అని హరీశ్‌రావు తన లేఖలో డిమాండ్ చేశారు.



మీకు ఎవరు ముఖ్యమో తెలుసుకోండి

కొంతమంది తమ ఖాళీ సమయాల్లో మీతో మాట్లాడతారు. మరికొందరు మీతో మాట్లాడటానికి సమయాన్ని కేటాయించుకుంటారు. ఆ రెండింటి మధ్య తేడా తెలుసుకున్నప్పుడే మీకు ఎవరు ముఖ్యమో అర్థమవుతుంది. అలాంటి వారితో బంధానికి విలువివ్వండి. వారితో గడిపిన సమయం ఎప్పటికీ వృథా కాదు.

– వాలా అఫ్సర్, కాలమిస్ట్

భారీ వాహనాల డ్రైవింగ్ శిక్షణ!

- మేడ్చల్, చౌటుప్పల్, జడ్చర్ల, జనగామలలో కేంద్రాలు



ఈనాడు – హైదరాబాద్

డ్రైవింగ్ లైసెన్సుల జారీ విధానంలో లోపాల్ని సవరించి, మార్పులు చేయడంపై రవాణాశాఖ దృష్టి సారించింది. రాష్ట్రంలో అనేకచోట్ల డ్రైవింగ్ పరీక్షకు కనీసం ట్రాక్‌లు కూడా లేవు. ఖాళీ ప్రదేశాల్లోనే పైపైన పరీక్షలు నిర్వహించి లైసెన్సులు జారీ చేస్తున్నారు. అనేక కార్యాలయాల్లో దళారుల ప్రభావం కనిపిస్తోంది. రహదారుల ప్రమాదాలకు వాహనదారుల్లో సరైన డ్రైవింగ్ నైపుణ్యం లేకపోవడం కూడా ఓ ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో డ్రైవింగ్ లైసెన్సుల పరీక్షలో శాస్త్రీయత జోడించడంతో పాటు లారీల వంటి భారీ వాహనాలు నడిపే వారికి డ్రైవింగ్‌లో శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు రవాణాశాఖ వర్గాల సమాచారం. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు, డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

మేడ్చల్‌లో 50 ఎకరాల్లో!

కారు డ్రైవింగ్ నేర్చుకునేందుకు హైదరాబాద్, జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో భారీ సంఖ్యలో డ్రైవింగ్ స్కూళ్లు ఉన్నాయి. లారీలకు మాత్రం క్లీనర్లుగా చేరి డ్రైవర్ ద్వారా లారీ నడపడం నేర్చుకుంటున్నారు. అదేవిధంగా గతంతో పోలిస్తే ఉపాధి అవకాశాల రీత్యా క్యాబ్‌ల సంఖ్య భారీగా పెరిగింది. సరిగ్గా డ్రైవింగ్ నేర్చుకోకుండా చాలామంది లారీలు, క్యాబ్‌లకు డ్రైవర్లు అయిపోతున్నారు. రహదారి ప్రమాదాలు ఎక్కువగా ఈ వాహనాల ద్వారానే జరుగుతున్నట్లు రవాణాశాఖ గుర్తించిందని ఓ అధికారి తెలిపారు. మేడ్చల్, చౌటుప్పల్, జడ్చర్ల, జనగామలలో ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు, డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నామని ఓ అధికారి తెలిపారు.

మేడ్చల్ దగ్గర 50 ఎకరాల్లో ఏర్పాటుకానుంది. దీనిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవర్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్‌గా వ్యవహరిస్తారు. చౌటుప్పల్, జడ్చర్ల, జనగామలలో ఏర్పాటు చేసే వాటిని రీజినల్ డ్రైవర్ ట్రైనింగ్ కేంద్రాలుగా పిలుస్తారు. ఈ కేంద్రాల్లో ఆధునిక డ్రైవింగ్ ట్రాక్‌లు ఉంటాయి. లైసెన్సుల జారీలో మానవ ప్రమేయం ఉండదు. ట్రాక్‌లో సెన్సర్లు ఉంటాయి. అంటే వాహనదారు బండిని ఎలా నడిపిందీ అంతా కంప్యూటర్‌లో రికార్డు అవుతుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానమే లైసెన్సు జారీపై నిర్ణయం తీసుకుంటుందని రవాణాశాఖ అధికారి ఒకరు తెలిపారు.

అద్దె స్థలాల్లో పరీక్షలు

రాష్ట్రంలో అనేకచోట్ల డ్రైవింగ్ ట్రాక్‌లు లేకపోవడం ఒక అంశం అయితే.. సొంత స్థలాలు లేక అద్దె స్థలాల్లో డ్రైవింగ్ పరీక్షలు పెట్టడం మరో విషయం. సిరిసిల్లలో అద్దె స్థలంలోనే డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు స్థలానికి నెలకు రూ.16 వేలు అద్దె చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ డ్రైవింగ్ పరీక్షలు, వాహన రిజిస్ట్రేషన్ల సమయంలో దళారులు చురుగ్గా కనిపిస్తుంటారు. పెద్దపల్లిలో డ్రైవింగ్ ట్రాక్ లేదు. రవాణాశాఖ కార్యాలయం ముందున్న కొద్దిపాటి స్థలంలోనే లైసెన్సుల జారీ ప్రక్రియ చేపడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే డ్రైవింగ్ పరీక్ష కేంద్రం కోసం ఐదెకరాలు కేటాయించినా నిధుల కొరతతో ఆ భూమిని మరో అవసరానికి కేటాయించారు.


ఈనాడు

హైదరాబాద్ 27-9-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 48

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



మల్లన్న దారిలో.. మనసు దోచే వంతెన!

- శ్రీశైలం హైవేలో 55 కి.మీ. ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదన
- మన్ననూరు నుంచి పాతాళగంగ వరకు రాష్ట్రంలో అతిపెద్ద వంతెన
- రూ.7 వేల కోట్ల అంచనాతో కేంద్రానికి నివేదిక

ఈనాడు, హైదరాబాద్: శ్రీశైల మల్లన్న స్వామి దర్శనానికి హైదరాబాద్ నుంచి రాత్రివేళలో వెళ్లలేం. పగటిపూట కూడా ప్రస్తుత రహదారిపై 30-40 కి.మీ. కంటే వేగంగా ప్రయాణించలేం. ఏమాత్రం వేగం పెరిగినా జరిమానాలు చెల్లించాల్సి వస్తోంది. పైగా సొంత వాహనాలపై వెళ్లేవారిని వన్యప్రాణుల దాడి భయమూ వెన్నాడుతోంది. ఈ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రతిపాదనలను తెరపైకి తెచ్చింది. అవి కార్యరూపం దాలిస్తే... మన్ననూరు చెక్‌పోస్టు నుంచి ఏకంగా 55 కి.మీ. పొడవైన వంతెన మీదుగా, దట్టమైన అడవుల అందాలను వీక్షిస్తూ, స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ, నేరుగా శ్రీశైలం వరకు వెళ్లవచ్చు. పైగా ప్రయాణ సమయమూ తగ్గనుంది. వేగంపై ఆంక్షలూ తొలగే అవకాశముంది. ఇవీ వివరాలు...

అత్యంత కీలక మార్గం

హైదరాబాద్-శ్రీశైలం-నంద్యాల జాతీయ రహదారి (నంబరు 765) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య అత్యంత కీలకమైంది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులకు తుక్కుగూడ, ఆమనగల్లు, డిండి, మన్ననూరు మీదుగా ఉండే ఈ రోడ్డే ప్రధానం. తెలంగాణ నుంచి తిరుపతికి వెళ్లిరావడానికి దీన్నే ఉపయోగిస్తారు. హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో శుక్ర, శని ఆదివారాల్లో ఏడు వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తాయని అంచనా. ఈ హైవే నల్లమల అటవీప్రాంతం మధ్యలోంచి సాగుతుంది. మార్గంమధ్యలో... అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఉండటం, పెద్దపులులు, ఇతర వన్యప్రాణుల సంచారం కారణంగా ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరణకు గతంలో చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. హైవేలో ఏకంగా 55 కిలోమీటర్ల పొడవున వంతెన నిర్మించేలా రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. వాటిని కేంద్ర ఉపరితల రవాణా శాఖకు, నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్టీసీఏ)కి పక్షం రోజుల క్రితం సమర్పించారు.

ఘాట్ రోడ్డు... దట్టమైన అడవి

హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో ఘాట్ రోడ్డు మొదలయ్యే ప్రాంతం నుంచి ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రతిపాదించారు. మన్ననూరు చెక్ పోస్టుకు ముందు ఉన్న బ్రాహ్మణపల్లి నుంచి ప్రారంభమై... దోమలపెంట తర్వాత వచ్చే పాతాళగంగ(తెలంగాణ సరిహద్దు) వద్ద ముగిసేలా దీని ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ కారిడార్ ఘాట్ రోడ్డులో, దట్టమైన అమ్రాబాద్ అభయారణ్యం మీదుగా సాగుతుంది. జనావాసాలు ఉన్న మన్ననూరు, దోమలపెంటల వద్ద బైపాస్‌లను, మూలమలుపులు ఉన్న చోట నేరుగా వంతెన వెళ్లేలా ప్రతిపాదించారు. "మన్ననూరు-ఫర్హాబాద్ జంగిల్ సఫారీ-వటవర్లపల్లి-దోమలపెంట మీదుగా 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ ఎలైన్‌మెంట్‌ను కేంద్రానికి ప్రతిపాదించాం. ఇది సాకారమైతే రాష్ట్రంలోనే అతిపెద్ద వంతెన అవుతుంది. దీని అంచనా వ్యయం రూ.7,000 కోట్లు. కేంద్రం అనుమతి కోసం ఎదురుచూస్తున్నాం. ఆమోదం రాగానే సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) రూపకల్పనపై దృష్టి పెడతాం" అని ఆర్‌అండ్‌బీ అధికారి ఒకరు తెలిపారు. పాతాళగంగ నుంచి శ్రీశైలం వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇదే తరహా ఎలైన్‌మెంట్ రూపొందించినట్లు తెలుస్తోంది.

అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాల పెంపు 12లో

నవంబరు నుంచి భూముల ధరల సవరణ 13లో
- వచ్చే నెలలో కొత్త రెవెన్యూ చట్టం..

రోజుకు రూ.67 లక్షల దోపిడీ!



జనవరి 1- ఆగస్టు 31 మధ్య	
రాష్ట్రంలో నమోదైన సైబర్ కేసులు	80,273
కేటుగాళ్లు కొట్టేసిన మొత్తం	రూ.1300 కోట్లు
2023లో సైబర్ నేరాల్లో పోయిన మొత్తం	రూ.707 కోట్లు

- పేట్రేగిపోతున్న సైబర్ నేరగాళ్లు
- బాధితుల్లో సగం మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

ఈనాడు, హైదరాబాద్: సైబర్ (ఇంటర్‌నెట్ ఆధారంగా జరుగుతున్న) నేరాలు ఏటికేడు రెట్టింపవుతున్నాయి. ఈ తరహా నేరాల్లో ఆర్థికంగా మోసపోతున్న వారిలో సగం మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ఉంటున్నారు. సైబర్ నేరగాళ్లు రాష్ట్రంలో ప్రతి గంటకు సుమారు రూ.3 లక్షలు.. రోజుకు రూ.67 లక్షలు చొప్పున దోచుకుంటున్నారని తాజా గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాది రాష్ట్రంలో సంప్రదాయ నేరాల్లో దొంగలు దోచుకున్న మొత్తాన్ని (రూ.151.78 కోట్లు).. ఈ ఏడాది ఒక్క నెలలోనే సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. ఈ ఏడాది మొదటి 8 నెలల్లో (జనవరి 1 నుంచి ఆగస్టు 31 వరకూ) రాష్ట్రంలో జరిగిన సైబర్ నేరాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో విశ్లేషణలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

1930కి రోజుకు సగటున 1,600 కాల్స్

రాష్ట్రవ్యాప్తంగా సైబర్ నేరాలకు గురయ్యామని.. ఫిర్యాదుల నంబర్ 1930కు సగటున రోజుకు 1,600 కాల్స్ వస్తున్నాయి. వీటిలో ఆర్థికపరమైన మోసాలకు సంబంధించినవి సగం ఉంటుండగా.. 20% ఆర్థికేతర, 30% ఇతరత్రా ఉంటున్నాయి. బాధితుల్లో సగం మందికి పైగా అంటే 27,256మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కొద్దిమంది ఇతర ప్రైవేటు ఉద్యోగులు ఉన్నారు.

ఏపీ గనుల ఘనుడి అరెస్టు

- వెంకటరెడ్డిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న ఏపీ ఏసీబీ

ఈనాడు, అమరావతి: ఏపీలో వైకాపా ప్రభుత్వ పెద్దలు గత ఐదేళ్లలో సాగించిన ఇసుక, ఖనిజ, గనుల దోపిడీకి వెన్నుదన్నుగా నిలిచి.. సర్వం తానై వ్యవహరించిన గనులశాఖ పూర్వ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డిని ఆ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఎట్టకేలకు అరెస్టు చేసింది. హైదరాబాద్‌లో గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో ఆయన్ను అదుపులోకి తీసుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజుల తర్వాత పరారైన ఆయన మూడు నెలలుగా తప్పించుకుని తిరుగుతున్నారు. జగన్ హయాంలో ఇసుక విధానం ముసుగులో ఏకంగా రూ.2,566 కోట్లు దోచేసినట్లు ఏసీబీ దర్యాప్తులో గుర్తించింది. ఈ దోపిడీకి వెంకటరెడ్డి అన్ని విధాలుగా సహకరించారని తేల్చింది. గనుల శాఖలో టెండర్లు, ఒప్పందాలు, ఏపీఎంఎంసీ నిబంధనలు, కార్యకలాపాలు, ఇసుక తవ్వకాల్లో భారీ ఎత్తున అక్రమాలు, అవినీతి, అవకతవకలకు పాల్పడ్డారనే అభియోగాలపై కొన్నాళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. గనుల శాఖాధికారుల ఫిర్యాదు మేరకు వెంకటరెడ్డిపై ఈ నెల 11న ఏసీబీ కేసు నమోదు చేసింది. అప్పటి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాల్లో గాలిస్తున్న ఏసీబీ బృందాలు.. ఆయన హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశాయి.

కాళేశ్వరం తప్పిదాలకు బాధ్యులు ఎవరు?

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని ఉద్బోధించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన జరిగిన ఇంజినీర్ల సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

ఎవర్ని బాధ్యుల్ని చేయాలి?

"కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తే కట్టడం, కూలడం రెండూ జరిగాయి.. లక్ష ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదు. దీనికి ఎవర్ని బాధ్యులను చేయాలో మీరే చెప్పాలి. అధికారులనా? రాజకీయ నాయకులనా? రాష్ట్రంలో గడిచిన పదేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులేవీ పూర్తి చేయలేకపోయారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాణహిత- చేవెళ్ల, పాలమూరు- రంగారెడ్డి, ఎస్సెల్బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, దేవాదుల, సీతమ్మసాగర్ ప్రాజెక్టులు పూర్తికాలేదు. అలాగే తెలంగాణ వచ్చి పదేళ్లు అయినా... సాగునీటి రంగంపై రూ.2 లక్షల కోట్లు ఖర్చు పెట్టినా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తికాలేదు. కారణమేమిటో ఆలోచించండి. కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎవరు తప్పు చేశారో గుర్తించండి. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యే విధంగా ముందుకెళ్లండి.

మీకు ఇది ఉద్యోగం కాదు.. ఒక భావోద్వేగం

నీళ్లు తీవ్ర భావోద్వేగ అంశం.. మన సంస్కృతిలో భాగం. తెలంగాణ ప్రజల భావోద్వేగం నీళ్లతో ముడిపడి ఉంది. అలాంటి శాఖకు మీరు ప్రతినిధులుగా నియామకమవుతున్నారు. మీకు ఇది ఉద్యోగం కాదు.. ఒక భావోద్వేగం. నీళ్లను ఒడిసిపట్టి ప్రజలకు అందించాల్సిన బాధ్యత మీపై ఉంది. రాష్ట్ర నిర్మాణంలో ఇంజినీర్లు భాగస్వాములై దేశంలో, ప్రపంచంలో రాష్ట్రాన్ని ముందు నిలపాలి. నీళ్లు, నియామకాల ఆకాంక్షల కోసమే తెలంగాణ ఏర్పడింది. తెలంగాణ ఏర్పడిన దశాబ్దం తరువాత నియామకాల ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే ఎల్బీనగర్‌లో 30 వేల ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చాం.

క్షేత్రస్థాయి పరిశీలన లేకపోతే తప్పిదాలకు అవకాశం

ఏ వృత్తిలోనైనా క్షేత్ర స్థాయిలో అనుభవం ఉన్నవాళ్లే రాణిస్తారు. రాజకీయాల్లోనూ క్షేత్ర స్థాయి నుంచి వచ్చిన వారే ఎక్కువ రాణిస్తారు. పీవీ నరసింహారావు, కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి, నీలం సంజీవరెడ్డి లాంటి వారు సర్పంచ్ స్థాయి నుంచి ఎంతో ఎత్తుకు ఎదిగారు. నేను కూడా జిల్లా పరిషత్ సభ్యుడి స్థాయి నుంచే సీఎం స్థాయికి వచ్చా. ఆ అనుభవంతో ఎవరైనా ఏదైనా చెబితే అంచనా వేయగలుగుతున్నా. మేం అధికారంలోకి వచ్చాక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిందేనని ఆదేశించాం. కలెక్టర్లు, ఎస్పీలు క్షేత్రస్థాయికి వెళ్లడం లేదు. వాళ్లు ఎన్నిసార్లు వెళ్లారనేదాని ఆధారంగా పదోన్నతులు కల్పించాలని, వారి సర్వీస్ రిజిస్టర్లలో రాయాలని సీఎస్‌కు కూడా సూచించా. పరిశీలన లేకపోతే తీసుకునే నిర్ణయాలలో తప్పిదాలకు అవకాశం ఉంటుంది.

సిఫార్సుతో వస్తే సుదూరంగా పోస్టింగ్

కొత్తగా శాఖలో చేరిన ఏఈఈలు క్షేత్రస్థాయిలో పనిచేయాలి. ఎవరైనా సిఫార్సుతో వస్తే వారికి సుదూర ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చి పనిష్మెంట్ ఇవ్వండి. పని మీద శ్రద్ధ పెట్టండి.. పోస్టింగ్‌ల మీద కాదు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేస్తే తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలబడుతుంది. క్షేత్రస్థాయిలో పని చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించండి. అంతర్రాష్ట్ర జల వివాదాలు, ఇతర సమస్యలు కూడా ఉన్నాయి. వాటిపై దృష్టి పెట్టండి'' అని సీఎం రేవంత్ సూచించారు.

ఇంజినీర్లకు వాలంతరిలో శిక్షణ: ఉత్తమ్

ఏఈఈలుగా ఎంపికైన వారికి హైదరాబాద్‌లోని వాలంతరిలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఏఈఈలుగా నియామకం పొందిన వారిలో ఐఐటీ, ఎన్ఐటీ నుంచి వచ్చిన వారు ఉండటం శాఖకు మంచి పేరు తెచ్చిపెట్టాలని అభిలషించారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులను సందర్శించాలని శాఖపై పట్టు సాధించాలని కోరారు. దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న కొత్త రాష్ట్రం తెలంగాణ అని, అలాంటి రాష్ట్రంలో నీటిపారుదల ప్రాధాన్య శాఖ అని తెలిపారు. ఇంజినీర్లతోపాటు 281 మంది హెల్పర్లు, 1,597 మంది లస్కర్ల నియామకానికి సీఎం ఆమోదం తెలిపారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ అనిల్‌కుమార్, కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో టాప్ ర్యాంకులు సాధించి ఏఈఈగా నియామకమైన పలువురికి సీఎం, మంత్రి నియామక పత్రాలు అందజేశారు.

నెల రోజుల్లో ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డులు

ఈనాడు, హైదరాబాద్; న్యూస్‌టుడే, నల్లకుంట: నెల రోజుల్లో రాష్ట్రంలో ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డుల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రతి గ్రామంలో ఇంటింటా సర్వే చేసి వ్యక్తిగత ఆరోగ్య ప్రొఫైల్ రూపొందిస్తామని చెప్పారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్‌ను గురువారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "ఆంధ్ర మహిళా సభ ఆధ్వర్యంలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రిలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద క్యాన్సర్ సేవలను అందుబాటులోకి తేవడం గొప్ప విషయం. ప్రస్తుతం యువతతోపాటు వృద్ధుల జనాభా అధికమవుతోంది. అందుకు అనుగుణంగా ముందస్తు ఆలోచనలతో ప్రణాళికలు సిద్ధం చేసుకొని ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందించాల్సి ఉంది. అందుకే అందరి హెల్త్ ప్రొఫైల్స్ తయారు చేస్తున్నాం. 30 రోజుల లోపు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నాం. ఇందు కోసం దుర్గాబాయి దేశ్‌ముఖ్ లాంటి ఆసుపత్రులు, ఎన్జీవోల సహకారం తీసుకుంటాం. ఈ సంస్థలతో ఆరోగ్యశాఖ మంత్రి సమావేశమై దీనిపై కూలంకషంగా చర్చిస్తారు' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ ప్రస్తుతం జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, దుర్గాబాయి దేశ్‌ముఖ్ ట్రస్టు లైఫ్ ట్రస్టీ, ఐఏఎస్ మాజీ అధికారి ఐవైఆర్ కృష్ణారావు, ఆంధ్ర మహిళాసభ అధ్యక్షురాలు లక్ష్మి, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళాసభ ఛైర్మన్ ఎస్వీ రావు, రెనోవా ఆసుపత్రి ఛైర్మన్ వి.కె.శాస్త్రి, ఎండీ శ్రీధర్ పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యానగర్‌లో దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎస్వీ రావు, దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్ పెద్దిరెడ్డి తదితరులు

స్టాండింగ్ కమిటీల్లో తెలంగాణ ఎంపీలకు చోటు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు ఎంపీలకు పార్లమెంటు స్థాయీ సంఘం ఛైర్మన్ పదవులు దక్కాయి. రైల్వేశాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల స్థాయీ సంఘం ఛైర్మన్‌గా మాగుంట శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. ఆయా కమిటీలు, వాటిలో స్థానం దక్కిన తెలంగాణ ఎంపీల వివరాలు ఇలా ఉన్నాయి.. వాణిజ్యం - రేణుకాచౌదరి; ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం: కడియం కావ్య; పరిశ్రమలు- ధర్మపురి అర్వింద్, మల్లు రవి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి; సిబ్బంది, ప్రజాఫిర్యాదులు, న్యాయశాఖ- కేఆర్ సురేష్‌రెడ్డి, రఘునందన్‌రావు; శాస్త్ర, సాంకేతికం, అటవీ, పర్యావరణం- డి.దామోదర్‌రావు, వంశీకృష్ణ; రవాణా, పర్యాటకం, సాంస్కృతికం- సురేశ్ షెట్కార్; ఎరువులు, రసాయనాలు- బలరాం నాయక్, ఈటల రాజేందర్; బొగ్గు, గనులు, ఉక్కు - అనిల్‌కుమార్, కమ్యూనికేషన్లు, ఐటీ - ఆర్.రఘురాంరెడ్డి; ఇంధనం- రఘువీర్; విదేశాంగ వ్యవహారాలు- కె.లక్ష్మణ్, అసదుద్దీన్ ఒవైసీ, డీకే అరుణ; గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాలు- చామల కిరణ్; పెట్రోలియం, సహజవాయువు- వద్దిరాజు రవిచంద్ర; రైల్వే- కె.లక్ష్మణ్; సామాజిక న్యాయం, సాధికారత- గోడం నగేశ్.



అలాంటి వారికి దూరంగా ఉండండి

సానుకూల దృక్పథం ఉన్న వారితో సంభాషిస్తే మీ ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుంది. ప్రతికూల ఆలోచనలు చేసేవారితో గడిపితే మీలో ఆత్మన్యూనత పెరిగే ప్రమాదం ఉంది. అందుకే అలాంటి వారి సాంగత్యానికి దూరంగా ఉండండి. దాంతోపాటు అభద్రతా భావంతో అతిగా ఆలోచిస్తూ సమయం వృథా చేయకండి. మీ పనిని మొదలుపెట్టి చేసుకుంటూ వెళ్లండి. దాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడానికి అవసరమైన మార్గాలు సందర్భానుసారం మీకే తెలిసొస్తాయి.

– గ్యారీ వయ్‌నెర్‌చుక్, ఇన్వెస్ట్‌మెంట్ నిపుణులు

విద్యుత్ బస్సులకు పది కొత్త డిపోలు!

- వంద ఎకరాలు.. రూ.వంద కోట్లు అవసరం
- ప్రభుత్వానికి ఆర్టీసీ ప్రతిపాదన
- పది ఇంటర్మీడియట్ ఛార్జింగ్ స్టేషన్లకు సైతం..

ఈనాడు, హైదరాబాద్: ఎలక్ట్రిక్ బస్సుల కోసం నూతన డిపోలు అవసరమని రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. రాష్ట్రంలో దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సుల్ని ప్రవేశపెడుతున్న నేపథ్యంలో 10 కొత్త బస్ డిపోలు అవసరమని తెలిపింది. ఆర్టీసీలో 9,158 బస్సులున్నాయి. ఇందులో 6,420 సొంతవి, 2,738 అద్దె బస్సులు. ఆర్టీసీకి గత సంవత్సరం రూ.6,833 కోట్లు వ్యయం కాగా, ఇందులో డీజిల్‌కు రూ.1,522.04 కోట్లు (22.27 శాతం) ఖర్చయింది. ఈక్రమంలో ఇంధన వ్యయాన్ని తగ్గించుకునేందుకు ఎలక్ట్రిక్ బస్సులకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.



క్రమంగా పెరుగుతున్న ఎలక్ట్రిక్ బస్సులు..

- 2019లో 40 ఎలక్ట్రిక్ బస్సుల్ని ప్రవేశపెట్టిన ఆర్టీసీ.. 2023లో వెయ్యి బస్సుల సరఫరాకు తయారీ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. దశలవారీగా ఇవి అందుబాటులోకి వస్తున్నాయి. మరో 2,500 ఈ-బస్సుల్ని గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్‌లో తీసుకోవాలని సంస్థ భావిస్తోంది. ఈక్రమంలో పది కొత్త బస్ డిపోలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చింది. ఒక్కో డిపోకు 10 ఎకరాల చొప్పున 100 ఎకరాలు, ఒక్కో డిపో ఏర్పాటుకు రూ.10 కోట్ల చొప్పున రూ.100 కోట్లు ఇవ్వాలని అడిగింది.
- ఈ బస్సులకు ఛార్జింగ్ కోసం 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ సరఫరా అవసరం. 10 కొత్త డిపోలతో పాటు 19 పాత బస్ డిపోలకు హైటెన్షన్ విద్యుత్ సరఫరాకు మరో రూ.232 కోట్లు అవసరం అవుతాయని ఆర్టీసీ అధికారులు లెక్కలు వేశారు.



- నూతన డిపోలతో పాటు హైదరాబాద్‌లోని కోఠి, హయత్‌నగర్ తదితర 10 టెర్మినల్ పాయింట్లలో ఇంటర్మీడియట్ ఛార్జింగ్ స్టేషన్లు అవసరమని.. ఇందుకోసం ఒక్కోచోట 2 వేల చదరపు మీటర్ల స్థలం అవసరమని సంస్థ ప్రతిపాదించింది. ఇంటర్మీడియట్ ఛార్జింగ్ స్టేషన్లకు రూ.6 కోట్ల చొప్పున రూ.60 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేసింది.

హరియాణా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆస్తుల జప్తు

దిల్లీ: హరియాణాలో కాంగ్రెస్ ఎమ్మెల్యే దన్ సింగ్, ఆయన కుమారుడు అక్షత్ సింగ్‌కు చెందిన వివిధ సంస్థలకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో రూ.44 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది. హరియాణా అసెంబ్లీకి ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో దన్ సింగ్ కాంగ్రెస్ పార్టీ తరపున మరోసారి మహేంద్రగఢ్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు.

4 అంతస్తుల భవనం 5 సెకన్లలో నేలమట్టం

(మొదటి పేజీ తరువాయి)

పేలుళ్ల సమయంలో ఓ హోంగార్డు తలకు రాయి తగిలి తీవ్ర గాయమైంది. కొండాపూర్ తహసీల్దార్ అనిత తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన ఐకేఈ స్వామి 2011లో పెద్దచెరువు శిఖంలోని సర్వే నంబరు 95లో మూడెకరాలను కొనుగోలు చేశారు. 250 గజాల్లో నాలుగు అంతస్తుల భవన నిర్మాణం చేపట్టారు. ఇంటినుంచి బయటకు రావడానికి చెరువులో చిన్న వంతెన నిర్మించారు. సంగారెడ్డి జిల్లాలో 2600 ఎకరాల ఆయకట్టు ఉన్న పెద్ద చెరువులో అక్రమంగా భవన నిర్మాణం చేపట్టినా అప్పట్లో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. ఈచెరువు పరిధిలోని రైతులు ఇటీవల అధికారులకు ఈనిర్మాణంపై ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు భవనం అక్రమంగా నిర్మించినట్లు తేల్చారు. పోలీసుల బందోబస్తు మధ్య గురువారం నాలుగంతస్తుల భవనాన్ని కూల్చివేశారు. అక్కడ బందోబస్తులో పాల్గొన్న హోంగార్డు గోపాల్ తలకు పేలుడు ధాటికి ఎగిరి వచ్చిన రాయి తగిలి తీవ్ర గాయమైంది. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. హోంగార్డు పరిస్థితి విషమంగా ఉందని ఇంద్రకరణ్ ఎస్సై విజయ్‌కుమార్ గౌడ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

అధికారులు అనుమతి ఇచ్చారు

"2011లో పట్టా భూమి అనుకొని కొనుగోలు చేశా. అప్పుడు చెరువులో నీళ్లు లేవు. 2012-13లో రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు అనుమతులివ్వడంతో భవనాన్ని నిర్మించా. ఇందులో ఆసుపత్రి ఏర్పాటుచేసి.. ఉచితంగా వైద్యసేవలు అందించాలని నిర్ణయించుకున్నా. అప్పట్లోనే అధికారులు అభ్యంతరం చెబితే భవనాన్ని నిర్మించేవాడిని కాదు. దీని నిర్మాణానికి ఎస్‌బీఐలో రుణం తీసుకున్నా. ప్రస్తుతం బ్యాంకు అప్పు కట్టాల్సి ఉంది. నాకు రూ.6 కోట్ల నష్టం వాటిల్లింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి'' అని భవనాన్ని నిర్మించిన ఐకేఈ స్వామి పేర్కొన్నారు.

ఆధార్, పాన్ వివరాలు బహిర్గతం..

కొన్ని వెబ్‌సైట్లపై కేంద్రం కొరడా

దిల్లీ: ఆధార్, పాన్‌లతో సహా పౌరులకు సంబంధించిన సున్నితమైన వివరాలు బహిర్గతం చేస్తున్న కొన్ని వెబ్‌సైట్లపై కేంద్రం కొరడా ఝుళిపించింది. వాటిని బ్లాక్ చేసినట్లు వెల్లడించింది. ఆయా వెబ్‌సైట్లలో భద్రతా లోపాలు ఉన్నట్లు కేంద్ర ఐటీశాఖ పరిధిలోని 'భారత కంప్యూటర్ అత్యవసర స్పందన బృందం' (సీఈఆర్‌టీ-ఇన్) గుర్తించిన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలు చేపట్టింది. ఆధార్, పాన్, డ్రైవింగ్‌లైసెన్సు వంటి వివరాలతో పాటు పౌరుల వ్యక్తిగత, సున్నిత సమాచారాన్ని కొన్ని వెబ్‌సైట్లు బహిర్గతం చేస్తున్నట్లు ఐటీ శాఖ దృష్టికి వచ్చింది. ఈ వెబ్‌సైట్ల తీరును తీవ్రంగా పరిగణిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది.

28న తిరుమలకు సీజేఐ రాక

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డా.డి.వై.చంద్రచూడ్ శనివారం తిరుపతికి రానున్నట్లు కలెక్టర్ డా.వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు.

రిజిస్ట్రేషన్ల శాఖ బదిలీల్లో అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

గతంలో జరిగిన విధంగా కాకుండా 'జీరో' సర్వీస్‌ను పరిగణిస్తూ అందరినీ బదిలీ చేయాలని ఆదేశించి ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించారు. దీంతో తొమ్మిదేళ్లుగా జరగని బదిలీలన్నీ చేపట్టారు. అటెండర్ నుంచి ఉన్నతాధికారి వరకు స్థానచలనం కల్పించారు. దీంతోపాటు జులై నెలాఖరున దాదాపు 141 మంది సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్ల ట్రాన్స్‌ఫర్లు కూడా చేపట్టారు. 2023లో స్థానచలనం పొందిన సబ్ రిజిస్ట్రార్లను కూడా బదిలీ చేసేశారు. ఈ క్రమంలో 'జీరో' సర్వీసు నిబంధనను కొందరు అనుకూలంగా మార్చుకున్నారన్న ఆరోపణలున్నాయి. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, యాదాద్రి, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కొన్ని కార్యాలయాలకు సంబంధించి పోస్టింగులు ఇష్టానుసారం జరిగాయని తెలియవచ్చింది. హైదరాబాద్‌లోని శాఖ ప్రధాన కార్యాలయంతోపాటు జిల్లా రిజిస్ట్రార్ల కార్యాలయాలకు చెందిన కొందరు బదిలీల్లో జోక్యం చేసుకొని పోస్టింగ్‌లను అనుకున్న వారికి కేటాయించేలా చూశారని, పెద్ద ఎత్తున సొమ్ము చేతులు మారిందన్న ఆరోపణలు వచ్చాయి. బదిలీల సమయంలోనే పటాన్‌చెరు రిజిస్ట్రేషన్ల కార్యాలయంలో ఇద్దరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలపై అనిశా తనిఖీలు చేపట్టింది. అనధికారికంగా గుర్తించిన సొమ్మును, దాదాపు 100 డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. ఈ ఇద్దరు అధికారులూ హైదరాబాద్ పరిసర ప్రాంతాలకే బదిలీ అయ్యారు. ఈ క్రమంలో బదిలీల వ్యవహారంపై రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి దృష్టి సారించారు. నలుగురు ముఖ్యమైన అధికారులకు ఈ వ్యవహారంతో సంబంధం ఉందని గుర్తించినట్లు సమాచారం. 30 మంది వరకు ఇతర అధికారుల పాత్ర ఉన్నట్లు.. వీరిలో కొందరు మంచి పోస్టులు పొందినట్లు తెలిసింది. ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు సమాచారం. బదిలీల విషయంలో పెద్ద మొత్తంలో సొమ్ము చేతులు మారగా.. ఎవరెవరు.. ఎవరి నుంచి లబ్ధి పొందారో సమగ్ర విచారణ చేయిస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పనిచేసిన వారికి సంబంధించిన సర్వీస్ రిజిస్టర్లను కూడా పరిశీలించి.. వివరాలను సేకరించినట్లు తెలిసింది.

గ్రహం అనుగ్రహం

27-9-2024 శుక్రవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; వర్ష రుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం

దశమి: సా. 4-19 తదుపరి ఏకాదశి; పుష్యమి: తె. 4-46 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: మ. 12-14 నుంచి 1-54 వరకు; **అమృత ఘడియలు:** రా. 10-09 నుంచి 11-49 వరకు; **దుర్ముహూర్తం:** ఉ. 8-16 నుంచి 9-04 వరకు; తిరిగి మ. 12-16 నుంచి 1-04 వరకు; **రాహుకాలం:** ఉ. 10-30 నుంచి 12-00 వరకు

సూర్యోదయం: ఉ. 5.53; సూర్యాస్తమయం: సా.5.52; హస్త కార్తె

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	35.8	26.5
అనంతపురం	34.5	24.6
ఒంగోలు	33.8	27.6
కడప	33.0	26.0
తిరుపతి	32.8	25.9
కర్నూలు	32.6	24.5
నిజామాబాద్	32.3	24.7
గుంటూరు	32.0	26.0
రామగుండం	32.0	25.6
హనుమకొండ	32.0	24.0
విజయవాడ	31.8	25.6
ఆదిలాబాద్	31.8	24.7
మెదక్	31.6	21.3
ఖమ్మం	31.4	25.0
కరీంనగర్	31.0	23.0
సూర్యాపేట	30.0	25.0
నల్గొండ	29.5	23.4
విశాఖపట్నం	29.0	25.8
హైదరాబాద్	28.7	23.6
మహబూబ్‌నగర్	26.3	23.2

ప్రాధాన్య ప్రాజెక్టులకు దండిగా నిధులు

● 75%, ఆపైన పూర్తయిన వాటికింద వచ్చే వానాకాలంలో నీళ్లు ● నీటి పారుదల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టులకు సరిపడా నిధులను గ్రీన్‌ఛానల్ ద్వారా విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గురువారం రాత్రి హైదరాబాద్‌లోని నీటిపారుదల శాఖ ప్రధాన కార్యాలయంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి నీటి పారుదల శాఖపై సమీక్షించారు. ఆ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్.. రాష్ట్రంలోని ప్రాజెక్టుల పరిస్థితి, పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... 'సాగు నీటి ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తిచేయాలి. ఎప్పటికప్పుడు నిర్ణీత గడువుతోపాటు లక్ష్యాలను నెరవేర్చేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి. వీలైనంత ఎక్కువ ఆయకట్టుకు ఆరు నెలల్లోనే నీటిని అందించే ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యంగా ఎంచుకోవాలి. ఎప్పుడో ఐదారేళ్లకు పూర్తయ్యే వాటిపై నిధులు ఖర్చు చేస్తే లాభం లేదు. ఇప్పటికే 75%, అంతకుమించి పనులు చేసిన ప్రాజెక్టులను పూర్తిచేస్తే... రానున్న వానాకాలంలోగా మరింత ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశముంది. ఈ వరుసలో రాబోయే రెండేళ్లలో పూర్తయ్యే ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలి. గోదావరి, కృష్ణా పరీవాహకంలోని ప్రాధాన్య ప్రాజెక్టులకు నిధుల ఇబ్బంది రాకుండా ఆర్థికశాఖ చూడాలి. తక్కువ సమయంలో ఎక్కువ ఆయకట్టుకు నీటినిచ్చే వాటికి గ్రీన్‌ఛానల్ ద్వారా బిల్లులను చెల్లించాలి' అని సూచించారు. ఈ సందర్భంగా... విద్యుత్తు విభాగంతో కొన్ని బిల్లుల చెల్లింపుల సమస్యలున్నాయని అధికారులు పేర్కొన్నారు. దీంతో స్పందించిన సీఎం... 'ఇతర విభాగాలతో సమన్వయం లోపిస్తే పనులు ముందుకెళ్లవు. వెంటనే ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలతో నీటిపారుదలశాఖ సంయుక్త సమావేశం నిర్వహించాలి. భూసేకరణ వేగంగా పూర్తయ్యేందుకు రెవెన్యూ విభాగంతోనూ సమన్వయం చేసుకోవాలి' అని ఆదేశించారు.



గోదావరి, కృష్ణా బోర్డుల ఛైర్మన్లు ఎంకే సిన్హా, అతుల్ జైన్, ఇతర సభ్యులతో సమావేశమైన సీఎం రేవంత్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మంత్రులు పొన్నం, తుమ్మల, ఉత్తమ్

ఇంజినీర్లపై పనిభారం తగ్గుతుంది

సాగునీటి విభాగంలో కొత్తగా చేరిన ఏఈఈలతో ఇప్పుడున్న ఇంజినీర్లపై పనిభారం కొంతమేరకు తగ్గుతుందని సీఎం అన్నారు. కొనసాగుతున్న ప్రాజెక్టులన్నిటికీ సంబంధించిన భూసేకరణను మొదట పూర్తి చేయాలన్నారు. భూనిర్వాసితులతో అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించాలన్నారు. చిన్నకాళేశ్వరం, మోడికుంటవాగు, లోయర్ పెన్‌గంగ, చనాఖా కొరటా, జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, కోయిల్‌సాగర్, మహాత్మాగాంధీ కల్వకుర్తి, నెట్టెంపాడు, రాజీవ్ బీమా ఎత్తిపోతలు, ఎలిమినేటి మాధవరెడ్డి ఎస్ఎల్బీసీ, డిండి, ఎస్సారెస్పీ-2, సదర్‌మట్ బ్యారేజ్, నీల్వాయి, పాలెంవాగు ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవకాశాలున్నాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. అనంతరం సీఎంతో గోదావరి, కృష్ణా బోర్డుల ఛైర్మన్లు ఎంకే సిన్హా, అతుల్ జైన్, ఇతర సభ్యులు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి సిటిజన్స్ ఫోరం

● విశ్రాంత ఐపీఎస్ అధికారి వి.కె.సింగ్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పలువురు విశ్రాంత ఐపీఎస్, ఐఆర్ఎస్ ఉన్నతాధికారులు, వ్యాపారులతో కలిసి 'తెలంగాణ సిటిజన్స్ ఫోరం' ఏర్పాటుచేసినట్లు ఫోరం కో-ఆర్డినేటర్, విశ్రాంత ఐపీఎస్ అధికారి వి.కె.సింగ్ ప్రకటించారు. గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఫోరం తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొంతకాలంగా పాలన సక్రమంగా సాగడం లేదన్నారు. ప్రజలు, అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు పారదర్శకమైన సేవలు అందేలా ఫోరం పనిచేస్తుందన్నారు. 16మందితో ఫోరం ప్రతినిధి మండలిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వీరిలో విద్యావేత్త చుక్కా రామయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి నాగిరెడ్డి, గ్లోబల్ ఆసుపత్రి ఛైర్మన్ డా.రవీంద్రనాథ్ ఉన్నారని వివరించారు. ప్రభుత్వం, ప్రజలకు మధ్య అనుసంధానకర్తగా ఉండటమే ఫోరం లక్ష్యమని విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి బి.వి.గోపీనాథ్ పేర్కొన్నారు.

'అమ్మ పేరుతో ఒక మొక్క'లో యూపీ రికార్డు

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అమ్మ పేరుతో ఒక మొక్క' పథకంలో ఉత్తర్‌ప్రదేశ్ రికార్డు సృష్టించింది. జూన్ 5 నాటికి ఆ రాష్ట్రం 26.5 కోట్ల మొక్కలను నాటి అగ్ర స్థానంలో నిలిచింది. కేంద్ర పర్యావరణశాఖ గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ పథకంలో భాగంగా తెలంగాణ 8.34 కోట్ల మొక్కలను నాటింది. గుజరాత్ 15.5 కోట్ల మొక్కలను నాటింది. ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ పథకంలో భాగంగా ఈ ఏడాది సెప్టెంబరు నాటికి 80 కోట్లు, వచ్చే ఏడాది మార్చి నాటికి 140 కోట్ల మొక్కలను నాటాలనేది లక్ష్యం.

శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ గవర్నర్



శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం దర్శించుకున్నారు. తెల్లవారుజామున ఆలయానికి చేరుకున్న గవర్నర్‌కు తితిదే అధికారులు స్వాగతం పలికారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి ఆయన శ్రీవారి అర్చన సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వారికి వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే శ్రీవారిని రాజస్థాన్ మంత్రి సంజయ్ శర్మ దర్శించుకున్నారు. –న్యూస్‌టుడే, తిరుమల

గృహహింస చట్టానికి మతంతో సంబంధం లేదు: సుప్రీంకోర్టు

దిల్లీ: మహిళలకు రక్షణ కల్పించే గృహహింస చట్టం-2005 ఒక పౌరస్మృతి అని, మతంతో, సామాజిక నేపథ్యంతో సంబంధం లేకుండా ఇది దేశంలోని మహిళందరికీ వర్తిసుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఓ మహిళ భరణం, పరిహారానికి సంబంధించిన కేసులో తీర్పునిస్తూ న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "గృహహింసకు గురయ్యే మహిళాబాధితులను రక్షించేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఈ చట్టం రక్షిస్తోంది. మతంతో, సామాజిక నేపథ్యంతో సంబంధం లేకుండా పౌరస్మృతిలో భాగమైన ఈ చట్టం దేశంలోని మహిళలందరికీ వర్తిస్తుంది'' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఈనాడు

ఊడలు దిగిన వికృత సంస్కృతి


దేశాల సరిహద్దులకు అతీతంగా ప్రపంచ ప్రజల నడుమ అనుసంధాన వారధులను నిర్మించింది అంతర్జాలం. విజ్ఞాన సర్వస్వంగా, వినోద కేంద్రంగా, ఉపాధికల్పనా క్షేత్రంగా, పౌరసేవలను సులభతరం చేసిన సాంకేతిక అద్భుతంగా... ఇంకా అనేక విధాలుగా విశ్వ మానవాళికి విస్తృతంగా ఉపయోగపడుతోంది ఇంటర్నెట్. అదే సమయంలో దాని దుర్వినియోగమూ విపరీతమవుతోంది. అంతర్జాలాన్ని ముంచెత్తుతున్న అశ్లీల దృశ్యాల వరద- సామాజిక సంక్షోభానికి కారణమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా వెర్రితలలు వేస్తూ వేగంగా విస్తరిస్తున్న అశ్లీల దృశ్య పరిశ్రమ (పోర్న్ ఇండస్ట్రీ) విలువ ప్రస్తుతం రూ. 8.11 లక్షల కోట్లకు పైబడినట్లు అంచనా. మనిషిని నైతికంగా పతనం చేసి, జుగుప్సాకర నేరాలకు ప్రేరేపిస్తున్న ఈ దౌర్భాగ్య సంస్కృతిలో అత్యంత వికృత కోణం- చిన్నారులతో అశ్లీల దృశ్యాల చిత్రీకరణ! దీని విపరిణామాలు విశృంఖలమవుతున్న వేళ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పునిచ్చింది. చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం, డౌన్‌లోడ్ చేయడంతో పాటు ఆ నీలిచిత్రాలను కలిగి ఉండటమూ నేరమేనంటూ నాలుగు రోజుల క్రితం 'సుప్రీం' ఇచ్చిన ఆదేశాలు అవసరమైనవి, అవశ్యం ఆచరణీయమైనవి!

వివిధ అధ్యయనాల ప్రకారం, ఇంటర్నెట్‌ను తరచూ వినియోగించే భారతీయుల సంఖ్య 82కోట్లకు పైబడింది. దానికి తగినట్లే- నీలిచిత్రాలకు అధిక సంఖ్యలో వీక్షకులు ఉన్న దేశాల్లో ఒకటిగా ఇండియా పరువుమాస్తోంది. చూడటమే కాదు- పోర్న్ వీడియోలను అంతర్జాలంలో అప్‌లోడ్ చేయడంలోనూ భారతీయుల పాత్ర అధికంగా ఉన్నట్లు పరిశోధనలు చాటుతున్నాయి. ముఖ్యంగా పిల్లల అశ్లీల చిత్రాలు, దృశ్యాలను ఆన్‌లైన్‌లోకి బట్వాడా చేస్తున్న దేశాల్లో ఇండియా, థాయ్‌లాండ్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఆ మేరకు అమెరికాకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్ (ఎన్‌సీఎంఈసీ) సంస్థ చేదువాస్తవాలను వెల్లడించింది. దిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ్ బెంగాల్ నుంచి చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలు ఎక్కువగా ఇంటర్నెట్‌లోకి వచ్చిచేరుతున్నట్లు ఎన్‌సీఎంఈసీ గుర్తించింది. చిన్నారులపై చిత్రీకరించిన అశ్లీల దృశ్యాలను చూస్తూ, ఇతరులకు షేర్ చేస్తున్న ప్రబుద్ధులు తెలుగు రాష్ట్రాల్లోనూ పోగుపడ్డారు. అడపాదడపా పోలీసుల దాడుల్లో కొందరు పట్టుబడుతున్నారు. సాంకేతిక నిఘా ద్వారా అశ్లీల వెబ్‌సైట్లు, యాప్‌లను కట్టడి చేయకపోతే- భావితరానికి భద్రతే ఉండదు!

ఈతరం పిల్లలు ఆరేళ్ల వయసు నుంచే సెల్‌ఫోన్లను వినియోగిస్తున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపించడంతో వారిలో చాలామంది అశ్లీల దృశ్యాల వీక్షణకు అలవాటుపడుతున్నారు. పదకొండు నుంచి పదమూడేళ్ల ప్రాయంలోనే పోర్న్ వీడియోలకు బానిసలవుతున్నవారు గణనీయంగా ఉన్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లోని రీవా జిల్లాలో మొన్న ఏప్రిల్‌లో పదమూడేళ్ల పిల్లాడొకడు అశ్లీల దృశ్యాల మాయలోపడి తొమ్మిదేళ్ల సోదరిపై అఘాయిత్యానికి పాల్పడి చంపేశాడు. ఎనిమిది నుంచి పదకొండేళ్ల పిల్లలు ముగ్గురు... తమతో కలిసి నీలిచిత్రాలను చూడలేదని ఆరేళ్ల పసిదాన్ని రాళ్లతో కొట్టి చంపారు. అస్సామ్‌లో జరిగిందీ దారుణం! ఇలాంటివి పలు రాష్ట్రాల్లో వెలుగుచూస్తున్నాయి. అంతర్జాలంలో అశ్లీల దృశ్యాల వ్యాప్తి నిరోధానికి, నీలిచిత్రాల తయారీదారుల పీచమణచడానికి ప్రభుత్వాలు సరైన చొరవ తీసుకోకపోతే ఇంకెన్ని అనర్థాలు సంభవిస్తాయో ఊహించలేం. ఇంట్లో పిల్లలకు మంచీచెడూ చెబుతూ సరైన దారిలో పెట్టడమెంత అవసరమో- విద్యాలయాల్లో నైతిక విద్యాబోధనకు పట్టంకట్టడమూ అంతే ప్రధానం!

అమృత ఫలాలు

జీవితమనే వృక్షానికి రెండే అమృత ఫలాలు. అవి- మంచి వ్యక్తులతో సహవాసం, మేలిమి గ్రంథాలు చదవడం. జ్ఞానంతో పాటు చక్కటి గుణాలు, మంచి మనసు కలిగినవారిని సజ్జనులు అంటారు. వారు చెడ్డవారి మధ్య ఉన్నా తమ సొంత గుణాన్ని వదులుకోరు. వారి సాన్నిహిత్యంలో భయానికి చోటుండదు. స్వార్థంతో కూడిన ఆలోచనలు దూరమవుతాయి. మనసులోని ఉద్రేకాలు తగ్గి ప్రశాంతత నెలకొంటుంది. వారి సహవాసం బుద్ధిమాంద్యాన్ని పోగొడుతుంది. మనసులోని చెడు ఆలోచనలను తొలగిస్తుంది. సత్యం గొప్పదనం తెలిసివస్తుంది. గంగానది పాపాన్ని, చంద్రుడు తాపాన్ని, కల్పవృక్షం పేదరికాన్ని పోగొడతాయని పెద్దలు చెబుతారు. మంచి వ్యక్తుల ఆశ్రయం, వారి దర్శనం కూడా ఆ మూడింటినీ లభింపజేస్తాయి.



అంతర్యామి

మంచి మనుషుల సహవాసం మనసు నిశ్చలంగా ఉండేలా చేస్తుంది. దానివల్ల అనవసర ఆరాటాలు దూరమవుతాయి. అంతిమంగా అది ముక్తిపథానికి కారణమవుతుందన్నారు ఆదిశంకరులు. అందుకే మంచి వ్యక్తుల సాంగత్యాన్ని మోక్షద్వారాల్లో ఒకటిగా అభివర్ణిస్తారు. ధృతరాష్ట్రుడు పుట్టుకతో అంధుడు. కొడుకుల చెడ్డపనులను అతడు నిలువరించకపోవడం పెను వినాశనాన్ని తెచ్చిపెట్టింది. ధృతరాష్ట్రుడి తమ్ముడు విదురుడు జ్ఞాని. నీతికోవిదుడు. అందరి మంచినీ కోరుకునేవాడు. విదురుడి హిత వాక్యాలను ధృతరాష్ట్రుడు వినేవాడంతే. వాటిని ఆచరణలో పెట్టేవాడు కాదు. ఫలితం మహాభారత యుద్ధం. కృష్ణపరమాత్మ దుర్యోధనుడు, అర్జునుడు ఇద్దరికీ బంధువే. దుర్యోధనుడు కృష్ణుడి హిత వచనాలను ఎగతాళిచేసి, వంశ వినాశనానికి కారణమయ్యాడు.

బుద్ధిమంతులు మంచి పుస్తకాలు చదువుతూ, విజ్ఞులతో చర్చిస్తూ కాలాన్ని సద్వినియోగం చేసుకుంటారు. మూర్ఖులు వ్యసనాలు, అనవసర కలహాలతో సమయాన్ని వృథా చేసుకుంటారు అంటుంది సుభాషితం. రామాయణ భారత భాగవతాల వంటి గ్రంథాలు చదవాలి. శాస్త్రాలను అధ్యయనం చేయాలి. వ్యక్తుల అభివృద్ధికి తోడ్పడే చిన్న వాక్యమైనా అది ఒక మేలిమి గ్రంథంతో సమానమే. భారతంలో కొన్ని విషయాలను స్థూలంగా చూస్తే ధర్మం అధర్మంగా కనిపిస్తుంది. సూక్ష్మంగా పరిశీలిస్తే వాటిలోని అసలు సత్యం గోచరిస్తుంది. రామాయణం మనుషులందరికీ మార్గదర్శి. భాగవతం చదవడం వల్ల మనసు భగవంతుడి భక్తి వైపు మళ్లుతుంది. ఆత్మ, పరమాత్మల కలయిక అర్థమవుతుంది.

జీవితంలో ఉన్నత స్థితికి చేరడానికి తోడ్పడేవారిని ఆశ్రయించాలి. అలాంటివారిని అనుసరించాలి. ఏ శాస్త్రాలు బుద్ధిని వికసింపజేస్తాయో వాటిని మరీ మరీ చదవాలి. వాటిలోని జ్ఞానాన్ని పూర్తిగా గ్రహించాలి. ఈ రెండింటినీ సరిగ్గా వినియోగించుకున్నవారు జీవిత మాధుర్యాన్ని ఆస్వాదించడంతో పాటు బతుకును అర్థవంతం చేసుకోగలుగుతారు.

– కస్తూరి హనుమన్నాగేంద్ర ప్రసాద్

'యుద్ధం ఆగేది అప్పుడే...'



పొరుగుదేశమైన లెబనాన్‌తో తాము యుద్ధం కోరుకోవడంలేదని భారత్‌లో ఇజ్రాయెల్ డిప్యూటీ అంబాసిడర్ ఫారిస్ సాయెబ్ స్పష్టం చేశారు. హమాస్, హెజ్బొల్లాలు రెండింటినీ ఇరాన్ వెనక ఉండి నడిపిస్తోందని వ్యాఖ్యానించారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఫారిస్‌తో 'ఈటీవీ భారత్' ప్రతినిధి చంద్రకళా చౌధురి ముఖాముఖి...



గాజాపై దాడి తరవాత లెబనాన్ నుంచి హెజ్బొల్లా దాడులను ఇజ్రాయెల్ ఎదుర్కొంటోంది. ఈ ఉద్రిక్తతలు తగ్గేదెన్నడు?

హమాస్ చెరలో ఇప్పటికీ చాలామంది ఇజ్రాయెలీలు బందీలుగా ఉన్నారు. వారిని విడిపించుకుని, హమాస్‌ను తుడిచిపెట్టేవరకు యుద్ధం ఆపే ప్రసక్తి లేదు. మానుంచి ఎలాంటి కవ్వింపు లేకపోయినా లెబనాన్‌లోని హెజ్బొల్లా గతేడాది అక్టోబరు నుంచి ఇజ్రాయెల్‌పై క్షిపణులు ప్రయోగిస్తోంది. ఎదురుదాడికి దిగకుండా మేము సంయమనం పాటించాం. హమాస్, హెజ్బొల్లాలు రెండూ ఇరాన్ చెప్పినట్లు ఆడతాయి. యెమెన్‌లో హూతీలు, ఇరాక్‌లో కొన్ని తీవ్రవాద గ్రూపులు కూడా ఇరాన్ చెప్పుచేతల్లో ఉన్నాయి. ఇరాన్ ప్రోద్బలంతో ఈ ముఠాలన్నీ ఇజ్రాయెల్‌పై బహుముఖ పోరాటం మొదలుపెట్టాయి. అయినా, హమాస్ చెరలోని బందీలను విడిపించుకోవడమే మా ప్రాధాన్యం కాబట్టి, ఇతరుల దాడులకు మేము స్పందించలేదు. ఇటీవల గోలాన్ హైట్స్‌లోని డ్రూజ్ గ్రామాలపై హమాస్ క్షిపణి ప్రయోగంలో 12 మంది బాలలు మరణించారు. దురదృష్టవశాత్తూ వారిలో అయిదుగురు నా బంధువులే. హెజ్బొల్లా కూడా మా పౌరులపై కాల్పులు మొదలుపెట్టింది. దాదాపు ఎనభై వేల మంది ఇజ్రాయెలీలు ఇల్లూవాకిళ్లు వదలిపెట్టాల్సి వచ్చింది. వారు మళ్లీ క్షేమంగా తమ గృహాలకు వెళ్లగలగాలి. హెజ్బొల్లా ఏం సాధించాలనుకొంటోంది? యుద్ధాన్ని ఎంత వరకు తీసుకెళ్లదలిచింది? మేమైతే పొరుగుదేశమైన లెబనాన్‌తో యుద్ధం కోరుకోవడం లేదు. కానీ, మాపై దాడి చేయాలని హెజ్బొల్లాను ఇరాన్ రెచ్చగొడుతోంది. దీన్ని లెబనాన్ గ్రహించి ఉద్రిక్తతలను ఉపశమింపజేయడానికి ముందుకొస్తుందని ఆశిస్తున్నాం.

హమాస్‌తో పోరు మొదలై ఏడాది కావస్తోంది. గాజాలో శాంతి ఎప్పటికి నెలకొంటుంది?

హమాస్ చెరలో బందీలు ఉన్నంత వరకు శాంతి చర్చలు ఎలా సాధ్యం? బందీలను అడ్డుపెట్టుకొని హమాస్ పోరాటం సాగిస్తోంది. హమాస్‌ను తుడిచిపెట్టిన తరవాతే శాంతీ సయోధ్యల గురించి చర్చించగలం. అంతర్జాతీయ సమాజం, ఉదారవాద అరబ్, పాలస్తీనా నాయకత్వాలతో కలిసి శాంతి సాధనకు కృషిచేయగలుగుతాం. కానీ, దానికన్నా ముందు హమాస్ చెరలోని ఇజ్రాయెలీలు విడుదలవ్వాలి.

> ఇండియా కొన్నేళ్లుగా ప్రగతిపథంలో పయనిస్తోంది. చంద్రుడి మీదకూ వెళ్లింది. మేమూ చంద్రమండల యాత్రకు ప్రయత్నించాం. ప్రస్తుతం భారత్, ఇజ్రాయెల్‌ల మధ్య అన్ని స్థాయుల్లో, అన్ని రంగాల్లో సమన్వయ సహకారాల వృద్ధికి కృషి జరుగుతోంది. అందుకే నేను భారత్‌లో ఇజ్రాయెలీ దౌత్యవేత్త పదవికి దరఖాస్తు చేశాను. సరైన సమయంలో సరైన చోట ఉండాలని కోరుకున్నాను. రెండు నెలల క్రితం పదవిని చేపట్టినప్పటి నుంచి భారతీయ స్టార్టప్‌లు, టెక్నాలజీ సంస్థల నాయకులతో మాటామంతీ జరుపుతున్నాను. వ్యవసాయం, నీటిని పొదుపుగా వాడటం వంటి అంశాల్లో ఇప్పటికే రెండు దేశాలూ సహకరించుకుంటున్నాయి. ఇకపై ఆరోగ్య రంగంలో సహకారం, ప్రజలు, సంస్థల మధ్య బంధం బలపరచుకోవడం గురించి చర్చిస్తున్నాం.

భారత్‌కు ఇజ్రాయెల్, పాలస్తీనాలు రెండింటితో సత్సంబంధాలు ఉన్నాయి. పశ్చిమాసియా సంక్షోభంపై భారత్ వైఖరిని ఎలా చూస్తారు? ఇండియా నుంచి ఏం ఆశిస్తున్నారు?

అంతర్జాతీయ వేదికలపై భారత్ ఉదారవాద వాణిని వినిపిస్తోంది. అయితే, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో నిమగ్నమైన అంతర్జాతీయ సంస్థలనూ రాజకీయాలకు వాడుకోవాలని పాలస్తీనా, ఇతరులు చూస్తున్నారు. దీన్ని నిరోధించడానికి భారత్ మాతో కలిసి వస్తుందని కోరుకుంటున్నాం.

ఇజ్రాయెల్ ప్రత్యేక విజ్ఞప్తి మేరకు భారత్ నిర్మాణ కార్మికులను పంపింది. అక్కడ వారికి కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని వార్తలొచ్చాయి... వాటి మీద ఇజ్రాయెల్ స్పందనేంటి?

రెండు దేశాల ప్రభుత్వాలు, వ్యాపార సంస్థల మధ్య వివిధ సహకార ఒప్పందాలున్నాయి. అందులో భాగంగా అన్ని సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతుంది. భారతీయ సిబ్బంది ఇబ్బందుల గురించి సమాచార సాధనాల్లో కొన్ని అతిశయోక్తులు ప్రచారమవుతున్నాయి. ఇజ్రాయెల్‌కు వచ్చిన భారతీయుల్లో అత్యధికులు నిపుణ కార్మికులే. ఇప్పటికే మా దేశంలో పదివేల మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. మున్ముందు వారి సంఖ్య మరింత పెరగనుంది. భారతీయ సంస్థలు ఇజ్రాయెల్‌లో మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపడుతున్నాయి. రెండు దేశాల మధ్య వ్యాపార, పని పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. వాటికి అలవాటుపడటానికి కొంత సమయం పడుతుంది. ఇజ్రాయెల్‌లో పనిచేసే విదేశీయులకు పూర్తి భద్రత కల్పిస్తున్నాం.

పశ్చిమాసియా సంక్షోభ పరిష్కారానికి భారత్‌తో కలిసి తెరవెనక ప్రయత్నాలేమైనా జరుగుతున్నాయా?

దౌత్యపరంగా జరిగేవాటన్నింటి గురించి బయటకు వెల్లడించలేం. ఇండియాను ముఖ్యమైన భాగస్వామిగా చూస్తున్నాం. ఇజ్రాయెల్‌కు సభ్యత్వం లేని అంతర్జాతీయ సంస్థలతో, దేశాలతో ఇండియాకు సంబంధాలున్నాయి. అక్కడ భారత్ మా వాణిని వినిపిస్తుందని ఆశిస్తున్నాం.

భారతీయ ఆయుధాలు ఇజ్రాయెల్‌కు చేరుతున్నాయని అంటున్నారు. వాటిని గాజాలో ప్రయోగిస్తున్నారని వార్తలొచ్చాయి. వాటిలో ఎంతవరకు నిజముంది?

మాకున్న అత్యంత శక్తిమంతమైన, రహస్య ఆయుధం మా ప్రజలే. హమాస్‌తో యుద్ధం మొదలయ్యాక విదేశాల్లో పనిచేస్తున్న, చదువుకుంటున్న, విహార యాత్రలకు వెళ్లిన ముప్పై వేల మంది ఇజ్రాయెలీలు వెంటనే తిరిగొచ్చి మాతృదేశ రక్షణకు పోరాడుతున్నారు. మాకు ఏ దేశం ఎలాంటి సాయం చేసినా కృతజ్ఞులమై ఉంటాం. మేమిప్పుడు ఇరాన్ పరోక్షంగా సమర్థిస్తున్న మూకలతో పోరాడటమే కాకుండా, అవి అంతర్జాతీయ సంస్థల ద్వారా మాపై తెస్తున్న ఒత్తిడినీ ఎదుర్కొంటున్నాం. ఆ సంస్థల్లోని మా మిత్రులు మాకు అండగా నిలుస్తారని ఆశిస్తున్నాం.

భారత్-పశ్చిమాసియా-ఐరోపా ఆర్థిక నడవా (ఐమెక్) ప్రాజెక్టు పశ్చిమాసియాపై ఎలాంటి ప్రభావం చూపనుంది?

ఇండియాను భూ, సముద్ర మార్గాల ద్వారా ఐరోపాతో కలిపే ఐమెక్ ప్రాజెక్టు బహుళ ప్రయోజనకారి. ఇది భారత్‌ను ఐరోపాతో, ఇజ్రాయెల్‌ను ఆసియా దేశాలతో అనుసంధానిస్తుంది. పశ్చిమాసియాపై సంక్షోభ మేఘాలు తొలగిన తరవాతే ఐమెక్ ముందుకు సాగుతుంది. ఈ ప్రాజెక్టును విజయవంతం చేయడంలో భారత్ కీలక పాత్ర పోషిస్తుందని ఇజ్రాయెల్ ఆశాభావంతో ఉంది. ఇండియాకు పసిఫిక్, హిందూ మహాసముద్ర తీర దేశాలతో బలీయ బంధం ఉంది. భారత్ ప్రపంచశక్తిగా ఎదుగుతుందని ఇజ్రాయెల్ విశ్వసిస్తోంది. రెండు దేశాలు భవిష్యత్తులో బలీయ భాగస్వాములవుతాయని భావిస్తోంది. ●

తీర ప్రాంతాలకు పెనుముప్పు

ముందుచూపు లేని మానవ కార్యకలాపాల వల్ల పర్యావరణం దెబ్బతింటోంది. దాంతో ఉష్ణోగ్రతలు పెరగడం... వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ప్రకృతి ప్రకోపించడం ఒక చక్రంలా సాగిపోతోంది. పర్యావరణ వ్యవస్థలన్నీ పరస్పరం ఆధారపడి, సమస్త జీవరాశి మనుగడకు తోడ్పడతాయి. అత్యంత కీలకమైన ప్రకృతి వనరులను భద్రంగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా, అన్ని దేశాలపైనా ఉంది. అందుకు గట్టి సంకల్పం కొరవడిన ఫలితాలే- కొంతకాలంగా మనం చూస్తున్న ఎర్రటి ఎండలు, అకాల వానలు, వరదలు, కరవు కాటకాలు!




ప్రకృతి విపత్తులపై పరిశోధన సాగిస్తున్న ఇంగ్లండ్‌లోని ప్లీమత్ యూనివర్సిటీ- ప్లాస్టిక్ కాలుష్యం, సముద్రనీటి వరదలు కలగలిసి సృష్టిస్తున్న ఉత్పాతాన్ని గుర్తించింది. సూక్ష్మ పరిమాణంలోని ప్లాస్టిక్ రేణువులు (మైక్రోప్లాస్టిక్స్) తీరప్రాంత మొక్కల పునరుత్పత్తి సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంటే, ఉప్పునీటి వరదల వల్ల వాటి కణజాలం నశించిపోతున్నట్లు తేల్చింది. ఈ రెండూ కలగలిసి ఒకేసారి ప్రభావం చూపుతుండటంతో ఆ మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ గాడి తప్పుతోంది. పర్యవసానంగా అవి నీటిని, పోషకాలను, వేడిమిని సరిగ్గా గ్రహించలేక కృశించిపోతున్నాయి. తీరప్రాంత మొక్కలు ఏమైపోతే మనకేంటని తేలిగ్గా తీసిపారేయడానికి లేదు. ఎందుకని?

భూగోళంపై 71శాతం మేర నీరుంటే... మిగతా 29శాతంలో ఖండాలు, ద్వీపాలు విస్తరించి ఉన్నాయి. వీటిలో సుమారు 6,20,000 కిలోమీటర్ల మేర తీర ప్రాంతాలే. ప్రపంచ జనాభాలో 37శాతం సాగరాలకు వంద కిలోమీటర్ల దూరంలోనే జీవనం సాగిస్తోంది. మన దేశంలో సముద్రతీరం 7,516 కిలోమీటర్లు. ఆంధ్రప్రదేశ్‌లో అది సుమారు 975 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ నగరాలెన్నో సాగర తీరాల్లో వెలసినవే. మత్స్య సంపదకు, పర్యటకానికి, రవాణాకు, వాణిజ్యానికి, పరిశోధనలకు... ఇలా ఎన్నింటికో కడలి ఆధారమవుతోంది. సాధారణ అడవుల మాదిరిగానే సముద్ర తీరాల్లోనూ ప్రత్యేకంగా పెరిగే మొక్కలూ చెట్లూ ఉంటాయి. అడవుల్లోని చెట్లు కార్బన్ డైఆక్సైడ్‌ను పీల్చుకుని మనకు స్వచ్ఛమైన ప్రాణవాయువును ప్రసాదిస్తాయనేది తెలిసిందే. తీరప్రాంతాల్లోని మడ అడవులు అంతకు మూడు నుంచి అయిదు రెట్లు అధికంగా సీవో2ను శోషిస్తాయి. అంతేకాదు, నదుల నుంచి సముద్రాల్లో కలిసే నీటి ప్రవాహాల్లోని అవక్షేపాల నుంచీ కార్బన్‌ను గ్రహిస్తాయి. అడవుల్లో చెట్లు మృతిచెందినప్పుడు అవి కొంతవరకు కార్బన్ డైఆక్సైడ్‌ను వాతావరణంలోకి విడుదల చేస్తాయి. తీరప్రాంత మొక్కలు అలా కాదు. అవి గ్రహించిన కార్బన్ డైఆక్సైడ్ వంటి వాయువులను తమ కణజాలంలో, వేళ్లలో, వాటితో అంటిపెట్టుకున్న నేలలో అదిమిపడతాయి. చనిపోయినాసరే తిరిగి వాటిని వాతావరణంలోకి విడుదల చేయడమనేది పెద్దగా ఉండదు. తీరప్రాంత మొక్కలే లేకుంటే... వాతావరణంలో సీవో2 స్థాయులు అనూహ్యస్థాయిలో ఉండేవి. అనేక జీవజాతులు ఏనాడో చరిత్రలో కలిసిపోయేవి! అందుకనే, వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కోవడానికి తీరప్రాంత ఆవరణ వ్యవస్థను పరిరక్షించడం ఒక మేలిమి మార్గమంటారు పరిశోధకులు.

ప్లాస్టిక్ కట్టడితోనే...

ప్రపంచవ్యాప్తంగా రోజూ 2000కుపైగా ట్రక్కులకు సమానమైన ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాలు, నదుల్లో కలుస్తున్నట్లు అంచనా. ఏటా 2.3 కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు జలవనరుల్లోకి వచ్చి చేరుతున్నాయి. తుపానులు తలెత్తినప్పుడు, అలలు ఎగసిపడినప్పుడు, ఉప్పునీటి వరదలు ముంచికొచ్చినప్పుడు ఈ వ్యర్థాలతో కలిసిన నీరు పరిసర ప్రాంతాల్లోని వృక్షజాతులకు విషమే అవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్లీమత్ యూనివర్సిటీ పరిశోధన- యావత్ ప్రపంచానికి ఒక మేలుకొలుపు. ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేయడంతో పాటు ఆ వ్యర్థాలు సరస్సులు, నదులు, సముద్రాల్లో కలవకుండా జాగ్రత్త వహించడం ప్రజలూ ప్రభుత్వాల కర్తవ్యం. దాన్ని విస్మరించడమంటే- పెను ఉపద్రవాన్ని కోరి ఆహ్వానించడమే!

– టి.రఘుబాబు



భూవాతావరణాన్ని నాశనం చేస్తున్న శిలాజ ఇంధనాల వినియోగం తగ్గడం లేదు. దాంతో కర్బన ఉద్గారాలు ఏటికేడు పెరుగుతున్నాయి. ఇంధన సంబంధిత కర్బన ఉద్గారాలు 2021లో 36.3 గిగాటన్నులుగా ఉంటే- 2023లో 37.4 గిగాటన్నులకు చేరాయి. 1900 - 2023 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్త కర్బన ఉద్గారాల్లో వచ్చిన మార్పులివి...

(ఆధారం: ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ నివేదిక)

ఏమనుకుంటే మనకేంటి?

స్నేహితుడి చెల్లి పెళ్లి ఉంటే వెళ్లాడు రవి. పెళ్లింటి నుంచి కల్యాణమండపానికి వెళ్లడానికి పిల్ల తరఫు బంధువు ఒకరి కారులో ఎక్కించారు. ఎక్కిన దగ్గర నుంచి ఒకటే రొద. "ఈ నెల కారు ఈఎంఐ ఎలా కట్టాలో, అప్పులోళ్లు ఒకటే ఫోన్లు, ప్రశాంతత లేదు" భర్త టెన్షన్ పడుతున్నాడు. ఆయన ఏదో కంపెనీలో మోస్తరు ఉద్యోగట. "నా బంగారం ఎప్పుడు విడిపిస్తారు. నలుగురిలోకీ రావాలంటే నామోషీగా ఉంది" ఆమె కరుగ్గా అంది. "వాళ్లకుంది, నాకులేదు అని పోరుపెట్టి మూడు రూపాయల వడ్డీకి అప్పు చేయించి బోలెడు కొన్నావు. ఆ అప్పులతోనే చావొస్తోంది" అతను కోప్పడ్డాడు. "నన్నే అనండి. చుట్టాలు పక్కాల్లో విలువ ఉండదని కారు కొన్నారు. పదిమందిలో గొప్పగా ఉంటుందని మనకి ఫ్లాట్ ఉన్నా అప్పుచేసి స్థలం తీసుకున్నారు. ఇంకా.. ఫ్రెండ్స్ ముందు ఫోజుల కోసం వారంవారం పార్టీలు, ఖరీదైన దుస్తులు, కళ్లజోళ్లు, సెంట్లు.. మానాన్న పెట్టిన రెండెకరాలు అమ్మేశారుగా" ఆమె రెట్టించింది. రవి కారులో ఉన్నాడన్న విషయం మర్చిపోయినట్లున్నారు.. మండపానికి చేరుకునే వరకూ వాళ్ల గొడవ ఆగలేదు.



జీవితం తమ చేతుల్లోనే ఉందని చాలామంది భావిస్తారు. అది అబద్ధం. పక్కవాళ్లు ఎక్కడ చిన్నచూపు చూస్తారో, వాళ్ల ముందు దర్జాగా ఉండాలని అనుకుంటూ జీవితాన్ని ఇరుగు పొరుగు చేతుల్లో మనమే పెట్టేస్తున్నాం. బడ్జెట్ వేసుకుని జాగ్రత్తగా డబ్బు ఖర్చుపెట్టేవాడు ఇప్పుడు అసమర్థుడు! నాలుగైదు క్రెడిట్ కార్డులు తీసుకుని, ఇందులోది అందులోకి.. అందులోది ఇందులోకి కడుతూ కొత్త బట్టలు, చెప్పులు, సినిమాలు, షికార్లతో మెరిపించేవాడే తెలివైనవాడు. ఆ ఆటను ఎన్ని రోజులు విజయవంతంగా ఆడితే అంత సమర్థుడు. అసలిప్పుడు ఎన్ని పాట్లయినా పడి ఫ్లాటు కొనాలి. స్థోమత లేకపోయినా లోన్‌లో కారు తీసుకోవాలి. ఇంటికి ఒక టూవీలర్ చాలామందికి సరిపోవడం లేదిప్పుడు. రెండు కావాలి! అందరి ముందూ గొప్పగా ఉండాలన్న ఆరాటం. ఇంట్లో అన్ని రకాల వస్తువులు లేకుంటే పక్కింటోళ్లు గేలి చేస్తారేమోనన్న బెరుకు. అందుకే అందినచోటల్లా అప్పు చేసి కొనాలి. దీని వల్ల నిజమైన గౌరవం ఉంటుందా అంటే.. మన ముందు పొగిడి పక్కకెళ్లాక బడాయి బాపతు అంటారు. ఆ విషయం తెలిసీ ఎందుకు ఏమారుతున్నాం? ఆర్థిక ఇబ్బందుల్లో ఎందుకు కొట్టుమిట్టాడుతున్నాం? అందుకే... "మంచంకొద్దీ కాళ్లు ముడుచుకోమంటారు పెద్దలు. ఇప్పుడలా ఉండేవాడు వింతజంతువు. అప్పుచేసి పప్పుకూడు తినేవాడే మేధావి. అయినా సరే, నువ్వు మాత్రం ఆ రొంపిలో చిక్కుకోవద్దు. నీ స్థోమతను మరచిపోవద్దు. అనవసర చింత లేకుండా ప్రశాంతంగా నిద్రపోయేవాణ్ని మించిన ధనవంతుడు లేడు" అన్న నాన్న మాటలు ఎప్పుడూ గుర్తుచేసుకుంటుంటాడు రవి!

– ఎం.వి.బాబు

చిలుక మాటలు..!

హాయ్! బుజ్జీ!!

వసంతకోన అనే అడవిలో రకరకాల జంతువులు, పక్షులు నివాసం ఉండేవి. అవన్నీ జాతి వైరాన్ని మరిచి.. స్నేహభావంతో మెలిగేవి. చాలా క్రమశిక్షణతో ఉండేవి. మృగరాజు సిద్ధ కూడా మిగతా జంతువులతో స్నేహంగానే ఉండేది. శాకాహార జంతువులేమో.. అడవిలో దొరికే పండ్లు, దుంపలు, ఆకులను ఆహారంగా తీసుకునేవి. మాంసాహార జీవులేమో.. చనిపోయిన జంతువులను మాత్రమే తినేవి. ఇలా రోజులను చాలా ఆనందంగా గడిపేవి ఆ జీవులు.

ఒకరోజు వసంతకోనకు ఒక కోతుల గుంపు వచ్చింది. అడవిలోని పండ్లు, దుంపల చెట్ల కొమ్మలన్నీ విరిచేస్తూ.. ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తించసాగాయి. చెట్లకు ఉన్న పండ్లన్నీ తెంపుతూ.. వాటిని బురదలో వేస్తూ.. చిందరవందర చేశాయి. అడవి జంతువులు ఎంత వారించినా.. అవి అస్సలు వినిపించుకోలేదు. అలా రోజులు గడుస్తూ ఉన్నాయి. కొన్ని రోజులకు అక్కడ ఆహారం దొరకడమే కష్టతరమైంది. మెల్లగా జంతువుల మధ్య గొడవలు మొదలవుతున్నాయి. అది ఎలా ఆపాలో అర్థంకాక మృగరాజు అయోమయపడసాగింది. అప్పుడు అక్కడే ఉండే రుక్మిణి అనే చిలుక వచ్చి.. 'మీరేం కంగారు పడకండి మృగరాజా! వాటిలో నేను మార్పు తీసుకొస్తాను' అంది. వెంటనే ఆ కోతుల గుంపును పిలిచి.. 'ఇప్పటికే అడవికి చాలా నష్టం జరిగింది. అవసరం



లేకపోయినా.. మీరు పండ్లను తెంపి నేలపాలు చేశారు. ఇప్పుడు తినడానికి ఆహారం లేక జంతువులన్నీ ఇబ్బంది పడుతున్నాయి. మనం ఏదైనా పొదుపుగా ఉపయోగించుకోవడం నేర్చుకోవాలి. క్రమశిక్షణతో నడుచుకోవాలి. అప్పుడు మనకు వచ్చే ఇబ్బందులను కాస్తయినా ఎదుర్కోగలం.. ప్రాణాలను నిలుపుకోగలం. ఇప్పుడైనా మీ చేష్టలు మానుకోండి' అంది. దాని మాటలు విన్న కోతుల గుంపు క్షమాపణలు కోరి.. ఇక అక్కడి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆ అడవి జీవులన్నీ మళ్లీ హాయిగా జీవించసాగాయి.

– కటుకోజ్వల రమేష్

ఆ ఒక్కటి ఏది?

కింద ఇచ్చిన వాటిల్లో ఒకటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. ఆ ఒక్కటి ఏదో చెప్పగలరా?



1. బిస్కెట్, పుస్తకం, ఆపిల్, లడ్డు
2. త్రిభుజం, చతురస్రం, వృత్తం, రాంబస్
3. జూన్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్

జవాబులు: 1.పుస్తకం 2.వృత్తం 3.జూన్

సాంకేతిక ఉన్నతీకరణ పేదల సాధికారతకు దోహదపడాలి

ప్రధాని మోదీ ఉద్ఘాటన • 3 పరమ్ రుద్ర సూపర్ కంప్యూటర్ల ఆవిష్కరణ • కచ్చితమైన వాతావరణ అంచనాల కోసం అర్కా, అరుణిక

పుణె: సాంకేతిక ఉన్నతీకరణ పేదల సాధికారతకు దోహదపడేలా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఏ దేశమైనా గొప్ప దార్శనికతను కలిగి ఉన్నప్పుడే ఉన్నత లక్ష్యాలను విధించుకోగలదని పేర్కొన్నారు. జాతీయ సూపర్ కంప్యూటింగ్ మిషన్ కింద స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన మూడు పరమ్ రుద్ర సూపర్ కంప్యూటర్లను ఆయన దిల్లీ నుంచి వీడియో లింక్ ద్వారా గురువారం ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగిస్తూ.. సాంకేతిక రంగంలో పరిశోధనలు సాధారణ పౌరులకు లబ్ధి కలిగించేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. "జాతీయ సూపర్ కంప్యూటింగ్ మిషన్‌ను మేం 2015లో ప్రారంభించాం. ప్రస్తుతం క్వాంటమ్ కంప్యూటింగ్ సాంకేతికత బాగా ఊపందుకుంది. దాని వల్ల ఐటీ, తయారీ, ఎంఎస్ఎంఈ రంగాలతో



పాటు అంకుర సంస్థలు మెరుగవుతున్నాయి" అని పేర్కొన్నారు. కచ్చితమైన వాతావరణ సూచనలను అందించేందుకు దోహదపడేలా రూ. 850 కోట్ల వ్యయంతో పుణెలో ఏర్పాటుచేసిన హైపర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ సిస్టమ్‌లు 'అర్కా', 'అరుణిక'లను కూడా మోదీ ప్రారంభించారు.

మన వాటా టెరాబైట్లు, పెటాబైట్లలో ఉండాలి

శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగాలకు తమ సర్కారు సముచిత ప్రాధాన్యమిస్తోందని మోదీ పేర్కొన్నారు. "2035 కల్లా మన దేశానికి సొంత అంతరిక్ష కేంద్రం అందుబాటులోకి వస్తుంది. ఆ ప్రాజెక్టు తొలి దశ ఇప్పటికే ఆమోదం పొందింది. మిషన్ గగన్‌యాన్ సన్నాహాలు మొదలయ్యాయి. 'స్వీయ సాధికారత కోసం సైన్స్' అన్నదే మా మిషన్. ప్రస్తుతం సాంకేతికత, కంప్యూటింగ్ సామర్థ్యాలపై ఆధారపడని రంగమేదీ లేదు. ఈ విప్లవంలో మన వాటా బిట్లు, బైట్లలో కాదు.. టెరాబైట్లు, పెటాబైట్లలో భారీగా ఉండాలి" అని ఆయన చెప్పారు. అంతర్జాతీయ సరఫరా గొలుసులో కీలకంగా మారేలా మన దేశం సొంత సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించుకుంటోందని ప్రధాని తెలిపారు.

రూ.130 కోట్ల వ్యయంతో..

ప్రధాని తాజాగా ప్రారంభించిన మూడు సూపర్ కంప్యూటర్లను రూ.130 కోట్ల వ్యయంతో నిర్మించారు. అత్యాధునిక పరిశోధనలకు ఉపయోగపడేలా వాటిని పుణె, దిల్లీ, కోల్‌కతాల్లో మోహరించారు. ఫాస్ట్ రేడియో బర్‌స్ట్స్ (ఎఫ్ఆర్‌బీ) సహా ఇతర ఖగోళ పరిణామాలను లోతుగా అన్వేషించేందుకు సూపర్ కంప్యూటర్‌ను పుణెలోని జెయింట్ మీటర్ రేడియో టెలిస్కోప్ (జీఎంఆర్‌టీ) ఉపయోగించుకుంటుంది. మెటీరియల్ సైన్స్, అటామిక్ ఫిజిక్స్‌లో పరిశోధనలను విస్తృతం చేయడంలో దిల్లీలోని ది ఇంటర్ యూనివర్సిటీ యాక్సిలరేటర్ సెంటర్ (ఐయూఏసీ)కు సూపర్ కంప్యూటర్ దోహదపడుతుంది. భౌతిక, విశ్వోద్భవ, భూవిజ్ఞాన శాస్త్రాల్లో అత్యాధునిక పరిశోధనల కోసం సూపర్ కంప్యూటర్‌ను కోల్‌కతాలోని ఎస్ఎన్ బోస్ సెంటర్ ఉపయోగించుకుంటుంది.

పురిటి నొప్పులు చూసైనా మనసు కరగలేదా?

- ఏపీలోని నంద్యాల జిల్లాలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పురిటి నొప్పులతో ప్రభుత్వాస్పత్రికి వచ్చిన ఓ చెంచు మహిళకు ప్రసవం చేసేందుకు వైద్యులు నిరాకరించగా, ఆమె మెట్లపైనే ప్రసవించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా కొత్తపల్లి చెంచుగూడేనికి చెందిన గర్భిణికి ఈ నెల 21న పురిటి నొప్పులు రాగా, కుటుంబసభ్యులు కొత్తపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఆమె నొప్పులతో అల్లాడిపోతున్నా వైద్యసిబ్బంది.. 'ఇప్పుడే ప్రసవం కాదులే, ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లండి' అని నిర్లక్ష్యంగా చెప్పారు. ఎంతసేపు బతిమాలినా ఆసుపత్రిలో చేర్చుకోలేదు. అంతలోనే ఆమె మెట్లపైనే ప్రసవించారు. బాధితురాలి బంధువులు ఈ ఘటనను వీడియోలు, ఫొటోలు తీశారు. తల్లీబిడ్డను తీసుకుని గూడెం వెళ్లిపోయారు. ఫొటోలు, వీడియోలు బయటికొస్తే తమకు ఇబ్బందులు తప్పవని భయపడిన వైద్య సిబ్బంది, అదేరోజు సాయంత్రం గూడేనికి వెళ్లారు. వారికి సర్దిచెప్పి ఆధారాలు డిలీట్ చేయించారు. తల్లీబిడ్డను మళ్లీ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించి మూడు రోజుల తర్వాత పంపించారని గూడెం వాసులు చెబుతున్నారు. చెంచు పేదరాలి పట్ల అమానవీయంగా వ్యవహరించిన వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



ఆస్పత్రి మెట్లపై గర్భిణికి సపర్యలు చేస్తున్న బంధువులు

వరిలో చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వరికి చీడపీడల బెడద ఉందని, దీనిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం గురువారం సూచించింది. మెదక్, సంగారెడ్డి, భువనగిరి, మేడ్చల్ జిల్లాల్లో వరి పైర్లకు గింజ గట్టిపడే దశలో, చిరుపొట్ట నుంచి బిర్రు పొట్టదశల్లో ఉన్నాయని విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు రఘురామిరెడ్డి తెలిపారు. వాటిలో కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగు, రెక్కల పురుగుల ఉద్ధృతి ఉందని, అది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. వీటికి అధికారులు సూచించిన మందులను పిచికారీ చేయాలన్నారు.



ఏకాగ్రత లేకపోవడమే అతిపెద్ద సమస్య

ప్రస్తుతం యువతలో ఉన్న అతి పెద్ద సమస్యల్లో ఒకటి ఏకాగ్రత లేకపోవడం. కనీసం 8 గంటల పాటు ఫోన్ నోటిఫికేషన్లను పట్టించుకోకుండా, కుదురుగా కూర్చొని ఒక అంశంపై దృష్టి నిలపలేనివారు గొప్ప విజయాలు సాధించలేరు. మీ ఏకాగ్రతను చెడగొట్టే విషయాలకు మీరు దూరం జరక్కపోతే, అవి మిమ్మల్ని మీ లక్ష్యాలకు దూరం చేస్తాయి.

– అలెక్స్ హర్మోజి, బిజినెస్ గ్రోత్ మెంటార్



జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరిన కిలారు రోశయ్య, కంది రవిశంకర్, సామినేని ఉదయభాను, బాలినేని, అవనపు భావన, విక్రమ్. చిత్రంలో నాదెండ్ల మనోహర్

జనసేనలోకి వైకాపా కీలక నేతలు

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపాలో కీలకంగా పని చేసిన పలువురు నేతలు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో గురువారం సాయంత్రం.. పార్టీ అధ్యక్షుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రకాశం జిల్లా వైకాపా కీలక నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ మాజీ విప్, జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఉమ్మడి విజయనగరం జిల్లా డీసీఎంఎస్ ఛైర్‌పర్సన్, వైకాపా నేత అవనాపు భావన, వైకాపా యువజన నాయకుడు అవనాపు విక్రమ్ జనసేనలో చేరారు. ఒంగోలుకు చెందిన వ్యాపారవేత్త కంది రవిశంకర్, నెల్లూరుకు చెందిన సినీ నిర్మాత చిట్టుమూరు ప్రవీణ్ కుమార్‌రెడ్డి కూడా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ పల్లెపల్లెకు జనసేన సిద్ధాంతాలను తీసుకువెళ్లాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, విజయనగరం జిల్లాల నుంచి భారీగా వచ్చిన కార్యకర్తలకు.. ఆయన పార్టీ కార్యాలయం వెలుపలికి వచ్చి అభివాదం చేశారు. కార్యకర్తలు భారీ గజమాలతో పవన్‌ను సత్కరించారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, శాసనమండలి సభ్యులు పిడుగు హరిప్రసాద్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు.

రెవెన్యూ కాన్ఫరెన్స్‌కు తహసీల్దార్లు హాజరవ్వాలి

- సీసీఎల్ఏ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 29న నిర్వహించనున్న రెవెన్యూ కాన్ఫరెన్స్‌కు తహసీల్దార్లు తప్పనిసరిగా హాజరు కావాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్‌మిత్తల్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ కాన్ఫరెన్స్ శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీలో నిర్వహిస్తుండగా.. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరు కానున్నారు. డిప్యుటేషన్‌లో ఉన్న తహసీల్దార్లు, ఇతర శాఖల్లో పనిచేస్తున్న వారు కూడా తప్పనిసరిగా హాజరు అయ్యేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ ఆదేశించారు.

రఘురామను కస్టడీలో చిత్రహింసలు పెట్టింది నిజమే

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో ఏపీ మాజీ ఎంపీ, ప్రస్తుత ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును పోలీసు కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో నాటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ అడ్డంగా బుక్కయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రఘురామను కొడుతూ వీడియోకాల్‌లో సీఐడీ బాస్‌కు చూపించామని.. అప్పట్లో విధులు నిర్వహించిన సీఐ, ఎస్సై, సిబ్బందీ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. అయితే కొట్టడమంటే అలా కాదంటూ కాల్ కట్ చేసి ఆయన తన సిబ్బందితో నేరుగా రఘురామను నిర్బంధించిన గదిలోకి వచ్చి దగ్గరుండి కొట్టించారని వారు తెలిపారు. దీనికి సంబంధించి గుంటూరు పోలీసులు పక్కాగా సాక్ష్యాధారాలు సేకరించారు. సీఐడీ చీఫ్ సెల్‌ఫోన్ లొకేషన్ కూడా తీసుకున్నారు. కేసు దర్యాప్తును కొలిక్కి తెచ్చారు. సీఎం జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నానని సీఐడీ పోలీసులు తనపై రాజద్రోహం కేసు పెట్టి, 2021 మే 14న తనను అరెస్టు చేసి గుంటూరులోని సీఐడీ కార్యాలయానికి తరలించి హత్యాయత్నం చేశారని రఘురామకృష్ణరాజు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జులై 11న గుంటూరు నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

మిజోరం గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డికి అదనపు బాధ్యతలు


ఈనాడు, దిల్లీ: మిజోరం గవర్నర్‌గా సేవలందిస్తున్న కంభంపాటి హరిబాబు ఆరోగ్య కారణాల రీత్యా సెలవుపై వెళ్లడంతో ఆ బాధ్యతలను తాత్కాలికంగా త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డికి అదనంగా అప్పగించారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం గురువారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది.

ఏఐ కోర్సు పెట్టేద్దాం చలో..

- ఐఐటీల దూకుడు.. అదేబాటలో ట్రిపుల్‌ఐటీలు, ఐఐఎంలు
- భవిష్యత్తు డిమాండ్‌తో ఆన్‌లైన్ కోర్సులకూ శ్రీకారం
- పాఠశాల విద్యార్థులకూ సర్టిఫికెట్ కోర్సులు

కృత్రిమ మేధ.. అందరి నోటా ఇదేమాట. అన్ని రంగాల్లోకి అది చొచ్చుకు వస్తుండటంతో పరిశ్రమలకు అవసరమైన నిపుణులను అందించేందుకు.. ఇతర రంగాల్లోని వారికి ఏఐ నైపుణ్యాలను పెంచేందుకు దేశవ్యాప్తంగా ఐఐటీలు, ట్రిపుల్‌ఐటీలు, ఐఐఎంలు ఏఐ కోర్సులను ప్రవేశపెట్టేందుకు పోటీపడుతున్నాయి. కొన్నేళ్లుగా కేవలం బీటెక్, ఎంటెక్ కోర్సులే ఉండగా.. ఇప్పుడు సర్టిఫికెట్ కోర్సులను పెద్దఎత్తున ప్రవేశపెడుతున్నాయి. భారత్‌లో 2027 నాటికి ఏఐ మార్కెట్ విలువ 17 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఇది ఏటేటా 25-35 శాతం వృద్ధి నమోదు చేయనుందని అధ్యయనాలు వెల్లడించాయి. కేంద్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, వ్యవసాయం రంగాల్లో ఏఐను వినియోగించుకోవాలని ప్రణాళికలు రచించింది. భారత్‌లో ఏఐ అవకాశాలపై గూగుల్ ఇప్పటికే కేంద్ర ఐటీ, ఆరోగ్య, వ్యవసాయశాఖలతో కలిసి పనిచేస్తోంది. కేంద్ర విద్యాశాఖ 'ఏఐ ఫర్ ఇండియా 2.0' పేరిట గత ఏడాది ఉచిత ఆన్‌లైన్ కోర్సుకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలో దేశంలోని ప్రతిష్ఠాత్మక సంస్థలు ఏఐ కోర్సులను అందుబాటులోకి తెస్తున్నాయి.

నైపుణ్యాల పెంపునకు భాగస్వామ్యం



ఐఐఎంలు, వైద్య కళాశాలలు, ఆరోగ్య వర్సిటీల్లోని ఆచార్యులకు ఏఐపై నైపుణ్యం ఉండదు. అందుకే ఆయా సంస్థలు ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలతో ఒప్పందం కుదుర్చుకొని ఏఐ నైపుణ్యాలను పెంపొందించుకునే పనిలో పడ్డాయి. కరోనాతో దేశంలో తొలిసారిగా బీటెక్ స్థాయిలో ఏఐ కోర్సుకు ఐఐటీ హైదరాబాద్ శ్రీకారం చుట్టింది. తర్వాత పలు ఐఐటీలు, ట్రిపుల్‌ఐటీలు, ఎన్‌ఐటీలు, ఇతర కళాశాలలు ఆ కోర్సును ప్రవేశపెట్టాయి. తాజాగా వివిధ రంగాల్లో ఇప్పటికే స్థిరపడిన ఉద్యోగులు, టీమ్ లీడర్లు, వైద్యులకు ఇటీవలే పెద్దఎత్తున స్వల్ప కాలిక కోర్సులను ఆన్‌లైన్ విధానంలో ప్రవేశపెడుతున్నాయి. రానున్న రెండేళ్లలో వందల సంఖ్యలో ఇలాంటి కోర్సులు రానున్నాయని ఐఐటీ ఆచార్యులు అంచనా వేస్తున్నారు.

ఇదీ ఏఐ బాట



- ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ వైద్యరంగంలోని వారికి ఏఐలో ఆన్‌లైన్ కోర్సును ప్రారంభించింది. నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్(న్యామ్స్) భాగస్వామ్యంతో 12 వారాల కాలవ్యవధితో కోర్సును అందిస్తోంది. వైద్యరంగంలో కూడా సాంకేతికత పెరిగిపోయిన నేపథ్యంలో క్లినికల్ సెట్టింగ్స్, రోగుల సంరక్షణ, ఇతరత్రా అంశాల్లో ఏఐ సాంకేతికతను వినియోగించడంలో ఈ కోర్సు తోడ్పడుతుంది.
- ఐఐటీ మద్రాస్ 'ఐఐటీఎం స్కూల్ కనెక్ట్' పేరిట ఇంటర్ విద్యార్థుల కోసం డేటా సైన్స్ అండ్ ఏఐ, ఎలక్ట్రానిక్ సిస్టమ్ అనే రెండు ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించింది. కాలవ్యవధి 4 నుంచి 8 వారాలపాటు ఉంటుంది. ఇప్పటికే దీంట్లో 500 మందికి పైగా విద్యార్థులు నమోదు చేసుకున్నారు.
- ఐఐఎం లఖ్‌నవూ ఇటీవల డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ ఏఐ ఫర్ బిజినెస్ లీడర్స్ పేరిట 11 నెలల కోర్సు ప్రారంభించింది. వ్యాపారులు, సీనియర్ మేనేజర్లు, టీమ్ లీడర్లు, ఎగ్జిక్యూటివ్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్లు చేరొచ్చు.
- కృత్రిమ మేధ ఆధారిత సవాళ్లను పరిష్కరించడమే లక్ష్యంగా ఐఐఎం కోల్‌కతా టాలెంట్ స్ప్రింట్ భాగస్వామ్యంతో ఏఐ ఫర్ లీడర్స్ పేరిట ఇటీవలే కోర్సును ప్రారంభించింది.
- టెక్నాలజీ అండ్ ఏఐ లీడర్‌షిప్ పేరిట సర్టిఫికెట్ కోర్సుకు ఐఐటీ దిల్లీ శ్రీకారం చుట్టింది. ఎమర్జింగ్ టెక్నాలజీపై ఆయా కంపెనీల సారథులకు, టీమ్ లీడర్లకు ఏఐ నైపుణ్యాన్ని అందించేందుకు ఈకోర్సు ఉపయోగపడుతుంది.

డిమాండ్ పెరుగుతున్నందునే..

–ఆచార్య పాండురంగారావు, ఐఐటీ హైదరాబాద్

ఏఐకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. అందుకే విద్యాసంస్థలు పెద్దఎత్తున ఏఐపై కోర్సులు తీసుకొస్తున్నాయి. కొత్తగా మార్కెట్లోకి వచ్చే విద్యార్థులను నిపుణులుగా చేయడంతో పాటు.. వివిధ రంగాల్లో స్థిరపడిన వారికీ నైపుణ్యాన్ని అందించాల్సిన అవసరముంది. అందుకే ఏఐ నైపుణ్యాన్ని అందించే సంస్థలతో ఇతరరంగాల వారు ఒప్పందం కుదుర్చుకొని తమ సిబ్బందికి శిక్షణ ఇప్పిస్తున్నారు.

- ఈనాడు, హైదరాబాద్

గిరిజన పల్లెల్లో పనులపై గ్రామసభలకే నిర్ణయాధికారం

- కేంద్రానికి మంత్రి సీతక్క డిమాండ్

ఈనాడు, దిల్లీ: అటవీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పనులపై నిర్ణయాధికారం అక్కడి గ్రామసభలకే వదిలిపెట్టాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి చిన్నపనికీ దిల్లీ వచ్చి అటవీశాఖ అనుమతులు తీసుకురావాలన్న నిబంధనతో ఈ ప్రాంతాల్లో కనీస మౌలిక వసతుల కల్పన సాధ్యం కావడంలేదన్నారు. స్కూలు భవన నిర్మాణానికి అనుమతివ్వకపోవడంతో కంటెయినర్ పాఠశాల ఏర్పాటు చేయాల్సి వచ్చిందన్నారు. పీసా చట్టం (పంచాయత్స్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్)పై గురువారం దిల్లీలో జరిగిన జాతీయస్థాయి సదస్సులో పాల్గొన్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. దేశంలో పీసా చట్టం అమల్లో ఉన్న 10 రాష్ట్రాల పంచాయతీరాజ్, గిరిజనాభివృద్ధి వ్యవహారాలశాఖ మంత్రులు ఇందులో పాల్గొన్నట్లు చెప్పారు. "తెలంగాణలో గ్రామాలకు కావాల్సిన రోడ్లు, మంచినీరు, పాఠశాలలు, విద్యుత్తు, ఆరోగ్య కేంద్రాల్లాంటి ప్రాథమిక వసతుల కల్పనకు అటవీ చట్టాలు అడ్డొస్తున్నాయి. దీనివల్ల పీసా చట్టం అమల్లో ఉన్న ప్రాంతాలకు రాష్ట్ర ప్రభుత్వాలు నిధులిస్తున్నా అవి ఉపయోగపడటం లేదు. ఇలాంటి కారణాలతో ఆదిలాబాద్ జిల్లాలో సుమారు రూ.200 కోట్ల పనులు పెండింగ్‌లో పడ్డాయి. ములుగు, భద్రాద్రి జిల్లాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం గ్రామసభలకు అధికారాలివ్వాలి" అని డిమాండ్ చేశారు.



పీసా చట్టంపై సదస్సులో జ్యోతి వెలిగిస్తున్న సీతక్క. చిత్రంలో కేంద్ర మంత్రి ఎస్‌పీసింగ్‌భగేల్, మధ్యప్రదేశ్ మంత్రి ప్రహ్లాద్‌సింగ్ తదితరులు

మద్యం కుంభకోణంలో కవితతో పనిచేసిన వ్యక్తి సృజన్‌రెడ్డి

అమృత్ పథకం ప్రాజెక్టు టెండర్లలో అవినీతి జరిగిందని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై విలేకరులు ప్రశ్నించగా.. ఆ పథకంలో తప్పిదాలు జరిగితే కేంద్రమే చర్యలు తీసుకుంటుందని సీతక్క అన్నారు. టెండర్లు దక్కించుకున్న సృజన్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డి బంధువులుగా ఆరోపణలుచేస్తున్న వారు, అదే వ్యక్తి కేటీఆర్ తోబుట్టువు (కవిత)తో దిల్లీలో మద్యం వ్యాపారాలు చేసినట్లు, ఆ కేసులో ఆయనకూ పాత్ర ఉన్నట్లు వచ్చిన వార్తలకు ఏం జవాబిస్తారని ప్రశ్నించారు. హైదరాబాద్ మునిగిపోకుండా ఉండటానికే చెరువుల్లోని ఆక్రమణలను తొలగిస్తున్నట్లు చెప్పారు.

కలలో కూడా 'కాళేశ్వరం' ఇంజినీర్లు కావొద్దు

- కొత్త ఇంజినీర్లతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్, మాదాపూర్, న్యూస్‌టుడే: "రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులు కట్టిన వెంటనే కూలిపోయి ఇంజినీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిన ఘటనల్ని చూశాం. కొందరు పాలకులు, ఇంజినీర్ల స్వార్థం కారణంగా ఇంజినీర్లందరికీ మచ్చ వచ్చినట్లయింది. మీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి ఇంజినీర్లను ఆదర్శంగా తీసుకోవాలి. కాళేశ్వరం కట్టిన ఇంజినీర్లను కాదు. కలలో కూడా మీరు అలాంటి ఇంజినీర్లు కావొద్దు. అలాంటి వారిని మీ కలలోకి కూడా రానివ్వొద్దు'' అని రహదారులు, భవనాల(ఆర్అండ్‌బీ) శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. టీజీపీఎస్సీ ద్వారా కొత్తగా నియమితులైన 156 మంది ఆర్అండ్‌బీ శాఖ ఇంజినీర్లకు అయిదు రోజుల పాటు నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాన్ని హైదరాబాద్ మాదాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్)లో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో తెలంగాణ విధ్వంసమైందని, గత ప్రభుత్వ హయాంలో 10 మండలాలకు ఒక్క ఇంజినీరు కూడా లేకపోవడంతో పర్యవేక్షణ కరవై పనులు పడకేశాయని దుయ్యబట్టారు. "రాష్ట్ర పునర్నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకం. దీన్ని దృష్టిలో ఉంచుకునే మా ప్రభుత్వం టీజీపీఎస్సీ ద్వారా నూతన ఇంజినీర్లను నియమించింది. కొత్తగా నియమితులైన ఇంజినీర్లు బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలి. రాష్ట్ర ప్రగతిలో కీలకమైన గేమ్ ఛేంజర్ లాంటి రీజినల్ రింగ్ రోడ్డుతో పాటు టిమ్స్ ఆసుపత్రుల భవనాలను నాణ్యంగా నిర్మించాలి'' అని కోమటిరెడ్డి వారికి సూచించారు. రహదారుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ. . కొత్త ఇంజినీర్ల రాకతో ఆర్అండ్‌బీ శాఖ, కార్పొరేషన్ శక్తిమంతమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, స్పెషల్ సెక్రటరీ హరిచందన దాసరి తదితరులు పాల్గొన్నారు.




నూతన ఇంజినీర్లకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో హరిచందన, ఆకునూరి మురళి, మల్‌రెడ్డి రాంరెడ్డి, వికాస్‌రాజ్



ఆదినారాయణ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న ఈనాడు ఎండీ సీహెచ్ కిరణ్. చిత్రంలో ఆదినారాయణ భార్య రమాదేవి, కుమారుడు ప్రణీత్ తదితరులు

సీనియర్ పాత్రికేయులు ఆదినారాయణ హఠాన్మరణం

- తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు సహా పలువురి సంతాపం



ఆదినారాయణ

ఈనాడు, హైదరాబాద్– మియాపూర్, న్యూస్‌టుడే: సీనియర్ పాత్రికేయులు, ఈటీవీ హైదరాబాద్ బ్యూరో చీఫ్ టి.ఆదినారాయణ (48) గురువారం హఠాన్మరణం చెందారు. ఈటీవీలో సుమారు 25 ఏళ్లుగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. మియాపూర్ సమీపంలోని హఫీజ్‌పేట్‌లో ఆదినారాయణ తాను నివాసముంటున్న అపార్ట్‌మెంట్ భవనంపై ఉదయపు నడకకు వెళ్లి ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడ్డారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆదినారాయణకు భార్య రమాదేవి, ఇద్దరు కుమారులున్నారు.

ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం పెదయాచవరంలో పేద రైతు కుటుంబంలో ఆదినారాయణ జన్మించారు. పాఠశాల విద్య నుంచి డిగ్రీ వరకూ సంక్షేమ వసతిగృహాల్లోనే చదువుకున్నారు. పాత్రికేయ వృత్తిపై ఆసక్తితో విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఏ జర్నలిజం పూర్తిచేశారు. 2000 సంవత్సరంలో ఈటీవీలో విలేకరిగా చేరారు. అంచెలంచెలుగా ఎదిగి ఈటీవీ హైదరాబాద్ బ్యూరో చీఫ్ స్థాయికి చేరుకున్నారు.

ప్రముఖుల దిగ్భ్రాంతి

ఆదినారాయణ హఠాన్మరణంపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. నిబద్ధత గల సీనియర్ జర్నలిస్టును కోల్పోయామని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, గొట్టిపాటి రవికుమార్, నారాయణ; భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆదినారాయణ మృతికి సంతాపం ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఆసుపత్రిలో ఆదినారాయణ భౌతికకాయానికి నివాళి అర్పించారు.

ఈనాడు ఎండీ సీహెచ్ కిరణ్, ఈనాడు తెలంగాణ ఎడిటర్ డీఎన్ ప్రసాద్, ఈటీవీ సీఈవో బాపినీడు, పలువురు పాత్రికేయులు ఆదినారాయణ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి ఫొటో పెట్టండి

- సర్కారు ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని జిల్లా కలెక్టరేట్లు, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి ఫొటోను పెట్టాలని ప్రభుత్వం గురువారం ఆదేశించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో నమూనాను కూడా విడుదల చేసింది. అక్టోబరు 7 లోగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అన్ని స్థాయిల అధికారులకు ఆదేశాలు జారీచేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడిచినా.. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టలేదనే ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లు కూల్చొద్దు: తమ్మినేని

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మూసీ నది పరిసర ప్రాంతాల్లో దశాబ్దాలుగా నివాసముంటున్న పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా వారి ఇళ్లను కొల్చొద్దని ప్రభుత్వానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విజ్ఞప్తి చేశారు. పునరావాసం కల్పించకుండానే వారి ఇళ్లు, గుడిసెలను తొలగించేందుకు పూనుకుంటున్న హైడ్రా అధికారుల తీరును ఖండిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. "మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం పేదలను ఇబ్బందులకు గురిచేయడం తగదు. హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్ తదితర ప్రాంతాల్లోని ఎఫ్‌టీఎల్ జోన్లలో దశాబ్దాల క్రితం నివాసాలను ఏర్పరచుకున్న వారంతా నిరుపేదలే. ముందుగా పునరావాసం కల్పించిన తర్వాతే వారి ఇళ్లను కూల్చే పనులు చేపట్టాలి. ప్రస్తుతం నివాసం ఉంటున్న ప్రాంతాల్లోనే వారికి ఇళ్లను కేటాయించాలి'' అని ఆ ప్రకటనలో ప్రభుత్వాన్ని వీరభద్రం కోరారు.

బీసీ కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు

- వచ్చే జయంత్యుత్సవం నాటికి ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠ: మంత్రి పొన్నం ప్రభాకర్

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: 'భారాస నాయకుల బృందం బలహీనవర్గాలపై అధ్యయనం చేయడానికి చెన్నైకి వెళ్లిందట. అధికారంలో ఉన్న పదేళ్లు ఏం చేశారు?' అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. కులగణనకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోంటే.. కొన్ని రాజకీయ పార్టీలు అదే పనిగా విమర్శలు చేస్తున్నాయన్నారు. బీసీ కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు జరుగుతాయని, ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదని స్పష్టంచేశారు. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వం, జయంత్యుత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. కమిటీ ఛైర్మన్ వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడారు.. వచ్చే జయంత్యుత్సవం నాటికి ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ప్రతిష్ఠిస్తామన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గత పాలకులు వేల కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారని, దీనిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. సభలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిలతో పాటు చిట్యాల శ్వేత ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ జయంత్యుత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వీర్లపల్లి శంకర్, చిట్యాల శ్వేత ఐలమ్మ, చిత్రంలో బస్వరాజు సారయ్య తదితరులు

చాకలి ఐలమ్మకు సీఎం రేవంత్ నివాళి

ఈనాడు, హైదరాబాద్ – హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో ఆమె చిత్రపటం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళి అర్పించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితరులు పాల్గొన్నారు. శాసనసభ ప్రాంగణంలో ఐలమ్మ చిత్రపటానికి శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

◆ చాకలి ఐలమ్మ జయంతిని కాంగ్రెస్ పార్టీ గురువారం గాంధీభవన్‌లో నిర్వహించింది. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సీనియర్ నాయకులు టి.కుమార్‌రావు, బొల్లు కిషన్, మత్స్య సహకార కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, పీసీసీ రజక విభాగం కోఆర్డినేటర్ మిద్దె శ్రీనివాసులు తదితరులు.. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

◆ తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక చాకలి ఐలమ్మ అని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఓ ప్రకటనలో కొనియాడారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకం

- గవర్నర్, సీఎంల నివాళి

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కొనియాడారు. శుక్రవారం బాపూజీ జయంతిని పురస్కరించుకొని గవర్నర్ గురువారం సందేశం విడుదల చేశారు. "కొండా లక్ష్మణ్ బాపూజీ క్విట్ ఇండియా, నాన్ ముల్కీ, తెలంగాణ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి" అని గవర్నర్ పిలుపునిచ్చారు.

◆ బహుభాషా కోవిదుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితాంతం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. "మలిదశ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ. తెలంగాణ రాష్ట్ర సాధనకు అలుపెరుగని కృషిచేశారు. 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ'కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాం" అని సీఎం పేర్కొన్నారు.

తొలితరం ఉద్యమనేత: కేసీఆర్

తెలంగాణ స్వయం పాలన, ఆత్మగౌరవం కోసం పోరాటాలు చేసిన తొలితరం ఉద్యమనేత, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని భారాస అధినేత కేసీఆర్ తెలిపారు. రాజకీయవేత్తగా తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు బాపూజీ చేసిన పోరాటాలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

హైడ్రా.. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం

- సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ



ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేతల ద్వారా పేరు తెచ్చుకోవాలని భావిస్తున్నట్లుందని, హైడ్రా చర్యలు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉంటున్నాయని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ స్థలాల్లో వెలసిన కట్టడాలను సరైన ప్రణాళిక లేకుండా తొలగిస్తున్నారన్నారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. "గత భారాస ప్రభుత్వం కనీస ప్రణాళిక లేకుండా అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలుచేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని ఆసరాగా చేసుకుని డబ్బుల్లేవనే సాకుతో మౌలికవసతుల కల్పన జోలికి పోకుండా నిత్యం వార్తల్లో ఉండే లక్ష్యంతో అక్రమ కట్టడాల పేరిట ఇళ్లను కూల్చివేస్తోంది. దీన్ని న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా చేపట్టి ఉంటే బాగుండేది. ప్రస్తుతం అక్రమ కట్టడాలంటున్న వాటి ప్రాంతాల్లో ప్రభుత్వమే రూ.కోట్లు ఖర్చుచేసి రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు వంటి సౌకర్యాలు కల్పించడం, ఇళ్లకు నంబర్లను కేటాయించడం వాస్తవం కాదా? జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల ద్వారా దశాబ్దాలుగా సేవలందిస్తూ, పన్నులు వసూలు చేస్తున్నప్పుడు అక్రమం అనిపించలేదా? అధికారిక అనుమతులున్న భవనాలను నేలమట్టం చేయడం బాధాకరం. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలు ఇచ్చిన అనుమతులను తప్పని హైడ్రా ఎలా నిర్ణయిస్తుంది? మూసీ పరీవాహకంలో 15 వేలకుపైగా పేద, మధ్య తరగతి కుటుంబాలున్నాయి. వారి నివాసాలను కూల్చేముందు వారితో చర్చించాలి. పేదలు తమ కష్టార్జితంతో నిర్మించుకున్న ఇళ్లను కూల్చే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. తప్పుడు లేఔట్‌లు సృష్టించి, ప్రజలను మభ్యపెట్టి, వారికి స్థలాలను అక్రమంగా విక్రయించిన వ్యాపారులను బాధ్యులుగా చేస్తూ ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తేవాలి. సీఎం హోదాలో తీసుకునే నిర్ణయాలతో అందరికీ న్యాయం జరగాలి'' అని కిషన్‌రెడ్డి తన లేఖలో ఆకాంక్షించారు.

బకాయిలు చెల్లించకుండా నేత కార్మికులకు మోసం

- భారాసపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజం

ఈనాడు డిజిటల్, సిరిసిల్ల: బతుకమ్మ చీరల ఆర్డర్ల పేరిట గత భారాస సర్కారు చేనేత కార్మికులకు బకాయిలు చెల్లించకుండా మోసం చేసిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. గురువారం రాజన్న సిరిసిల్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. . కాంగ్రెస్ ప్రభుత్వంపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. "ఒకప్పుడు సిరిసిల్ల వస్త్రపరిశ్రమలోని పాలిస్టర్, కాటన్ ఉత్పత్తులకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉండేది. అలాంటిది బతుకమ్మ చీరలు తీసుకొచ్చి పరిశ్రమ ఉనికిని ప్రశ్నార్థకం చేసింది మీరు కాదా? చేనేత కార్మికులకు విడతల వారీగా రూ.197 కోట్ల బకాయిలను చెల్లించాం. గత ప్రభుత్వం మహిళలకు నాణ్యతలేని కోటి బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తే.. మా ప్రభుత్వం 8 కోట్ల నాణ్యమైన చీరలు అందించేందుకు ప్రణాళికలు వేస్తోంది. భారాస హయాంలో జిల్లా కార్యాలయాల్లో నోట్‌ఫైల్ లేకుండా జరిగిన పనుల్లో అక్రమాలను బయటకు తీస్తాం'' అని ఆది శ్రీనివాస్ అన్నారు.

ఫార్మా సిటీ రద్దు వెనుక రూ.వేల కోట్ల భూకుంభకోణం

- మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపణ



ఈనాడు, హైదరాబాద్: ఫార్మా సిటీ రద్దు వెనుక రూ.వేల కోట్ల భూకుంభకోణం ఉందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి తన సోదరులకు దోచిపెట్టేందుకు ఈ భూమాయ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ ఫార్మా సిటీ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలనే కాకుండా హైకోర్టును కూడా మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం బహిరంగ లేఖ రాశారు. ''అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మా సిటీని రద్దు చేస్తున్నామని.. దాని స్థానంలో ఫార్మా విలేజీలు, క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని అసెంబ్లీతోపాటు అనేక వేదికలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఫార్మా సిటీ రద్దు విషయంలో మాయమాటలతో మభ్యపెట్టి.. అనేక ఆర్థిక అవకతవకలకు, భూదందాలకు తెరలేపుతోంది. ఇదే హైదరాబాద్ ఫార్మా సిటీ పేరు మార్చి.. ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ అంటూ రకరకాల కొత్త పేర్లను తెరపైకి తెచ్చి.. అతిపెద్ద అవినీతి కుంభకోణానికి కాంగ్రెస్ సర్కార్ స్కెచ్ వేసింది. ఈ మాయాజాలం రాష్ట్ర ప్రజలకు ఇప్పటికే అర్థమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఒక్క ఎకరం భూమి అయినా సేకరించిందా? ఒక్క ఎకరం కూడా సేకరించకుండా.. హైకోర్టుకు తెలిపినట్లు ఫార్మా సిటీని రద్దు చేయకుండా.. సర్కారు చెబుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ, ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీలను ఎక్కడ కడతారో చెప్పాలి? రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి కోసం ఫార్మా సిటీకి భూములిచ్చేందుకు ముందుకొచ్చిన వేల మంది రైతులకు తమ భూమిని ప్రభుత్వం ఎలా ఉపయోగిస్తుందో తెలుసుకునే హక్కు ఉంది. ఆ భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకుంటామంటే.. చూస్తూ ఊరుకోవడానికి ప్రజలు సిద్ధంగా లేరు'' అని కేటీఆర్ పేర్కొన్నారు.



వ్యాధుల దాడి.. బారులుతీరి

వ్యాధుల విజృంభణతో నగరవాసులు ఆసుపత్రుల బాటపడుతున్నారు. పేదల పెద్దాసుపత్రి ఉస్మానియాకు గురువారం రోగులు భారీగా వచ్చారు. వైద్యులు రాసిన మందుల కోసం ఆసుపత్రి ఆవరణలోని పంపిణీ కేంద్రం వద్ద ఇలా బారులుతీరి కనిపించారు.

ఐటీ శాఖ కమిషనర్ పేరుతో వాట్సాప్ సందేశాలు

నగర సైబర్ క్రైమ్ విభాగంలో కేసు

ఈనాడు, హైదరాబాద్: ఆదాయపు పన్ను శాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత పేరుతో సైబర్ నేరగాళ్లు మరోసారి డబ్బు కొట్టేసేందుకు ప్రయత్నించారు. నకిలీ వాట్సాప్ ఖాతాతో.. కొందరు అధికారులకు డబ్బు అవసరముందంటూ మూడు రోజుల కిందట సందేశాలు పంపించారు. ఈ వ్యవహారంపై ఆదాయపు పన్ను అధికారి ముఖేశ్ కుమార్‌ఝా ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు ఈనెల 23వ తేదీన కేసు నమోదుచేశారు. మిథాలి మధుస్మిత పేరుతో నకిలీ వాట్సాప్ ఖాతా వెలుగులోకి రావడం ఇది రెండోసారి. ఈ ఏడాది ఆగస్టులోనూ సైబర్ నేరగాళ్లు ఆమె నకిలీ వాట్సాప్ ప్రొఫైల్‌తో డబ్బు వసూలుచేసేందుకు ప్రయత్నించారు. అప్పట్లోనూ సైబర్‌క్రైమ్ ఠాణాలో ఒక కేసు నమోదైంది.

ఆకాశ మార్గం.. సుగమం

ఈనాడు-సిటీ బ్యూరో
ప్రధాన ప్రతినిధి

రాజధాని నుంచి రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు వెళ్లేందుకు కీలకమైన రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం విషయంలో రక్షణ శాఖతో ఏర్పడిన ప్రతిష్టంభనకు పరిష్కారం దొరికొంది. వీటి నిర్మాణం కోసం తమ ఆధీనంలో ఉన్న 170 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు రక్షణ శాఖ ఉన్నతాధికారులు అంగీకరించారు. దీనికి బదులుగా మరోచోట రక్షణ శాఖకు 400 ఎకరాలను ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.



- 170 ఎకరాలు ఇచ్చేందుకు రక్షణ శాఖ అంగీకారం
- బదులుగా మరోచోట 400 ఎకరాలు ఇవ్వనున్న సర్కారు
- కీలకమైన ఎలివేటెడ్ ప్రాజెక్టులపై తొలగిన ప్రతిష్టంభన

శామీర్‌పేట ఫైరింగ్ రేంజ్‌లో..

జేబీఎస్ నుంచి తూంకుంట వరకు దాదాపు 20 కిలోమీటర్ల మేర రాజీవ్ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టింది. నాగ్‌పూర్ జాతీయ రహదారిలో ప్యారడైజ్ నుంచి కొంపల్లి వరకు పది కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. రెండు వంతెనలను నిర్మించాలంటే రక్షణ శాఖ 170 ఎకరాలను ఇస్తేనేగానీ ఈ ప్రాజెక్టు ముందుకు వెళ్లని పరిస్థితి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సమస్య గురించి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో చర్చించారు. వీటికి స్థలాలను ఇచ్చేందుకు కేంద్రమంత్రి అంగీకరించారు. బదులుగా మూడింతల స్థలం తమకు నగర పరిధిలోనే ఇవ్వాలని రక్షణ శాఖ కోరింది. ఈనేపథ్యంలో రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ రక్షణ శాఖ అధికారులతో చర్చించారు. శామీర్‌పేట ఫైరింగ్ రేంజ్‌లో 400 ఎకరాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకురావడంతో రక్షణ శాఖ అధికారులు ఆమోదం తెలిపారు.



ఆరెకరాలకు.. పరిహారం..

లంగర్‌హౌస్‌లో రోడ్డు వెడల్పు ప్రక్రియ,మెహిదీపట్నంలో స్కైవాక్ పనులు ఆగిపోయాయి. దీనికి రక్షణ శాఖకు చెందిన ఆరెకరాల స్థలం అవసరం. అది ఇస్తే రూ. 400 కోట్లు ఇవ్వాలని రక్షణ శాఖ కోరింది. దీనికి సంబంధించి కూడా శామీర్‌పేటలో స్థలాన్ని తీసుకునేందుకు రక్షణ శాఖ అంగీకరించింది.

ఎలివేటెడ్ కారిడార్‌పై ఉన్నతాధికారుల సమావేశం

కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ మీదుగా చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ల అంశంపై కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో గురువారం ఉన్నతాధికారులు సమావేశమైనట్లు తెలిసింది. రక్షణ శాఖ ఉన్నతాధికారులు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి దానకిశోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి హాజరైనట్లు సమాచారం. రక్షణశాఖకు సంబంధించిన భూములను కేటాయించేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఏవోసీ సెంటర్ చౌరస్తాకు అనుసంధానంగా ఉన్న వివిధ రహదారులకు ప్రత్యామ్నాయంగా నిర్మించాలనుకున్న రహదారి ప్రస్తావన వచ్చిందని తెలిసింది. సమావేశానికి ముందు స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా మొక్కలు నాటారు.

ప్రధాని మోదీని ఆకర్షించిన బయోగ్యాస్ ప్లాంట్



బోయిన్‌పల్లి మార్కెట్‌లోని బయోగ్యాస్ ప్లాంటు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో కూరగాయల వ్యర్థాలతో జీవ విద్యుత్తు, జీవ ఇంధనం, జీవ ఎరువును ఉత్పత్తి చేసే బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటు చేయడం ప్రధాని మోదీని విశేషంగా ఆకట్టుకుందని కేంద్ర ప్రభుత్వం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. మన్ కీ బాత్‌లోనూ ప్రధాని ఈ విషయాన్ని ప్రస్తావించారని, దీన్ని స్వచ్ఛతా హీ సేవా విజయగాథగా కేంద్రం లేఖలో పేర్కొంది. వివిధ మార్కెట్ల నుంచి వచ్చే వ్యర్థాలతో ఏడాదికి 6,290 కిలోల కార్బన్‌డయాక్సైడ్ ఉత్పత్తి అవుతుందని, దీన్ని నివారించడానికి బయోగ్యాస్ ప్లాంటును ఏర్పాటు చేశారని, లేఖలో పేర్కొంది.

ప్రేమించడం లేదని యువకుడి ఉన్మాదం

పెనుగులాటలో ఇంజినీరింగ్ విద్యార్థినికి గాయం



ఉప్పల్, న్యూస్‌టుడే: యువతి తనను ప్రేమించడం లేదంటూ ఓ యువకుడు తనకు తాను కత్తితో గాయపర్చుకోగా.. పెనుగులాటలో ఇంజినీరింగ్ విద్యార్థినికి గాయమైన ఘటన ఉప్పల్ ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం హనుమపురానికి చెందిన **రాగల సాయికుమార్** (24) ప్రైవేటు ఉద్యోగి. ఇదే గ్రామానికి చెందిన విద్యార్థిని నగరంలో ఇంజినీరింగ్ చదువుతోంది. ఇద్దరి మధ్య స్నేహం ఉంది. కొన్ని రోజులుగా ఆమె సాయికుమార్‌ను దూరం పెడుతూ వస్తోంది. ఎవరినైనా ప్రేమిస్తుందనే అనుమానం పెంచుకున్నాడు. గురువారం ఇద్దరూ కలిసి భువనగిరి వెళ్లేందుకు ఉప్పల్‌కు వచ్చారు. ఇక్కడి బస్టాండ్ ప్రాంతంలోనే ఓ షాపులో సాయికుమార్ కత్తిని కొని జేబులో పెట్టుకున్నాడు. ఆమె చేతిలో ఉన్న ఫోన్‌ను లాక్కుని ఎవరికి ఫోన్ చేస్తుందో చూసే ప్రయత్నం చేయగా ప్రతిఘటించింది. దీంతో కోపోద్రిక్తుడైన సాయికుమార్ కత్తితో చేతిపై గాయపర్చుకున్నాడు. ఫోన్‌ను లాక్కునే క్రమంలో ఆమె చేతి వేలికి గాయమైంది. అక్కడున్న వారు డయల్ 100కు ఫోన్ చేయడంతో ఉప్పల్ పోలీసులు వచ్చి యువకుడిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. యువతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దూసుకెళ్తున్న శంషాబాద్ విమానాశ్రయం

మెట్రో నగరాల్లో అత్యధిక వృద్ధిరేటు నమోదు

ఈనాడు, హైదరాబాద్, శంషాబాద్ న్యూస్‌టుడే: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం విమానయాన ప్రయాణికుల రాకపోకలతో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు దేశీయ ప్రయాణికుల రాకపోకల్లో అరుదైన ఘనతను దక్కించుకుంది. దేశంలో హైదరాబాద్ కంటే జనాభాలో ముందున్న మెట్రో నగరాలు చెన్నై, కోల్‌కతాలను దాటేసింది. ఆగస్టు నెలలో 18వ తేదీన అత్యధికంగా 79,855 మంది శంషాబాద్ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించారని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కొద్దిరోజుల క్రితం అధికారికంగా వెల్లడించింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకూ 1.29 కోట్ల మంది ప్రయాణించారు. ఈ ఏడాదిలోపు ఈ సంఖ్య రెండుకోట్లు దాటే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

విమానాశ్రయాలు	దేశీయ ప్రయాణికులు (కోట్లలో)	పెరుగుదల శాతం
దిల్లీ	3.24	3.3
ముంబయి	2.26	4.1
బెంగుళూరు	1.99	4.0
హైదరాబాద్	1.29	11.2
కోల్‌కతా	1.05	8.1
చెన్నై	0.91	2.9





సుందరరంగథాముడు

కూకట్‌పల్లి రంగథాముని చెరువులో ఇటీవలే సుందరీకరణ పనులు పూర్తయ్యాయి. భారీ పూల డిజైన్లతో ఆకట్టుకునే నమూనాలు ఏర్పాటు చేయడంతో సందర్శకుల తాకిడి పెరిగింది.

ముందుకొస్తున్న మూసీ నిర్వాసితులు

- పునరావాసం కల్పిస్తే.. ఖాళీ చేస్తామన్న 30 శాతం మంది

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం కల్పిస్తామంటున్న పునరావాసానికి మూసీ నది నిర్వాసితులు అంగీకరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆక్రమణల తొలగింపులో భాగంగా బాధితులను గుర్తించేందుకు గురువారం ఇంటింటి సర్వే ప్రారంభమైంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని నది పరివాహక ప్రాంతాల్లోని 1,200 నిర్మాణదారులకు నోటీసులివ్వగా, 30 శాతం మంది పునరావాసానికి అంగీకరించినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ జిల్లాలో 542 ఇళ్లకు మార్కింగ్ వేయగా, అందులో 406 కుటుంబాలు పునరావాసానికి అంగీకరించాయి. వీరిందరికీ శనివారం రెండు పడక గదుల ఇళ్లు కేటాయించి, అక్కడి నుంచి ఖాళీ చేయించనున్నారు.



నిర్వాసితురాలికి రెండు పడక గదుల ఇంటి తాళం అందజేస్తున్న అధికారులు

మొదటి రోజు చైతన్యపురిలో నిర్వాసితులు సర్వేను అడ్డుకున్నారు. ఉప్పల్ మండలం పరిధిలోని 15 మందికి వనస్థలిపురం జైభవానినగర్‌లోని రెండు పడక గదుల ఇళ్లను కేటాయించి, సంబంధిత పత్రాలను అప్పటికప్పుడు అందజేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ వాహనాల్లోనే ఇళ్లలోని సామాన్లను వనస్థలిపురం చేర్చినట్లు తెలిపారు. శుక్రవారం మరో 200 కుటుంబాలకు ఇళ్లు అందజేస్తామన్నారు.

డీజేలపై పోలీసుల నజర్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్

ఈనాడు, హైదరాబాద్: ఊరేగింపులు, వేడుకల సందర్భంగా విపరీత శబ్ద కాలుష్యానికి దారితీస్తున్న డీజేల నిషేధంపై నగర పోలీసులు దృష్టి సారించారు. తొలిదశలో భాగంగా వివిధ వర్గాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై అభిప్రాయాలు సేకరించారు. వీటిని నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపించనున్నారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజాసింగ్, పాషాఖాద్రీ, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సీవీ ఆనంద్ డీజేలపై నియంత్రణ అవసరాన్ని వివరిస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రెండేళ్లుగా డీజేలతో పెద్దయెత్తున నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని, ఈసారి శృతిమించి జరిగిందని, సీఎం రేవంత్‌రెడ్డి సైతం దీన్ని గమనించి ఆరా తీశారని సీవీ ఆనంద్ అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఇక నుంచి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పాషాఖాద్రీ.. డీజేల నిషేధానికి మద్దతు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ.. డీజేలు బ్యాన్ చేయాలని ముందే నిర్ణయం తీసుకున్నట్లు అనిపిస్తోందని, వేలాది మంది పేదలు డీజేలపై ఆధారపడ్డారని, వారు రోడ్డుపాలవుతారని అన్నారు. డీజేలకు ఒక విధానం తేవాలని, పండుగలు ఎలా జరగాలో ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. డీజేలపై నిషేధం విధిస్తే దీనిపై ఆధారపడ్డ వారు ఉపాధి కోల్పోతారని, వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని సూచించారు.

28న నగరానికి రాష్ట్రపతి

నారాయణగూడ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 28న నగరానికి రానున్నారు. శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు బేగంపేట్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, పీఎన్‌టీ జంక్షన్, రసూల్‌పురా, సీటీఓ జంక్షన్, ప్లాజా, టివోలి, సికింద్రాబాద్ క్లబ్, కార్ఖానా, తిరుమలగిరి క్రాస్‌రోడ్స్, లోతుకుంట, బొల్లారం, రాష్ట్రపతి నిలయం పరిసర ప్రాంతాల్లోని కూడళ్లు, జంక్షన్లు కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ పి. విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

గోవాలో నటుడు అభిషేక్ అరెస్టు

ఈనాడు- హైదరాబాద్: డ్రగ్స్ కేసులో గతంలో అరెస్టయిన సినీ నటుడు అభిషేక్‌ను నగర పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తనపై ఉన్న కేసుల్లో కోర్టు హాజరుకాకపోవడంతో ఇటీవల నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి. అతడి ఆచూకీ గురించి ఆరా తీసిన పోలీసులు గురువారం గోవాలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అభిషేక్ గతంలో ఎస్ఆర్‌నగర్, జూబ్లీహిల్స్‌లో ఠాణాల్లో అభిషేక్‌పై డ్రగ్స్ కేసులు నమోదయ్యాయి. కొన్నాళ్లుగా గోవాలో రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు.

డ్రైవర్ పథకం వేశాడు.. స్నేహితులు కొట్టేశారు

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: శివారులోని మక్త గ్రామంలో పాల వ్యాపారి ఇంట్లో రూ.2.02 కోట్ల చోరీ కేసులో మిస్టరీ వీడింది. పాల వ్యాపారి వద్ద డ్రైవరుగా పనిచేస్తున్న రవి దర్శకత్వంలో ఆరుగురు ఈ చోరీ చేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పాల వ్యాపారి తన ఇంట్లో రూ.15 లక్షలు చోరీ అయ్యాయని ఫిర్యాదు ఇవ్వగా.. చోరీ చేసిన వారు మాత్రం సంచిలో రూ.2.02 కోట్లు ఉన్నాయని పోలీసులకు చెప్పడం విడ్డూరం.



బాధితుడి ఇంట్లో పోలీసుల తనిఖీలు

- వీడిన రూ.2 కోట్ల చోరీ కేసు మిస్టరీ
- పోలీసుల అదుపులో ఏడుగురు నిందితులు

తెరవెనుక ఉంటూ మంత్రాంగం..

పోచారం ఠాణా పరిధి మక్త గ్రామానికి చెందిన పాలవ్యాపారి నాగభూషణం(70) ఈ నెల 22న ఉదయం తన ఇంట్లో భారీ చోరీ జరిగిందని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మొత్తం రూ.2.02 కోట్ల నగదు, 28 తులాల నగలు ఎత్తుకెళ్లినట్లు చెప్పాడు. అయినా తొలిరోజు ఫిర్యాదు ఇవ్వలేదు. అదుపులోకి తీసుకుని విచారించాక మరుసటి రోజు ఠాణాకు వెళ్లి రూ.15లక్షలు పోయినట్లు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అనుమానంతో దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాలతో సీసీ కెమెరాలను తనిఖీ చేయగా ఓ ఆటోలో ముగ్గురు రాకపోకలు సాగించినట్లు గుర్తించారు. దాని ఆధారంగా సుమారు 200పైగా సీసీ కెమెరాలను పరిశీలించి ఆటో నెంబరు ద్వారా పవన్, మహేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిని నాగభూషణం డ్రైవర్ రవి స్నేహితులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. నాగభూషణం వద్ద భారీగా డబ్బు ఉన్నట్లు రవి చెప్పాడని, అతడి సూచన మేరకే చోరీ చేసినట్లు అంగీకరించినట్లు తెలిసింది. నాగభూషణం ఇంట్లో లేని సమయం గుర్తించి రవి సమాచారం ఇవ్వగా.. ఆటోడ్రైవర్ మహేశ్‌తో కలిసి చోరీ చేశామని చెప్పినట్లు సమాచారం. వీరికి మరో నలుగురు సహకరించినట్లు గుర్తించి అందర్నీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నాగభూషణం రూ.15 లక్షలు చోరీ అయినట్లు ఫిర్యాదు చేశారు. నిందితుల్లో ఒకరు చోరీ చేసిన సంచిలో దాదాపు రూ.2 కోట్లు ఉన్నాయని, మరో నిందితుడు రూ.1.7 కోట్లు ఉన్నాయని చెప్పినట్లు సమాచారం. నగదు ఎక్కడ ఉందనే విషయంపై ఆరా తీస్తున్నారు.

వివక్ష తొలగేలా.. ఉపాధి సాధించేలా



సమాజంలో వివక్షకు గురవుతున్న ట్రాన్స్‌జెండర్లకు గౌరవప్రదమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తొలిసారిగా రంగారెడ్డి జిల్లా సంక్షేమ విభాగం, క్వీర్ బంధు పేరెంట్ అసోసియేషన్, ఎంఎస్ఐ సంయుక్తంగా ట్రాన్స్ జెండర్లకు కంప్యూటర్ కోర్సులు నేర్పిస్తున్నారు. సరూర్‌నగర్‌లోని ఓ భవనంలో ఇలా ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

మూసీ వరదలకు 116 ఏళ్లు

150 మందిని రక్షించిన చింతచెట్టు పరిరక్షణకు చర్యలు శూన్యం

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: నగరంలో 116 ఏళ్ల క్రితం సెప్టెంబరులో భయంకరమైన వరదల కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అదే సమయంలోనే ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలోని చింతచెట్టు 150 మందిని అక్కున చేర్చుకుంది. 1908 సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు మూసీ ఉప్పొంగింది. వరద ప్రవాహం తగ్గేంత వరకు ఆ చెట్టును ఆసరాగా చేసుకుని బతికి బయటపడ్డారు. చారిత్రక ప్రాధాన్యం సంతరించుకున్న ఆ వృక్షానికి ప్రస్తుతం రక్షణ కరవైంది. దాని ప్రాధాన్యం భావితరాలకు చెప్పేందుకు సర్కారు చర్యలు తీసుకోకపోవడంపై చరిత్రకారులు పెదవి విరుస్తున్నారు.

నిధుల కొరత: గతంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పనిచేసిన సోమేశ్‌కుమార్ చెట్టు ఆవరణలోని ఉద్యానాన్ని ఆధునికీకరించేందుకు రూ.కోటి నిధుల్ని మంజూరు చేశారు. ఆగమేఘాల మీద పనులు ప్రారంభించారు. కొన్ని నెలల వ్యవధిలోనే ఆయన మరో శాఖకు బదిలీ కావడం, నిధుల గ్రహణం పట్టుకోవడంతో పనులు నిలిచిపోయాయి.



ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలోని చింత చెట్టు

రాచకొండ.. వాహనం కదలకుండా

ఈనాడు, హైదరాబాద్

- ప్రధాన కూడళ్లలో బారులు తీరుతున్న వాహనాలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

రోడ్లను సగం మేర ఆక్రమించి వ్యాపారాలు.. ప్రధాన కూడళ్ల దగ్గర అడ్డగోలుగా వాహనాలు.. వెరసి రాచకొండ కమిషనరేట్‌లో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. దీనిని చక్కదిద్దాల్సిన ట్రాఫిక్ విభాగం ప్రేక్షక పాత్ర పోషిస్తుండడంతో సమస్య తీవ్రత పెరుగుతోంది. కొన్ని ప్రధాన కూడళ్లలో సమస్యను చక్కదిద్దకుండా కేవలం చలానాలకు పరిమితమవడం విమర్శలకు దారితీస్తోంది.

ప్రధాన ప్రాంతాల్లో పర్యవేక్షణలేమి..

- అండర్‌పాస్, పైవంతెనలతో ఎల్బీనగర్ చౌరస్తా సిగ్నల్ ఫ్రీ జంక్షన్‌గా మారింది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ పరిస్థితి మెరుగ్గా ఉండాల్సి ఉండగా ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ లేమితో ఇష్టారీతిన ఆటోలు, ఇతర వాహనాల పార్కింగ్, బస్సులు స్టాపుల వద్ద నిలపకపోవడంతో గందరగోళంగా మారుతోంది. ఎల్బీనగర్ మెట్రోస్టేషన్ వద్ద అడ్డగోలుగా వాహనాలు నిలుపుతున్నారు.
- ఉప్పల్ కూడలిలో వరంగల్ వెళ్లే వాహనాలు, ఆర్టీసీ బస్సులు అడ్డగోలుగా నిలపడంతో రద్దీ ఏర్పడుతోంది. వరంగల్ జాతీయ రహదారిలోకి ప్రవేశించగానే ఇరుకు రోడ్డు ట్రాఫిక్ స్తంభించిపోతుంది.
- హబ్సిగూడ చౌరస్తా నుంచి ఉప్పల్ వరకు సాయంత్రం వేళ ప్రయాణం వాహనదారులకు విసుగుపుట్టిస్తోంది.
- చైతన్యపురి- రంగారెడ్డి కోర్టు వరకు ప్రధాన రహదారిని పండ్ల వ్యాపారులు సగం మేర ఆక్రమిస్తున్నారు.
- నాగోల్, ఉప్పల్ మెట్రోస్టేషన్ల కంటే ముందు వచ్చే యూటర్న్‌ల వద్ద సమస్య అధికంగా ఉంటోంది.



ఎల్బీనగర్ మెట్రోస్టేషన్ దగ్గర రోడ్డుకు అడ్డంగా వాహనాలు

అప్‌డేట్స్‌లో వెనకడుగు..

రాచకొండ కమిషనరేట్ పరిధిలో కీలకమైన విజయవాడ హైవే, ఎల్బీనగర్- హబ్సిగూడ వరకు ఇన్నర్ రింగురోడ్డు, సాగర్ రహదారి వంటి కీలక మార్గాలున్నాయి. రద్దీ సమయాలు, వర్షాలు ఇతర ప్రత్యేక సందర్భాల్లో హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు తాజా సమాచారం ఇస్తున్నాయి. రాచకొండ పోలీసులు ఈ తాజా సమాచారం ఇవ్వడంలో వెనుకబడ్డారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

తెలుగుతల్లి కంఠాభరణం ఘంటసాల



పురస్కార గ్రహీతలతో అతిథులు

రవీంద్రభారతి: తెలుగుతల్లి కంఠాభరణం ఘంటసాల వెంకటేశ్వరరావు అని వక్తలు కొనియాడారు. గురువారం రాత్రి రవీంద్ర భారతిలో ఘంటసాల ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో డా.అక్కినేని నాగేశ్వరరావు పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. అకాడమి అధ్యక్షుడు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో వరప్రసాద్ గురూజీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాకతీయ వర్సిటీ విశ్రాంత ప్రొ.తిరుపతయ్య, గాయకుడు ప్రభాకర్ (భద్రాద్రి), శంకర్ ప్రసాద్ (ముంబయి), న్యాయవాది రంగనాథ్, గాయకుడు వై.వి.రమణ (భీమవరం), లీగల్ అడ్వయిజర్ నాగరఘులకు పురస్కారాలు ప్రదానం చేశారు. సభలో భద్రాచలానికి చెందిన జగదీష్, రంగారెడ్డి, లక్ష్మీనారాయణ, ఘంటసాల సంగీత కళాశాల (మహబూబ్‌నగర్) జగదీశ్వర్ మాట్లాడారు.

భవిష్యత్తు భారత్ ప్రమాణాలదే: కలెక్టర్



కలెక్టర్‌కు జ్ఞాపిక ఇస్తున్న బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్

సోమాజిగూడ, న్యూస్‌టుడే: భవిష్యత్తులో ప్రపంచ దేశాలన్నీ భారతీయ ప్రమాణాలపై ఆధారపడే రోజు వస్తుందని, నాణ్యతకు చిరునామాగా మన దేశం మారుతుందని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. ఆ దిశగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. గురువారం సోమాజిగూడలోని కత్రియ హోటల్‌లో జరిగిన ప్రపంచ ప్రమాణాల దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. తాత్కాలిక ప్రయోజనాల కోసం నాసిరకం సరకు తయారు చేస్తే అది మానవాళి భవిష్యత్తు మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతుంది. బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్, అధికారులు డా.శ్రీకాంత్, సుజాత, తన్నీరు రాకేశ్, అభిసాయి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (ఉ.10 నుంచి మ.1 గంట మధ్య)

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

షేక్‌పేట, న్యూస్‌టుడే:

? షేక్‌పేట ఓయూ కాలనీ శ్రీలక్ష్మి ఫుడ్-వెస్టన్ ప్లాజా రోడ్డు గుంతలమయంగా మారింది. రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.
– రాయప్రోలు శర్మ, ఓయూ కాలనీ

✔ త్వరలోనే తారుతో మరమ్మతులు చేయిస్తాం. రోడ్డు పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.
–మోహన్‌రావు, ఏఈ, జీహెచ్ఎంసీ

ఇందిర నగర్.. గవర్నర్ నజర్

- 'స్వచ్ఛతా హీ సేవ'కు ఎంపిక
- నేడు సందర్శించనున్న జిష్ణుదేవ్ వర్మ

బస్తీ స్వరూపం

ఏర్పాటు	1965
మొత్తం బ్లాకులు	18
ప్రతి బ్లాక్‌కు అంతస్తులు	3
ప్రతి అంతస్తుల్లో నివాసాలు	6
ఒక్కోబ్లాక్‌లో నివాసాలు	18
మొత్తం ఇళ్లు	324
జనాభా సుమారుగా	1600
విశాలమైన రోడ్లు	4

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్‌లోని ఇందిర నగర్ బస్తీ రూపు మారనుందా? అంటే అవుననే వినిపిస్తోంది. బస్తీలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉందన్న భావన కలుగుతోంది. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ శాఖలు మమేకమవుతున్నాయి. అయితే రాష్ట్ర ప్రథమ పౌరుడు, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఖైరతాబాద్‌లోని ఇందిర నగర్ బస్తీని ఎంపికచేసుకున్నారు. దీంతో రాజ్‌భవన్ అధికారుల బృందం బుధవారం బస్తీని సందర్శించి అక్కడి సమస్యలు, ఎన్ని ఇళ్లు ఉన్నాయి. బస్తీ ఎప్పుడు ఏర్పడింది, ఎన్ని కుటుంబాలు ఉంటాయని ఆరా తీశారు. శుక్రవారం (నేడు) బస్తీని గవర్నర్ సందర్శించి 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో పాల్గొననున్నారు.



ఖైరతాబాద్‌లోని ఇందిరనగర్ బస్తీ

ఆక్రమణలతో..

ఇందిర నగర్ బస్తీ ఏర్పడేటప్పటికి ఖైరతాబాద్‌లో ఇతర బస్తీలు లేవు. కొంత దూరంగా ఓల్డ్ సీబీబీ క్వార్టర్స్, ఖైరతాబాద్ గ్రంథాలయం, దాని పరిసరాల్లో చిన్న ఇళ్లు ఉండేవి. విశాలమైన నాలుగు వీధులతో ఉన్న బస్తీలోని నివాసితుల కుటుంబ సభ్యుల సంఖ్య క్రమంగా పెరగడంతో అదనపు నిర్మాణాలు చేపట్టారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లోని వారు రోడ్డును ఆక్రమిస్తే, రెండో అంతస్తులోని కొందరు పైన మరో అంతస్తు నిర్మించుకున్నారు. దీంతో దాదాపు దాదాపు 100 నివాసాలు ఎక్కువయ్యాయి. వీధులు కుంచించుకుపోయాయి. ప్రస్తుతం జనాభా రెట్టింపు అయ్యింది. సుమారు 3వేల మంది నివాసం ఉంటున్నారు.

సమస్యలు అనేకం..

● ప్రధాన సమస్య డ్రైనేజీ. పాత పైపులు పెరిగిన జనాభాకు సరిపోక నిత్యం లీకవుతూ తాగునీటిరు కలుషితం అవుతోంది. ● వీధి దీపాలకు స్తంభాలు ఉన్నా సగం దీపాలు వెలగడం లేదు. ● బస్తీ నిర్మాణం తర్వాత వీధుల్లో లారీలు తిరిగేవి. నేడు అంబులెన్స్ రావాలన్నా ఇబ్బందికరమైన పరిస్థితి ● ఇళ్ల నిర్మాణం జరిగి 60 ఏళ్లు కావడంతో భవనాలన్నీ శిథిలావస్థకు చేరాయి. ● భారీ వర్షాలు కురిస్తే పలు చోట్ల గోడల్లో నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఇళ్లలో నీరు చేరుతోంది.

మార్పుపై ఆశలు..

నగరంలో అనేక బస్తీలు ఉన్నా గవర్నర్ ఇందిరనగర్ బస్తీని ఎంపిక చేసుకోవడంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎంతో కాలంగా ఉన్న సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నారు. భవనాలన్నీ శిథిలావస్థకు చేరడంతో కొత్తగా నిర్మించేలా ప్రభుత్వానికి గవర్నర్ సూచనలు చేస్తారని ఆశిస్తున్నారు.

జనసేన నేతల మౌనదీక్ష

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ విషయమై సనాతన ధర్మ పరిరక్షణకు జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా తెలంగాణ నాయకుల ఆధ్వర్యంలో గురువారం లిబర్టీలోని తితిదే వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం మౌనదీక్ష చేపట్టారు. అంతకుముందు జనసేన తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి వేమూరి శంకర్‌గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాధారం రాజలింగం ఆధ్వర్యంలో ఆలయాన్ని శుద్ధి చేశారు.





యూపీలో ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ సమావేశాలు 28 నుంచి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై జాతీయ సమావేశాల్లో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, ఐఎఫ్‌డబ్ల్యూ వర్కింగ్ కమిటీ సభ్యుడు మామిడి సోమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు ఉత్తరప్రదేశ్‌లోని మథురలో జరగనున్నాయని తెలిపారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను మీడియా కౌన్సిల్‌గా మార్చాలని, డిజిటల్, సోషల్ మీడియా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, జాతీయ పింఛను విధానం, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తదితర డిమాండ్లపై ఈ సమావేశాల్లో చర్చిస్తామన్నారు.

హెచ్‌సీఎల్ సైక్లథాన్ డిసెంబరు 30న



జెర్సీని ఆవిష్కరిస్తున్న జయేష్ రంజన్, చిత్రంలో అభిషేక్ మిశ్రా, రజత్ చందోలియా తదితరులు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: హెచ్‌సీఎల్, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ సైక్లింగ్ సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో డిసెంబరు 15న 'హెచ్‌సీఎల్ సైక్లథాన్- 2024' నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం బంజారాహిల్స్‌లోని తాజ్‌డెక్కన్‌లో రాష్ట్ర ఐటీశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి జయేష్ రంజన్ ఈ పోటీల జెర్సీని ఆవిష్కరించారు. హెచ్‌సీఎల్ గ్రూప్ ఉన్నతాధికారి రజత్ చందోలియా, ఈవెంట్ డైరెక్టర్ అభిషేక్ మిశ్రా, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఐ) ఉపాధ్యక్షుడు పి.మల్లారెడ్డి పోటీల వివరాలు వెల్లడించారు. నవంబరు 30 కల్లా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మేజర్ జనరల్ డా. ఏవీకే మోహన్, సైక్లిస్టులు పాల్గొన్నారు.

ఆయుష్‌ను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి



మాట్లాడుతున్న కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి భావనా సక్సేనా

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: ఆయుష్ పరిధిలోని అన్ని వైద్య విధానాలను ప్రజలకు చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయుష్ శాఖ సంయుక్త కార్యదర్శి భావనా సక్సేనా అన్నారు. ఎర్రగడ్డలోని యునానీ పరిశోధన కేంద్రం ఆడిటోరియంలో సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యూనాని మెడిషన్ ఆధ్వర్యంలో సైంటిస్టు లెవల్-1 రీసెర్చ్ మెథడాలజీ, మానవ వనరుల అభివృద్ధి కోర్ రిసెర్చ్ కార్యక్రమాలపై రెండు రోజులు జాతీయ సదస్సును గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గౌరవ అతిథిగా సెంటిఫిక్ అడ్వజరీ కమిటీ ఛైర్మన్ ఆచార్య అసిమ్ అలీఖాన్, సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యునాని మెడిషన్ మాజీ డైరెక్టర్ డా.ఎం.ఎ.వహీద్, సెంట్రల్ కౌన్సిల్ రిసెర్చ్ యునానీ మెడిషిన్ డైరెక్టర్ జనరల్ డా.ఎన్.జహీర్ అహ్మద్, నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యునానీ మెడిసిన్ హైదరాబాద్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డా.యూనిస్ ఇఫ్తాకర్ మున్షి యునాని అభివృద్ధికి చేపట్టాల్సిన పరిశోధనలపై చర్చించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది ప్రతినిధులు, పరిశోధకులు పాల్గొన్నారు

జైనూర్ ఘటనలో పోలీసుల వైఫల్యం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ ఘటన ప్రజల మధ్య విద్వేషాలు కలిగించేదిగా ఉందని పలువురు సామాజిక కార్యకర్తలు పేర్కొన్నారు. అక్కడ పోలీసుల వైఫల్యం కనిపిస్తోందని ప్రొ.పద్మజాషా పేర్కొన్నారు. పలువురు సామాజిక కార్యకర్తలతో ఈనెల 14, 19వ అక్కడ పర్యటించామని తెలిపారు. గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ.. గిరిజన మహిళ కుటుంబంలో జరిగిన గొడవను హిందూ, ముస్లిం వివాదంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పీఓడబ్ల్యూ సంధ్య మాట్లాడుతూ.. జైనూర్‌లో భాజపా, ఆర్ఎస్ కారణంగా అభద్రతా భావం నెలకొందన్నారు. ఘటనకు ప్రభుత్వం, భాజపా బాధ్యత వహించాలన్నారు. సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు శారా మాథ్యూ, కనీజ్ ఫాతీమా, ఎస్క్యూ మసూద్, అన్సార్ తదితరులు ఉన్నారు.

నాటక దర్శకుడు జమ్మలమడక రమణ కన్నుమూత



నారాయణగూడ, న్యూస్‌టుడే: ప్రముఖ నాటక దర్శకుడు జమ్మలమడక రమణ ప్రభ (75) వృద్ధాప్య సమస్యలతో తతవిద్యానగర్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. పలు నాటకాలకు దర్శకత్వం వహించిన ఆయన బాల్యం నుంచే రంగస్థలం మీద బాల నటుడిగా అడుగులు వేశారు. తొలుత యువభారతి సంస్థ ద్వారా నాటకాల్లో నటించారు. నాట్యాంజలి నాటక సంస్థను ఏర్పాటు చేసి ఎంతో మంది కళాకారులను తీర్చిదిద్దారు. రాజమండ్రిలో నిర్వహించిన పోటీలలో హైదరాబాద్ ఆర్టీసీ రంగస్థల విభాగం ఆర్ట్స్‌కో తరపున ప్రదర్శించిన 'మృత సంజీవని' నాటకానికి నంది బహుమతి అందుకున్నారు. జీవితం చివరి వరకు నాటకాలకు దర్శకత్వం వహిస్తూనే వచ్చారు. కోట శ్రీనివాసరావు, సుబ్బరాయశర్మ, ఎల్బీ శ్రీరామ్, నిట్టల శ్రీరామమూర్తి, అమరేంద్ర, విద్యాసాగర్ వంటి నటులతో కలిసి నటించారు. కుమారుడు అమెరికా నుంచి తిరిగి వచ్చిన తరువాత 27న శుక్రవారం ఆల్వాల్ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆసుపత్రి ఏజీఎం ఇంట్లో ఆభరణాలు చోరీ

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఓ కార్పొరేట్ ఆసుపత్రి ఏజీఎం ఇంట్లో చోరీ జరిగింది. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందినగర్‌లో యశోద ఆసుపత్రిలో అడ్మిన్ ఏజీఎంగా పని చేసే మాజిద్ హబీబ్ ఖాన్ నివసిస్తున్నారు. ఓ ప్రైవేటు సంస్థ పనిచేసే ఆయన భార్య విధులకు వెళ్లగా మాజిద్ ఇంటికి తాళం వేసి తాళం చెవి తలుపు పక్కన కిటికీ వద్ద షూలో పెట్టి విధులకు వెళ్లారు. అదే రోజు సాయంత్రం ఇంటికి తిరిగివచ్చిన భార్య లోపలికి వెళ్లి చూడగా అల్మరాలో దాచిన మూడు జతల చెవిదిద్దులు, బంగారు ఉంగరం పలు వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. బుధవారం రాత్రి మాజిద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలసీ బజార్ పేరిట టోకరా

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: పాలసీ బజార్ పేరిట మోసానికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో నివసించే మహమ్మద్ అబ్దుల్ రహమాన్‌కు సెప్టెంబరు 12న కారు బీమా పునరుద్ధరణకు పాలసీ బజార్ నుంచి అని ఒక అగంతకుడు సందేశం పంపాడు. దీంతో రూ.12,510 అతడు సూచించిన గూగుల్ పే నంబరుకు పంపాడు. ప్రతిగా పునరుద్ధరించిన పాలసీ కాపీ వాట్సాప్‌కు వచ్చింది. అయితే అందులో వివరాలు సరిగా నమోదు కాకపోవడంతో అతడిని సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫలితం లేకపోయింది. పాలసీబజార్‌ను సంప్రదించగా తమ వద్ద ఎలాంటి పాలసీ పునరుద్ధరణ జరగలేదని తేల్చిచెప్పారు. దీంతో మోసానికి గురైనట్లు గుర్తించి సైబర్ క్రైమ్, బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంటోన్మెంట్ స్థలం సమీపంలో నిర్మాణాలు.. ఇద్దరిపై కేసు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా మెహదీపట్నం ఆర్మీ కంటోన్మెంట్ స్థలానికి సమీపంలో నిర్మాణాలు చేపడుతున్న ఇద్దరిపై లెఫ్టినెంట్ కల్నల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెహదీపట్నంలోని డిఫెన్స్ స్థలానికి 55 మీటర్ల దూరంలో నిర్మాణాలకు అనుమతి లేదు. అలా నిర్మాణాలు చేపట్టాలంటే జీహెచ్ఎంసీ, స్థానిక మిలటరీ విభాగం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఇవేమీ లేకుండా బంజారాహిల్స్ రోడ్ నంబరు 12 సయ్యద్ నగర్ ఫస్ట్ ల్యాన్సర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ హమీద్, ఆయేషా సుల్తానా నిర్మాణాలు చేపట్టారు. ఆర్మీ కంటోన్మెంట్ హవాల్దార్ అజాజ్ అహ్మద్ బంజారాహిల్స్ ఇద్దరిపై వేర్వేరుగా ఫిర్యాదు చేయగా, జీహెచ్ఎంసీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.24,420 విలువైన విదేశీ సిగరెట్ల స్వాధీనం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న సూపర్ మార్కెట్ యజమానిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనగర్‌కాలనీలోని 'యశ్‌దీప్ సూపర్‌బజార్'లో విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్టోర్‌పై పోలీసులు దాడి చేసి దాదాపు రూ. 24,420 విలువైన సరకు స్వాధీనం చేసుకున్నారు. యజమాని యశ్వంత్ ఉపాధ్యాయపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్‌కానిస్టేబుల్ అదృశ్యం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: యూసుఫ్‌గూడలోని మొదటి పటాలంలో పనిచేసే హెడ్ కానిస్టేబుల్ అదృశ్యమైన ఘటన ఇది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. పోతనపల్లి వెంకటేశం 23 ఏళ్ల మొదటి పటాలంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆరు నెలలుగా ఆరోగ్యం బాగోలేకపోవడంతో విధులకు హాజరుకావడం లేదు. ఈనెల 13న సొంతూరికి వెళ్లి 18న తిరిగి వచ్చాడు. 20న ఇంట్లోంచి వెళ్లి తిరిగిరాలేదు. చరవాణిలో అందుబాటులో లేకపోవడంతో అతడి భార్య పవిత్ర పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలో వృద్ధి రేటు అధికం



విద్యార్థులు రూపొందించిన వాహనాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: దేశంలో తెలంగాణలోనే అత్యధికంగా వృద్ధిరేటు ఉందని, విశ్వనగరంగా మారిన హైదరాబాద్ నగరంలో పెట్టుబడులు పెట్టేందుకు అంతర్జాతీయ వ్యాపార, వాణిజ్య సంస్థలు, ప్రపంచస్థాయి పరిశ్రమలు తరలివస్తున్నాయని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాల (ఎంజేసీఈటీ)లో గురువారం 'కమ్మెన్స్‌మెంట్ డే' ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయస్థాయి రేసింగ్ పోటీలైన 'సుప్రా- 2024'లో పాల్గొనేందుకు కళాశాల విద్యార్థులు రూపొందించిన ఆల్ టెర్రయిన్ వెహికల్‌ను మంత్రి ఆవిష్కరించి విద్యార్థులను అభినందించారు. ఎస్‌యూఈఎస్ గౌరవ కార్యదర్శి జాఫర్ జావేద్, ఎంజేసీఈటీ ప్రిన్సిపల్ డా. మహిపాల్ సింగ్ రావత్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

వెంగళ్‌రావునగర్: హైదరాబాద్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎల్బీస్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంటర్ స్కూల్స్ కరాటే పోటీల్లో మధురానగర్‌లోని శ్రీనిధి పాఠశాల పదోతరగతి చదవుతున్న ఎస్.ప్రియ పాల్గొని అండర్-17 విభాగంలో కాంస్య పతకం సాధించింది. పాఠశాల డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపల్ గీత, ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.







14 రోజుల శిశువు గుండెకు రక్షణ

నిమ్స్, న్యూస్‌టుడే: పద్నాలుగు రోజుల చిట్టి గుండెకు రక్షణ కల్పించారు వైద్యులు. పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో బ్రిటన్ వైద్యుడు రమణ దన్నపనేని సారథ్యంలో చిన్నారుల గుండె శస్త్ర చికిత్సలు కొనసాగుతున్నాయి. బాబు 12 రోజులు ఉన్న సమయంలోనే గుండె నుంచి శరీరానికి సరఫరా అయ్యే రక్తనాళాలు మూసుకుపోవడంతో రక్తం సక్రమంగా సరఫరా కావడం లేదని కుటుంబీకులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించి అడ్మిషన్ చేసుకున్న వైద్యులు గురువారం నిర్వహించిన శస్త్ర చికిత్సల్లో(14 రోజులు) చిన్నారికి విజయవంతంగా శస్త్ర చికిత్సను పూర్తిచేసి రక్తనాళాలను మెరుగుపరిచారు. అంతే కాకుండా ఎనిమిది నెలల చిన్నారి, ఏడాది పాప(నీలం రంగు, గుండె రంధ్రం), మరో చిన్నారితో మొత్తం నలుగురికి చికిత్సలు పూర్తయినట్లు కార్డియోథొరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు చెప్పారు. అందరి పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు.

తాజ్‌కృష్ణలో లేబుల్ లవ్ ప్రదర్శన



జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ హోటల్ ఆవరణలో లేబుల్ లవ్ 6 ప్రదర్శన గురువారం ప్రారంభమైంది. పండుగల నేపథ్యంలో లైఫ్‌స్టైల్ ఉత్పత్తులకు ప్రాధన్యమిస్తూ ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. బంగారు ఆభరణాలు, ఇతర ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. దీపావళి పండుగకు సంబంధించిన అలంకార ఉత్పత్తులు ఉన్నాయి. ఈనెల 28 వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకురాలు శశినహాతా తెలిపారు. ఉదయం 11 నుంచి రాత్రి 8 వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు.

చాకలి ఐలమ్మ జయంతి



తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి మహమూద్ అలీ, భారాస నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు

మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన తెలంగాణ ధీరవనిత దివంగత చాకలి ఐలమ్మ అని వక్తలు కొనియాడారు. ఆమె జయంతి సందర్భంగా ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయం, బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్, పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో, ఫిల్మ్‌నగర్, వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్ మార్కెట్ సమీపంలో నిర్వహించి కార్యక్రమాల్లో ఐలమ్మకు నివాళులు అర్పించారు.

– న్యూస్‌టుడే, ఖైరతాబాద్, బంజారాహిల్స్, ఫిలింనగర్, నిమ్స్, వెంగళ్‌రావునగర్

కూ.. చుక్‌చుక్.. పనులు చకచక

మల్టీలెవెల్ పార్కింగ్ నిర్మాణం



ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు 2025 నవంబర్ మొదటివారానికి కల్లా పూర్తికానున్నాయి. రూ.700కోట్లతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టగా రెండు దశల్లో పనులను విభజించి ఏకకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు శ్రమిస్తున్నారు. మూడు షిఫ్టుల్లో పనులు చేయిస్తున్నారు. పూర్తిస్థాయిలో స్టేషన్ అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ఎయిర్‌పోర్టు తరహా సేవలు అందనున్నాయి.

ఎన్‌ఎస్‌జీ -1 గ్రేడ్‌లో స్టేషన్..

సంవత్సరానికి రూ.2 కోట్ల ప్రయాణికులతో, రూ.500 కోట్ల ఆదాయంతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎన్ఎస్‌జీ గ్రేడ్ - 1 (నాన్ సబర్బన్ గ్రేడ్ - 1) స్టేషన్ జాబితాలో ఉంది. రోజూ 180 రైళ్ల రాకపోకలు, సగటున 1.5లక్షల మంది ప్రయాణిస్తున్నారు. భవిష్యత్తులో ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో స్టేషన్‌ను ఆధునికీకరించాలని కేంద్ర ప్రభుత్వం భావించింది.



ఎస్కలేటర్లు ఇలా..

ప్రణాళిక ఇదీ..

● ఆధునాతన హంగులతో ఉత్తరం, దక్షిణం వైపు జీప్లస్ 3 భవనాల నిర్మాణం. 7.5 మీటర్ల వెడల్పుతో రెండు వాకోవేలు, వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా రెండు ట్రావెలేటర్ల ఏర్పాటు. ● రెండో అంతస్తులో ప్రయాణికులకు వసతులు, రిటైల్ వ్యాపారాలు, కెఫెటేరియాలు, వినోద సదుపాయాలు. ● ఉత్తరం వైపు బహుళ అంతస్తుల పార్కింగ్, దక్షిణం వైపు అండర్‌గ్రౌండ్ పార్కింగ్ సదుపాయం ● 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్ల నిర్మాణం. ● ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, ట్రావెలేటర్లు, స్కైవాక్. ● ఉత్తరం, పడమర వైపున్న మెట్రోస్టేషన్లను కలుపుతూ వాకోవే, స్కైవే. ● ప్రయాణికులకు ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పికప్, డ్రాప్ పాయింట్ల ఏర్పాటు. ● 5000 కిలోవాట్ల సోలార్ పవర్ ప్లాంట్.

పనుల పురోగతి ఇలా..

● దక్షిణంవైపు బేస్‌మెంట్ పనులు 80శాతం జరిగాయి. గ్రౌండ్‌ఫ్లోర్ లెవెల్ రోడ్డు, డ్రైన్లు, విద్యుత్, సీవరేజ్‌లైన్ల పనులు పురోగతిలో ఉన్నాయి. ● పీఆర్ఎస్ కార్యాలయం వద్ద 1.5 లక్షల లీటర్ల అండర్‌గ్రౌండ్ ట్యాంక్, ట్రైన్ లైటింగ్ ఏరియా వద్ద 2లక్షల లీటర్లు, డాగ్ స్క్వాడ్ కెన్నెల్ వద్ద 6లక్షల లీటర్ల అండర్ గ్రౌండ్ ట్యాంక్ పనులు చివరి దశలో ఉన్నాయి. ● పాత ప్లాట్‌ఫామ్ పనులు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఎయిర్ కాన్‌కోర్స్, ట్రావెలేటర్, సీవోపీ ఫౌండేషన్ పనులు పురోగతిలో ఉన్నాయి. ● బేస్‌మెంట్-2లో 200 కార్లను నిలిపేలా పార్కింగ్ పనులు పునాదిదశలో ఉండగా, గ్రౌండ్‌ఫ్లోర్ పనులు 15శాతం పూర్తయ్యాయి. ● ఆరంతస్తుల మల్టీలెవల్ కార్ పార్కింగ్, ఎస్‌వోపీల పనులు పురోగతిలో ఉన్నాయి.

ఆ బెదిరింపు కాల్స్ నమ్మొద్దు

రాయదుర్గం,న్యూస్‌టుడే: 'ఫెడెక్స్‌లో మీ పేరిట ఉన్న పార్సిల్‌లో నిషేధిత వస్తువులు ఉన్నాయని, మీపై కఠినచర్యలు తీసుకుంటామంటూ కొందరికి మాదకద్రవ్యాలతో కూడిన మీ పార్సిల్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులకు చిక్కిందని అరెస్టు తప్పదని, బయపడవలసిందే మేం అడిగినంత డబ్బులు పంపించాలి' అని సైబర్ మోసగాళ్లు భయాందోళనలకు గురిచేసి డబ్బులు కాజేస్తున్న ఘటనలు జరుగుతున్నాయి. అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

ఇలా ఉచ్చులోకి.. ఫెడెక్స్ సిబ్బంది, కస్టమ్స్, పోలీసు అధికారుల పేరిట నకిలీ సందేశాన్ని పంపిస్తారు. మీకు వచ్చిన ప్యాకేజీలో మాదక ద్రవ్యాలు, నకిలీ పాస్‌పోర్టులు వంటివి ఉన్నాయంటారు. తమ డిమాండ్లను ఒప్పుకోకపోతే అరెస్టు చేస్తామంటారు. అసలు విషయం తెలియనివారు భయభ్రాంతులకు గురవుతారు. ఈ క్రమంలో వంచకులు బాధితులను మరింత భయపెట్టి.. విషయాన్ని సన్నిహితులు, బంధువులకు చెప్పకూడదని, ఇదంతా దర్యాప్తులో భాగమని లొంగదీసుకుంటారు. ఇలాంటి వాటిపై cybercrime.gov.inలో, భారత సైబర్ క్రైమ్ సహాయ కేంద్రం టోల్‌ఫ్రీ నం. 1930లో ఫిర్యాదు చేయవచ్చు.

'ప్రపంచ టెలికాం' సదస్సుకు భారత్ ఆతిథ్యం



అతుల్ సిన్హా

ఈనాడు, హైదరాబాద్, గచ్చిబౌలి, న్యూస్‌టుడే: ప్రపంచ టెలికాం రంగం సుప్రసిద్ధమైన సదస్సును తొలిసారిగా భారత్ ఆతిథ్యమివ్వనుంది. అక్టోబరు 14 నుంచి 24వరకూ దిల్లీలో జరుగనుంది. సన్నాహక వివరాలను కేంద్ర టెలికాం శాఖ అధికారులు దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌ల నుంచి గురువారం ఏకకాలంలో వెల్లడించారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో టెలికాంశాఖ ప్రత్యేక సందర్శకులు (ప్రశాంత్ పాటిల్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్(ఐటీ) అతుల్ సిన్హా, సాంకేతిక విభాగం డైరెక్టర్ జనరల్ ఆనంద్ కుమార్‌లు సదస్సు ప్రత్యేకతలను మీడియాకు తెలిపారు. సదస్సులో 193 దేశాల ప్రతినిధులతో పాటు 50 టెలికాం సంస్థలు పాల్గొంటున్నాయని అతుల్ సిన్హా పేర్కొన్నారు. అక్టోబర్ 15న ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారత మండపంలో సదస్సును ప్రారంభించనున్నారని తెలిపారు. అందుబాటులో ఉన్న 5జీ సేవలు, భవిష్యత్తులో రానున్న 6జీ సేవలపై కీలక చర్చలుంటాయని వివరించారు.

స్పెక్ట్రమ్ వినియోగం.. ఒకే సాంకేతిక.. ఇంటర్నెట్ ప్రాముఖ్యం పెరుగుతున్న కొద్దీ టెలికాం ఆపరేటర్లపై ఒత్తిడి పెరుగుతోందని, దీన్ని అధిగమించేందుకు స్పెక్ట్రమ్ వినియోగాన్ని పెంచేందుకు ఎలాంటి పరిశోధనలు చేయాలన్న అంశాలపై సదస్సులో చర్చించనున్నారని అతుల్ సిన్హా తెలిపారు. ఈ సన్నాహక సమావేశంలో 'కేఈ-6జీ హాకథాన్-2024'గా వ్యవహరిస్తున్నట్లు వివరించారు.

వైద్యుడి నిర్లక్ష్యం వైద్య విద్యార్థి ప్రాణం తీసింది



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: వైద్యుల నిర్లక్ష్యం.. వైద్య విద్యార్థి ప్రాణాన్ని బలిగొనుకుంది. కడుపునొప్పితో ఆసుపత్రిలో చేర్పించిన కొడుకు శవంగా తిరిగి రావడం ఆ కుటుంబాన్ని కడుపు కోతకు గురిచేసింది. మృతుడి తల్లి రోదన అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం ఏరూరుకుచెందిన రవి, ప్రశాంతి దంపతులు 25ఏళ్ల క్రితం నగరానికి వచ్చి కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లో స్థిరపడ్డారు. వీరికి ఒక కుమారుడు **పి.వరుణ్‌తేజ్**(23), కూతురు. వరుణ్‌తేజ్ కామినేని వైద్య కళాశాలలో మెడిసిన్ మూడో ఏడాది చదువుతున్నాడు. ఈ నెల 24న కడుపునొప్పి రావడంతో కేపీహెచ్‌బీ రోడ్డు నం-1లోని హోలిస్టిక్ ఆసుపత్రిలో చేర్పించారు. అపెండిక్స్ కావడంతో శస్త్రచికిత్స చేయాలని వైద్యులుచెప్పగా తల్లిదండ్రులు అంగీకరించారు. 25న శస్త్ర చికిత్స జరిగిందని వైద్యులు చెప్పగా కొడుకును చూసేందుకు వెళ్లిన తల్లిదండ్రులకు ఆసుపత్రి వర్గాలు అంగీకరించలేదు. గురువారం ఉదయం నుంచి అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తుండడంతో తల్లిదండ్రులు అనుమానంతో వైద్యులను నిలదీయగా వరుణ్‌తేజ్ ప్రాణాలు కోల్పోయినట్టు చెప్పడంతో కన్నీరుమున్నీరయ్యారు. బంధువులు, తల్లిదండ్రుల ఆందోళనతో ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులువచ్చి పరిస్థితిని సమీక్షించారు. వరుణ్‌తేజ్‌కు శస్త్ర చికిత్స చేస్తుండగా ప్రమాదవశాత్తు నరం తెగింది, తర్వాత పలురకాల వైద్యసంబంధిత ఇబ్బందులు తలెత్తడంతో చనిపోయాడని హోలిస్టిక్ ఆసుపత్రి సీఈవో సుబ్బారావు చెప్పారు.

వంతెనపై బాంబు పెట్టానని బెదిరింపు.. యువకుడి అరెస్ట్

అసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: ఫ్లైఓవర్ పై బాంబు పెట్టాం.. కొన్ని సెకన్లలో పేలిపోతుందంటూ ఫోన్‌చేసి బెదిరించిన యువకుడిని లంగర్‌హౌస్ పోలీసులు అరెస్టుచేశారు. లంగర్‌హౌస్‌లోని బాగ్దాదికాలనీకి చెందిన అబ్దుల్ ఇమ్రాన్(30) భార్యతో గొడవపడ్డాడు. ఇంట్లోంచి బయటకొచ్చి మద్యం తాగాడు. మత్తులో లంగర్‌హౌస్ పోలీసులకు ఫోన్‌చేసి ఇక్కడి వంతెనపై బాంబు పెట్టినట్టు బెదిరించాడు. వెంటనే వారు పైఅధికారులకు చెప్పి తనిఖీలు చేపట్టారు. అక్కడేమీ లభించలేదు. ఇమ్రాన్‌ను అరెస్టు చేశారు.

బైక్‌పై రొమాన్స్ చేసిన ప్రేమజంట.. కేరాఫ్ కోల్‌కతా

పహాడీషరీఫ్: శ్రీశైలం రహదారిలో బైక్‌పై రెచ్చిపోతూ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసిన జంటను బాలాపూర్ పోలీసులు గుర్తించి గురువారం ఠాణాకు రప్పించారు. కోల్‌కతాకు చెందిన వారు నగరంలోని గచ్చిబౌలిలో నివాసముంటూ ఐటీ ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. ఇటీవల ఇద్దరూ తోటి ఉద్యోగి విందుకు వెళుతూ ఈ జంట ఇలా షైక్ మార్గంలో బైక్‌పై రొమాన్స్ చేశారని పోలీసుల విచారణలో తేలింది. వీరిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఆత్మహత్య చేసుకుంటున్నా..

భార్యకు వీడియో పంపి వ్యక్తి అదృశ్యం



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: స్నేహితులు మోసం చేశారని, ఆత్మహత్య చేసుకుంటున్నానని భార్యకు వీడియోపంపి ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గోకుల్‌ప్లాట్స్ వెంకటరమణకాలనీకి చెందిన డి.రాజేష్(32) ఈనెల 25న ఉదయం స్థలం విషయంలో స్నేహితులను కలవాలని వెళ్లాడు. రాత్రయినా రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా మద్యం మత్తులో మాట్లాడాడు. మరోసారి ఫోన్ చేస్తే వీడియో పంపానని చెప్పి కట్‌చేశాడు. ఇద్దరు స్నేహితులు మోసంచేశారని, ఆత్మహత్య చేసుకుంటున్నానని అందులో ఉంది. మరోసారి ఫోన్ చేయగా గుర్తు తెలియని వ్యక్తి లిఫ్ట్ చేసి ప్రగతినగర్ చెరువువద్ద రోడ్డుపై పడి ఉందన్నాడు. ఆమె అక్కడికి చేరుకొని ఫోన్ స్వాధీనం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం చెరువు సహా పలుచోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. రాజేష్‌కు అప్పులుండటం.. తన ప్లాటును స్నేహితుడు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వంటివి జరిగినట్లు విచారణలో తేలింది. కేసు నమోదుచేశారు.

బాలికను తల్లిని చేసిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

రాజేంద్రనగర్: బాలికను తల్లిని చేసిన ఓ వ్యక్తికి 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజేంద్రనగర్ ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి ఆంజనేయులు గురువారం తీర్పు వెల్లడించారు. ప్రత్యేక ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం. . నేపాల్‌కు చెందిన కుటుంబం 20ఏళ్ల క్రితం భారత్‌కు వచ్చింది. ఆ కుటుంబంలో వినోద్‌కుమార్(28) దిల్లీలో ఉంటూ చెఫ్‌గా పనిచేసేవాడు. 2018లో హైదరాబాద్‌కు వచ్చి లక్ష్మీగూడ రాజీవ్ గృహకల్పలో భార్యతో కలిసి ఉంటున్నాడు. పక్కనే ఉండే కుటుంబానికి చెందిన బాలిక(15)తో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఇది భార్యకు తెలియడంతో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. 2021 ఆగస్టు 9న ఆమెను నల్గొండ జిల్లా ఆలియాకు తీసుకెళ్లి గదిలో బంధించి పలుమార్లు అత్యాచారం చేశాడు. బాలిక కనిపించక పోవడంతో ఆమె తల్లిదండ్రులు అదేరోజు రాత్రి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రెండురోజుల్లో వారిని గుర్తించి తీసుకొచ్చారు. బాలికకు వైద్య పరీక్షలు చేయగా 5నెలల గర్భిణిగా తేలింది. పోలీసులు వినోద్ కుమార్‌పై అత్యాచారం,కిడ్నాప్ కేసు పెట్టి రిమాండ్‌కు తరలించారు. బాలిక ఓ బాలుడికి జన్మనిచ్చింది. ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి ఆంజనేయులు నిందితుడికి 20ఏళ్ల జైలు, రూ.80 వేల జరిమానా విధించారు. బాలికకు రూ.7లక్షల నష్టపరిహారాన్ని కోర్టు ప్రకటించింది.

తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై స్పందించిన ఒవైసీ

అబిడ్స్: తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతు కొవ్వు కలిసి ఉంటే నిజంగా అది తప్పేనని, దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. హిందూ దేవాలయాలకు హిందువులనే ఛైర్మన్లుగా నియమిస్తున్న ప్రభుత్వాలు వక్ఫ్ ఆస్తుల విషయంలో ఎందుకు కలుగజేసుకుంటున్నాయని ప్రశ్నించారు. వక్ఫ్ ఆస్తులపై కన్నేసిన కేంద్రంలోని భాజపా సర్కారు ముస్లిం ధర్మంలో భాగమైన వక్ఫ్ ఆస్తులను లాక్కునేందుకు కుట్ర పన్నుతోందన్నారు.

అర్ధరాత్రి పోటెత్తిన వరద





మంత్రాలచెరువు నుంచి కిలోమీటరున్నర దూరంలోని చందనచెరువు వరకు ఉన్న డ్రైనేజీ ట్రంక్ లైను బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో పొంగింది. ఉవ్వెత్తున వరద.. తెల్లవారేసరికి మీర్‌పేట కార్పొరేషన్‌లోని మిథిలానగర్, సత్యసాయినగర్ కాలనీలను ముంచేసింది. 150 ఇళ్లలో సామాన్లు నీట మునిగాయని స్థానికులు వాపోయారు. ఈ కాలనీలను గురువారం సాయంత్రం హైడ్రా అధికారులు సందర్శించారు. ఆక్రమణల వివరాలు కోరినట్లు డీఈఈ వెంకన్న తెలిపారు. –న్యూస్‌టుడే, మీర్‌పేట

ఏడాదిలోగా స్పాంజ్ ఐరన్ యూనిట్లు తరలించాలి

● ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కోడిచర్ల, తీగాపూర్, గుండ్లపట్లపల్లి, రంగారెడ్డిగూడ అప్పాజీపల్లి తాండా గ్రామాల పరిసరాల్లో మానవ నివాసాలకు కిలోమీటరు పరిధి లోపల ఉన్న స్పాంజ్ ఐరన్ యూనిట్‌లను ఏడాదిలోగా తరలించాలంటూ ప్రభుత్వానికి ఇటీవల హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. యూనిట్లను తరలించిన తరువాత నివేదికను హైకోర్టు జ్యుడిషియల్ రిజిస్ట్రార్‌కు సమర్పించాలని ఆదేశించింది. అక్కడ నడుస్తున్న మిగిలిన యూనిట్‌లు పర్యావరణ చట్టాలకనుగుణంగా నడుస్తున్నాయో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు నెలల్లో హైకోర్టు జ్యుడిషియల్ రిజిస్ట్రార్‌కు నివేదిక అందజేయాలని ఆదేశించింది. పంట నష్టాలకు పరిహారంగా పరిశ్రమలు డిపాజిట్ చేసిన సొమ్మును రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇలా స్పాంజ్ ఐరన్ పరిశ్రమలతో పంట నష్టపోయిన రైతులున్నట్లయితే చట్టప్రకారం వారిని గుర్తించి పరిహారం అందజేయాలని ఆదేశిస్తూ 19 ఏళ్ల పిటిషన్‌పై విచారణను ముగించింది. ఆయా గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాల్లో స్పాంజ్ ఐరన్ పారిశ్రామిక యూనిట్లు నిర్వహిస్తుండటాన్ని సవాలు చేస్తూ 2005లో షాద్‌నగర్‌కు చెందిన టి.వీరేందర్‌రెడ్డి మరో 8 మంది ప్రజాప్రయోజన పిటిషన్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఈ పరిశ్రమల కాలుష్యం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. కాలుష్య నివారణకు పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదని పేర్కొన్నారు. దీనిపై హైకోర్టు ఆదేశాల మేరకు.. పరిశీలన జరిపి పీసీబీ నివేదికను సమర్పించింది. పరిశీలించిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.

గోల్డ్‌ఫిష్ అబోడ్ సంస్థ ఎండీ అరెస్టు

ఈనాడు– హైదరాబాద్: గోల్డ్‌ఫిష్ అబోడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ వేగె చంద్రశేఖర్‌ను సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. క్రెస్టా విల్లా సొసైటీ జీపీఏగా వ్యవహరిస్తూ విల్లాలను ఒకరి కంటే ఎక్కువ మందికి రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు రూ.6.81 కోట్ల నిధులు పక్కదారి పట్టించిన కేసులో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై గతంలో 11 కేసులున్నాయి. నార్సింగి పోలీసులు గతంలో చంద్రశేఖర్‌పై పీడీ యాక్టు ప్రయోగించారు. ఈవోడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌కు చెందిన వేగె చంద్రశేఖర్ గోల్డ్‌ఫిష్ అబోడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీగా వ్యవహరిస్తున్నాడు. కోకాపేటలోని సర్వే నంబరు 84లోని 6.14 ఎకరాల భూమిలో క్రెస్టా విల్లా ప్రాజెక్టు చేపట్టారు. స్థల అభివృద్ధి ఒప్పందంలో భాగంగా చంద్రశేఖర్ వేగె జీపీఏ(జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ)గా ఉండే భూ యజమానులు ఒప్పందం చేసుకున్నారు. ఈ ప్రాజెక్టులో 42 విల్లాలకు అనుమతులు పొందారు. జీపీఏగా వ్యవహరించిన చంద్రశేఖర్ కొన్ని విల్లాలను ఒకరి కంటే ఎక్కువ మంది రిజిస్ట్రేషన్ చేయించాడు. తన సంస్థలో అదనపు డైరెక్టర్లుగా పనిచేస్తున్న వాసంశెట్టి సునీత, నాగేశ్వరరావు, కంభంపాటి గోకుల్ తదితరుల పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించాడు. 27 మంది విల్లాల యజమానుల పేరిట రూ.6.81 కోట్లు వసూలు చేశాడు. ఆ డబ్బును క్రెస్టా సొసైటీ ఖాతాకు బదిలీ చేయకుండా దారి మళ్లించాడు. ఈవోడబ్ల్యూ పోలీసులు చంద్రశేఖర్, వాసంశెట్టి సునీత, నాగేశ్వరరావు, కంభంపాటి గోకుల్‌పై కేసు నమోదు చేశారు. గురువారం చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావుతో కలిసి క్రియా హెల్త్‌కేర్ సంస్థ సీఈవో కిడ్నాప్, రూ.40కోట్ల షేర్లను బదిలీ చేయించుకున్న కేసులో గోల్డ్‌ఫిష్ అబోడ్ ప్రై.లిమిటెడ్ సంస్థ ఎండీ వేగె చంద్రశేఖర్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 125–00	డ్రెస్డ్	213–00
రిటైల్ 147–00	స్కిన్‌లెస్	243–00



నినాదాలు చేస్తున్న పరిశ్రమల నిర్వాహకులు, మద్దతిస్తున్న నాయకులు



ఫణిగిరి ఆలయం వద్ద ధర్నా చేస్తున్న మూసీ పరివాహక నిర్వాసితులు

చిన్నతరహా పరిశ్రమల నిర్వాహకుల ఆందోళన

అంబర్‌పేట: పట్టా భూములు కొనుక్కుని నిర్మించుకున్న తమ షెడ్లను తొలగించవద్దని చిన్నతరహా పరిశ్రమల నిర్వాహకులు ఆందోళన చేపట్టారు. ప్రత్యామ్నాయ స్థలాలు లేదా నష్టపరిహారం ఇస్తేనే ఖాళీ చేస్తామన్నారు. గురువారం అలీకేఫ్ చౌరస్తా.. న్యూదుర్గానగర్‌లో చిన్నతరహా పరిశ్రమల షెడ్లకు అధికారులు గుర్తులు వేయడంతో వారు ఆందోళనకు దిగారు. భారాస గ్రేటర్ ప్రచార కార్యదర్శి కె.లింగారావు, సీపీఎం నగరకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.మహేందర్ సంఘీభావం ప్రకటించారు.

ప్రాణాలొదిలేందుకు సిద్ధం

నాగోలు: చైతన్యపురి, కొత్తపేట డివిజన్ల పరిధిలో మూసీ పరివాహక ప్రాంత నిర్వాసితులు గురువారం ధర్నాకు దిగారు. అనుమతులన్నీ తీసుకుని.. ఏళ్ల తరబడి నివాసముంటున్న ఇళ్లను కూల్చేందుకు ప్రయత్నిస్తే.. ప్రాణాలొదిలేందుకు సిద్ధమన్నారు. ఫణిగిరి కాలనీ సమీప సాయిబాబా ఆలయం ముందు ఆందోళన చేపట్టారు. చైతన్యపురి పోలీసుల సాయంతో తహసీల్దార్లు మతిన్, శ్రీవిద్య, ఉప కమిషనర్ సుజాత వారితో మాట్లాడారు. నదీ పరివాహకంలోని ఇళ్లను మాత్రమే తొలగిస్తామని, నిర్వాసితులకు ప్రభుత్వం రెండు పడకగదుల ఇళ్లు కేటాయిస్తుందన్నారు. రూ.లక్షలు పోసి కట్టుకున్న ఇళ్లను కూల్చి.. మీరిచ్చే డబుల్ బెడ్‌రూం ఇళ్లు అక్కర లేదన్నారు. న్యూమారుతీ నగర్, సత్యానగర్ సమీపంలో మార్కింగ్ చేసిన ఇళ్ల యజమానులు సిబ్బంది చేతుల్లోని కాగితాలు చించేశారు.

ఆక్రమణల గుర్తింపు:

చంచల్‌గూడ, అక్బర్‌బాగ్: మూసానగర్‌లో బందోబస్తు నడుమ అక్రమనిర్మాణాలకు మార్కింగ్ చేశారు. హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, 25 అక్రమ నిర్మాణాలను గుర్తించారు. ఓల్డ్ మలక్‌పేట పరిధి శంకర్‌నగర్ మూసీ ప్రాంతాల్లోనూ సర్వే చేపట్టారు. హిమాయత్‌నగర్, షేక్‌పేట్, మారేడ్‌పల్లి తహసీల్దార్ల ఆధ్వర్యంలో 3 బృందాలు సుమారు 120 అక్రమ నిర్మాణాలను గుర్తించి, మార్కింగ్ చేశారు

అప్పులపాలై యువకుడి ఆత్మహత్య

తట్టుకోలేక ప్రియురాలి ఆత్మహత్యాయత్నం



రెజిమెంటల్‌బజార్: సికింద్రాబాద్‌లోని లాడ్జిలో బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న జయశంకర్ భూపాలపల్లికి చెందిన **అక్షయ్‌కుమార్** (24) వద్ద పోలీసులు సూసైడ్ నోట్‌గుర్తించారు. తాను ప్రేమికుడిని కాదని, జీవితంలో ఓడిపోయానని, అమ్మకి కొడుకుగా పనికిరానని పేర్కొన్నాడు. అప్పులు చేశానని, మోసం చేయాలనుకోవడం లేదని నోట్‌లో రాశాడు. పోలీసుల సమాచారంతో కుమారుడి మరణవార్తను తెలుసుకుని గురువారం కుటుంబసభ్యులు మార్కెట్ ఠాణాకు చేరుకున్నారు.

అప్పులపాలై.. ఉద్యోగంపోయి.. అప్పులపాలు కావడం, ఉద్యోగం పోవడంతోనే అక్షయ్‌కుమార్ ఆత్మహత్య చేసుకొని ఉంటాడని భావిస్తున్నారు. ఏడాదిగా నగరంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల బైక్ కొనుగోలు చేసినపుడు రెండ్రోజులు సెలవు పెట్టాడు. దీంతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ నెల 22న ఇంటికి వెళ్లి నగరానికి వెళ్లనని, ఇక్కడే ఉంటానని తండ్రికి చెప్పాడు. అదే రోజు నగరానికి వచ్చి సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశాడు. 24న రాత్రి సెల్‌ఫోన్ ఆన్‌చేసి స్టేటస్‌లో స్నేహితుల, బంధువుల ఫొటోలతో పాటు ఇదే చివరి రోజని మెసేజ్ పెట్టాడు. లొకేషన్ ఆధారంగా స్నేహితుడు గుర్తించాడు. లాడ్జికి వెళ్లి చూసేసరికే ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆసుపత్రిలో ప్రియురాలు: నగరానికి చెందిన ఓ యువతి (23) అక్షయ్‌కుమార్ ప్రేమించుకున్నారు. కుటుంబ సభ్యులకు చెప్పడంతో పెళ్లికి అంగీకరించారు. బుధవారం రాత్రి స్నేహితులతో కలిసి లాడ్జికి వచ్చింది. ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుసుకున్న ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్నేహితులు ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించారు.

'రాజకీయ లబ్ధికే కేటీఆర్ వ్యాఖ్యలు'



ప్లాంటు పరిశీలిస్తున్న దానం నాగేందర్, దిడ్డి రాంబాబు, రోహిణ్‌రెడ్డి తదితరులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: మూసీ పరీవాహక ప్రాంతానికి హైడ్రా వస్తుందని కేటీఆర్ ప్రజలను భయభ్రాంతులను చేయడం మానుకోవాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ హితవు పలికారు. రాజకీయ లబ్ధి కోసమే ప్రజలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. గురువారం అంబర్‌పేట సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను (ఎస్టీపీని) కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డితో కలిసి సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. మూసీ ప్రక్షాళన కోసం రూ. 10 వేల కోట్లతో మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది గత ప్రభుత్వమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతతో వీటిని పూర్తి చేస్తోందని, నదిలో అన్యాక్రాంతమైన భూమిలో 12 వేల ఇళ్లను గుర్తించిందని వివరించారు. వాటిలో ఉండే వారికి రెండు పడక గదుల ఇళ్లను ఇచ్చిన తర్వాతే ఖాళీ చేయిస్తామన్నారు. పార్టీ నాయకులు దిడ్డి రాంబాబు, రమేష్, జగన్, శ్రీకాంత్‌గౌడ్, రోహిత్, శ్రీధర్‌గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుడికి ఉస్మానియాలో కాలేయ మార్పిడి



డా.రవి సుందర్‌ను సన్మానిస్తున్న వైద్యులు

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: అవయవదానంతో ఇతరులకు పునర్జన్మ ప్రసాదించే అవకాశం ఉంటుందని ఉస్మానియా వైద్యకళాశాల ప్రిన్సిపల్ డా. నరేందర్‌కుమార్ అన్నారు. గురువారం ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా. రాకేశ్ సహాయ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్‌తో పాటు సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డా. సీహెచ్. మధుసూదన్, డా. మనీషా సహాయ్(నెఫ్రాలజీ), డా. ఎన్. నాగప్రసాద్ (ప్లాస్టిక్‌సర్జరీ), డా. మల్లిఖార్జున్ (యూరాలజీ), డా. చంద్రశేఖర్(అనస్థీషియా) తదితరులు మాట్లాడారు. ● నల్గొండ జిల్లాకు చెందిన డా. రవి సుందర్(46) సూర్యాపేటలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో జనరల్ సర్జరీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్. కాలేయం పూర్తిగా దెబ్బతినడంతో బ్రెయిన్ డెడ్ అయిన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలానికి చెందిన గుంత చెన్నయ్య(25) కాలేయాన్ని సేకరించి డా. రవి సుందర్‌కు అమర్చారు. ● సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్లకు చెందిన నరేందర్(46)కు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేశారు.

30లోగా అస్థికలు తీసుకెళ్లండి

షేక్‌పేట, న్యూస్‌టుడే: రాయదుర్గం వైకుంఠ మహాప్రస్థానం (జూబ్లీహిల్స్ రోడ్డు)తో పాటు బంజారాహిల్స్ (పంజాగుట్ట విద్యుత్తు దహన వాటిక)లో అంత్యక్రియలు నిర్వహించి ఎంతో కాలంగా అక్కడే వదిలివేసిన అస్థికలను సంబంధీకులు ఈనెల 30లోగా తీసుకెళ్లాలని మహాప్రస్థానం ట్రస్ట్ గురువారం ఓ ప్రకటనలో కోరింది. లేని పక్షంలో తామే గత ఏడాది మాదిరిగానే అక్టోబరు 2న మహాలయ అమావాస్య రోజు పూజలు నిర్వహించి కృష్ణా నదిలో అస్థికలను కలుపుతామని తెలిపింది. ఇతర వివరాలకు 98525 55555, 91211 81555 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొంది.

నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధి మెరుగు



చెత్త ఊడుస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో నిమ్స్‌మే డీజీ డా.గ్లోరీస్వరూప

బోరబండ, న్యూస్‌టుడే: యువత వివిధ విభాగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవచ్చని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. యూసుఫ్‌గూడలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నిమ్స్‌మేలో గురువారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అనంతరం నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ డా. గ్లోరీస్వరూప, సంస్థ ఉద్యోగులతో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. నిమ్స్‌మే ఫ్యాకల్టీ సభ్యురాలు, కార్యక్రమ సమన్వయకర్త వి.స్వప్న పాల్గొన్నారు.

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళి



జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి



నాంపల్లి భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ లక్ష్మణ్, నేతలు చంద్రశేఖర్ తివారీ, జి.ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా నేత ఆనంద్‌గౌడ్



నాగోలు చౌరస్తాలో టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ శ్రీనివాస్‌గుప్తా, రజక వృత్తిదారుల సంఘం కన్వీనర్ బొడ్డుపల్లి కృష్ణ తదితరులు



సఫిల్‌గూడ చౌరస్తాలో మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి, కిరణ్, ఉడుత నవీన్ తదితరులు

ఎంఎస్‌ఎంఈలు ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక



ప్రసంగిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో హర్షిత్‌షా, డా.ఎస్వీ వీరమణి, భూపేందర్‌సింగ్, శక్తి నాగప్పన్

మాదాపూర్, న్యూస్‌టుడే: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్‌ఎంఈ) ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం మెస్సె మూంచెన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన 'అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పో, ఫార్మా ప్రో ప్యాక్ ఎక్స్‌పో-2024" ప్రదర్శనలను మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ రంగాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలోని సంస్థలు, ప్రపంచ దేశాలతో పోటీపడేలా, స్వతహాగా అభివృద్ధి చెందేలా వాతావరణాన్ని సృష్టించడానికి ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఫార్మా రంగం మరింత వృద్ధి సాధించేందుకు ఎంఎస్‌ఎంఈల వృద్ధి ఎంతో అవసరమన్నారు. ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఫార్మెక్సిల్) ఛైర్మన్ డా.ఎస్వీ వీరమణి మాట్లాడుతూ.. ఫార్మా ఎగుమతుల్లో మూడోవంతు తెలంగాణ నుంచే జరుగుతున్నాయని చెప్పారు. జీనోమ్ వ్యాలీ, మెడ్‌టెక్ లాంటి పారిశ్రామిక జోన్లు ఏర్పాటు చేసి ప్రభుత్వం ఆయా రంగ పరిశ్రమలకు సహకారం అందిస్తుండటం హర్షణీయమన్నారు. మెస్సె మూంచెన్ ఇండియా(ఎంఎంఐ) సీఈఓ భూపిందర్‌సింగ్ మాట్లాడుతూ.. హైటెక్స్‌లో నిర్వహిస్తున్న అతి పెద్ద ప్రదర్శన ఇది అన్నారు. దాదాపు 500పైగా ఎగ్జిబిటర్లు, 7వేలకుపైగా ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారని తెలిపారు. ఇండియన్ ఫార్మా మెషినరీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్(ఐపీఎంఎంఏ) అధ్యక్షులు హర్షిత్ షా, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈవో శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి విరాళం



రేవంత్‌రెడ్డికి చెక్కు అందిస్తున్న రాధాకృష్ణ

హయత్‌నగర్, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం హయత్‌నగర్ పరిధిలోని శాంతినికేతన్ విద్యాసంస్థ సీఎం సహాయనిధికి రూ. 9 లక్షల విరాళంగా ప్రకటించింది. విద్యా సంస్థల ఛైర్మన్ జి.రాధాకృష్ణ గురువారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి. చెక్కు అందజేశారు.

వారంతా సార్ అని పిలుస్తున్నారు: మంత్రి వెంకట్‌రెడ్డి

మాదాపూర్, న్యూస్‌టుడే: 'నేను సివిల్ ఇంజినీరింగ్ చేశా. సీబీఐటీ కళాశాల విద్యార్థి అధ్యక్షుడిగా పనిచేశాను. ఆ సమయంలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి అప్పటి స్థానిక ఎమ్మెల్యే, హోంమంత్రి ఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆ సమావేశంలో విద్యార్థులందరినీ భవిష్యత్తులో ఏం చేస్తారని ప్రశ్నిస్తే నేను మాత్రం ఎమ్మెల్యే, మంత్రినై ప్రజలకు సేవ చేస్తానని చెప్పాను. ఇప్పుడు ఆర్ అండ్ బీ శాఖ మంత్రిగా ఉన్నాను. 35 ఏళ్ల క్రితం నాతో చదివిన నా స్నేహితులు పది మంది ఇప్పుడు ఇదే శాఖలో ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. వారంతా ఇప్పుడు నన్ను వద్దన్నా సార్ అని సంబోధిస్తున్నారు' అని మాదాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో ఓ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

విదేశాల్లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కార్వాన్, న్యూస్‌టుడే: విదేశాల్లో మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని టాంకాం (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) జనరల్ మేనేజర్ కె.నాగభారతి గురువారం తెలిపారు. కనీసం రెండేళ్ల అనుభవం కలిగిన మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, బీఎంఎస్ ఆపరేటర్, ఎంఈపీ టెక్నీషియన్, ఎంఈపీ సూపర్‌వైజర్ అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నామన్నారు. వివరాలకు మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని టాంకాం కార్యాలయంలో లేదా వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in

త్రీడీ ఏఎం సాంకేతికతతో రక్షణ ఉత్పత్తులు



జ్యోతి వెలిగిస్తున్న సమీర్ వి.కామత్, అనిల్ కకోద్కర్, ఇంద్రనీల్ మన్నా, జైతీర్థ ఆర్ జోషి, జి.ఏ.మూర్తి, యు.రాజబాబు

ఈనాడు, హైదరాబాద్: రక్షణ ఉత్పత్తుల తయారీలో త్రీడీ వంటి అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్(ఏఎం) సాంకేతికత కీలకం కాబోతుందని రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి. కామత్ అన్నారు. కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఎల్‌లో గురువారం మొదలైన రెండురోజుల 11వ ఇంజినీర్స్ సదస్సు-24లో ఆయన గౌరవ అతిథిగా మాట్లాడారు. ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్(ఐఎన్‌ఏఈ) సహకారంతో ఏర్పాటు చేసిన సదస్సును అంతకు ముందు అణు ఇంధన కమిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ అనిల్ కకోద్కర్ ప్రారంభించారు. డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ యు.రాజబాబు, ఐఎన్‌ఏఈ అధ్యక్షుడు ఆచార్య ఇంద్రనీల్ మన్నా ప్రసంగించారు. కన్వీనర్ డాక్టర్ జైతీర్థ ఆర్ జోషి, శాస్త్రవేత్తలు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, జె.జె.యాదవ్, డైరెక్టర్ జి.ఏ. మూర్తి పాల్గొన్నారు.

ఆస్పత్రులకు చేయూత అందించాలి



రమణ దన్నపనేని, అమరేశ్వరరావు, వైద్య బృందంతో గారెత్ విన్ ఓవెన్

నిమ్స్, న్యూస్‌టుడే: ఆసుపత్రులకు చేయూతనందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ కోరారు. పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో బ్రిటన్ వైద్యుడు రమణ దన్నపనేని సారథ్యంలో కొనసాగుతున్న చిన్నారులకు ఉచిత గుండె శస్త్రచికిత్సల క్యాంపును గురువారం ఆయన సందర్శించారు. చిన్నారుల ప్రాణాలు కాపాడే మహా యజ్ఞంలో బ్రిటన్‌కి చెందిన వైద్యులు పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు.

డీసీసీ బ్యాంకు డైరెక్టర్ల నియామకం



నూతన డైరెక్టర్లను సత్కరిస్తున్న కొత్తకుర్మ సత్తయ్య తదితరులు

గన్‌ఫౌండ్రీ, న్యూస్‌టుడే: రంగారెడ్డి డీసీసీబీ నూతన డైరెక్టర్లుగా కుల్కచర్ల పీఏసీఎస్ ఛైర్మన్ కనకం మొగులయ్య, మాజీ డైరెక్టర్ కిషన్‌నాయక్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం అబిడ్స్‌లోని బ్యాంక్ కార్యాలయంలో రంగారెడ్డి డీసీసీబీ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన జరిగిన పాలకవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. సమావేశంలో వైస్ ఛైర్మన్ సంగం రవీందర్‌గౌడ్, డైరెక్టర్లు అంజిరెడ్డి, చంద్రశేఖర్, బాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పోలీస్ రాంరెడ్డి, బూరుకుంట సతీష్, పీజీవీ రాణి, గుగులోతు సైదా హాజరయ్యారు.

బసవతారకం ఆస్పత్రితో రెడ్ హెల్త్ ఒప్పందం

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: క్యాన్సర్ రోగులకు సేవలు అందిస్తున్న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (బీఐఏసీహెచ్ అండ్ ఆర్ఐ)తో రెడ్ హెల్త్ సంస్థ ఒప్పందం కుదుర్చుకొంది. అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు రవాణా సదుపాయం కల్పించేందుకు అంబులెన్సులను నిత్యం ఆస్పత్రి వద్ద అందుబాటులో ఉంచనుంది. గురువారం బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఐఏసీహెచ్ అండ్ ఆర్ఐ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ కూతురు, ట్రస్టు బోర్డు సభ్యుడు, ఎంపీ భరత్ సతీమణి తేజస్విని అంబులెన్సులను ప్రారంభించారు. ఆస్పత్రి సీఈవో డా. కూరపాటి కృష్ణయ్య మాట్లాడారు. రెడ్ హెల్త్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో ప్రభదీప్ సింగ్ ఆస్పత్రి సీవోవో సునీల్ టాండన్, మెడికల్ సూపరింటెండెంట్ డా. ఫణికోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిలోఫర్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవికుమార్



డాక్టర్ రవికుమార్‌ను సత్కరించిన ఐఎన్‌టీయూసీ నేతలు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: నిలోఫర్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవికుమార్‌కు పూర్తి స్థాయి బాధ్యతల్ని అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐఎన్‌టీయూసీ (నిలోఫర్ ఆసుపత్రి శాఖ) అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వి.సాయిగణేష్, సంయుక్త కార్యదర్శి సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం.డి. ఖాజా, కార్యవర్గ సభ్యులు హరీష్, రాజు, శ్రీకాంత్ తదితరులు ఆయనను సన్మానించారు.

తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలం కేటాయించాలి



సదస్సులో మాట్లాడుతున్న రవికుమార్

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రతి ఒక్కరికి 250 చ.గ. ల చొప్పున ఇంటి స్థలం కేటాయించాలని తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఛైర్మన్ జిలుకర రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ఇంటి స్థలంలో గృహ నిర్మాణానికి రూ. 12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిలుకర రవికుమార్ మాట్లాడారు. రాష్ట్ర క్రిస్టియన్ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్, విశ్రాంత పోలీస్ అధికారి కూచిపూడి బాబురావు, నేతలు వి. సోమయ్య, ములకల భాస్కర్, చిలుక మల్లేశం, చిలుక భాస్కర్, మేకల సారయ్య పాల్గొన్నారు.

కృత్రిమ మేధతోనే ఇంటర్వ్యూలు



విద్యుత్ యూనిట్ అలర్టింగ్ మెషీన్

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ బిల్లు ఏ నెల ఎంత వస్తుందో తెలియడం లేదా..? ఇక ఆ చింత అవసరం లేదు. ఈసీఐఎల్‌కు చెందిన సస్టెక్ ఇన్నోవేషన్స్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ ఇందుకు పరిష్కారం తీసుకొచ్చింది. వినియోగదారుడు కోరిన యూనిట్ల వరకే విద్యుత్‌ను వినియోగిస్తూ పొదుపు మంత్రం పాటించేలా పరికరాన్ని రూపొందించింది. సగటు మధ్యతరగతి వినియోగదారులకు అందుబాటు ధరల్లోనే ఈ పరికరాన్ని మార్కెట్‌లోకి తీసుకురాబోతున్నామని ఆ సంస్థ డైరెక్టర్ కె. శివాజీ తెలిపారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) సాంకేతికతతో ఇది పనిచేస్తుంది. ప్రస్తుతం టీజీఎస్పీడీసీఎల్ టారిఫ్ ధరలు 0 నుంచి 50 యూనిట్లు, 50 - 100, 0- 100, 101 - 200, 201 నుంచి 301 యూనిట్ల ఆధారంగా బిల్లులు పంపుతోంది. ఈ లెక్కల గందరగోళంలో వినియోగం ఎంత..? బిల్లు ఎందుకు పెరిగిందో తెలియని పరిస్థితి నెలకొంది... ఈ పరికరాన్ని అమర్చుకున్న తర్వాత 200 యూనిట్ల వరకే ఆ నెల వాడాలని నిర్ణయిస్తే 170, 180, 190 యూనిట్ల వరకు మూడుసార్లు హెచ్చరికలు జారీ చేసేలా అలారమ్ వ్యవస్థను వినియోగించుకోవచ్చు. గురువారం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ)లో జరిగిన ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్ - 2024లో 'ఫ్రింట్' సంస్థ అందిస్తున్న సేవలను ప్రదర్శించింది.

వసుంధర

vasundhara@eenadu.in

చలో... సోలో!

నేడు ప్రపంచ పర్యటక దినోత్సవం


అమ్మాయిలు ఒంటరిగా పక్కవీధిలో ఉన్న షాపుకెళ్తేనే 'తోడు తీసుకెళ్లు' అని చెబుతారు... మరి నచ్చిన ప్రదేశాలు సోలోగా చుట్టేయాలనుకుంటే ... అమ్మో 'సురక్షితం కాదు' వద్దు అనేస్తారు. కానీ, ఈతరం ఆడపిల్లలు ఈ అపోహలన్నింటినీ దాటేసి ఆనందంగా ప్రపంచాన్ని చుట్టేస్తున్నారు. పది లక్షలకు పైగా ఫాలోవర్లను సంపాదించుకుని పర్యటకాన్నీ ఇన్ఫ్లుయెన్స్ చేస్తున్నారు. అందులో కొందరమ్మాయిలు వీళ్లు..



మనసుకి నచ్చింది చేస్తా

– షెనాజ్ ట్రెజరీ


'పర్యటనలు చేయడం వల్ల ప్రపంచాన్ని అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు, ఒక్కోసారి ఏదో కోల్పోతున్నామన్న భావన మనల్ని వెంటాడుతుంది. అలాంటప్పుడు నచ్చిన ప్రదేశానికి ఒంటరిగా వెళ్లి రండి.... తిరిగి మీరు కోరుకున్న జీవితాన్ని సంపాదించుకునే ఉత్సాహం వస్తుంది' అంటోంది షెనాజ్. కాలేజీరోజుల్లో ఓ ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించడంతో మోడలింగ్‌లోకి అడుగుపెట్టింది. తరవాత వీజేగా మారి, నటిగా వెండితెరపైనా కనిపించింది. మన తెలుగులోనూ 'ఎదురులేని మనిషి' చిత్రంలో నటించింది. ఆపై ఓ ట్రావెల్ ఛానెల్‌కు హోస్ట్‌గానూ వ్యవహరించింది. తరవాతే సోలో ట్రావెల్ కంటెంట్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారి లక్షల మంది అభిమానుల్ని సంపాదించుకుంది. 'వేసవి సెలవుల్లో మా కుటుంబమంతా గుల్‌మార్గ్‌కు వెళ్లేవాళ్లం. అక్కడే స్కీయింగ్ పాఠాలు నేర్చుకున్నా. అప్పట్నుంచే పర్యటనలపై ఇష్టం పెంచుకున్నా. తరవాత నటనను కెరియర్‌గా ఎంచుకున్నా ట్రావెలింగ్‌పై ప్రేమ తగ్గలేదు. నచ్చిన చోటుకు వెళ్లి వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం ఆరంభించా. ఇరవై దేశాలు తిరిగేశా. వాటిల్లో స్విట్జర్లాండ్, నార్వే, డెన్మార్క్‌లు నాకు ఇష్టమైన ప్రదేశాలు. న్యూయార్క్‌లో ఫ్రీ మ్యూజిక్ కాన్సర్ట్స్, పబ్లిక్ పూల్ వద్ద క్యూలను ఇష్టపడతా' అంటోంది షెనాజ్. అమ్మాయిలు ఇవి చేయకూడదు...అవి చేయకూడదు అనే ఆంక్షల్ని చూసి అక్కడే ఆగిపోవద్దు. మీ మనసు చెప్పింది ఫాలో అవ్వండ'నీ సూచిస్తోంది.



వారికీ స్ఫూర్తినిద్దామని...

– బృందాశర్మ

'పర్వతాలపై ఇష్టమే తనని పర్యటకురాలిగా' మార్చిందంటోంది బృందా శర్మ. ఈ ప్రేమ ఆమెకి పాఠశాల వయసులోనే మొదలైంది. స్కూలుకి ఎప్పుడు సెలవు దొరికినా విశ్రాంతి కోసమని వారి కుటుంబం దగ్గర్లోని హిల్ స్టేషన్లకు వెళ్లేదట. అప్పుడు మంచుతో కప్పి ఉన్న పర్వత శిఖరాలను చూసి బృంద ఎంతగానో సంబరపడిపోయేదట. ఆ ప్రకృతి రమణీయతను ఆస్వాదించడానికే సిమ్లాలోని కాలేజీలో చేరానని చెబుతోంది. అక్కడే ట్రావెలింగ్, ట్రెక్కింగ్ అభిరుచులు ఆమెకు అలవడ్డాయి. 11 మంది విద్యార్థుల బృందంలో సీనియర్‌గా ఎన్నో సాహసాలూ చేసింది. అలా ఓసారి ధౌలాదార్ పర్వత శిఖరాన్ని చేరుకున్నా తీవ్రమైన తుపానులో చిక్కుకుని బయటపడటం ఇప్పటికీ కలగానే ఉందని గుర్తు చేసుకుంటుంది. అయితే, ఈ జీవితం ఎంత ఇష్టంగా ఉన్నా... పర్యటనలు చేయడానికి బోలెడు డబ్బులూ కావాలి. అందుకే, దుబాయిలో ఉద్యోగంలో చేరింది. చాలామంది అమ్మాయిల్లానే 9-5 కొలువు చేస్తూనే వారాంతాలు, సెలవుల్ని ట్రావెలింగ్‌కోసం వాడుకుంటోంది. సోలో ట్రావెలర్‌గా... తను మరింత మందికి స్ఫూర్తినివ్వాలనే ఆలోచనతో ఆ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తోంది. ఇప్పటివరకూ మొదటి లాక్‌డౌన్ సమయంలో మినహా ఏ నెలా ప్రయాణాన్ని ఆపలేదట. న్యూజిలాండ్, రష్యా, భూటాన్, ఫిన్‌లాండ్... ఇలా ఒకటేమిటి చాలా దేశాలే తిరిగేసింది. ప్రకృతి ఎక్కడ నుంచి పిలిచినా అక్కడికి పరుగెత్తుకుని వెళ్లిపోతాననీ అంటోంది. మరి... భద్రత సమస్యలు రావా అంటే ప్రణాళికతో వెళ్తే అధిగమించొచ్చని ధీమాగా చెప్పేస్తోంది బృంద.



ఆడపిల్లలూ ప్రపంచాన్ని చూడండి..

– రిచీ షా

'మంచుకురిసే కశ్మీరులోయలో విహరించాలనీ, వెనిస్ నగరాన్ని పడవల్లో చూసేయాలనీ, ఈఫిల్ టవర్ ముందు ఒక్క ఫొటో అయినా తీసుకోవాలని కలలు కనని అమ్మాయిలుంటారా? కానీ, అవన్నీ మనసులోనే మిగిలిపోతాయి. ఆడపిల్లలు సరిహద్దులు గీసుకుంటే... ప్రపంచాన్ని చూడలేరు. గడపదాటి ఒక్కసారి బయటకి తొంగి చూడండి. జీవితంలోని రంగులన్నీ కనిపిస్తాయి. అంతేకాదు, పర్యటక రంగం అభివృద్ధి చెందితే ఆర్థిక వృద్ధితో పాటు సాంస్కృతిక వారసత్వమూ బలపడుతుంది' అని చెబుతోంది రిచీషా. తనది ముంబయి. వృత్తిరీత్యా ఛార్టెడ్ అకౌంటెంట్. కానీ, తన మనసుకి నచ్చిన ట్రావెలింగ్‌తో కంటెంట్ క్రియేటర్‌గా మారింది. పెద్ద ఎత్తున ఫాలోవర్లూ ఉండటంతో సింగపూర్, స్విట్జర్లాండ్, ఆమ్‌స్టర్‌డ్యామ్ పర్యటక విభాగాలే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు హోటళ్లూ రిచీషాతో కలిసి పనిచేస్తున్నాయి. పర్యటన అనగానే... దగ్గర్లోని ఏదో ఒక ప్రాంతానికి వెళ్లి చూసి వచ్చేయడం కాదు... సోలో ట్రావెలర్‌గా సాహసాలు చేస్తా. ట్రెక్కింగ్, హైకింగ్ వంటివీ నాకెంతో ఇష్టం అని చెబుతోంది.

కాలేజీకి వెళ్లాలంటేనే భయమేస్తోంది...

మొన్నామధ్య నా పుట్టినరోజుకి స్నేహితులను ఇంటికి పిలిచా. బాగా పొద్దు పోయిందని ఇద్దరు రాత్రికి నాతోనే ఉండిపోయారు. నాకు చిన్నప్పట్నుంచీ ఓ బొమ్మంటే ప్రాణం. అది లేకుండా నిద్రపోను. అదిచూసి మరుసటి రోజు నుంచి కాలేజీలో ఇంటర్‌కి వచ్చినా బొమ్మతో ఆడుతోందంటూ ఏడిపిస్తున్నారు. కాలేజీకి వెళ్లాలంటేనే భయమేస్తోంది. ఏం చేయను? – ఓ సోదరి

నీ పుట్టినరోజుకి స్నేహితులను ఇంటికి పిలిచి ఆనందంగా గడిపావు. కాకపోతే చిన్న అపశ్రుతిలా, నీ అలవాట్లను వాళ్లు గేలి చేశారు. నీ ఫ్రెండ్స్ చేసిన పని హర్షణీయం కాదు. ఒక్కొక్కరికి ఒక్కో అలవాటు ఉంటుంది. నువ్వే కాదు నీలా చాలామంది పిల్లలకి బొమ్మలను దగ్గర పెట్టుకొని నిద్రపోయే అలవాటు ఉంటుంది. మన ఆసక్తులు, అలవాట్లు ఎవరికీ హాని కలిగించనంత వరకూ విమర్శించే హక్కు ఎవరికీ లేదు. నీ స్నేహితులే కాబట్టి ఒకసారి వీలు చూసుకుని, వాళ్ళతో మాట్లాడు. నీ అలవాటును అందరిముందూ బయటపెట్టి ఆటపట్టించడం నీ మనసుకి ఎంత బాధ కలిగించిందో చెప్పు. నీ స్నేహితులదీ నీ వయసే కాబట్టి, ఇంకా మానసిక పరిపక్వత లేక చిన్నతనంతో అలా ప్రవర్తించి ఉంటారు. నువ్వు నీ బాధని చెబితే వాళ్లు చేసిన తప్పు వాళ్లకి తెలుస్తుంది. ఇక కళాశాలలో ఇతర పిల్లలు అంటావా... వాళ్లకీ నీలాగే ఏదో ఒక అలవాటు ఉంటుంది. కాకపోతే బయటపడలేదు అంతే. మరోసారి ఏడిపిస్తే, నా అలవాట్లు నావి, మీకేం బాధని ప్రశ్నించు. ఒకవేళ వాళ్లు మారకపోయినా నువ్వు స్పందించకు. కొన్నాళ్లకు వాళ్లే ఆ విషయాన్ని మర్చిపోతారు. చిన్న విషయాలకి అతిగా ఆలోచించి కాలేజీ మానేయడం కాదు... నీ అభిప్రాయాలను నువ్వు స్థిరంగా వ్యక్తపరుచు. అప్పుడే ఏడిపించేవాళ్లూ వెనక్కి తగ్గుతారు.



డియర్... వసుంధర

డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

మాస్క్... ఎందుకు?

ఫేషియల్‌లో భాగంగా ఆఖర్లో మాస్క్ వేస్తుంటారు. ముఖ్యమైన సందర్భాల్లో చర్మం తాజాగా కనిపించాలని ముందురోజు రాత్రో... మేకప్ వేయడానికి ముందో మాస్క్, షీట్‌మాస్క్ వంటివీ వాడుతుంటాం. మార్కెట్‌లో బోలెడు రకాలు కదా... ఏది ఎందుకో తెలిస్తేనే కదా మనకి అనువైనదేదో అర్థమయ్యేది! అందుకే తెలుసుకుందాం రండి...



- క్లే మాస్క్‌లో మినరల్స్ మెండుగా ఉంటాయి. ఇవి చర్మరంధ్రాల్లో పేరుకున్న మలినాలను తొలగించడమే కాదు, యాక్నేనీ దూరం చేస్తాయి. చర్మానికి తేమనందించి మెరిసేలానూ చేస్తాయి. బాగా పొడిబారే చర్మతీరు వారికి క్రీమ్ మాస్క్‌లు అనుకూలం. ఇవి పోషణను అందించి తిరిగి ఆరోగ్యంగా కనిపించేలా చేస్తాయి.
- ముఖాన్ని పట్టేస్తున్నట్లు ఉండే మాస్క్‌లు కొందరికి నచ్చవు. అలాంటివారు జెల్, హైడ్రోజెల్ మాస్క్‌లను ఎంచుకోవచ్చు. ఇవైతే అన్ని చర్మాల వారికీ అనువు. ఇవి చల్లదనాన్ని ఇస్తూనే చర్మకణాలకు ప్రశాంతతనీ చేకూరుస్తాయి. తేమనీ అందిస్తాయి కదా... తీసేశాక ముఖం మెరుస్తున్నట్లే అనిపిస్తుంది.
- షీట్ మాస్క్‌లైతే అందరికీ పరిచయమున్నవే. పలుచటి వస్త్రానికి లిక్విడ్ సీరమ్ పట్టించినట్లుగా ఉంటాయి. యాంటీ ఏజింగ్, ట్యాన్, హైడ్రేషన్... కోరుకున్న ఫలితానికి తగ్గది ఎంచుకోవడమే. కొంచెంసేపు ఉంచుకుంటే చాలు. తిరిగి ముఖం శుభ్రం చేసుకోవాల్సిన పనీ ఉండదు. తగిన గాఢతలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి చేరతాయి కాబట్టి... కోరిన ఫలితం పొందుతూనే ఆరోగ్యంగానూ కనిపిస్తుంది.
- పీల్ ఆఫ్ మాస్క్‌లు జెల్, లిక్విడ్, క్రీమ్ రూపాల్లో దొరుకుతాయి. చర్మరంధ్రాల్లోని మృతకణాలు, మలినాలను తొలగించడం వీటి పని. లోతైన శుభ్రత దొరుకుతుంది కాబట్టే, మాస్క్ తొలగించగానే చర్మం నునుపుగా, మెరుస్తున్నట్లుగా కనిపిస్తుంది. నల్లమచ్చలు తొలగించడంలో చర్మాన్ని బిగుతుగా చేయడంలో ఇవి చక్కగా సాయపడతాయి.

ఫోన్... సమయం తినేస్తుంది!



ఉదయాన్నే స్నేహితురాలి ఫోన్... నిన్న ఆఫీసులోని తమ విభాగంలో జరిగిన విషయాలన్నీ పూస గుచ్చినట్లు చెబుతోంది. ఆసక్తితో వింటూ పనిచేస్తుంటే ఎంతకీ తెమలదే! పనంతా పూర్తయ్యింది ఇక, రెడీ అవ్వడమే మిగిలింది... కాసేపు విశ్రాంతి పేరుతో ఫోన్ పట్టుకుంటే చాలు... రీల్స్, షార్ట్స్ అంటూ సమయం గడిచిపోయింది. తీరా ఆఫీసుకు బయలుదేరేటప్పుడు హడావుడి. ఈ రెండు సందర్భాలే కాదు... ఫోన్ మితిమీరి వాడటం వల్ల వచ్చే ఇబ్బందులు చాలానే ఉంటాయి. ఈరోజుల్లో మొబైల్ అరచేతిలో ప్రపంచాన్ని చూపించేస్తుంది. కానీ, దాన్ని సరైన దారిలో వాడకపోయినా, నియంత్రించుకునే మార్గం తెలియకపోయినా విలువైన సమయమెంతో వృథా అవుతుంది. అలాకాకూడదంటే... ఇతర పనులకు టైమ్ కేటాయించినట్లే ఫోన్ మాట్లాడేందుకు నిర్దేశించుకోమంటున్నారు నిపుణులు. డెస్క్‌టాప్ మీద తప్ప మొబైల్‌లో సామాజిక మాధ్యమాలను లాగిన్ అవ్వొద్దని చెబుతున్నారు. అలానే భోజనం చేసేటప్పుడు, నిద్రపోయేటప్పుడు డిజిటల్ తెరలకు దూరంగా ఉండటం తప్పనిసరి. ఇక, అలారం కోసమనో, టైమ్ చూసుకునేందుకనో ఫోన్ మీద ఆధారపడుతుంటే నెమ్మదిగా ఆ పని మానేయండి. గడియారంలోనో, స్మార్ట్ ఫోన్‌లోనో రిమైండర్ పెట్టుకోండి. ఇవన్నీ మీ పనుల వేగం పెంచుతాయి. ప్రయత్నించి చూడండి.



బంగారం-వెండి

26న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ.లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	7,060	7,060
వెండి (గ్రా)	101.00	101.00

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం (24క్యా)	77,020	77,020	75,480	74,760	76,900	76,500	78,000	76,030	76,740	76,740
ఆర్నమెంట్	70,600	70,600	70,060	70,060	71,900	70,840	71,760	71,130	70,600	70,600
వెండి (కిలో)	101,000	101,000	93,900	93,400	90,600	90,500	94,100	93,000	91,000	91,000

పొగడ్తకూ ఓ లెక్క ఉంది!

'ఫస్ట్‌ర్యాంకుకు రెండు మార్కులు తగ్గితే కోప్పడతావు. ఇన్ని మార్కులు తెచ్చుకున్నానని ప్రశంసించవు' ప్రతిసారీ రాకేష్ మాటలకు వంద శాతం వస్తేనే.. అంటుంది అతడి తల్లి. పిల్లలను పొగిడితే చెప్పినమాట వినరు అనుకోకుండా సందర్భంబట్టి కాస్తంత పొగిడి చూడండి అంటున్నారు నిపుణులు. అది వారిని ప్రోత్సహించి లక్ష్యసాధనవైపు నడిపించేలా ఉండాలట. అలాగే పొగడ్తకూ ఒక లెక్క ఉందట.



- పిల్లలు సంతోషిస్తారని లేదా పొగడ్త ఇవ్వకపోతే బాధపడతారని కాకుండా నిజాయితీగా ప్రశంసించాలి. అది కూడా నిర్దిష్టంగా ఉండాలి. తను చేసిన పని వల్ల లేదా చదువులో ముందుండటంతో కలిగే ప్రయోజనాలను వివరించి పొగడాలి. భవిష్యత్తులో ఈ మార్గాన్నే అనుసరించాలనే సూచన పిల్లల మెదడుకు చేరాలి.
- ఇతరులపై తను చూపించే ప్రేమ, పక్కవారికి సాయం చేసే గుణం వంటివి ప్రదర్శించినప్పుడు మీ పొగడ్త తప్పనిసరి. ముమ్ముందు కూడా ఆ తత్వాన్ని అలవరుచుకోవడం ఎంత మంచి విషయమో చెప్పి మరీ ప్రశంసించాలి.
- పిల్లలు కష్టపడి ప్రయత్నిస్తున్నప్పుడు ప్రశంస ప్రోత్సాహపూర్వకమైనదిగా ఉండాలి. ప్రశంసాపూర్వకమైన చిన్న సంజ్ఞ కూడా వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.
- మంచి పని చేసినప్పుడే కాదు, వాళ్లల్లో ప్రతికూలమైన ప్రవర్తన కనిపించినప్పుడు కూడా సానుకూల శ్రద్ధ కనబరుస్తూ ప్రశంసలు కలపాలి. ఎలాగంటే, 'గతంలో నువ్వెంతో మంచిగా ఉన్నావు, ఇప్పుడెందుకిలా ప్రవర్తిస్తున్నావు' అని విమర్శనాత్మకంగా లేదా గట్టిగా అరవకుండా, అదే పదాలను మృదువుగా చెప్పాలి. పిల్లలు ప్రతికూల అభిప్రాయాల కంటే, అందులోని ప్రశంసకే స్పందిస్తారు.
- అతిగా ప్రశంసించడం నివారించుకోవాలి. అతిశయోక్తి చేయకూడదు. ఎందుకంటే ఇది నిజమైన పొగడ్త ప్రాముఖ్యతను తగ్గిస్తుంది.
- మనకు నచ్చింది చేశారని కాకుండా, పిల్లలు తీసుకునే చిన్నచిన్న నిర్ణయాలు వారి లక్ష్యాన్ని సాధించగలరనే నమ్మకం కలిగినప్పుడు ప్రశంసించాలి. అది వాళ్లలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలిగే నైపుణ్యాలను పెంచుతుంది.

కంటిచూపు లేకున్నా... అల్లేస్తున్నారు!

ఆ మహిళల చేతివేళ్ల పనితనాన్ని ఆ బ్యాగులే చెబుతాయి. సమష్టిగా వాళ్లు సాధిస్తున్న సాధికారతను చూపిస్తాయి. వీటిని ఇంత అందంగా అల్లుతున్న వారంతా మాత్రం అంధ మహిళలే. తమ చేతిలో రూపొందుతున్న బుట్టల రంగులు తెలియకపోతేనేం... వందలమందికి నచ్చేలా ఆకర్షణీయంగా తయారుచేస్తున్నారు. దేశవ్యాప్తంగా విక్రయిస్తూ తమని తాము నిరూపించుకుంటోందీ మహిళాబృందం.

తిరుచ్చికి చెందిన ముత్తుసెల్వి పుట్టుకతోనే అంధురాలు. పేద కుటుంబం. ఆర్థికంగా కుటుంబానికి తన వంతు సాయం చేయాలనుకున్నా కూడా తను చదువుకోలేదు. అయితే ఆ అవకాశాన్ని ఆమెకు అందించింది తిరుచ్చిలోని ఓ కంటి ఆసుపత్రి ప్రారంభించిన అంధ మహిళల పునరావాస కేంద్రం (ఆర్‌సీబీడబ్ల్యూ). ఇందులో ముత్తుసెల్వి సహా దైవానై, మణిమేఖలై, ముత్తమిళ్ వంటి అంధ మహిళలు ఈ బుట్టల అల్లికలో శిక్షణ తీసుకున్నారు. 'రంగుల ఎంపికలో వలంటీర్లు మాకు సాయం చేస్తారు. మాలో కొందరు వైర్లను సమానంగా కట్ చేస్తే, కొంతమంది బుట్టలు అల్లుతారు. మరికొందరం దానికి బేస్ తయారుచేసి కలుపుతాం. ఇంకొందరు హ్యాండిల్స్ విడిగా అల్లి బుట్టకు అమర్చుతుంటారు. ఇలా సమష్టిగా అందరం పనిని పంచుకుంటూ షిఫ్టుల ప్రకారం పూర్తిచేస్తాం. పూజగదిలో లేదా గుడికి తీసుకెళ్లేలా అందమైన ఆకారంలో అర్చన బుట్ట, వంటింట్లో ఉల్లి, వెల్లుల్లి వంటివాటికి హ్యాండిల్ లేనివి, అలాగే బజారుకు తీసుకెళ్లేలా పరిమాణంలో పెద్దవి... ఇలా రకరకాల డిజైన్లు, ఆకారాల్లో అల్లుతున్నాం. అవసరానికి తగ్గట్లుగా ఉండటం, అలాగే ఇవి రీయూజబుల్ కావడంతో వీటి వినియోగం ఇప్పుడు పెరిగింది. సోషల్‌మీడియా ద్వారా వచ్చే ఆర్డర్లకు తగ్గట్లు బుట్టలను సిద్ధం చేస్తాం. వీటిని విక్రయించి ఆదాయాన్ని అందుకుంటున్నా'మని చెబుతున్న ముత్తుసెల్వి సహా ఇక్కడి వాళ్లంతా తమ కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించగలుగుతున్నారు. 'ఈ మహిళా బృందమంతా గతేడాదిలో వెయ్యికిపైగా బుట్టలు విక్రయించారు. చెన్నై, కోయంబత్తూరు, దిల్లీ, బెంగళూరు, హరియాణా తదితర ప్రాంతాల నుంచి ఆర్డర్లను అందుకుంటుండగా, పండుగరోజుల్లో ఈ విక్రయాలు రెట్టింపు ఉంటాయి. అలాగే దుబాయి వంటిచోట్ల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి' అంటున్నారు ఆర్‌సీబీడబ్ల్యూ ట్రైనింగ్ ప్రాజెక్టు డైరెక్టరు విమలా మోజెస్.







నేటి ఫ్యాషన్

వర్షాల వేళ... వేద్దామా ఫ్లడ్ ప్యాంట్!

ఈ కాలం ఎప్పుడు వర్షం పడుతుందో... ఎప్పుడు ఆగుతుందో అంచనా వేయడమే కష్టంగానే ఉంది కదూ! ఒక్కసారి మొదలైందంటే రోడ్లన్నీ జలమయం. ఎంత జాగ్రత్తగా నడిచినా ప్యాంటు తడవడం ఖాయం. వెళ్లేది ఇంటికైతే పర్లేదు... వెంటనే దుస్తులు మార్చేసుకోవచ్చు. ఏ ఆఫీసుకో... మరే పనో అయితేనే ఇబ్బంది. అమ్మాయిల అవసరాల్నీ అభిరుచుల్నీ గమనించే డిజైనర్లు ఈ సమస్యని మాత్రం వదిలేస్తారా ఏంటి? అందుకే జోరు వర్షాలకు సరిపోయేలా 'ఫ్లడ్ ప్యాంట్స్' తీసుకొచ్చేశారు. చీలమండకి కాస్త పైకి ఉంటాయివి. పాదాలు మునిగే నీటిలోనూ జాగ్రత్తగా నడిచేలా వీటిని తీర్చిదిద్దారన్నమాట. వీటినే కొన్నిచోట్ల 'కాప్రి ప్యాంట్ల'నీ అంటున్నారు. అలాగని ఇవి ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చినవేమీ కాదు. ఏళ్లక్రితమే అందుబాటులోకి వచ్చాయి. అయితే అవి ఇస్తున్న సౌకర్యంతో ఇప్పటి తరాన్నీ ఆకర్షించేస్తున్నాయి. అందుకే వీటికీ ఫ్యాషన్‌ని జోడించేసి తాజాగా తీసుకొచ్చేశారు ఫ్యాషనిస్టులు. కాటన్, రేయాన్, లినెన్, విస్కోజ్... అంతెందుకు, జీన్స్ రూపంలోనూ ఇవి దొరుకుతున్నాయి. పేరు విని కేవలం ప్యాంట్లే దొరుకుతాయి అనుకునేరు! సెట్ల రూపంలోనూ లభిస్తున్నాయి. కాంట్రాస్ట్, వింటేజ్, కాఫ్తాన్, కోఆర్డ్, ట్రౌజర్ తరహా... హా... చెప్పుకొంటూపోతే బోలెడు రకాలు. మీ స్టైల్‌కి తగ్గవి ఎంచుకోండి. క్యాజువల్, పార్టీ, ఆఫీసు... సందర్భానికి తగ్గట్టుగానూ ఎంచుకోవచ్చు. వర్షాల్లోనూ మీ ఫ్యాషన్ స్టైల్‌ని చూపించడానికి సిద్ధమా మరి?







గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన ఈమె పేరు రచన. ఆర్థిక అవసరాలరీత్యా.. జొమాటో వినియోగదారులకు ఆహారాన్ని అందించే పనిలో చేరారు. గురువారం ఇలా వర్షంలోనే తన రెయిన్‌కోట్‌లో 'కంగారూ' మాదిరిగా చంటిబిడ్డను ఉంచుకుని ద్విచక్ర వాహనంపై వినియోగదారుల ఇళ్లకు, కార్యాలయాలకు వెళ్లి ఆహారాన్ని అందించారు.

2050 కల్లా ఎల్‌నినోల ఉగ్రరూపం!

దిల్లీ: గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు ప్రస్తుత స్థాయిలో కొనసాగితే.. 2050 కల్లా ప్రతి రెండు ఎల్‌నినోల్లో ఒకటి తీవ్ర ప్రతికూల ప్రభావాలు చూపుతుందని తాజా అధ్యయనమొకటి హెచ్చరించింది. ఎల్‌నినో అనేది ఒక ప్రత్యేక వాతావరణ పోకడ. దాని రాకతో వడగాలులు, వరదల వంటి ప్రతికూల పరిస్థితులు తలెత్తుతాయి. భవిష్యత్తులో దాని ప్రభావాలు ఎలా ఉంటాయన్నదానిపై అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో బౌల్డర్ పరిశోధకులతో కూడిన బృందం ప్రత్యేక అధ్యయనం నిర్వహించింది. ఇందులో భాగంగా ఓ కంప్యూటర్ నమూనాతో.. గత 21 వేల ఏళ్లలో ఎల్‌నినో ప్రభావాల తీరును ముందుగా విశ్లేషించింది. భవిష్యత్తులో వాటి తీవ్రత ఎలా ఉండబోతున్నదన్నది అంచనా వేసింది. వాతావరణంలో ప్రతికూల మార్పులతో ఎల్‌నినోలు తరచూ ఏర్పడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు ప్రస్తుత స్థాయిలో కొనసాగితే 2050 కల్లా ఏర్పడే ప్రతి రెండు ఎల్‌నినోల్లో ఒకటి అత్యంత ప్రతికూల పరిస్థితులకు దారితీస్తుందని వెల్లడించారు.

జ్ఞాన నేత్రం

వారాంతంలో వ్యాయామంతో 200 రకాలకుపైగా వ్యాధుల ముప్పు తగ్గుదల

దిల్లీ: రోజూ వ్యాయామం చేయాలంటే సమయం సరిపోవడం లేదనిపిస్తోందా..? కనీసం వారాంతంలోనైనా వ్యాయామంపై కాస్త గట్టిగా దృష్టిపెట్టండి. దాదాపు 200 రకాలకు పైగా వ్యాధుల ముప్పును తగ్గించుకోవచ్చని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఆరోగ్యం బాగుండాలంటే వారానికి 150 నిమిషాల వ్యాయామం అవసరమన్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సిఫార్సు. కొంతమంది రోజువారీ వ్యాయామం చేయకుండా.. వారాంతంలోనే అంత సమయాన్ని వ్యాయామానికి కేటాయిస్తుంటారు. అలాంటివారిని 'వీకెండ్ వారియర్స్'గా పిలుస్తారు. వారికి చేకూరే ప్రయోజనాలపై బోస్టన్‌లోని మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్ పరిశోధకులతో కూడిన బృందం అధ్యయనం చేపట్టింది. రోజువారీ 20-30 నిమిషాలు వ్యాయామం చేసేవారి స్థాయిలోనే వీకెండ్ వారియర్స్ కూడా అధిక రక్తపోటు, ఊబకాయం, గుండె సంబంధిత సమస్యల వంటి 200 రకాలకుపైగా అనారోగ్యాల ముప్పును బాగా తగ్గించుకోగలుగుతున్నారని నిర్ధారించింది.

భద్రతామండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి ఫ్రాన్స్ మద్దతు

న్యూయార్క్: ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ఫ్రాన్స్ మద్దతు ప్రకటించింది. శక్తిమంతమైన భద్రతామండలిని వెంటనే విస్తరించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పింది. న్యూయార్క్‌లో బుధవారం ఐరాస సర్వసభ్య సమావేశంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ప్రసంగించారు. "ప్రస్తుతం భద్రతామండలి స్తంభించింది. దాన్ని మరింత సమర్థంగా తీర్చిదిద్దాలి. అందులో మరిన్ని దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలి. భారత్, జర్మనీ, జపాన్, బ్రెజిల్‌లను భద్రతామండలిలో శాశ్వత సభ్యదేశాలుగా చేర్చుకోవాలి. వాటితో పాటు రెండు ఆఫ్రికా దేశాలనూ తీసుకోవాలి. ఆ రెండు దేశాలు ఏవన్నది నిర్ణయించుకునే అధికారం ఆఫ్రికాకే ఇవ్వాలి" అని ఆయన పేర్కొన్నారు. భద్రతామండలి పనితీరు కూడా మారాలని, కొన్ని అంశాల్లో వీటో అధికారంపై పరిమితులు ఉండాలని మెక్రాన్ అభిప్రాయపడ్డారు.



ఆనందాన్ని ఎవరికి వారు సృష్టించుకోవాలి

ఆనందం అనేది ఎక్కడో దొరకదు. దాన్ని ఎవరికి వారు సృష్టించుకోవాలి. మీ ఆలోచనా విధానం, భవిష్యత్తు కోసం తీసుకొనే నిర్ణయాలు, ప్రతిరోజూ చేసే పనులు ఉన్నతంగా ఉన్నప్పుడే మీరు ఆనందకర జీవితాన్ని నిర్మించుకోగలరు. అలా కాక వక్రమార్గంలో జీవిస్తూ సంపాదనలోనో, ఆడంబరాల్లోనో లేదా విలాసాల్లోనో ఆనందాన్ని పొందాలని ప్రయత్నిస్తే అది ఎప్పటికీ మీ దరి చేరదు.

– బ్రియాన్ ట్రేసీ, రచయిత

కాంగ్రెస్ అబద్ధాల పుట్ట

- ఆ పార్టీ కుమ్ములాటలు పిల్లలకూ తెలుసు : మోదీ



చండీగఢ్: కాంగ్రెస్ పార్టీ అంటే అంతర్గత కలహాలకు మారుపేరు అని, ఆ విషయం హరియాణాలో పిల్లలకూ తెలుసునని ప్రధాని నరేంద్రమోదీ ఎద్దేవా చేశారు. అందుకే రాష్ట్రాన్ని రక్షించుకునేందుకు భాజపాకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయానికి వచ్చారని చెప్పారు. హరియాణాలోని భాజపా కార్యకర్తలతో గురువారం ఆయన 'నమో' యాప్ ద్వారా ముచ్చటిస్తూ కాంగ్రెస్‌పై మరోసారి విరుచుకుపడ్డారు. శాసనసభ ఎన్నికల్లో గెలిచేందుకు బూత్‌స్థాయిలో వ్యూహం రూపొందించుకోవాలని కార్యకర్తలకు సూచించారు. "కాంగ్రెస్ గత పదేళ్లుగా విపక్షంగానూ విఫలమైంది. పూర్తిగా నమ్మలేని పార్టీ ఆ పార్టీ. సమయమంతా పరస్పర కలహాలకే సరిపోతుంది. ఈ ఎన్నికల్లో మనపై వారి పోరుకు ప్రాతిపదికంతా అబద్ధాలే. పదేపదే వారు అసత్యాలు చెబుతున్నారు. తలాతోకా లేని మాటలతో వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. కాంగ్రెస్ రోజురోజుకీ ఆ పార్టీ బలహీనపడుతోంది. ప్రజాసంబంధిత అంశాలకు దూరమవుతోంది. అలాంటివారు హరియాణా ప్రజల విశ్వాసాన్ని గెలవడం కష్టం. అలాగని మనం కిమ్మనకుండా కూర్చోకూడదు. మనసుపెట్టి కష్టపడి పనిచేసి మన పార్టీ జెండాని బలంగా నాటాలి" అని పిలుపునిచ్చారు. "కాంగ్రెస్‌వారికి ఎంతసేపూ వారి కుటుంబమే ముఖ్యం. హరియాణాలో భాజపా పదేళ్ల పాలనలో అవినీతి ఛాయలే లేవు. కాబట్టి మరోసారి విజయం మనదే" అని మోదీ విశ్వాసం వ్యక్తంచేశారు.

ఏదో ఒకరోజు వచ్చి టీ తాగుతా

పార్టీ పనులపై 1990లలో హరియాణాలో తాను స్కూటర్‌పై తిరిగిన రోజుల్ని మోదీ గుర్తుచేసుకున్నారు. జింద్ జిల్లాకు చెందిన ముకేశ్ సైనీ తన టీస్టాల్ వద్దకు సీఎం సైనీ వచ్చి తేనీరు తయారు చేశారని, ఆయన్ని పెద్దన్నయ్యగా భావిస్తున్నానని సంబరంగా చెప్పారు. తానూ ఒకప్పుడు చాయ్‌వాలానేనని, అలాగైతే తానూ సోదరుడినే అవుతానని మోదీ పేర్కొన్నారు. ఏదోఒకరోజు వచ్చి టీ రుచి చూస్తానని ముకేశ్‌కు హామీ ఇచ్చారు.

ఉపాధి వ్యవస్థను అంతం చేసిన మోదీ

రాహుల్ ధ్వజం



చండీగఢ్: ప్రధానమంత్రి మోదీ హరియాణాను నాశనం చేశారని, దేశంలో ఉపాధి వ్యవస్థను క్రమబద్ధంగా అంతం చేశారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. హరియాణా నుంచి వలస వెళ్లిన యువతను ఇటీవల అమెరికాలో కలిశానని, సొంత రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతోనే వారు వలస వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. హరియాణాలోని అస్సంధ్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ గురువారం పాల్గొని ప్రసంగించారు. 'అమెరికాలోని డాలస్‌లో ఒకే గదిలో 15-20 మంది హరియాణా యువత నివాసం ఉంటున్నారు. అక్కడకు వెళ్లేందుకు వెచ్చించిన సొమ్ముతో రాష్ట్రంలోనే వ్యాపారం ప్రారంభించవచ్చు కదా అని అడిగితే ఇక్కడ పరిస్థితులు బాగాలేవని వారు వాపోయారు. తప్పుడు జీఎస్టీతో చిన్న వ్యాపారాలను భాజపా మట్టుబెడుతోంది' అని రాహుల్ ధ్వజమెత్తారు.

అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాల పెంపు

దిల్లీ: అసంఘటిత రంగంలో పని చేసే కార్మికుల కనీస వేతనాలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఏ గ్రేడ్ ప్రాంతాల్లో నిర్మాణం, స్వీపింగ్, క్లీనింగ్, లోడింగ్ అండ్ అన్‌లోడింగ్ రంగాల్లో పని చేసే నైపుణ్యం గల కార్మికులకు రోజుకు ఇక నుంచీ రూ.1,035 (నెలకు రూ.26,910) చెల్లించాల్సి ఉంటుంది. నైపుణ్యం లేని కార్మికులకు రోజుకు రూ.783 (రూ.20,358) ఇవ్వాల్సి ఉంటుంది. వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్సును సవరించడంద్వారా ఈ వేతనాలను పెంచినట్లు కేంద్రం వెల్లడించింది. పాక్షిక నైపుణ్యం కలిగిన కార్మికులకు రోజుకు రూ.868 (రూ.22,568) ఇవ్వాల్సి ఉంటుంది. క్లరికల్, కాపలాదారులకు, సాయుధ గస్తీ కాసేవారికి రోజుకు రూ.954 (రూ.24,804) చెల్లించాల్సి ఉంటుంది. కొత్త వేతనాలు అక్టోబరు 1 నుంచి అమల్లోకి వస్తాయి. కార్మికులను నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం, నైపుణ్య లేమి ఆధారంగా.. ప్రాంతాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు.

హరియాణాలో

'బుల్డోజర్' ప్రచారం



నూహ్: హరియాణా ఎన్నికల్లో కొందరు అభ్యర్థులు తమ ప్రచార రథాలుగా బుల్డోజర్లను వినియోగిస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో ఎక్కడ చూసినా పొక్లెయిన్‌లే దర్శనమిస్తున్నాయి. ప్రజల నుంచి భారీ స్పందన వస్తుండటంతో రాజకీయ పార్టీలన్నీ వీటినే తమ వాహనాలుగా వినియోగిస్తున్నాయి. దీంతో అక్కడ బుల్డోజర్లకు భారీ డిమాండు పెరిగింది. బుల్డోజర్ న్యాయం పేరుతో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారి ఇళ్లను కూల్చివేసే ప్రక్రియను పలు రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయి. దీంతో పొక్లెయిన్ వస్తుందంటేనే అక్రమార్కుల్లో దడ పుట్టించేలా మారిపోయాయి. యూపీలో తొలుత మొదలైన ఈ ధోరణి.. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకూ పాకింది. ఇలా బుల్డోజర్ న్యాయం, బుల్డోజర్ రాజకీయాలు అనే పదాలను వాడిన ప్రధాన రాజకీయ పార్టీలు. . ఇప్పుడు అదే వాహనాన్ని ప్రచారంలో విస్తృతంగా వాడుకుంటున్నాయి. పొక్లెయిన్ బ్లేడ్లపై కూర్చుని పూలు చల్లుతూ, నృత్యాలు చేస్తూ పార్టీ కార్యకర్తలు ఫుల్ జోష్‌తో ప్రచారంలో దూసుకుపోతున్నారు. మత సామరస్యాన్ని దెబ్బతీయాలని ప్రయత్నించే శక్తులకు బుల్డోజర్ చర్య తప్పదని చెప్పడానికి ఈ వాహనాలను ఉపయోగిస్తున్నామని కొన్ని పార్టీలు అంటుండగా.. జనాకర్షణగా నిలుస్తుండటంతో ఎన్నికల ప్రచారంలో విరివిగా ఉపయోగిస్తున్నామని మరికొన్ని పార్టీలు చెబుతున్నాయి. ప్రచారంలో రాజకీయ పార్టీలు కొత్త వ్యూహాలతో ముందుకెళ్తున్న వేళ తమ వాహనాలకు భారీ డిమాండ్ పెరిగిందని బుల్డోజర్ల యజమానులు పేర్కొంటున్నారు. ఎన్నికల ప్రచారానికి కార్లను పంపించినట్లుగానే తాము బుల్డోజర్లను పంపిస్తున్నామని చెబుతున్నారు. దీంతో దిల్లీతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో వాటిని తెప్పించాల్సి వస్తోందని తెలిపారు.

సంజయ్ రౌత్‌కు 15 రోజుల జైలుశిక్ష

ముంబయి: పరువు నష్టం కేసులో శివసేన-యూబీటీ కీలక నేత, ఎంపీ సంజయ్‌రౌత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. భాజపా నేత కిరీట్ సోమయ్యా, ఆయన భార్య మేధ సోమయ్యా దాఖలు చేసిన పరువునష్టం కేసులో సంజయ్‌ను గురువారం ముంబయి కోర్టు దోషిగా తేల్చింది. 15 రోజుల సామాన్య జైలు శిక్షతోపాటు రూ.25 వేలు జరిమానా విధించింది. శిక్షను నిలుపు చేయాలని, బెయిల్ మంజురు చేయాలని కోరుతూ తీర్పు అనంతరం సంజయ్ తరపు న్యాయవాది కోర్టులో రెండు అభ్యర్థనలను దాఖలు చేశారు. దీనికి కోర్టు అనుమతినివ్వడంతో సంజయ్‌కు బెయిల్ లభించింది. కోర్టు తీర్పుపై స్పందించిన సంజయ్‌రౌత్ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు తనను బలిపశువును చేశారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు.

కశ్మీర్ ఎన్నికల తర్వాత పీవోకే మనదే: యోగి

జమ్మూ: ప్రస్తుత శాసనసభ ఎన్నికలు ముగిసి జమ్మూకశ్మీర్‌లో భాజపా అధికారంలోకి వచ్చాక పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) కూడా ఈ రాష్ట్రంలో భాగంగా మారుతుందని, పాకిస్థాన్ నుంచి విడిపోతామంటూ ఆ ప్రాంతం గొంతెత్తి చెబుతోందని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. కేంద్రంలోని బలమైన సర్కారు కారణంగా కశ్మీర్‌లో ఎన్నికలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆర్.ఎస్.పుర ప్రాంతంలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. పాక్‌లో పరిస్థితి అల్లకల్లోలంగా ఉందని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు వారు తంటాలు పడుతున్నారని చెప్పారు. పాకిస్థాన్‌ను మానవత్వానికి శత్రువుగా, మానవాళి పాలిట క్యాన్సర్‌గా అభివర్ణించారు.

కాల్పుల విరమణను అంగీకరించం

- అమెరికా ప్రతిపాదనను తిరస్కరించిన నెతన్యాహు

బీరుట్/న్యూయార్క్: ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా ఘర్షణను ఆపేందుకు అమెరికా, ఫ్రాన్స్, ఇతర దేశాలు చేసిన 21 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను గురువారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తిరస్కరించారు. తమ లక్ష్యాలను సాధించేవరకు హెజ్‌బొల్లాపై దాడులు ఆపే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు లెబనాన్‌పై పూర్తిశక్తితో విరుచుకుపడాలని సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు. "ఇజ్రాయెల్ విధానం సుస్పష్టం. మేం మా లక్ష్యాలను సాధించేవరకు దాడులు ఆపం. హెజ్‌బొల్లా దాడుల కారణంగా ఉత్తర ఇజ్రాయెల్‌ను ఖాళీ చేసిన పౌరులు తమ నివాసాలకు తిరిగి వెళ్లడం మాకు కీలకం'' అని నెతన్యాహు తెలిపారు. గురువారం మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇజ్రాయెల్ దాడిలో హెజ్‌బొల్లాకు చెందిన డ్రోన్ యూనిట్ కమాండర్ ప్రాణాలు కోల్పోయారు. లెబనాన్ రాజధాని బీరుట్‌లోని దాహియాలో ఈ కమాండర్ ఉన్న అపార్టుమెంటుపై ఇజ్రాయెల్ మూడు క్షిపణులను ప్రయోగించింది.

లెబనాన్‌ను వీడండి

లెబనాన్‌లోని భారతీయులు అప్రమత్తంగా ఉండాలని గురువారం బీరుట్‌లోని భారత రాయబార కార్యాలయం హెచ్చరిక జారీ చేసింది. ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా భారతీయులు దేశాన్ని వీడాలని పేర్కొంది.

■ గోలన్‌హైట్స్‌లో ఐక్యరాజ్యసమితి శాంతిపరిరక్షక దళంలో పనిచేస్తూ ఓ ప్రమాదంలో గాయపడిన భారతీయ సైనికుడు హవల్దార్ ఆర్.సురేశ్‌ను గురువారం భారత్ టెల్ అవీవ్ నుంచి దిల్లీకి తరలించింది. ప్రస్తుతం సురేశ్ దిల్లీలోని ఆర్మీ రీసెర్చ్ అండ్ రిఫరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

ఉగ్రవాదం భూస్థాపితమైంది..

అది మళ్లీ రాదు: అమిత్‌షా



ఉధంపుర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని భూస్థాపితం చేశామని, అది తిరిగి పుంజుకునేందుకు అనుమతించేదే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పారు. గురువారం జమ్మూకశ్మీర్‌లోని ఉధంపుర్ జిల్లా చెనానిలో ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ కూటమి ఇక్కడ గెలిచినట్లయితే పాకిస్థాన్ ఎజెండాను అమలు చేస్తుందని హెచ్చరించారు. భాజపా మాత్రం ఉగ్రవాద ఛాయల్లేని రాష్ట్రాన్ని అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఉగ్రవాదాన్ని విస్తరించాలని ఎవరు అనుకున్నా వారికి ఉరికంబమే గతి అవుతుందన్నారు. ఆయుధాలు వదిలిపెట్టి చర్చలకు రాకపోతే భద్రత దళాల చేతిలో చావుదెబ్బ తినేందుకు సిద్ధపడాలని ఉగ్రవాదులకు హెచ్చరించారు. వారిని పాతాళంలోకి నెట్టేవరకు విశ్రమించబోమన్నారు. రాళ్లు విసిరేవారిని, ఉగ్రవాదులను వదిలేయాలని కాంగ్రెస్ కోరుకుంటుందని, ఒక్క రాయి విసరడానికి కూడా అందరూ భయపడేలా తాము చట్టాలను అమలు చేశామని చెప్పారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల హయాంలోనే జమ్మూకశ్మీర్ ఎక్కువ ఏళ్లపాటు కేంద్ర పాలనలో ఉన్న విషయాన్ని రాహుల్ గాంధీ తెలుసుకోవాలని సూచించారు. ప్రతికూల వాతావరణంలో హెలికాప్టర్ దిగలేకపోవడంతో ఆయన ఉధంపుర్‌కు వెళ్లి, కొన్నిగంటలు ఆలస్యంగా చెనానికి రోడ్డుమార్గాన చేరుకోవాల్సి వచ్చింది.

తక్కువ ఓటింగుకు కేంద్రమే కారణం: ఒమర్

జమ్మూకశ్మీర్‌లో రెండోదశ ఎన్నికల్లో తక్కువ ఓటింగు నమోదు కావడానికి కేంద్రమే కారణమని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా ఆరోపించారు. సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పేందుకు కేంద్రం ప్రయత్నిస్తుండటాన్ని ప్రజలు తిప్పికొట్టాలనుకున్నారని చెప్పారు. ఎన్నికల బహిష్కరణకు ఎవరూ పిలుపునివ్వకపోవడం, ఎలాంటి బెదిరింపులు లేకపోవడంతో నిజానికి ఓటింగ్‌శాతం పెరుగుతుందని భావించానని తెలిపారు. పోలింగ్ శాతం పెరిగితే అది తమ విజయంగా కేంద్రం భావిస్తోందని, అలాంటి తప్పుడు సంకేతాలను ఓటర్లు ఇవ్వదలచుకోలేదని బారాముల్లా జిల్లాలో ఆయన విలేకరులకు చెప్పారు. కశ్మీర్ పోలింగ్ పరిశీలనకు విదేశీ దౌత్యవేత్తల్ని ఆహ్వానించడం తప్పిదమన్నారు.

■ కశ్మీర్ రెండోదశ పోలింగులో దాదాపు 40% మంది కశ్మీరీ పండిట్లు తమ హక్కు వినియోగించుకున్నారని సహాయ పునరావాస కమిషనర్ అరవింద్ కర్వానీ తెలిపారు.

ఇక ప్రాచీన ప్రసాద వితరణే

- మథురలో హిందూ సంస్థ ప్రకటన

మథుర, ప్రయాగ్‌రాజ్, అయోధ్య : ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం కల్తీ ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ క్రమంలో పలు దేవాలయాలు ప్రైవేటు వ్యాపారులు చేసే స్వీట్స్‌ను భక్తులకు ప్రసాదంగా పంచే విధానానికి స్వస్తి పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథురలో గల దేవాలయాల్లో ఇకపై భక్తులకు బహిరంగ మార్కెట్‌లో తయారయ్యే స్వీట్ల స్థానంలో 'ప్రాచీన ప్రసాదం' వితరణ చేయాలని స్థానిక హిందూ సంస్థ నిర్ణయించింది. ఆ ప్రకారం ఆయా కాలాల్లో వచ్చే పళ్లు, పూలు, అయిదు రకాల ఎండు ఫలాలతో కూడిన పంచమేవ, యాలకులు, చక్కెర మిఠాయిలను భక్తులకు పంచుతారు. బృందావన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ధర్మ రక్షా సంఘ్ అధ్యక్షుడు సౌరభ్ గౌర్ మాట్లాడుతూ. ."దేశ వ్యాప్తంగా దేవాలయాల్లో ప్రసాదం వ్యవస్థలో సమూల సంస్కరణలు తీసుకురావాలి. సంప్రదాయ హిందూ పద్ధతిలో స్వచ్ఛమైన, సాత్విక ప్రసాదం వితరణను పునరుద్ధరించాలన్న అంశంపై మత పెద్దలు, సంస్థల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది''అని పేర్కొన్నారు.

కొబ్బరికాయలు, పళ్లే తీసుకురండి

దేవాలయాలకు దుకాణాల నుంచి తెచ్చే స్వీట్లు, శుద్ధి చేసిన ఆహార పదార్థాలను భక్తులు తీసుకురావడంపై ప్రయాగ్‌రాజ్‌లోని దేవాలయాలు నిషేధం విధించాయి. బదులుగా కొబ్బరికాయలు, పళ్లు, ఎండుఫలాలను మాత్రమే నైవేద్యంగా సమర్పించేందుకు తీసుకురావాలని సూచించాయి. ఈ మేరకు ప్రముఖ అలోప్ శాంకరీ దేవి, బడే హనుమాన్, మన్‌కామేశ్వర్ దేవాలయాలు ప్రకటించాయి. దేవాలయ యాజమాన్యం నిర్వహించిన సమావేశంలో ఇకపై అమ్మవారికి స్వీట్లను నైవేద్యంగా పెట్టరాదని నిర్ణయించినట్లు ప్రయాగ్‌రాజ్‌లోని ప్రఖ్యాత లలితా దేవి ఆలయ ప్రధాన పూజారి శివ మురత్ మిశ్ర వెల్లడించారు.

బయట సంస్థల ప్రసాదాలపై నిషేధం విధించాలి: రామమందిర పూజారి

దేశవ్యాప్తంగా విక్రయిస్తున్న నెయ్యి స్వచ్ఛతపై అయోధ్య రామాలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ సందేహం వ్యక్తం చేశారు. దేవాలయాల్లో ప్రసాద తయారీని పూజారుల పర్యవేక్షణలోనే చేపట్టాలని సూచించారు. అన్ని ప్రముఖ దేవాలయాలు, మఠాల్లో బయట సంస్థలు తయారు చేసే ప్రసాదాలపై నిషేధం విధించాలని సూచించారు. తిరుపతి బాలాజీ ప్రసాదంలో కొవ్వును ఉపయోగించడంపై భక్తులు ఆగ్రహంతో ఉన్నారని, ఆ వ్యవహారంపై దర్యాప్తును కోరుతున్నారని పేర్కొన్నారు.

నాగాలాండ్, అరుణాచల్‌లలో ఏఎఫ్ఎస్‌పీఏ చట్టం పొడిగింపు

దిల్లీ: భద్రతా దళాలకు ప్రత్యేక వెసులుబాట్లు కల్పించేందుకు ఉద్దేశించిన సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని (ఏఎఫ్ఎస్‌పీఏ) కొన్ని ప్రాంతాల్లో పొడిగించారు. నాగాలాండ్‌లో ఎనిమిది జిల్లాలు, అరుణాచల్ ప్రదేశ్‌లో మూడు జిల్లాలు, మరికొన్ని ప్రాంతాలు ఈ జాబితాలో ఉన్నాయి. మరో ఆరు నెలల పాటు ఈ చట్టం ఆయా చోట్ల అమల్లో ఉండనుంది. అక్టోబరు 1 నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

ఆరెస్సెస్ సభ్యులంతా హిందూ సింహాలు

ఝార్ఖండ్ సీఎం వ్యాఖ్యలపై భాజపా స్పందన

రాంచీ: ఆరెస్సెస్ సభ్యులంతా హిందూ సింహాలని, దేశంలో సనాతన ధర్మ ప్రతిష్ఠను పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్న యోధులని భాజపా పేర్కొంది. వారిని ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ ఎలుకలుగా అభివర్ణించడాన్ని తప్పుపట్టింది. రాజకీయ ప్రయోజనాల కోసమే ఆయన పనిచేస్తున్నారని, బంగ్లాదేశీ చొరబాట్లను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించింది. ఈ మేరకు ఝార్ఖండ్ శాసనసభలో ప్రతిపక్షనేత, భాజపా నేత అమర్ కుమార్ బవురి పేర్కొన్నారు.

అరుణాచల్‌లో పర్వతానికి ఆరో దలైలామా పేరు

చైనాకు పర్వతారోహకుల ఝలక్

బీజింగ్: అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఓ పర్వతానికి ఆరో దలైలామా పేరుపెట్టి భారత పర్వతారోహకులు చైనాకు ఝలక్ ఇచ్చారు. ఆ ప్రాంతంపై తమకు హక్కు ఉందని భారత్ పునరుద్ఘాటించింది. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో 'జాతీయ పర్వతారోహణ, సాహస క్రీడల సంస్థ' (నిమాస్) 15 రోజుల సాహస యాత్ర చేపట్టి, ఈ పర్వతంపైకి చేరుకుని, దాని ఎత్తును 20,942 అడుగులుగా తేల్చింది. మాన్ తవాంగ్ ప్రాంతంలో 1682లో జన్మించిన ఆరో దలైలామా- సాంగ్‌యాంగ్ గ్యాత్సో పేరును దీనికి పెట్టాలని నిర్ణయించింది. ఇంతవరకు దీనికి పేరుపెట్టలేదు. అరుణాచల్‌లోని దిరాంగ్‌లో నెలకొన్న నిమాస్ సంస్థ- భారత రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. దలైలామా అపార విజ్ఞానానికి, మోన్పా తెగకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా పర్వతానికి పేరు పెట్టినట్లు రక్షణశాఖ తెలిపింది. ఈ విషయం గురించి తమకు తెలియదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి స్పష్టంచేశారు. అరుణాచల్‌ను జాంగ్‌నన్‌గా చైనా పేర్కొంటూ అది తమదేనని వాదిస్తోంది. 2017 నుంచి అక్కడ కొన్ని ప్రాంతాలకు పేర్లు పెడుతూ వస్తోంది. భారత్ దానిని తోసిపుచ్చుతూ అరుణాచల్ పూర్తిగా తమ అంతర్భాగమని, పేర్లతో వాస్తవాన్ని మార్చలేరని స్పష్టంచేస్తోంది.

పేద విద్యార్థి ఐఐటీ సీటు కోసం..

ఏకమైన యూపీ గ్రామస్థులు

- సుప్రీంకోర్టు తీర్పు కోసం ఎదురుచూపు



ముజఫర్‌నగర్ (యూపీ): నిరుపేద దళిత కుటుంబంలో పుట్టినా చదువులో సరస్వతీపుత్రుడైన అతుల్‌కుమార్ (18) ఐఐటీ సీటు కోసం ఉత్తర్‌ప్రదేశ్‌లోని టిటోడా అనే కుగ్రామం మొత్తం ఏకమైంది. అతుల్ ఫీజు చెల్లింపునకు మొదట విరాళాలు పోగుచేసిన ఈ గ్రామం.. సాంకేతిక కారణాలతో ఆగిన అతడి 'ఐఐటీ ప్రవేశం' కేసులో సెప్టెంబరు 30న సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు కోసం ఆత్రుతగా ఎదురుచూస్తోంది. అత్యధిక పోటీ ఉండే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఉత్తీర్ణుడైన అతుల్.. ధన్‌బాద్ (ఝార్ఖండ్) ఐఐటీలో ఇంజినీరింగు చేయాలన్న తన కల నెరవేరబోతోందని సంబరపడ్డాడు. సీటు ఖరారు కోసం ముందస్తుగా రూ.17,500 మొత్తాన్ని కట్టాల్సి వచ్చింది. వస్త్ర పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న తండ్రి రాజేంద్ర నిస్సహాయతను చూసి, టిటోడా గ్రామస్థులు విరాళాలు వేసుకొని ఆ మొత్తం సమకూర్చారు. ఈలోపు ఫీజు గడువు ముంచుకువచ్చింది. జూన్ 24లోపు ఫీజు కట్టాల్సి ఉండగా, చివరిరోజుల్లో సాంకేతిక కారణాలతో ధన్‌బాద్ ఐఐటీ ఆన్‌లైన్ పోర్టల్ పనిచేయక అతుల్ ఆ మొత్తాన్ని సకాలంలో కట్టలేకపోయాడు. సీటు వచ్చినట్టే వచ్చి చేజారింది. దీనిపై గ్రామస్థుల అండతో గత మూడు నెలలుగా కింది కోర్టుల్లో న్యాయపోరాటం చేసిన అతుల్‌కుమార్ చివరి ఆశగా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన దేశ అత్యున్నత న్యాయస్థానం సాధ్యమైనంత వరకు అతుల్‌కు సాయం చేస్తామని హామీ ఇచ్చింది. ఈ నెల 30న తదుపరి విచారణ ఉంది.

చక్కెర కనీస విక్రయ ధర పెంపు!

- ఎగుమతులకు అనుమతిపైనా పరిశీలన
- ఇథనాల్ ధరలనూ పెంచే అవకాశం
- కేంద్ర మంత్రి వెల్లడి

దిల్లీ: చక్కెర కనీస విక్రయ ధరను పెంచడంతోపాటు 2024-25 ఏడాదిలో ఎగుమతులకు అనుమతించే అంశాన్నీ పరిశీలిస్తున్నామని కేంద్ర ఆహారశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. వీటితోపాటు ఇథనాల్ ధరలనూ పెంచే విషయాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు. గురువారం దిల్లీలో ఇండియన్ షుగర్ మిల్స్ అసోసియేషన్ (ఇస్మా) సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఇథనాల్ ధర పెంపు అంశం పెట్రోలియం శాఖ వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. చక్కెర లభ్యత, వచ్చే ఏడాది సాగుపై అంచనాకు వచ్చాక ఎగుమతులపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. 2019 నుంచి చక్కెర కనీస విక్రయ ధర రూ.31 వద్దే ఉందని, దీనిపై కార్యదర్శుల కమిటీ చర్చలు జరుపుతోందని వివరించారు.

■ సదస్సులో ఇస్మా అధ్యక్షుడు ఎం.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. చక్కెర కనీస విక్రయ ధరను రూ.39కి పెంచాలని, 20 లక్షల టన్నుల చక్కెర ఎగుమతులకు అనుమతివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



యుద్ధం తెచ్చిన కష్టం!

ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య పోరు కారణంగా దక్షిణ గాజా స్ట్రిప్‌లో సామాన్యులు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. ఎప్పుడు ఏ వైపు నుంచి బాంబు వచ్చిపడుతుందో లేక క్షిపణి దాడి జరుగుతుందోనన్న భయంతో గడుపుతున్నారు. దాడుల బారిన పడినవారు అవయవాలు కోల్పోయి చక్రాల కుర్చీకే పరిమితం అవుతున్నారు. ఖాన్ యూనిస్‌లో అలా గాయపడిన ఓ మహిళను మరో వ్యక్తి దాడుల్లో ధ్వంసమైన ఇళ్ల మధ్య నుంచి తీసుకెళుతున్నప్పటిదే ఈ చిత్రం

పుణ్యస్నానాలు ఆచరిస్తూ 46 మంది మృతి

- జీవిత్‌పుత్రిక పండగరోజు బిహార్‌లో తీవ్ర విషాదం

పట్నా: బిహార్‌లో 'జీవిత్‌పుత్రిక' పండగ రోజు తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పండగ సందర్భంగా నదుల్లో పుణ్యస్నానాలు ఆచరిస్తూ వేర్వేరు దుర్ఘటనల్లో 46 మంది మరణించారు. వీరిలో 37 మంది చిన్నారులేనని గురువారం అధికారులు ప్రకటించారు. 'జీవిత్ పుత్రిక' పండగలో భాగంగా మహిళలు తమ పిల్లల సంక్షేమం కోసం ఉపవాసాలు ఉండి, చిన్నారులతో పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. ఈ క్రమంలోనే 15 జిల్లాల్లో బుధవారం దుర్ఘటనలు చోటుచేసుకున్నాయి. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. దుర్ఘటనలపై స్పందించిన ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ మృతుల కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు.

హరిత ఇంధనానికి శపథం

- 2030 నాటికి 21 వేల మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యం
- కేంద్రానికి సంబంధిత పత్రం అందజేసిన రాష్ట్ర ఇంధనశాఖ



తెలంగాణను హరిత ఇంధన హబ్‌లా మారుస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం శపథం చేసింది. దేశంలో 2030కల్లా 5 లక్షల మెగావాట్ల హరిత ఇంధన ఉత్పత్తిని సాధించాలని ప్రధాని మోదీ లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాల నుంచి వాటి వాటాగా ఉత్పత్తి చేయాల్సిన హరిత విద్యుత్తుపై రాతపూర్వక హామీని 'శపథ్ పత్రం' పేరిట కేంద్ర నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల మంత్రిత్వశాఖ(ఎంఎన్ఆర్ఈ) సేకరిస్తోంది. అందులో భాగంగా 2030 నాటికి తెలంగాణలోనూ 21,083 మెగావాట్ల హరిత ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తామంటూ రాష్ట్ర ఇంధన శాఖ కేంద్ర ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. ఇటీవల గుజరాత్‌లోని గాంధీనగర్‌లో నిర్వహించిన 'అంతర్జాతీయ పునరుద్ధరణీయ ఇంధన పెట్టుబడుల సదస్సు'కు హాజరైన ఉప ముఖ్యమంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఈ పత్రాన్ని అధికారికంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీకి సమర్పించారు. దాన్ని 'ఈనాడు' సేకరించింది. అందులోని ముఖ్యాంశాలు...

- తెలంగాణలో 2035 నాటికి 40 వేల మెగావాట్ల హరిత ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. ఇందులో 21 వేల మెగావాట్లను 2030కల్లా సాధిస్తాం. దీంట్లో సౌర(14,878 మెగావాట్లు), పవన(2,400), జల విద్యుత్తు(3805)కు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకున్నాం.
- రాష్ట్రంలో ఏడాదిలో 300 రోజులపాటు సూర్యరశ్మి ధారాళంగా ఉంటుంది. అందుకే 26,400 మెగావాట్ల సౌరవిద్యుదుత్పత్తికి అవకాశమున్నట్లు సర్వేలో తేలింది.
- పవన విద్యుత్తుపై ప్రత్యేక పాలసీని రూపొందిస్తాం. రాష్ట్రంలో 5,400 మెగావాట్ల పవన విద్యుదుత్పత్తికి అవకాశాలున్నాయి.
- పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు(పీఎస్‌పీపీ)లను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సింగరేణి సంస్థ గతంలో బొగ్గును తవ్వి మూసివేసిన ఉపరితల బొగ్గు గనుల్లో నీటిని నింపి రిజర్వాయర్లుగా మార్చి పీఎస్‌పీపీల నిర్మాణానికి చర్యలు మొదలయ్యాయి.
- జాతీయ జలవిద్యుదుత్పత్తి సంస్థ(ఎన్‌హెచ్‌పీసీ) అధికారులు ఇటీవల హైదరాబాద్ వచ్చి జెన్‌కోతో చర్చించారు. జెన్‌కో ఆధ్వర్యంలో 1000 మెగావాట్ల పీఎస్‌పీలను చేపట్టడానికి అవకాశాలున్నట్లు తేలింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ఆనకట్టలకు దిగువన వీటి నిర్మాణానికి పరిశీలిస్తున్నారు.
- హైదరాబాద్‌లో త్వరలో నిర్వహించనున్న పెట్టుబడిదారుల సదస్సు తర్వాత హరిత ఇంధన ప్రాజెక్టులపై మరింత స్పష్టత వస్తుంది.

పెట్టుబడుల కోసం అన్వేషణ

ప్రభుత్వం త్వరలో 'తెలంగాణ రాష్ట్ర ఇంధన పాలసీ' తీసుకురానుంది. హరిత విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల కోసం ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడంపై, అలాంటి కంపెనీలకు రాయితీలు ఇవ్వడంపై అందులో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. గాంధీనగర్ సదస్సు ఎగ్జిబిషన్‌లో తెలంగాణ ఇంధనశాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను 300 వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడిదారులు సందర్శించారు. వీరిలో సుజలాన్, రెన్యూ సోలార్, జిందాల్ ఇండియా, అమర్ రాజా, గ్రీన్ ఎనర్జీ తదితర కంపెనీల ప్రతినిధులు ఉన్నారు. వీరితోపాటు ప్రముఖ ఆర్థిక సంస్థలు సైతం తెలంగాణలో హరిత ఇంధన ప్రాజెక్టులకు అవసరమైన రుణాల వివరాలను అడిగాయి. అక్కడే వివిధ పరిశ్రమల యాజమాన్యాలతో ఉప ముఖ్యమంత్రి భట్టి చర్చించారు. త్వరలో హరిత ఇంధన పెట్టుబడిదారులతో హైదరాబాద్‌లో ప్రత్యేక సదస్సు నిర్వహించాలని రాష్ట్ర విద్యుత్ సంస్థల సీఎండీలను ఆయన తాజాగా ఆదేశించారు.

- ఈనాడు, హైదరాబాద్

మొదటి విడతలో పది లక్షల ఇందిరమ్మ ఇళ్లు!

లబ్ధిదారుల ఎంపికకు కమిటీలు

ఈనాడు, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో భాగంగా మొదటి దశలో ఒకేసారి పది లక్షల గృహాలను మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించి సీఎం వద్ద కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 15 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా.. ప్రస్తుతం ఆ మార్కును దాటాలని యోచిస్తున్నట్లు తెలిసింది. లబ్ధిదారుల ఎంపికకు గ్రామస్థాయిలో అంగన్‌వాడీ, ఆశ, గ్రామ కార్యదర్శితోపాటు స్థానికంగా ఉండే వారితో కలిపి కమిటీలను నియమించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు గృహ నిర్మాణశాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఈ కమిటీలు ఇచ్చే నివేదిక ఆధారంగా ఎంపీడీవోలు తుది నిర్ణయం తీసుకుని లబ్ధిదారుల తుది జాబితా ఖరారు చేయనున్నట్లు తెలిసింది. కొద్ది రోజుల్లో మార్గదర్శకాలు విడుదల కానున్నట్లు సమాచారం.

డిప్యుటేషన్‌లో ఉన్న హౌసింగ్ ఉద్యోగులు వెనక్కి

ఈనాడు, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వివిధ శాఖలు, కార్పొరేషన్లలో డిప్యుటేషన్‌లో పనిచేస్తున్న హౌసింగ్ ఉద్యోగులను వెనక్కి తీసుకుంటూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన 242 మంది రెగ్యులర్ ఉద్యోగులు పంచాయతీరాజ్, రోడ్లు-భవనాలు, దేవాదాయ, మార్కెటింగ్, వైద్యఆరోగ్య సహా పలు శాఖల్లో.. జీహెచ్ఎంసీ, టీజీబీసీఎల్, టీజీకేవీబీ, హెచ్ఎంఆర్ఎల్ సహా 15 కార్పొరేషన్లలో డిప్యుటేషన్‌లో ఉన్నారు. వీరిని వెనక్కి తీసుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఇందులో కలెక్టరేట్లలో పనిచేస్తున్న 148 మంది, రాజీవ్‌స్వగృహ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 9 మంది ఆయాచోట్ల కొనసాగిస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వీరి సేవల్ని అక్కడే ఉపయోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నేడు గాంధీభవన్‌లో 'మంత్రులతో ముఖాముఖి'కి ఉత్తమ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: గాంధీభవన్‌లో శుక్రవారం జరిగే 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమంలో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొంటారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరిస్తారు.



ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడేందుకు ముందుకొస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని నిలువరిస్తున్న మంత్రి కొండా సురేఖ. చిత్రంలో ఎంపీ రఘునందన్‌రావు తదితరులు

రసాభాసగా చెక్కుల పంపిణీ

కాంగ్రెస్ నాయకుడు వేదికపైకి రావడంపై అభ్యంతరం

దుబ్బాక, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రసాభాస జరిగి హడావుడిగా ముగిసింది. ప్రభుత్వ కార్యక్రమం కాబట్టి ప్రొటోకాల్ లేని నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వేదిక పైనుంచి కిందికి వెళ్లాలని లేదంటే తమ పార్టీ నాయకులు పైకి వస్తారని భారాస ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. దీంతో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. శ్రీనివాస్‌రెడ్డి వేదికపైనే ఉంటారని ఎమ్మెల్యేకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ లోపు ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లి శ్రీనివాస్‌రెడ్డి ఏదో చెప్పే ప్రయత్నం చేయగా ఆయనను మంత్రి వారించారు. వేదికపైకి రావాలంటూ భారాస నాయకులకు ఎమ్మెల్యే సూచించడంతో కొందరు వేదికపైకి వచ్చే ప్రయత్నం చేశారు. గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో భారాస పట్టణ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణగౌడ్, ఇతర నాయకులను వేదికపై నుంచి కిందికి నెట్టివేయడంతో వారు కుర్చీలపై పడ్డారు. ఏసీపీతో ఎమ్మెల్యేకు వాగ్వాదం జరిగింది. భారాస, కాంగ్రెస్ నాయకుల పోటాపోటీ నినాదాలతో గందరగోళం నెలకొంది. ముగ్గురికి చెక్కులను పంపిణీ చేసిన మంత్రి కొద్ది నిమిషాలు మాట్లాడి వెళ్లిపోయారు. గత ప్రభుత్వ హయాంలో భారాస స్థానిక ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు జరిగేవని.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నా వేదికల పైకి ఆహ్వానించిన దాఖలాలు లేవని మంత్రి పేర్కొన్నారు.

వ్యవసాయ పంపుసెట్లకు.. రూ.508 కోట్లతో విద్యుదీకరణ పథకం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ కొత్తగా వ్యవసాయ పంపుసెట్ల విద్యుదీకరణ పథకాన్ని రూపొందించింది. రూ. 508.95 కోట్ల విలువైన ఈ పథకానికి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్గొండ, సూర్యాపేట, సరూర్‌నగర్, మెదక్, వికారాబాద్, యాదాద్రి, నారాయణపేట్, రాజేంద్రనగర్, గద్వాల్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఆపరేషన్ సర్కిళ్లకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. ప్రస్తుతం విద్యుత్తు లైన్లకు దూరంగా ఉన్న పొలాలకు ఈ పథకంలో ప్రాధాన్యమివ్వనున్నారు. ఈ పథకం కింద 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నాలుగైదు హెచ్‌పీ పంపుసెట్లకు కనెక్షన్ ఇవ్వనున్నారు. 25కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్, దానికి అవసరమైన 11 కేవీ కండక్టర్, ఎల్‌టీ కేబుల్, పోల్స్ వంటివి ఏర్పాటు చేయాలంటే దాదాపు రూ.3 లక్షల వరకు ఖర్చవుతుంది. ఒక్కో కనెక్షన్‌కు రూ.75 వేల వ్యయం కానుంది. ఒక వ్యవసాయ కనెక్షన్‌కు రైతు చెల్లించేది రూ.5 వేలు మాత్రమే. మిగిలిన రూ.70 వేలను ప్రభుత్వం రాయితీ కింద భరించనుంది. దీనికి సంబంధించిన పనులన్నీ సంస్థ పరిధిలోనే జరుగుతాయి.

కేటీఆర్‌కు లీగల్ నోటీసు

ఈనాడు హైదరాబాద్: అమృత్ టెండర్లకు సంబంధించి సృజన్‌రెడ్డిపై చేసిన ఆరోపణలను ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో చట్ట ప్రకారం ముందుకు వెళ్లాల్సి ఉంటుందని పేర్కొంటూ ఆయన తరఫు న్యాయవాది భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు లీగల్ నోటీసు పంపారు. తన క్లయింట్‌పై చేసిన ఆరోపణలు ఆధార రహితమని, ఆయన బహిరంగంగా క్షమాపణలు చెప్పడంతోపాటు సోషల్ మీడియాలో ఉన్న పోస్టులను తొలగించాలని నోటీసులో పేర్కొన్నారు. మొత్తం టెండర్ల విలువ రూ.3656.78 కోట్లు మాత్రమేనని, ఇందులో వారి వాటా రూ.321.9 కోట్లేనని పేర్కొన్నారు.

పన్నెండు రైళ్లు.. నెల రోజులు రద్దు

ఈనాడు, హైదరాబాద్: నిర్వహణ పనుల కారణంగా వివిధ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న 12 రైళ్లను రద్దు చేస్తున్నట్లు ద.మ.రైల్వే గురువారం ప్రకటించింది. కాచిగూడ-నిజామాబాద్(07596), నిజామాబాద్-కాచిగూడ(07593), మేడ్చల్-లింగంపల్లి(47222), లింగంపల్లి-మేడ్చల్ (47225), మేడ్చల్-సికింద్రాబాద్(47235), సికింద్రాబాద్-మేడ్చల్ (47236), మేడ్చల్-సికింద్రాబాద్(47237), సికింద్రాబాద్-మేడ్చల్(47238) మేడ్చల్-సికింద్రాబాద్(47242), సికింద్రాబాద్-మేడ్చల్(47245), మేడ్చల్-సికింద్రాబాద్(47228), సికింద్రాబాద్-మేడ్చల్ (47229) రైళ్లు అక్టోబరు 1 నుంచి అదే నెల 31వ తేదీ వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉండవని తెలిపింది. కాచిగూడ-మెదక్ రైలు(07850)ను కాచిగూడ-మల్కాజిగిరి మధ్య అక్టోబరు 1 నుంచి 31 వరకు పాక్షికంగా రద్దు చేసినట్లు తెలిపింది.

కాచిగూడ, సికింద్రాబాద్ నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లు

ఈనాడు, హైదరాబాద్: దసరా, దీపావళి పండగల రద్దీ నేపథ్యలో కాచిగూడ, సికింద్రాబాద్ స్టేషన్ల నుంచి తిరుపతికి అక్టోబరు 1వ తేదీ నుంచి నవంబరు 16 వరకు ప్రత్యేక రైళ్లు నడిపించనున్నట్లు ద.మ.రైల్వే తెలిపింది. కాచిగూడ-సికింద్రాబాద్(07063) ఏడు సర్వీసులు, తిరుపతి-కాచిగూడ(07064) ఏడు సర్వీసులు, సికింద్రాబాద్-తిరుపతి(07041) 14 సర్వీసులు, తిరుపతి-సికింద్రాబాద్(07042) 14 సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని జోన్ సీపీఆర్వో ఎ.శ్రీధర్ పేర్కొన్నారు. సికింద్రాబాద్-తిరుపతి రైళ్లు జనగామ, వరంగల్ మార్గంలో.. కాచిగూడ-తిరుపతి రైళ్లు ఉందానగర్, షాద్‌నగర్, మహబూబ్‌నగర్, గద్వాల మార్గంలో రాకపోకలు సాగిస్తాయి.

స్థానిక, ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టిసారించాలి

పార్టీ నేతలతో భాజపా ముఖ్యనాయకులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు వ్యూహాత్మక కార్యాచరణను సిద్ధం చేయాలని భాజపా ముఖ్యనేతలు పార్టీ నేతలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలు, సభ్యత్వ నమోదుపై గురువారం వేర్వేరుగా పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి చంద్రశేఖర్ తివారీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, భాజపా శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, పార్టీ నేతలు రాంచందర్‌రావు, ప్రేమేందర్‌రెడ్డి సహా పలువురు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని పార్టీ నాయకులకు సూచించారు.

రేపు హైదరాబాద్‌కు నడ్డా

ఈనాడు, హైదరాబాద్: భాజపా జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా శనివారం హైదరాబాద్‌కు రానున్నారు. మధ్యాహ్నం మహాకాళి అమ్మవారిని ఆయన దర్శించుకుంటారు. అనంతరం భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు, రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాలపై చర్చిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. చివరగా బేగంబజార్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని, రాత్రి నడ్డా దిల్లీకి తిరిగి వెళ్లనున్నారు.



పెద్ద కలలు కంటేనే పురోగతి

జీవితంలో ఎదగాలంటే సాధారణ కలలు కంటూ మామూలు లక్ష్యాలను విధించుకుంటే సరిపోదు. పెద్ద కలలు కనాలి, ఉన్నత లక్ష్యాలపై గురిపెట్టాలి. పెద్ద కలల గురించి చెబితే ఇతరులు నవ్వుకుంటారని సందేహించకండి. కలలు కన్న వారందరూ విజయం సాధించలేకపోవచ్చు కానీ విజేతలంతా కలలు కన్న వారే అని గుర్తుంచుకోండి. 10 వేల అడుగులు వేయాలని నడక మొదలుపెడితే కనీసం 5 వేల అడుగులైనా పూర్తి చేయగలరు. అదే 3 వేల అడుగులనే లక్ష్యంగా పెట్టుకుంటే 5 వేల అడుగులు వేయలేరు కదా?

– ముత్తుకృష్ణన్, ఫైనాన్షియల్ ప్లానర్

తిరుపతి లడ్డూ కల్తీపై 30న ఆందోళనలు: వీహెచ్‌పీ

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ కల్తీ వివాదంపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) డిమాండ్ చేసింది. లడ్డూను అపవిత్రం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు పేర్కొంది. గురువారం కోఠిలోని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, ప్రచార ప్రముఖ్ బాలస్వామి గోడ ప్రతులను ఆవిష్కరించి మాట్లాడారు. లడ్డూ కల్తీతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదాయశాఖను రద్దు చేయడంతో పాటు ఆలయాల్లో తిష్ఠ వేసిన అన్యమతస్థులను తొలగించాలని పేర్కొన్నారు. రాజకీయ నాయకులకు కేంద్రాలుగా మారిన ఆలయ కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఎంపికతో బయట చదివితే స్థానికతను ఎలా నిరాకరిస్తారు?: హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర కోటా కింద ప్రభుత్వ ఎంపికతో డెహ్రాడూన్ సైనిక్ స్కూలులో 8 నుంచి 10వ తరగతి వరకు చదువుకుని, అనంతరం తెలంగాణలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థిని స్థానికేతరుడిగా చూపుతూ కాళోజీ వర్సిటీ అడ్మిషన్ నిరాకరించడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్ర కోటా కింద సైనిక్ స్కూలులో చదివిన తనను స్థానిక కోటా కింద పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ చేవూరి అవినాశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. నిబంధనల ప్రకారం వరుసగా నాలుగేళ్లు చదవకపోతే స్థానికుడిగా పరిగణించలేమని యూనివర్సిటీ తరఫు న్యాయవాది చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని.. దాన్ని శుక్రవారం తెలపాలంటూ హైకోర్టు ఆదేశించింది.

నేటి నుంచి ఎంబీబీఎస్ వెబ్‌ఆప్షన్లు

- కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నోటిఫికేషన్



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్ల అడ్మిషన్ల కోసం గురువారం నుంచి వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పిస్తూ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీచేసింది. కన్వీనర్ కోటా సీట్ల కోసం శుక్రవారం ఉదయం 6 నుంచి ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటలలోపు వెబ్‌ఆప్షన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలంది. కన్వీనర్ కోటా (కాంపిటెంట్ అథారిటీ కోటా)లో దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడినవారు (ఈడబ్ల్యూఎస్), పోలీసు అమరవీరుల పిల్లలు(పీఎంసీ), సైనికోద్యోగుల పిల్లలు(క్యాప్) కేటగిరీకి చెందిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవాలంది. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రైవేటు, అన్‌ఎయిడెడ్, మైనార్టీ/నాన్ మైనార్టీ వైద్య కళాశాలల్లోని కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేస్తున్నట్లు వివరించింది.

ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల మెరిట్ జాబితా కాళోజీ వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంది. సీటు కేటాయించిన విద్యార్థులు రూ.12 వేలు చెల్లించి ఎలాట్‌మెంట్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కన్వీనర్ కోటా సీట్లకు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫీజు రూ.10 వేలు కాగా ప్రైవేటు వైద్యకళాశాలల్లో రూ.60 వేలు, ఈఎస్ఐ కాలేజీలో ఫీజు రూ.లక్షగా ఉంది. మొదటి రౌండ్‌లో కన్వీనర్ కోటా సీట్లకు వెబ్‌ఆప్షన్లు ఇవ్వని విద్యార్థులకు తర్వాతి రౌండ్లలో వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉండదు. మొదటి రౌండ్‌లో ఎంబీబీఎస్ సీటు వచ్చిన విద్యార్థులు కళాశాలలో చేరకుంటే తర్వాత రౌండ్లలో కౌన్సెలింగ్‌కు అర్హత ఉండదు. అర్హతకు సంబంధించి హైకోర్టులోని పెండింగ్ కేసుల తుది తీర్పునకు లోబడి కేటాయింపులు, అడ్మిషన్లు ఉంటాయి. వెబ్‌ఆప్షన్లను https://tsmedadm.tsche.in/ వెబ్‌సైట్ ద్వారా ఇవ్వాలి. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే 9392685856/7842136688/9059672216 నంబర్లకు ఫోన్ చేసి లేదా tsmedadm2024@gmail.com మెయిల్‌కు సందేహాలను పంపి నివృత్తి చేసుకోవాలి.

అందుబాటులో ఉన్న సీట్లు...

రాష్ట్రంలో వైద్య కళాశాలల వారీగా అందుబాటులో ఉన్న కన్వీనర్ కోటా సీట్లు కేటగిరీల వారీగా సూచిస్తూ కాళోజీ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో సీట్ మ్యాట్రిక్స్ అందుబాటులో ఉంచింది. ఏ కళాశాలలో ఏ కేటగిరీకి ఎన్ని ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయనేది పొందుపరిచింది. ఏడు వైద్య కళాశాలల్లోని ఈడబ్ల్యూఎస్ సీట్ల కోటా వివరాలను ప్రత్యేకంగా పేర్కొంది. రాష్ట్రంలో 34 ప్రభుత్వ వైద్య కళాశాలలు, 22 ప్రైవేటు వైద్య కళాశాలలు, మరో 4 ముస్లిం మైనార్టీ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేయనుంది. కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న 16,694 మంది విద్యార్థుల తుది మెరిట్ జాబితాను విడుదల చేసింది. వీరితోపాటు కోర్టు ద్వారా అనుమతి తెచ్చుకున్న విద్యార్థుల మెరిట్ జాబితాను వర్సిటీ పొందుపరిచింది.

పూర్తి వివరాలు www.eenadu.net లో

నవంబరు నుంచి భూముల ధరల సవరణ

- వచ్చే నెలలో కొత్త రెవెన్యూ చట్టం..



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో నవంబరు నుంచి భూముల కొత్త మార్కెట్ విలువ అమల్లోకి రానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూముల బహిరంగ ధరలను అధ్యయనం చేసిన స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ మార్కెట్ విలువను సవరించే ప్రక్రియను దాదాపు పూర్తిచేసింది. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి త్వరలోనే నివేదిక అందించనుంది. అనంతరం కొత్త మార్కెట్ విలువను ప్రభుత్వం అమల్లోకి తీసుకురానుంది. ప్రస్తుతానికి రాష్ట్రంలో అమలవుతున్న ధరలు దాదాపు కొనసాగే అవకాశాలున్నట్లు తెలిసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 'మార్కెట్ విలువ' కంటే బహిరంగ ధరలు అధికంగా ఉన్నచోట్ల కొంతమేర పెంపుదల ఉండే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. ఖమ్మం, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో బహిరంగ ధరల కన్నా 'మార్కెట్ విలువ' ఎక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిసింది. దీని ప్రకారం ఈ జిల్లాల్లో కొంతమేరకు ధరలు తగ్గించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న 7.5 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీలను సైతం కొంత తగ్గించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

కొత్త ఆర్వోఆర్ చట్టంపై..

కొత్త రెవెన్యూ చట్టం (ఆర్ఓఆర్)-2024ను అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. గురువారం దీనికి సంబంధించి ధరణి కమిటీ సభ్యులు సునీల్‌కుమార్, కోదండరెడ్డి తదితరులతో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ భేటీ అయ్యారు. ధరణి కమిటీ నివేదిక మేరకు కొత్త చట్టంలో అనేక అంశాలను జోడించిన ప్రభుత్వం.. ధరణి పోర్టల్‌లోనూ మార్పుచేర్పులకు చర్యలు చేపట్టింది. గత నెలలో ఆర్ఓఆర్ చట్టంపై సలహాలు సూచనలు తీసుకున్న రెవెన్యూ శాఖ వాటిని క్రోడీకరించి కొత్త చట్టంలో చేర్చేందుకు ఏర్పాట్లు చేసింది. అక్టోబరులో ఈ ప్రక్రియను పూర్తి చేసి కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకురావాలని రెవెన్యూ శాఖ తుది నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

తమిళనాడులో భారాస ప్రతినిధుల బృందం పర్యటన

చెన్నై, న్యూస్‌టుడే: బీసీల సంక్షేమం, అభ్యున్నతికి తమిళనాడు రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు తెలంగాణ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, భారాస నేతలతో కూడిన 40 మంది ప్రతినిధుల బృందం గురువారం చెన్నై చేరుకుంది. సచివాలయంలో తమిళనాడు రాష్ట్ర బీసీ, ఎంబీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి విజయ్ రాజాకుమార్, కమిషనర్ వెంకటేశ్ తదితర ఉన్నతాధికారులతో సమావేశమైన బృందం సభ్యులు.. బీసీ సంక్షేమ శాఖ తీరు, ఆ శాఖ అమలుచేస్తున్న పథకాలు, వాటి ద్వారా లబ్ధిదారులకు కలుగుతున్న ప్రయోజనాలు తదితర విషయాలపై చర్చించారు. బృందంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, మండలిలో భారాస పక్ష నాయకులు సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జోగు రామన్న, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, కోరుకంటి చందర్, పుట్టా మధూకర్, నాయకులు ప్రకాశ్, జూలూరు గౌరీశంకర్ తదితరులు ఉన్నారు.

హూవర్ డ్యామ్ స్ఫూర్తితో జలవిద్యుదుత్పత్తి

- ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క
- అమెరికాలో జలవిద్యుత్ ప్రాజెక్టు సందర్శన



హూవర్ డ్యామ్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్‌రాస్, సింగరేణి సీఎండీ బలరాం తదితరులు

ఈనాడు, హైదరాబాద్: హూవర్ డ్యామ్ స్ఫూర్తితో తెలంగాణలో జలవిద్యుత్ అభివృద్ధికి చర్యలు చేపడతామని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. అమెరికాలోని నెవాడ, ఆరిజోనా రాష్ట్రాల సరిహద్దులో కొలరాడో నదిపై ఎనిమిది దశాబ్దాల క్రితం నిర్మించిన అతి పెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు హూవర్ డ్యామ్‌లో నీటి వినియోగం, రక్షణ చర్యలు ఆచరించదగినవని తెలిపారు. అమెరికాలో పర్యటనలో ఉన్న భట్టి గురువారం రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్‌రాస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్ తదితర అధికారులతో కలిసి డ్యామ్‌ను సందర్శించారు. ప్రాజెక్టు ప్రత్యేకతలను వారికి అక్కడి అధికారులు వివరించారు. తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల్లో 1931-36 మధ్య నిర్మించిన ఈ డ్యామ్ ఒక ఇంజినీరింగ్ అద్భుతమని, ఇక్కడ ఉన్న 17 జనరేటర్ల ద్వారా 2080 మెగావాట్ల జల విద్యుదుత్పత్తి అవుతుందని, మూడు రాష్ట్రాల్లోని 80 లక్షల మంది ప్రజల మంచినీటి అవసరాలు తీర్చడంతోపాటు సాగునీరు అందిస్తుందని తెలిపారు. 726 అడుగుల ఎత్తు, 1244 అడుగుల పొడవు ఉన్న ఈ డ్యామ్ వెనుక ఒక పెద్ద కృత్రిమ సరస్సు ఏర్పడిందని, పూర్తిస్థాయి నీటి నిల్వ ఉన్నప్పుడు 185 కిలోమీటర్ల పొడవున విస్తరిస్తుందని చెప్పారు. ఏటా సుమారు 80 లక్షల మంది పర్యాటకులు దీన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్కడ జల విద్యుత్తు ఉత్పాదకత, యంత్రాల సామర్థ్యం, నీటి లభ్యత, రక్షణ చర్యలు, ఇతర సమాచారాన్ని భట్టి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలోని జల విద్యుత్తు ప్రాజెక్టుల సమాచారంతో బేరీజు వేస్తూ హూవర్ డ్యామ్ జలవిద్యుత్తు ఉత్పాదకతను స్ఫూర్తిగా తీసుకొని మన ప్రాజెక్టుల సామర్థ్యం పెంపుదలకు, రక్షణ మెరుగుదలకు అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర అధికారులకు సూచించారు.

అంతర్జాతీయ ప్రదర్శన సందర్శన

అనంతరం భట్టి, రాష్ట్ర అధికారులు లాస్‌వెగాస్‌లో మైనెక్స్-2024 అంతర్జాతీయ ప్రదర్శనలో పాల్గొన్నారు. వివిధ సంస్థల స్టాళ్లను సందర్శించారు. శాండ్విక్ కంపెనీ స్టాల్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక కంటిన్యూయస్ మైనర్ యంత్రాన్ని పరిశీలించారు. అందులోని వర్చువల్ రియాలిటీ మైనింగ్ టెక్నాలజీని పరిశీలించారు. ఈ వర్చువల్ రియాలిటీతో గని లోపలికి యంత్రాన్ని పంపించి.. అక్కడి పరిస్థితులను వెలుపలి నుంచే అంచనా వేస్తూ బొగ్గు తవ్వొచ్చని నిర్వాహకులు వివరించారు. సింగరేణి కార్మికుల రక్షణను దృష్టిలో పెట్టుకొని ఈ తరహా సాంకేతికతను గనుల్లో ఏర్పాటు చేయడానికి అవకాశాలను పరిశీలించాలని అధికారులను భట్టి ఆదేశించారు.

ఓపీఎస్ అమలు కోరుతూ 'పెన్షన్ ఆక్రోశ్ మార్చ్'

- ఎన్ఎం ఓపీఎస్ ఆధ్వర్యంలో నిరసనలు



హైదరాబాద్ బీమా భవన్‌లో నిరసన తెలుపుతున్న స్థితప్రజ్ఞ, ఉద్యోగులు


ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఏకీకృత పెన్షన్ విధానాన్ని(యూపీఎస్) వ్యతిరేకిస్తూ నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్(ఎన్ఎం ఓపీఎస్) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 'పెన్షన్ ఆక్రోశ్ మార్చ్' పేరిట గురువారం ప్రభుత్వ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి.. విరామ సమయంలో నిరసన తెలిపారు. పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బొగ్గులకుంటలోని బీమా భవన్‌లో ఎన్ఎం ఓపీఎస్ సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. ఉద్యోగుల కుటుంబాలకు పెన్షన్‌తో సామాజిక భద్రత ఇవ్వాల్సిన ప్రభుత్వమే.. పెన్షన్ కొనుక్కునేలా చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. యూపీఎస్ విధానానికి మూలమైన సోమనాథన్ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాల్లో తెలంగాణ సీపీఎస్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేశ్‌గౌడ్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

28న జిల్లా కేంద్రాల్లో యూఎస్‌పీసీ నిరసన..

ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25ను సవరించాలని, సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) పిలుపునిచ్చింది.

మామునూరు పశువైద్య కళాశాలలో వీసీఐ తనిఖీలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని పశువైద్య విశ్వవిద్యాలయం, కళాశాలలను జాతీయ పశువైద్య మండలి (వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా-వీసీఐ) గురువారం తనిఖీ చేసింది. ముగ్గురు సభ్యుల బృందం వరంగల్ జిల్లాలోని మామునూరు పశువైద్య కళాశాలను సందర్శించింది. అక్కడి అధ్యాపకులు, సిబ్బంది వివరాలు, ఖాళీలు, మౌలిక సదుపాయాలు, గ్రంథాలయం, వసతిగృహంలో తనిఖీలు నిర్వహించింది. మామునూరు పశువైద్య కళాశాలకు వీసీఐ గుర్తింపు లేదు. ఈ నేపథ్యంలో అనుమతుల పునరుద్ధరణకు రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం మళ్లీ దరఖాస్తు చేసుకోగా వీసీఐ బృందం తనిఖీలకు వచ్చింది. మరోవైపు మామునూరు పశువైద్యశాలలో ఖాళీలున్నాయి. వీసీఐ తనిఖీలను దృష్టిలో పెట్టుకొని వర్సిటీ అధికారులు హైదరాబాద్ నుంచి 12 మంది ప్రొఫెసర్లు, సహాయ ప్రొఫెసర్లను మామునూరుకు పంపారు. వారు వీసీఐ ప్రతినిధుల కంటే ముందే అక్కడికి చేరుకొని విధులు నిర్వర్తించారు.





EENADU Vol: 51, Iss: 48 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. A-1/1, Block No. 3, Industrial Development Area, Uppal, Hyderabad, Medchal District - 500 039, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy District - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223. RNI No. 27656/75. Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఐటీ కోటలో ట్రాఫిక్కే సమస్య

- వరదలు, రోడ్లూ ఇబ్బందికరమే
- పరిష్కరించాలని కోరుతున్న గురుగ్రామ్ ఓటరు
- హరియాణా అసెంబ్లీ పోరు



హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలు అనేక హామీలిస్తున్నాయి. ఉచితాల నుంచి ఉద్యోగాల దాకా హామీలిచ్చి ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. అయితే భారతీయ సింగపూర్‌గా ఖ్యాతి గడించిన గురుగ్రామ్ ఇవేమీ కోరుకోవడం లేదు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తే చాలని కోరుకుంటోంది. మిలీనియం సిటీగా పేరొందిన గురుగ్రామ్ దిల్లీకి సమీపంలో ఉంటుంది. ఇండియాలోనే అతి పెద్ద సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ హబ్‌గా ఇది వర్ధిల్లుతోంది. దేశంలోని నలు మూలల నుంచి వచ్చి ఇక్కడ ఉద్యోగాలు చేసుకుంటున్న వారెందరో ఉన్నారు. అయితే సౌకర్యాల విషయంలో రోజురోజుకూ పరిస్థితి దిగజారుతోంది.

- ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడం, దెబ్బతిన్న రోడ్లు, విపరీతమైన ట్రాఫిక్ జామ్‌లను గురుగ్రామ్‌లోని సగటు ఓటరు ప్రతిరోజూ ఎదుర్కొనే సమస్యలు. వాటిని పరిష్కరించాలని ఓటర్లు డిమాండు చేస్తున్నారు.
- నో రోడ్ నో ఓట్ (రోడ్డేయకపోతే ఓటేయం), స్టక్ ఇన్ ట్రాఫిక్.. కాంట్ ఓట్ (ట్రాఫిక్‌లో చిక్కుకుపోతే ఓటేయడం కష్టం), గురుగ్రామ్ క్రాల్స్ (గురుగ్రామ్ ఎందుకు నెమ్మదిగా సాగుతోంది) అనే పోస్టర్లు నగరంలో దర్శనమిస్తున్నాయి.
- విమానాశ్రయం నుంచి మెట్రో రైళ్లు లేకపోవడంతో గురుగ్రామ్ నుంచి కారులో విమానాశ్రయానికి రావడానికి నరకం చూడాల్సి వస్తోంది.
- గురుగ్రామ్‌లో ట్రాఫిక్ పరిస్థితి దారుణంగా ఉంటుంది. దీనికి పరిష్కారం ఇంటి నుంచి బయటకు రాకపోవడమే మేలన్నట్లుగా ఉంటుంది. కొన్ని కిలోమీటర్లు ప్రయాణించడానికి గంట సమయం పడుతుంది. దిల్లీ రోడ్డు మార్గంలో వెళ్లడం కంటే విమానంలో దుబాయ్, సింగపూర్‌కు వెళ్లడం తేలిక అంటుంటారు.
- దిల్లీ విమానాశ్రయానికి దగ్గరగా ఉండటంతో గురుగ్రామ్‌లో పలువురు వీవీఐపీలు నివసిస్తున్నారు. దీంతోపాటు ఖరీదైన అపార్ట్‌మెంట్లకు ఇది కేంద్ర స్థానం.
- వర్షం వచ్చిందంటే చాలు.. పడవల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

15 లక్షల మంది ఓటర్లు

గురుగ్రామ్‌లో 15 లక్షల మంది ఓటర్లున్నారు. గుర్గావ్, పటౌడీ, బాద్షాపూర్, సోహ్నా నియోజకవర్గాలున్నాయి. బాద్షాపూర్ అతి పెద్ద నియోజకవర్గం.

- గురుగ్రామ్ దుస్థితిపై రాజకీయ పార్టీల నేతలు ఒకరినొకరు విమర్శించుకుంటారు. గత ప్రభుత్వంలో కొనసాగిన జననాయక్ జనతా పార్టీ మున్సిపల్ శాఖను నిర్వహించింది.

(ఈనాడు ప్రత్యేక విభాగం)

అధికారంపై దురాశ లేదు : కేజ్రీవాల్

దిల్లీ: అధికారంపై తనకు దురాశ లేదని, దేశానికి సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పునరుద్ఘాటించారు. గురువారం దిల్లీ అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. తన అరెస్టు కారణంగా దిల్లీలో నిలిచిపోయిన అభివృద్ధి పనులన్నీ త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వృద్ధాప్య పింఛన్లు, వృద్ధులకు తీర్థయాత్ర, ఆసుపత్రుల్లో ఉచిత మందుల పంపిణీ వంటి పథకాలను భాజపా అడ్డుకొందని ఆరోపించారు.

సీఎం ఆతిశీతో కలిసి రోడ్ల పరిశీలన..

దిల్లీ ప్రభుత్వాన్ని పనిచేయకుండా చేసి, తమను అప్రదిష్ఠపాలు చేసేందుకే భాజపా తనను జైలుకు పంపించిందని కేజ్రీవాల్ ఆరోపించారు. గురువారం సీఎం ఆతిశీతో కలిసి దిల్లీ యూనివర్సిటీ ప్రాంతంలో పాడైన రోడ్లను ఆయన పరిశీలించారు. అనంతరం కేజ్రీవాల్ మాట్లాడుతూ..'' కొన్నిరోజుల కిందట ఒక పెద్ద భాజపా నేతను కలిశా. నా అరెస్టుతో ఏం సాధించారని అడిగా. దిల్లీలో ప్రభుత్వ పాలన గాడి తప్పింది.. నగరంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయిగా అని ఆయన ఇచ్చిన బదులు విని ఆశ్చర్యపోయా'' అని తెలిపారు.



దిల్లీ అసెంబ్లీలో గురువారం మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్

దిల్లీ స్థాయీసంఘం ఎన్నికలో ఎల్జీ జోక్యం.. హై డ్రామా

దిల్లీ: ఎంసీడీ (మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ దిల్లీ) స్థాయీసంఘంలో ఖాళీగా ఉన్న ఆరోస్థానం కోసం గురువారం నిర్వహించతలపెట్టిన ఎన్నికలో చివరిక్షణాన లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) వి.కె.సక్సేనా జోక్యంతో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అంతకుముందు జరిగిన ఎంసీడీ సమావేశంలో కౌన్సిలర్లను తనిఖీ చేశారన్న కారణంగా తలెత్తిన గందరగోళం మధ్య స్థాయీసంఘం ఎన్నికను మేయర్ షెల్లీ ఓబెరాయ్ అక్టోబరు 5వ తేదీకి వాయిదా వేశారు. భద్రత కారణాలతో కౌన్సిలర్లను ఇలా తనిఖీ చేయడం ఇదే మొదటిసారని, ఇది సభ్యులను అవమానించడమే అని మేయర్ అన్నారు. ఈ నేపథ్యంలో స్థాయీసంఘం ఎన్నిక వాయిదాపడగా.. ఎల్జీ జోక్యంతో పరిస్థితి మొత్తం మారిపోయింది. 'ఇదే రోజు ఎన్నిక నిర్వహించి రాత్రి పది గంటలలోపు నాకు నివేదిక ఇవ్వండి' అని ఎంసీడీ కమిషనర్ అశ్వనీకుమార్‌ను ఎల్జీ ఆదేశించారు. ఎన్నిక నిర్వహణకు మేయర్ అంగీకరించకపోతే డిప్యూటీ మేయర్ ద్వారా నిర్వహించాలని, అదీ కుదరకపోతే సీనియర్ సభ్యుడి అధ్యక్షతన జరపాలని ఎల్జీ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇంతకుమునుపు స్థాయీసంఘం సభ్యుడిగా ఉన్న భాజపా కౌన్సిలరు కమల్‌జీత్ షెరావత్ లోక్‌సభకు ఎన్నికై ఆ స్థానం ఖాళీ కావడంతో తాజా ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికలో ఓటింగుకు దూరంగా ఉండాలని తాము నిర్ణయించుకొన్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. చండీగఢ్ మేయర్ ఎన్నికలో చేసిన తప్పిదమే భాజపా మళ్లీ చేస్తోందని, రాత్రిపూట ఎన్నికను కోర్టులో సవాలు చేస్తామని ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోదియా తెలిపారు. ఎల్జీ ఆదేశంతో రాత్రికి రాత్రి ఎన్నిక నిర్వహణకు కమిషనర్ ప్రకటన జారీ చేసినా.. పలు కారణాలతో అది కార్యరూపం దాల్చక మళ్లీ వాయిదా పడినట్లు సమాచారం అందింది.



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో లద్ధాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్, విశ్రాంత బ్రిగేడియర్ బి.డి.మిశ్ర, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ తదితరులు

సియాచిన్ బేస్ క్యాంప్‌లో రాష్ట్రపతి

దిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం లద్దాఖ్‌లోని సియాచిన్ బేస్ క్యాంప్‌ను సందర్శించారు. అక్కడి బలగాలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో ఉన్న ఈ యుద్ధ క్షేత్రంలో పని చేస్తున్న సైనికులను అభినందించారు. 'భారీ మంచుపాతం, మైనస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రతల వంటి ప్రతికూల పరిస్థితుల్లో మాతృభూమి రక్షణ కోసం మీరు చాటుతున్న త్యాగం, సాహసం అసాధారణం. సైనిక బలగాల సుప్రీం కమాండర్‌గా.. మీ సేవలను చూసి గర్వపడుతున్నా' అని రాష్ట్రపతి పేర్కొన్నారు. సైనిక దుస్తులు ధరించిన ముర్ము.. ఈ సందర్భంగా సియాచిన్ యుద్ధ స్మారక చిహ్నంవద్ద నివాళి అర్పించారు. 1984 ఏప్రిల్ 13న సియాచిన్ హిమనీ నదంలో (గ్లేసియర్) భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ మేఘ్‌దూత్‌లో అమరులైన సైనికులు, అధికారుల త్యాగానికి ఈ మెమోరియల్ ప్రతీకని కొనియాడారు. ఈ పర్యటనతో సియాచిన్ బేస్ క్యాంప్‌ను సందర్శించిన మూడో రాష్ట్రపతిగా ముర్ము గుర్తింపు పొందారు. అంతకుముందు ఏపీజే అబ్దుల్ కలామ్, రామ్‌నాథ్ కోవింద్ కారాకోరం పర్వత శ్రేణిలో 20వేల అడుగుల ఎత్తులో ఉన్న ఈ బేస్ క్యాంప్‌ను సందర్శించారు.

'వెల్‌కమ్ టు వాషింగ్టన్'

- మళ్లీ తడబడిన బైడెన్



న్యూయార్క్: ప్రపంచ నాయకులను ఉద్దేశించి ప్రసంగించిన సమయంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తడబడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఇటీవల న్యూయార్క్‌లో ఐక్యరాజ్య సమితి 79వ వార్షిక సర్వప్రతినిధి సభ సమావేశం జరిగింది. ఈ క్రమంలో బార్క్లే హోటల్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి పలు దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జో బైడెన్ మాట్లాడుతూ.. 'వాషింగ్టన్‌కు స్వాగతం' అంటూ ఒక్క క్షణం ఆగిపోయారు. వెల్‌కమ్ టు న్యూయార్క్ అనబోయి వెల్‌కమ్ టు వాషింగ్టన్ అని పేర్కొన్నారు.

కమలా హారిస్ కార్యాలయ ఉద్యోగిపై లైంగిక వేధింపులు

ఇంటర్నెట్ డెస్క్: అమెరికాలో ఏకంగా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగికే భద్రత లేకుండాపోయింది. సీక్రెట్ సర్వీస్ సిబ్బందే ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. తాజాగా దీనిపై దర్యాప్తు మొదలు పెట్టినట్లు ఉపాధ్యక్షురాలి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. మరోవైపు సీక్రెట్ సర్వీస్ దీనిని తీవ్రంగా పరిగణించింది. సదరు ఏజెంట్‌ను దర్యాప్తు పూర్తయ్యేవరకూ సెలవుపై పంపింది. ఈ వారం విస్కాన్సిన్‌లో సీక్రెట్ సర్వీసు సిబ్బంది ఒకరు ఉపాధ్యక్షురాలి ఉద్యోగితో హోటల్లో అనుచితంగా ప్రవర్తించాడు. హారిస్ ప్రచార ప్రణాళికను సిద్ధం చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

న్యూయార్క్ మేయర్ ఫోన్ స్వాధీనం

న్యూయార్క్: అమెరికాలోని అతి పెద్ద నగరం న్యూయార్క్‌కు మేయర్‌గా ఉన్న ఎరిక్ ఆడమ్స్ ఫోన్‌ను గురువారం ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మేయర్ అధికారిక నివాసంలోకి ప్రవేశించిన అధికారులు ఆయనపై విచారణ జరుగుతున్న క్రిమినల్ కేసులో ఈ చర్య తీసుకున్నారు. చట్టాలను ఉల్లంఘించారనే అభియోగాలను మేయర్‌పై మోపారు. అయితే అవేంటనేది తెలియరాలేదు. తనపై తప్పుడు కేసులు పెట్టారని, వాటిపై పోరాడతానని ఆడమ్స్ స్పష్టం చేశారు.

దక్షిణాసియా లీడర్స్ ఫోరం ప్రారంభం

వాషింగ్టన్: దక్షిణాసియా లీడర్స్ ఫోరంను అమెరికా ప్రారంభించింది. దీని ద్వారా యువ నాయకత్వ అనుసంధానంతోపాటు శిక్షణ అవకాశాలను కల్పించాలని నిర్ణయించినట్లు బుధవారం అమెరికా విదేశాంగశాఖ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. ఈ ఫోరంలో భారత్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక ఉన్నాయి.

వలసవాదులను వెనక్కి పంపుతా: ట్రంప్



వాషింగ్టన్: బైడెన్ విధానాల కారణంగా దేశంలోకి ప్రవేశించిన వేల మంది వలసవాదులను వెనక్కి పంపుతానని అమెరికా అధ్యక్ష ఎన్నికల రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇప్పటికే వలసవాదులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఆయన తాజాగా ఈ హెచ్చరికలు జారీ చేశారు. బైడెన్ తెచ్చిన రెండు విధానాల కారణంగా 10 లక్షల మంది అక్రమంగా దేశంలోకి ప్రవేశించారని, వారంతా వెనక్కి వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని ట్రంప్ పేర్కొన్నారు.

కాలిఫోర్నియాలో విద్వేషపూరిత రాతలు

- 10 రోజుల్లో రెండో ఘటన

కాలిఫోర్నియా: అమెరికాలోని హిందూ దేవాలయంపై ద్వేషపూరిత రాతలు మరోసారి వెలుగుచూసాయి. కాలిఫోర్నియాలోని శాక్రమెంటో బాప్స్ శ్రీ స్వామినారాయణ మందిర గోడలపై గుర్తుతెలియని వ్యక్తులు 'హిందువులు వెనక్కి వెళ్లండి' అంటూ గ్రాఫిటితో విద్వేషపూరిత రాతలు రాశారు. అలాగే ఆలయానికి వెళ్లే నీటి పైపుల్ని సైతం ధ్వంసం చేశారు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనపై తాజాగా ఆలయ అధికారులు స్పందించారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి 10 రోజుల ముందు న్యూయార్క్‌లోని బాప్స్ మందిరంపై ఇదే విధంగా విద్వేషపూరిత వ్యాఖ్యలు రాశారు. ఈ అంశంపై దర్యాప్తు చేపట్టినట్లు శాక్రమెంటో పోలీసులు తెలిపారు.

రష్యా విదేశాంగ మంత్రితో జైశంకర్ భేటీ

- ఉక్రెయిన్ వివాద పరిష్కారం సహా పలు అంశాలపై చర్చ

న్యూయార్క్: రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్‌తో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ న్యూయార్క్‌లో గురువారం భేటీ అయ్యారు. పలు ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలు సహా కీలక అంతర్జాతీయ వ్యవహారాలపై వారిద్దరూ చర్చించారు. ఉక్రెయిన్ వివాద పరిష్కార అంశం కూడా జైశంకర్, లవ్రోవ్ చర్చల్లో ప్రస్తావనకు వచ్చిందని రష్యా విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది.

ఉగ్ర సంస్థలపై చర్యలకు ఐబీఎస్‌ఏ పిలుపు

ఐక్యరాజ్య సమితి ఉగ్ర ముద్ర వేసిన వ్యక్తులు, సంస్థలపై అన్ని దేశాలూ చర్యలు తీసుకోవాలని భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా (ఐబీఎస్‌ఏ) పిలుపునిచ్చాయి. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కర్-ఎ-తయిబా (ఎల్‌ఈటీ), జైష్-ఎ-మహమ్మద్ (జేఈఎం) వంటి ఉగ్ర సంస్థలపై చర్యల ఆవశ్యకతను ప్రధానంగా ప్రస్తావించాయి. న్యూయార్క్‌లో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశాల సందర్భంగా ఐబీఎస్‌ఏ విదేశీ వ్యవహారాల మంత్రులు గురువారం భేటీ అయ్యారు.

పాలస్తీనాకు మద్దతుగా అవార్డు నిరాకరించిన ఝుంపా లాహిరి

న్యూయార్క్: అమెరికాలోని నోగుచి మ్యూజియం తనకు ప్రదానం చేయదలచిన అవార్డును భారత సంతతి రచయిత్రి ఝుంపా లాహిరి తిరస్కరించారు. గాజాలో పాలస్తీనావాసులకు మద్దతుగా తలపై కఫియే వస్త్రాలను ధరించిన ముగ్గురు ఉద్యోగులకు న్యూయార్క్‌లోని నోగుచి మ్యూజియం నిర్వాహకులు ఇటీవల ఉద్వాసన పలికారు. దీనికి నిరసనగా లాహిరి అవార్డును తిరస్కరించారు. ఈ మ్యూజియంను 40 ఏళ్ల క్రితం ఇసామూ నోగుచి అనే జపాన్ శిల్పి, డిజైనర్ స్థాపించారు. ఆయన పేరిట నెలకొల్పిన అవార్డును లాహిరికీ, కొరియా కళాకారుడు లీ ఉఫాన్‌కు వచ్చే నెలలో ప్రదానం చేయాల్సి ఉంది. లండన్‌లో భారతీయ సంతతి తల్లిదండ్రులకు జన్మించిన ఝుంపా లాహిరికి 2000లో పులిట్జర్ బహుమతి లభించింది. నోగుచి మ్యూజియం ఉద్యోగులు రాజకీయ నినాదాలు, ప్రతీకలను ప్రదర్శించే వస్త్రాలను, ఇతర ఉపకరణాలను ధరించకూడదని నిర్వాహకులు ఈ నెలారంభంలో ఆంక్షలు విధించారు.

రక్తహీనతపై విస్తృతంగా ప్రచారం చేశాం: కేంద్రం

దిల్లీ: దేశవ్యాప్తంగా ఈ ఏడాది చేపట్టిన 'పోషణ్ మాహ్'లో భాగంగా విస్తృతస్థాయిలో 1.88 కోట్ల ప్రచార కార్యక్రమాలను రక్తహీనత నివారణపై నిర్వహించినట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం వెల్లడించింది. ఈ మేరకు మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రచారంలో పిల్లల అభివృద్ధి పర్యవేక్షణ ప్రాముఖ్యతతోపాటు కుంగిపోవడం, పోషకాహార లోపం వంటి సమస్యలను ముందస్తుగా గుర్తించడం వంటి అంశాలను వివరించారు. పోషణ్ ట్రాకర్ అనే డిజిటల్ సాధనాన్ని ఉపయోగించడం ద్వారా పోషకాహార లోపాన్ని సకాలంలో గుర్తించి నివారించే వెసులుబాటు పెరిగినట్లు మంత్రిత్వశాఖ తెలిపింది. ఆరు నెలల నుంచి రెండేళ్లలోపు వయసుగల పిల్లలకు పరిపూర్ణమైన పోషణపై దృష్టిపెట్టడం 'పోషణ్ మాహ్'లో మరో ముఖ్యమైన అంశం. పసిపిల్లల ఎదుగుదలకు అత్యంత క్లిష్టమైన దశలో అందిచాల్సిన పోషకాహారంపైనా ప్రచారం చేశారు. పిల్లల అభివృద్ధికి సంపూర్ణ విధానాన్ని రూపొందించడానికి చదువును పోషణతో మిళితం చేస్తూ 'పోషణ్ భీ.. పఢాయీ భీ' పేరిట 1.59 కోట్ల ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. 'పోషణ్ మాహ్'లో తక్షణ పోషణ అవసరాలపై దృష్టి సారించడమే కాకుండా.. విద్య, సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ ద్వారా సుస్థిర శ్రేయస్సుకు పునాది వేసినట్లు మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ తెలిపింది.

అమెరికాకు 'హెలెనా' ముప్పు

వాషింగ్టన్: అమెరికాను హెలెనా హరికేన్ భయపడుతోంది. అతి తీవ్రమైన ఈ హరికేన్ గల్ఫ్ ఆఫ్ మెక్సికో తీరం నుంచి అమెరికాలోని ఫ్లోరిడా వైపు వేగంగా ప్రయాణిస్తున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. గురువారం సాయంత్రం నాటికి ఫ్లోరిడాలోని వాయవ్య తీరాన్ని తాకనున్నట్లు తెలిపింది. కేటగిరీ-2 లేదా అంతకంటే అధికంగా భావిస్తున్న ఈ హరికేన్ జార్జియాను తాకే అవకాశం ఉందని, ముఖ్యంగా అపలాచీ బే ప్రాంతంలో పరిస్థితి ప్రమాదకరంగా ఉంటుందని తెలిపింది. సముద్రపు అలలు 20 అడుగుల ఎత్తున ఎగసిపడవచ్చని, ఆగ్నేయ రాష్ట్రాల్లోని వందల మైళ్ల లోతట్టు ప్రాంతాల్లో భారీ ఈదురుగాలులు, వర్షాలు, ఆకస్మిక వరదలతో బీభత్సం సృష్టించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఫ్లోరిడా, జార్జియా, కాలిఫోర్నియా రాష్ట్రాలు అత్యవసర పరిస్థితిని విధించాయి. ఇప్పటికే ఈ హరికేన్ మెక్సికోలో విధ్వంసం సృష్టించింది.

ప్రయాణికురాలికి అస్వస్థత.. విమానాన్ని దించినా దక్కని ప్రాణం

కోల్‌కతా: అకస్మాత్తుగా అస్వస్థతకు గురైన 16 ఏళ్ల బాలిక ప్రాణాలను కాపాడేందుకు విమానయాన సంస్థ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇరాక్‌కు చెందిన డెరెన్ సమీర్ అహ్మద్ అనే బాలిక బుధవారం రాత్రి బాగ్దాద్-గ్వాంగ్‌ఝౌ విమానంలో ప్రయాణిస్తున్నప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. ఆమెను రక్షించడానికి విమానాన్ని అరగంటలో దారి మళ్లించి కోల్‌కతా అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా దించారు. అక్కడి వైద్యుల బృందం ఆమెను వెంటనే పరీక్షించి, అప్పటికే ప్రాణాలు కోల్పోయిందని తేల్చింది. సమీపంలోని ఆసుపత్రికి తరలించినా అక్కడి వైద్యులూ అదే విషయం ధ్రువీకరించారు. మిగిలిన ప్రయాణికులతో గురువారం తెల్లవారుజామున విమానాన్ని చైనాకు పంపించారు.

ఐటీ సవరణ నిబంధనలు రాజ్యాంగ వ్యతిరేకం

- వాటిని లాంఛనంగా కొట్టివేస్తూ బాంబే హైకోర్టు తీర్పు

ముంబయి: సామాజిక మాధ్యమ వేదికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చే నకిలీ, తప్పుడు సమాచారాన్ని గుర్తించి, అడ్డుకునేందుకు గాను సమాచార సాంకేతిక నిబంధనల(ఐటీ రూల్స్)కు కేంద్ర సర్కారు చేసిన సవరణలు రాజ్యాంగ విరుద్ధమని బాంబే హైకోర్టు గురువారం ప్రకటించింది. పౌరుల సమానత్వ హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛలకు విఘాతం కలిగిస్తాయంటూ ఆ నిబంధనలను కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ ఎ.ఎస్.గడ్కరీ, జస్టిస్ నీలా గోఖలే ధర్మాసనం తీర్పును లాంఛనంగా వెలువరించింది. ఐటీ సవరణ నిబంధనలను సవాల్ చేస్తూ కమెడియన్ కునాల్ కమ్రా, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను అనుమతించింది. ఈ నెల 20న ఏకసభ్య ధర్మాసనం జడ్జి జస్టిస్ ఎ.ఎస్.చంద్రశేఖర్ ఈ పిటిషన్లపై తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ ఐటీ సవరణ నిబంధనలు అస్పష్టంగా ఉన్నాయని, నకిలీ, తప్పుడు సమాచారం అనే పదాలకు సరైన నిర్వచనం ఇవ్వలేదన్నారు. ఈ వ్యాజ్యంలో ఆయన 'టై-బ్రేకర్' జడ్జీగా వ్యవహరించారు. అంతకు ముందు ద్విసభ్య ధర్మాసనం ఈ వ్యాజ్యంపై భిన్నమైన తీర్పును ఇవ్వడంతో మూడో న్యాయమూర్తి అభిప్రాయం కీలకంగా మారింది. మెజారిటీ జడ్జీల అభిప్రాయం ఆధారంగా గురువారం జస్టిస్ ఎ.ఎస్.గడ్కరీ, జస్టిస్ నీలా గోఖలే ధర్మాసనం లాంఛనంగా తీర్పు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ ఐటీ సవరణ నిబంధనలను వ్యతిరేకించింది. దీంతో నకిలీ, తప్పుడు సమాచారాన్ని గుర్తించి, నివారించేందుకు ఏర్పాటు చేయదలచిన ఫ్యాక్ట్ చెక్ యూనిట్ (ఎఫ్‌సీయూ)కు అడ్డుకట్టపడినట్లైంది.

బిల్కిస్ బానో అత్యాచార దోషుల విడుదల రద్దు తీర్పులో వ్యాఖ్యలపై గుజరాత్ అభ్యర్థన తోసివేత

దిల్లీ: బిల్కిస్ బానోపై అత్యాచార దోషులను జైలు నుంచి ముందుగా విడుదల చేయడాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులో రాష్ట్ర సర్కారుకు వ్యతిరేకంగా ఉన్న కొన్ని వ్యాఖ్యలపై గుజరాత్ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. వాటిని సమీక్షించాలని కోరుతూ దాఖలు చేసిన ప్రభుత్వ పిటిషన్‌ను జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం గురువారం తోసిపుచ్చింది. విచారణకు స్వీకరించబోమని స్పష్టం చేసింది.

కలియుగం వచ్చినట్లే అనిపిస్తోంది

- వృద్ధ దంపతుల వివాదంపై అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్య

ప్రయాగ్‌రాజ్: భరణానికి సంబంధించి ఓ వృద్ధజంట మధ్య తలెత్తిన వివాదంపై విచారణ సందర్భంగా అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌరభ్ శ్యామ్ షంషేరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కలియుగం వచ్చినట్లే కనిపిస్తోందంటూ వ్యాఖ్యానించారు. ఈ కేసులో 70 ఏళ్ల భార్యకు రూ.5 వేలు భరణం చెల్లించాలంటూ 80 ఏళ్ల భర్త మునీశ్ కుమార్ గుప్తాను ఫ్యామిలీ కోర్టు ఆదేశించింది. తన భర్తకు నెలకు రూ.35 వేలు పింఛను వస్తుందని ఫ్యామిలీ కోర్టులో భార్య గాయత్రీదేవీ పేర్కొన్నారు. దీంతో న్యాయస్థానం భరణం మంజూరు చేసింది. ఈ ఉత్తర్వులను భర్త హైకోర్టులో సవాల్ చేశారు. విచారణ సందర్భంగా.. "70,80 ఏళ్ల వయసున్న దంపతుల న్యాయ పోరాటం చూస్తూ ఉంటే కలియుగం వచ్చేసినట్లే అనిపిస్తోంది" అనిని జస్టిస్ శ్యామ్ షంషేరీ పేర్కొన్నారు. భర్త పిటిషన్‌పై భార్యకు నోటీసులు పంపుతూ.. ఇరు పక్షాలు ఓ అంగీకారానికి వస్తారని ఆశాభావాన్ని జడ్జి వ్యక్తంచేశారు.

హసీనా దించివేత వెనుక కుట్ర: యూనస్

వాషింగ్టన్: బంగ్లాదేశ్‌లో ప్రధాని పదవి నుంచి షేక్ హసీనాను దించేయడం ప్రణాళిక ప్రకారం జరిగిన కుట్రే అని ఆ దేశ తాత్కాలిక సారథి మహ్మద్ యూనస్ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన క్లింటన్ గ్లోబల్ ఇనీషియేటివ్ వార్షిక సమావేశంలో ప్రసంగించారు. విద్యార్థి నాయకులు బంగ్లాదేశ్‌కు కొత్త రూపు తీసుకొచ్చారని కొనియాడారు. హసీనాను పదవి నుంచి దింపే కుట్ర వెనుక ఎవరున్నారో బయటకు రాలేదుగానీ.. మహఫుజ్ అబ్దుల్లా పాత్ర ఉండొచ్చని పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఇదంతా యాదృచ్ఛికం కాదని, ఒక ప్రణాళిక ప్రకారం జరిగిందని అభిప్రాయపడ్డారు.



పశ్చిమబెంగాల్‌లోని పశ్చిమ మేదినీపుర్ జిల్లాలో గురువారం తమ వస్తువులను తీసుకుని పీకల్లోతు వరదనీటిలో వెళుతున్న మహిళలు

92వ పడిలోకి మన్మోహన్

- మాజీ ప్రధానికి శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేతలు

దిల్లీ: భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గురువారం 92వ పడిలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గురువారం ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసింది. దేశం కోసం జీవితం మొత్తాన్ని ఆయన అంకితం చేశారని కొనియాడింది. రాజకీయ రంగంలో ఆయనకున్న నిరాడంబరత, హుందాతనం, చతురత అరుదైన లక్షణాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆయన చేసిన నిస్వార్థ సేవ.. దేశంలోని లక్షల మందితోపాటు తనలోనూ స్ఫూర్తి నింపాయని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ వెల్లడించారు. భారత ప్రధాని మోదీ సైతం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు చెప్పారు. సింగ్ చిరకాలం ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నట్లు వెల్లడించారు.

50 ఔషధాల్లో నాణ్యత కరవు

- ఆగస్టు నివేదికలో వెల్లడించిన సీడీఎస్‌సీవో

దిల్లీ: కేంద్ర ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ 50కిపైగా ఔషధాలను 'నిర్దేశిత ప్రమాణాలు లేని' మందుల జాబితాలో పెట్టింది. వీటిలో జ్వరానికి, కడుపు ఉబ్బరానికి దేశవ్యాప్తంగా అత్యధికంగా ఉపయోగించే పారాసిటమాల్, పాన్-డితోపాటు డయాబెటిక్ మందులు, కాల్షియం, విటమిన్ డీ3 సప్లిమెంట్లు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. మన దేశంలో ఉత్పత్తి అవుతున్న ఔషధాలను సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీవో) ర్యాండమ్‌గా పరీక్షించి, వాటి నాణ్యతపై ప్రతినెలా నివేదిక విడుదల చేస్తుంది.

అత్యధికం.. రోజువారీగా వాడే మందులే

ఆగస్టు నెలకు సంబంధించి... షెల్‌కాల్, బీ-కాంప్లెక్స్, సీ, డీ3 విటమిన్లు, సిప్రోఫ్లోక్సాసిన్, బీపీని నియంత్రించే టెల్మిసార్టన్, అట్రోఫైన్ సల్ఫేట్, యాంటీబయాటిక్స్‌గా వాడే అమోక్సిసిలిన్, పొటాషియం క్లావులనేట్‌ల బ్యాచ్‌లలో నమూనాలను సీడీఎస్‌సీవో పరీక్షించగా... నాసిరకంగా ఉన్నట్లు తేలిందని తాజా నివేదిక వెల్లడించింది. వీటిని ఆల్కెమ్ లాబొరేటరీస్, హిందుస్థాన్ యాంటీబయోటిక్స్ లిమిటెడ్, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, కర్ణాటక యాంటీబయోటిక్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్, నెస్టార్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్, ప్రియా ఫార్మాస్యూటికల్స్, స్కాట్-ఆడిల్ ఫార్మాసియా లిమిటెడ్ వంటి కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయి. వీటన్నింటికీ హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, దిల్లీ, ఉత్తరాఖండ్, అస్సాం, బిహార్, తమిళనాడు, పంజాబ్, మేఘాలయ, మణిపుర్ తదితర రాష్ట్రాలు ఆగస్టుకు సంబంధించి నాణ్యత ప్రమాణాల హెచ్చరికల నివేదికలు విడుదల చేయలేదని అధికార వర్గాలు తెలిపాయి.

అంత్యక్రియలకు పోలీసు భద్రత కల్పించండి

- బద్లాపుర్ అత్యాచార నిందితుడి కుటుంబం వేడుకోలు

ఠాణే: పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన బద్లాపుర్ అత్యాచార కేసు నిందితుడు అక్షయ్ శిందే అంత్యక్రియలకు భద్రత కల్పించాలని అతడి కుటుంబ సభ్యులు గురువారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అక్షయ్ తల్లిదండ్రులతోపాటు న్యాయవాదికి కూడా పోలీసు రక్షణ కల్పించాలని కోరారు. ఈ విషయంపై ఇప్పటికే ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు మెయిల్ పంపించినట్లు వెల్లడించారు. పోలీసులు కొన్ని ప్రదేశాలను చూపించారని, మృతదేహాన్ని భద్రమైన ప్రదేశంలో ఖననం చేస్తామని అక్షయ్ బంధువుల్లో ఒకరు తెలిపారు. తనను పాతిపెట్టాలని, దహనం చేయకూడదని అక్షయ్ గతంలో కోరుకున్నట్లు పేర్కొన్నారు. కాగా, నిందితుడికి తమ ఊరిలో అంత్యక్రియలు నిర్వహిస్తామన్న ప్రతిపాదనను బద్లాపుర్‌లోని మంజరి గ్రామస్థులు వ్యతిరేకించారు. కాల్వా ప్రాంత ప్రజలు అదే వైఖరిని ప్రకటించారు. దీంతో నిందితుడి అంత్యక్రియలపై గందరగోళం నెలకొంది.

కోల్‌కతాలో బాలికపై హత్యాచారం కేసులో దోషికి మరణశిక్ష

కోల్‌కతా: ఏడేళ్ల బాలికపై అత్యాచారం జరిపి, దారుణంగా హతమార్చిన కేసులో కోల్‌కతా కోర్టు దోషికి మరణశిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పింది. గతేడాది మార్చి 26న కోల్‌కతాలోని తిల్‌జలా ప్రాంతం నుంచి ఓ బాలిక అదృశ్యమైంది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సమీపంలోని ఫ్లాటులో ఆమె మృతదేహాన్ని కనుగొన్నారు. ఆ ఫ్లాటులో అద్దెకు ఉంటున్న వ్యక్తిని అరెస్టు చేశారు. పోస్టుమార్టం నివేదికలో నేరం రుజువైంది. అత్యాచారం అనంతరం ఆ చిన్నారిని ఆయుధంతో గాయపరిచి, గొంతు నులిమి చంపినట్లు తేలింది. ఈ నేరాన్ని అత్యంత అరుదైన కేసుగా అలీపుర్ ప్రత్యేక కోర్టు (పోక్సో) జడ్జి సుదీప్తో భట్టాచార్య పేర్కొన్నారు. తనను తాను రక్షించుకోలేని వయసులో ఉన్న చిన్నారిపై ఘోరమైన నేరానికి పాల్పడినట్లు తీర్పులో వెల్లడించారు. ఏడాది వ్యవధిలో కేసును పరిష్కరించి దోషికి మరణశిక్ష విధించిన కోర్టు బాలిక తల్లికి బాధితుల పరిహార పథకం నుంచి రూ.10 లక్షలు చెల్లించాలని పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ముంబయిని ముంచెత్తిన భారీ వర్షాలు


ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయి నగరాన్ని భారీ వర్షాలు ముంచెత్తాయి. గురువారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షాల కారణంగా పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి జనజీవనం అస్తవ్యస్తమైంది. వర్షాల కారణంగా దాదాపు 14 విమానాలను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముంబయితో పాటు పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం వరకు ఉరుములతో కూడిన వర్షాలు పడే అవకాశముందని, ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని హెచ్చరించింది. వర్షాల కారణంగా పాఠశాలలు, కళాశాలలకు బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ గురువారం సెలవు ప్రకటించింది.

మోదీ పర్యటన రద్దు

భారీ వర్షాల కారణంగా ప్రధానమంత్రి మోదీ ముంబయి పర్యటన రద్దయ్యింది. షెడ్యూల్ ప్రకారం గురువారం సాయంత్రం ఆయన పుణె చేరుకొని రూ.22వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాల్సి ఉంది.

ఈనాడు బిజినెస్

అధునాతన ఆయుధ, నిఘా వ్యవస్థలు



ఈనాడు, హైదరాబాద్: యాంటీ-డ్రోన్ టెక్నాలజీ, ట్రైనింగ్ సేవలు అందించే జెన్ టెక్నాలజీస్, తన అనుబంధ సంస్థ అయిన ఏఐ ట్యూరింగ్ టెక్నాలజీస్ సహకారంతో తాజాగా 4 రకాల ఆయుధ, నిఘా వ్యవస్థలను ఆవిష్కరించింది. ఈ ఆధునిక ఆయుధ వ్యవస్థలు రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తాయని జెన్ టెక్నాలజీస్ తెలిపింది. ఈ ఆయుధ, నిఘా వ్యవస్థల్లో ఆర్‌సీడబ్ల్యూఎస్, ట్యాంక్ మౌంటెడ్ ఆర్‌సీడబ్ల్యూఎస్, నావల్ ఆర్‌సీడబ్ల్యూఎస్, ఆర్టిలరీ రగ్‌డ్ కెమేరా ఉన్నాయి. మనదేశంలో సాయుధ బలగాల శక్తి సామర్థ్యాలను మరింతగా మెరుగు పరచడానికి తమవంతు కృషి చేస్తున్నట్లు జెన్ టెక్నాలజీస్ ఎండీ అశోక్ అట్లూరి పేర్కొన్నారు. ఈ దిశగా విస్తృత పరిశోధనలతో నూతన ఆయుధ, నిఘా వ్యవస్థలను తీసుకు వస్తున్నట్లు తెలిపారు.

జాగెల్ ప్రీపెయిడ్‌కు 2 కంపెనీల్లో వాటాలు

ఈనాడు, హైదరాబాద్: ఫిన్‌టెక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్(ఎస్ఏఏఎస్) కార్యకలాపాలు సాగిస్తున్న జాగెల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్ అనే సంస్థ, రూ.48 కోట్లతో 2 కంపెనీల్లో వాటాలు కొనుగోలు చేసింది. స్పాన్ అక్రాస్ ఐటీ సొల్యూషన్స్‌లో 98.32% వాటాను రూ.32.07 కోట్లకు, మొబైల్‌వేర్ టెక్నాలజీస్‌లో 26% వాటాను రూ.15.60 కోట్లకు కొనుగోలు చేసింది. ఐటీ రిటర్న్‌లు తయారు చేయడంతో పాటు ఇ-ఫైలింగ్ కార్యకలాపాల్లో స్పాన్ అక్రాస్ ఐటీ సొల్యూషన్స్ నిమగ్నమై ఉంది. డిజిటల్ పేమెంట్స్ విభాగంలో మొబైల్‌వేర్ టెక్నాలజీస్ క్రియాశీలకంగా ఉంది. వీటిని కొనడం వల్ల డిజిటల్ సర్వీసెస్ విభాగంలో విస్తరించొచ్చని జాగెల్ యాజమాన్యం భావిస్తోంది.

హురున్ అండర్ 35 జాబితాలో ఈశా, ఆకాశ్ అంబానీ



- ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో 60 మంది ఐఐటీయన్లే
- తెలుగు రాష్ట్రాల నుంచి 11 మందికి చోటు

దేశవ్యాప్తంగా 35 ఏళ్లలోపు వయసులోనే విశేష ప్రతిభ చూపుతున్న 150 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల జాబితాను హురున్ ఇండియా విడుదల చేసింది. ఇందులో 60 మంది వివిధ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో చదివినవారే కావడం విశేషం. అత్యధికంగా ఐఐటీ మద్రాస్ నుంచి 13 మంది ఉన్నారు. ఐఐటీ బాంబే(11), ఐఐటీ దిల్లీ(10), ఐఐటీ ఖరగ్‌పూర్(10), ఐఐటీ రూర్కీ(6) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

రిలయన్స్ రిటైల్‌కు నేతృత్వం వహిస్తున్న ఈశా అంబానీ(32) ఈ జాబితాలో అత్యంత తక్కువ వయసున్న మహిళగా నిలిచారు. ఈ జాబితాలో సలోని ఆనంద్ (త్రయ హెల్త్), ఘజల్ అలఘ్ (మామాఎర్త్) కూడా ఉన్నారు. షేర్‌చాట్ ప్రతినిధి అంకుష్ సచ్‌దేవ(31) అందరి కంటే పిన్న వయస్కుడు కావడంతో జాబితా అగ్రస్థానంలో నిలిచారు. ఈశా అంబానీ 31వ స్థానంలో ఉండగా.. ఆమె కవల సోదరుడు, జియో ఛైర్మన్ ఆకాశ్ అంబానీ 32వ స్థానంలో ఉన్నారు.

ఇలా గుర్తించారు: తొలి తరం అయితే కనీసం 50 మిలియన్ డాలర్లు (సుమారు రూ.415 కోట్లు), తదుపరి తరాలైతే కనీసం 100 మిలియన్ డాలర్ల (సుమారు రూ.830 కోట్ల) వ్యాపార విలువ కలిగిన వారికి ఈ జాబితాలో చోటు కల్పించారు.

123 మంది తొలి తరం: ఈ జాబితాలో 82% మంది (123 మంది) తొలి తరం పారిశ్రామికవేత్తలే. రెండో తరానికి చెందిన వారు నలుగురు, మూడో తరం నుంచి 17 మంది, నాలుగో తరం నుంచి ఆరుగురు ఉన్నారు.

మహిళల ప్రత్యేకతలు: సలోని(34), త్రయ హెల్త్ ద్వారా కేశ సంరక్షణ రంగంలో వినూత్న ఆవిష్కరణలు చేశారు. ఘజల్ అలఘ్(35) తన మామాఎర్త్ అంకురాన్ని నమోదు కూడా చేశారు. జాబితాలోని అనేరి పటేల్, అనీశా తివారీ, అంజలి మర్చంట్ కూడా 33-34 ఏళ్ల వారే.

బెంగళూరు, ముంబయిదే రాజ్యం: అత్యంత ఎక్కువ మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలున్న నగరాల్లో బెంగళూరు (29), ముంబయి (26), దిల్లీ (21), హైదరాబాద్ (9) నిలిచాయి.

రంగాల వారీగా: ఆర్థిక సేవల రంగంలో 21 మంది ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో సాఫ్ట్‌వేర్ రంగం (14), విద్య-శిక్షణ (12), మీడియా-వినోదం (12), ఇకామర్స్ (10) ఉన్నాయి.

జాబితాలో తెలుగు రాష్ట్రాల నుంచి

ర్యాంకు	పేరు	కంపెనీ
3	అక్షిత్ జైన్	గోల్డ్‌మెడల్ ఎలక్ట్రికల్స్
18	కేశవ్ రెడ్డి	ఆరాజెన్ లైఫ్ సైన్సెస్
42	వెంకట సంజీవ్ అల్లూరి	అవంతీ ఫీడ్స్
50	నవీశ్ రెడ్డి	ఫైనాన్స్‌పీర్
51	రాహుల్ అట్లులూరి	నెక్స్‌వేవ్
59	అరవింద్ సంక	రాపిడో
61	పవన్ గుంటుపల్లి	రాపిడో
79	పవన్ కుమార్‌చందన	స్కైరూట్ ఏరోస్పేస్
99	ఆశిస్ గోయెంకా	3ఎఫ్ ఆయిల్ పామ్
112	డి. నాగ భరత్	స్కైరూట్ ఏరోస్పేస్
113	సంజయ్ బైలాల్ జగన్నాథ్	ఎక్స్‌పొనెంట్ ఎనర్జీ

(3, 59 స్థానాలు ఆంధ్రప్రదేశ్ వారివి కాగా, మిగతావారు తెలంగాణకు చెందిన వారు)

డీలిస్టింగ్ ప్రక్రియ ఇక సులభంగా

దిల్లీ: నమోదిత కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి తమ షేర్లను సులభంగా డీలిస్ట్ చేసేందుకు సెబీ కొన్ని నిబంధనలను సవరించింది. ప్రస్తుత రివర్స్ బుక్ బిల్డింగ్ (ఆర్‌బీబీ) ప్రక్రియకు ప్రత్యామ్నాయంగా ఫిక్స్‌డ్ ప్రైస్ మెకానిజం ద్వారా షేర్లను డీలిస్ట్ చేయడానికి అనుమతిస్తూ నోటిఫై చేసింది. ఆర్‌బీబీ ప్రక్రియ కింద ఏదైనా కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి డీలిస్ట్ కావాలంటే.. ముందుగా ప్రజా ప్రకటన ఇవ్వాలి. కనీస ప్రాథమిక ధరను ఆఫర్ చేయాలి. ప్రమోటర్లు లేదా పెద్ద వాటాదార్లకు తమ సెక్యూరిటీలను ఇతర వాటాదార్లు విక్రయించాల్సి ఉంటుంది.

కొత్త పద్ధతిలో ఇలా: సెబీ తాజా నోటిఫికేషన్ ప్రకారం.. ఫిక్స్‌డ్ ప్రైస్ ప్రక్రియలో ప్రాథమిక ధరపై కనీసం 15% అధికంగా కొనుగోలుదారు ఆఫర్ చేయాల్సి ఉంటుంది. తరచూ ట్రేడయ్యే, తరచూ ట్రేడ్ కాని కంపెనీల షేర్ల డీలిస్టింగ్‌కు అదనపు పరామితిగా సర్దుబాటు చేసిన పుస్తక విలువను సెబీ తీసుకొచ్చింది. ఇలా కొన్ని నిబంధనలను సరళీకరించి, ప్రక్రియను సులభతరం చేసింది.

✦ డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూ లిస్టింగ్ గడువు సమయాన్ని టి+3 ట్రేడింగ్ రోజులకు తగ్గిస్తున్నట్లు సెబీ గురువారం వెల్లడించింది. ప్రస్తుతం ఈ గడువు టి+6 ట్రేడింగ్ రోజులుగా ఉంది.

రూ.78,000 మించిన బంగారం


అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాములు) మేలిమి బంగారం ధర గురువారం రికార్డు స్థాయిలో 2685 డాలర్లకు చేరింది. తదుపరి కాస్త తగ్గి 2670 డాలర్ల వద్ద కదలాడుతుండగా, దేశీయంగానూ ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ విపణిలో రాత్రి 11.30 గంటల సమయానికి 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.78,100 (జీఎస్‌టీతో కలిపి) వద్ద ట్రేడ్ అయ్యింది. కిలో వెండి ధర కూడా ఒక దశలో రూ.94,400కు చేరినా, తదుపరి కాస్త దిగి వచ్చి రూ.93,700 వద్ద నిలిచింది.

కార్యాలయ స్థలాల లీజింగ్‌లో హైదరాబాద్ హవా

జులై-సెప్టెంబరుపై కొలియర్స్ ఇండియా నివేదిక



కార్యాలయ స్థలాల లీజింగ్ కార్యకలాపాలు జులై-సెప్టెంబరులో హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో ఎక్కువగా జరిగాయని కొలియర్స్ ఇండియా నివేదిక వెల్లడించింది. దేశ వ్యాప్తంగా 6 ప్రధాన నగరాల్లో కార్యాలయ స్థలాల స్థూల లీజింగ్ 2023 జులై-సెప్టెంబరులో 13.2 మిలియన్ చదరపు అడుగుల మేర జరగ్గా, ఈ ఏడాది ఇదే సమయంలో 31% పెరిగి 17.3 మి.చ.అడుగులకు చేరింది. ఇందులో సగానికి పైగా హైదరాబాద్, బెంగళూరుల్లోనే జరిగింది. ఈ ఏడాది మొదటి 9 నెలల్లోనే బెంగళూరు, హైదరాబాద్, ముంబయిల్లో కార్యాలయ స్థలాలకు ఏర్పడిన గిరాకీ, 2023 ఏడాది మొత్తం గిరాకీకి దగ్గరగా లేదా అధిగమించిందని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర్వీసెస్ ఎండీ అర్పిత్ మెహ్రోత్రా వెల్లడించారు.



మౌరి టెక్ రూ.1500 కోట్ల ఐపీఓ

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన ఐటీ సేవల సంస్థ మౌరి టెక్ తొలి పబ్లిక్ ఆఫర్‌కు (ఐపీఓ) రానుంది. రూ.1500 కోట్లు సమీకరించేందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. రూ.440 కోట్ల విలువైన ఈక్విటీ షేర్ల (ముఖ విలువ రూ.10)ను కొత్తగా జారీ చేస్తుంది. ప్రమోటర్లు రూ.1,060 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద విక్రయిస్తారు. సంస్థ ప్రమోటర్లు సుజయ్ పాతూరు రూ.615 కోట్ల విలువైన షేర్లు, అనిల్ రెడ్డి యర్రంరెడ్డి రూ.316 కోట్ల విలువైన షేర్లను; నాన్-ప్రమోటర్ శ్రీనివాసరావు సుంకర రూ.129 కోట్ల విలువైన షేర్లను విక్రయిస్తారు. ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ కింద రూ.88 కోట్ల విలువైన షేర్లను సంస్థాగత మదుపరులకు విక్రయించే ఆలోచన కూడా ఈ సంస్థకు ఉంది. కంపెనీకి ఐపీఓ ద్వారా లభించే రూ.440 కోట్లలో రూ.165 కోట్లను యూఎస్‌లోని తన అనుబంధ కంపెనీలో పెట్టుబడి పెట్టేందుకు కేటాయిస్తారు. 2024 ఆర్థిక సంవత్సరానికి ఈ కంపెనీ రూ.940 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది.

ఐటీకి మంచి రోజులు!

ఆదాయ అంచనాలు పెంచిన యాక్సెంచర్

కొత్త ప్రాజెక్టులు నెమ్మదించడంతో, లాభదాయాలు తగ్గి, ఉద్యోగుల సంఖ్యలో కోత విధిస్తున్న ఐటీ సంస్థలకు మంచి రోజులు వస్తున్న సంకేతాలు స్పష్టమవుతున్నాయి. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గించడంతో, వాణిజ్య సంస్థలు ఐటీ కోసం వెచ్చించే మొత్తాలను పెంచుతాయన్న అంచనాలు వాస్తవరూపం దాల్చనున్నాయి. అంతర్జాతీయ ఐటీ సేవల అతిపెద్ద సంస్థ యాక్సెంచర్ 2025 ఆర్థిక సంవత్సరానికి తన ఆదాయ వృద్ధి అంచనాను 3-6 శాతంగా ప్రకటించడమే ఇందుకు నిదర్శనం. 2024 ఆర్థిక సంవత్సరానికి సంస్థ ఆదాయ వృద్ధి అంచనా 1.5-2.5 శాతంగా ప్రకటించగా, 1% వృద్ధినే సాధించింది. నాస్‌డాక్‌లో నమోదైన ఈ సంస్థ సెప్టెంబరు-ఆగస్టును ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తోంది. నాస్‌డాక్ నమోదిత సంస్థ అయిన కాగ్నిజెంట్ టెక్నాలజీస్ కూడా ఏప్రిల్-జూన్‌కు పరిశ్రమ అంచనాలను మించి ఆదాయాన్ని ప్రకటించడం గమనార్హం.



✦ 2024 చివరి త్రైమాసికంలో యాక్సెంచర్ ఆదాయ అంచనా 16.38 బి.డా. కాగా, 16.41 బి.డా. ఆదాయాన్ని ఆర్జించింది. 2025 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి 16.85-17.45 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని యాక్సెంచర్ అంచనా వేసింది. ఇతర సంస్థల స్వాధీనతకు 3 బిలియన్ డాలర్లు వెచ్చిస్తామని తెలిపింది. 2024 ఆర్థిక సంవత్సరంలో వెచ్చించిన మొత్తం కంటే ఇది సగం కంటే తక్కువ. 4 బిలియన్ డాలర్లతో షేర్ బైబ్యాక్ పథకాన్ని యాక్సెంచర్ ప్రకటించింది.

✦ **ఏఐ నుంచి 1 బి.డా. ప్రాజెక్టులు:** 2024లో 81.2 బి.డా. ప్రాజెక్టులను సంస్థ సాధించింది. జెనరేటివ్ ఏఐ (కృత్రిమమేధ) ఆధారిత కొత్త ప్రాజెక్టులే 1 బిలియన్ డాలర్ల విలువైనవి లభించాయని తెలిపింది. ఇప్పటివరకు చూస్తే మన దేశంలో టీసీఎస్ మాత్రమే ఏఐ ప్రాజెక్టులపై ఆదాయాన్ని ఆర్జించినట్లు తెలిపింది.

✦ **దేశీయ ఐటీ కంపెనీల ఫలితాలు ఇదే బాటలో:** యాక్సెంచర్ ఫలితాలు దేశీయ ఐటీ రంగ పరిస్థితికి సంకేతాలుగా పరిగణిస్తుంటారు. దేశీయ ఐటీ కంపెనీల ఫలితాలు బాగుంటాయనే అంచనాలు పెరుగుతున్నాయి. అక్టోబరు 10న టీసీఎస్ ఫలితాలతో జులై-సెప్టెంబరు ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభం కానుంది.

మహారాష్ట్రలో భారీ పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్తు ప్రాజెక్టులు

విలువ రూ.21,000 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: మహారాష్ట్రలో 4,000 మెగావాట్ల సామర్థ్యం గల రెండు భారీ పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్తు కేంద్రాలను రూ.21,000 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్నట్లు ఎంఈఐఎల్ గ్రూపు (మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్) తెలిపింది. బీఓఎం (బిల్డ్- ఓన్- మెయింటెనెన్స్) విధానంలో ఈ ప్రాజెక్టులను చేపడతామంది. కామోడ్ వద్ద ప్రాజెక్టును 5 ఏళ్లలో, ఘోస్లా వద్ద ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేయాలని మేఘా ఇంజినీరింగ్ భావిస్తోంది. ఈ రెండు ప్రాజెక్టుల వల్ల 2,500 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ప్లాంట్ల ద్వారా తక్కువ వ్యయంతో జల విద్యుత్తును ఉత్పత్తి చేయడంతో పాటు నిల్వ చేసి, అవసరమైనప్పుడు వాడుకోవచ్చు. రోజుకు 6 గంటల జల విద్యుత్తును నిల్వ చేయొచ్చని ఎంఈఐఎల్ గ్రూపు అధ్యక్షుడు ఆర్‌వీఆర్ కిషోర్ తెలిపారు.

కోడి గుడ్లు

27న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	505
వరంగల్	507
విజయవాడ	530
గోదావరి	530
విశాఖపట్నం	530
చిత్తూరు	543

ఆ నోటీసులపై పన్ను అధికారుల డిజిటల్ సంతకాలు ఉండవు



జీఎస్‌టీఎన్ స్పష్టత

దిల్లీ: జీఎస్‌టీ పోర్టల్ ద్వారా పన్నుల అధికారులు జారీ చేసే షోకాజ్ నోటీసులు, మదింపు ఆదేశాలపై వారి డిజిటల్ సంతకాలు ఉండవని జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) స్పష్టం చేసింది. జీఎస్‌టీ పోర్టల్ ద్వారా పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ చేసిన షోకాజ్ నోటీసులు, ఆదేశాలపై పన్నుల అధికారుల డిజిటల్ సంతకాలు లేకపోవడంతో అవి చెల్లుబాటు అవుతాయా? కాదా? అనే సందేహం పన్ను చెల్లింపుదార్లలో నెలకొంది. దీనిపై జీఎస్‌టీఎన్ స్పష్టతనిచ్చింది. జీఎస్‌టీ అధికారి తన డిజిటల్ సంతకంతో లాగిన్ అవ్వడం ద్వారానే జీఎస్‌టీ పోర్టల్‌లో ఈ నోటీసులు, ఆదేశాలు జనరేట్ అవుతాయని తెలిపింది. అందువల్ల మళ్లీ ప్రత్యేకంగా వీటిపై డిజిటల్ సంతకాలు అవసరం లేదని వివరించింది.

✦ జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్‌టీ రేటును తగ్గించే అంశాన్ని నిర్ణయించేందుకు ఏర్పాటైన మంత్రుల కమిటీ (జీఓఎం) తన తొలి సమావేశాన్ని అక్టోబరు 19న నిర్వహించనుంది.

రెండేళ్లలో 50 ఔషధ, వైద్య పరికరాల కొత్త ప్లాంట్లు!

దిల్లీ: ఔషధ, వైద్య పరికరాల తయారీని ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద వచ్చే రెండేళ్లలో 50 కొత్త ప్లాంట్లు నిర్మితమవుతాయని ఔషధ విభాగ కార్యదర్శి అరుణీశ్ చావ్లా వెల్లడించారు. పరిశ్రమ సమాఖ్య అసోచామ్ నిర్వహించిన వార్షిక ఔషధ సదస్సులో ఆయన మాట్లాడారు. 'భారత్‌లో తయారీ (మేకిన్ ఇండియా) కార్యక్రమం పదేళ్లు పూర్తి చేసుకుంది. ఔషధ, వైద్య పరికరాల తయారీ రంగంలో పీఎల్ఐ పథకం కింద ఇప్పటికే 50 ప్లాంట్లను కంపెనీలు ఏర్పాటు చేశాయి. వీటిల్లో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి కూడా. మరో 50 ప్లాంట్లు వచ్చే రెండేళ్లలో రాబోతున్నాయ'ని అరుణీశ్ తెలిపారు.

'మౌలికం'లో భారత్ భేష్

- 2047కు అభివృద్ధి చెందిన దేశంగా మారే అవకాశం
- ఆర్‌బీఐ పూర్వ గవర్నర్ రఘురామ్ రాజన్



దిల్లీ: మౌలిక సదుపాయాల రంగంలో గత పదేళ్లలో భారత్ అద్భుతంగా పని చేసిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పూర్వ గవర్నర్ రఘురామ్ రాజన్ వెల్లడించారు. స్థానిక తయారీని ప్రోత్సహించడంతో పాటు ఉద్యోగాల సృష్టి కోసం మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వస్తువులు లేదా సేవల ఉత్పత్తిపై ప్రభుత్వం దృష్టి పెట్టడం మంచి విషయమే అయినా, దానిని సరైన మార్గంలో చేయడం ముఖ్యమని తెలిపారు. ఆయా అంశాలపై ఆయనేమన్నారంటే..

✦ మోదీ ప్రభుత్వం సరిగ్గా పదేళ్ల క్రితం చేపట్టిన 'మేకిన్ ఇండియా' 'ఉద్దేశం మంచిదే. 'ఇది ఎంత బాగా ముందుకెళ్లిందో తనిఖీ చేసుకోవాల్సిన అవసరం ఉంది. దీనికి ఉత్తమ మార్గం విమర్శకులను అడగడమే. 'మీరు ఏమనుకుంటున్నారు? ఏం జరిగింది? మీరు కోరుకున్న విధంగా జరిగిందా? ఇంకా ఎక్కువగా చేయాలా' వంటి ప్రశ్నలు అడిగితే వారి నుంచి అభిప్రాయాలు వస్తాయి. వాటిని పరిగణనలోకి తీసుకుని పని చేయాల్సి ఉంటుంది. ఇదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన చాలా బాగుంది. అవి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

ఇబ్బందులపై వ్యాపారుల అభిప్రాయమే ముఖ్యం: వ్యాపారాన్ని మరింత సులభతరం చేయడానికి, ప్రత్యేకించి ప్రభుత్వ విధానాలకు సంబంధించి పరిశోధనా అధికారులు లేదా పన్ను అధికారుల దాడులకు భయపడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి. వ్యాపారవేత్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ప్రభుత్వం వారినే అడగాలి. ప్రపంచ బ్యాంక్ సులభతర వ్యాపార నిర్వహణ (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) చెక్‌లిస్ట్‌ను అనుసరించడం మాత్రమే సరికాదు.

తలసరి ఆదాయం రూ.12.45 లక్షలు కావాలి: ప్రపంచంలో అతి పెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ మారేందుకు ఏటా 7% ఆర్థిక వృద్ధి సరిపోతుంది. ఈ దశాబ్దం చివరి వరకు ఇదే వృద్ధితో భారత్ ముందుకెళితే జర్మనీ, జపాన్‌ల ఆర్థిక వ్యవస్థలను అధిగమించి మూడో స్థానాన్ని చేజిక్కించుకుంటుంది. ప్రస్తుతం జర్మనీ ఆర్థిక వ్యవస్థ 4.5 ట్రిలియన్ డాలర్లు, జపాన్ ఆర్థిక వ్యవస్థ 4.2 ట్రి.డాలర్ల స్థాయిలో ఉండగా, భారత్ ఆర్థిక వ్యవస్థ 3.7 ట్రి.డాలర్లుగా ఉంది. అనుకున్నట్లు వృద్ధి చెందితే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడం సాధ్యమే.

రూ.91,000 కోట్ల సెమీకండక్టర్ ప్లాంటుకు టాటా ఒప్పందం

దిల్లీ: రూ.91,000 కోట్లతో గుజరాత్‌లోని ఢొలేరా వద్ద నిర్మించబోయే వేఫర్ ఫ్యాబ్ ప్లాంటుకు సంబంధించి తైవాన్ సంస్థ పవర్‌చిప్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్(పీఎస్ఎంసీ)తో ఒప్పందం ఖరారైనట్లు టాటా ఎలక్ట్రానిక్స్ వెల్లడించింది. ఈ ఒప్పందం ప్రకారం.. ప్రతిపాదిత ప్లాంటుకు డిజైన్, నిర్మాణ మద్దతును పీఎస్ఎంసీ అందిస్తుంది. దేశంలో ఏర్పాటవుతున్న తొలి ఏఐ ఆధారిత ఫ్యాబ్ ఇదే. ఈ ఫ్యాబ్ వల్ల లక్ష మందికి పైగా నైపుణ్య ఉద్యోగాలు లభించగలవని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ పేర్కొన్నారు. నెలకు 50,000 వేఫర్ల సామర్థ్యంతో ఈ ప్లాంటు నిర్మించనున్నట్లు తెలిపారు.

జియో-బీపీ 500వ ఈవీ ఛార్జింగ్ స్టేషన్

దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ అనంత్ అంబానీ, ఆ సంస్థ భాగస్వామి బీపీ సీఈఓ ముర్రే అచిన్‌క్లోస్ కలిసి గురువారమిక్కడ 500వ జియో-బీపీ పల్స్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్‌ను ఆవిష్కరించారు. జియో-బీపీ అనేది రిలయన్స్ ఇండస్ట్రీస్, అంతర్జాతీయ ఇంధన దిగ్గజం బీపీల సంయుక్త సంస్థ. జియో-బీపీ తన ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను వేగంగా పెంచుతోంది. ఈ నెట్‌వర్క్‌లో 95% వరకు వేగవంతమైన ఛార్జింగ్ స్టేషన్లే నిర్మిస్తున్నారు.

హైదరాబాద్‌లో గృహ/ఫ్లాట్ల విక్రయాలు 22% తగ్గాయ్: అనరాక్

దేశంలోని 7 ప్రధాన నగరాల్లో జులై-సెప్టెంబరు త్రైమాసికంలో గృహ/ఫ్లాట్ల విక్రయాలు 11% తగ్గినా, సగటు ధరలు మాత్రం వార్షికంగా 23% పెరిగాయని స్థిరాస్తి కన్సల్టెంట్ అనరాక్ నివేదిక వెల్లడించింది. 2023 జులై-సెప్టెంబరులో 1,20,290 ఇళ్లు/ఫ్లాట్లు విక్రయమవగా, ఈ ఏడాది 1,07,060కి పరిమితమయ్యాయని నివేదిక పేర్కొంది. 7 నగరాల్లో కలిపి సగటు చదరపు అడుగు ధర రూ.6,800 నుంచి రూ.8,390కి పెరిగిందని వెల్లడించింది. విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఇళ్లు/ఫ్లాట్లు కూడా 1,16,220 నుంచి 93,750కు పరిమితమయ్యాయి. హైదరాబాద్‌లో విక్రయాలు 22% క్షీణించగా, సగటు ధర మాత్రం 32% పెరిగినట్లు అనరాక్ ఛైర్మన్ అనూజ్ పురి వెల్లడించారు.

నగరాల వారీగా జులై-సెప్టెంబరు గృహ/ఫ్లాట్ల విక్రయాలు

నగరం	2023	2024	క్షీణత(%)
ముంబయి	38,505	36,190	6
పుణె	22,885	19,050	17
దిల్లీ-ఎన్‌సీఆర్	15,865	15,570	2
బెంగళూరు	16,395	15,025	8
హైదరాబాద్	16,375	12,735	22
కోల్‌కతా	5,320	3,980	25
చెన్నై	4,945	4,510	9

హైదరాబాద్‌లో 'ద ఆర్గానిక్ వరల్డ్' విక్రయశాల

ఈనాడు, హైదరాబాద్: బెంగళూరుకు చెందిన నిమిడా గ్రూపు రిటైల్ సంస్థ ద ఆర్గానిక్ వరల్డ్, హైదరాబాద్‌లోని ప్రగతి నగర్‌లో విక్రయశాలను ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా విస్తరించాలనే ఆలోచనలో భాగంగా తొలిసారిగా బెంగళూరుకు వెలుపల హైదరాబాద్‌లో స్టోర్ ఏర్పాటు చేసినట్లు నిమిడా గ్రూపు వ్యవస్థాపకుడు గౌరవ్ మన్‌చందా వెల్లడించారు.

డాక్టర్ రెడ్డీస్‌కు మెక్సికో జరిమానా

ఈనాడు, హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు రూ.28 లక్షల జరిమానా విధిస్తున్నట్లు మెక్సికో ఔషధ నియంత్రణ మండలి కొఫెప్రిస్ ప్రకటించింది. ఒక ఏపీఐ ఔషధాన్ని ఆ దేశంలోకి దిగుమతి చేసేందుకు మార్గదర్శకాలను పాటించనందున, మెక్సికో ఔషధ నియంత్రణ మండలి 6,52,420 మెక్సికన్ పెసోల (రూ.28 లక్షల) జరిమానా విధించింది.

కొనసాగిన లాభాల పరుగు

సెన్సెక్స్ ▲666 85836 | నిఫ్టీ ▲212 26216

జీవనకాల కొత్త గరిష్ఠాలకు సెన్సెక్స్, నిఫ్టీ

స్టాక్ మార్కెట్ లాభాల పరుగు కొనసాగింది. విదేశీ మార్కెట్ల సానుకూల సంకేతాల ప్రభావంతో.. సూచీలు జీవనకాల కొత్త గరిష్ఠాలను తాకాయి. వాహన, బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడమూ కలిసివచ్చింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 8 పైసలు తగ్గి 83.66 వద్ద స్థిరపడింది. బ్రెంట్ క్రూడ్ 2.26% నష్టంతో 71.17 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. విదేశీ మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు ఆకర్షణీయ లాభాలతో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.

ముగింపూ రికార్డే

క్రితం రోజు ముగింపు అయిన 85,169.87 పాయింట్లతో పోలిస్తే, గురువారం ఉదయం స్వల్ప నష్టంతో సెన్సెక్స్ 85,167.56 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత లాభాల్లోకి వచ్చి... చివరి వరకు అదే ఒరవడిలో సాగింది. ఇంట్రాడేలో 760.56 పాయింట్ల వరకు పెరిగి 85,930.43 వద్ద రికార్డు గరిష్ఠ స్థాయిని నమోదుచేసింది. చివరకు 666.25 పాయింట్ల లాభంతో 85,836.12 వద్ద ముగిసింది. నిఫ్టీ 211.90 పాయింట్లు పెరిగి 26,216.05 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీలకు ముగింపు పరంగా ఇవే అత్యధిక స్థాయులు. ఇంట్రాడేలో నిఫ్టీ 26,250.90 పాయింట్ల వద్ద జీవనకాల కొత్త గరిష్ఠ స్థాయిని తాకింది.

28 షేర్లు రాణించాయ్: సెన్సెక్స్ 30 షేర్లలో 28 రాణించగా.. ఎన్‌టీపీసీ 0.44%, ఎల్అండ్‌టీ 0.9% నష్టపోయాయి. మారుతీ సుజుకీ 4.76%, టాటా మోటార్స్ 3.08%, ఎంఅండ్ఎం 2.97%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.91%, టాటా స్టీల్ 2.48%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 2.11%, అల్ట్రాటెక్ సిమెంట్ 2% చొప్పున లాభపడ్డాయి. రంగాలవారీ సూచీల్లో వాహన 2.23%, లోహ 2.08%, కమొడిటీస్ 1.32%, ఎఫ్ఎంసీజీ 0.84% మేర రాణించాయి. పరిశ్రమలు, టెలికమ్యూనికేషన్, యుటిలిటీస్ రంగాల సూచీలు డీలాపడ్డాయి. 257 షేర్లు 52 వారాల గరిష్ఠాలను చేరగా.. 46 షేర్లు 52 వారాల కనిష్ఠాన్ని నమోదుచేశాయి.



సమీక్ష

✦ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఇంజినీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఐఈసీసీఎల్)పై దివాలా పరిష్కార ప్రక్రియ అమలు చేసేందుకు జాతీయ కంపెనీల చట్టం అప్పిలేట్ ట్రైబ్యునల్ అనుమతినిచ్చింది. రుణ సంక్షోభంలోని ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌కు చెందిన, నష్టాల్లో ఉన్న ఇతర నమోదిత సంస్థలకు ఐఈసీసీఎల్‌ను వేరుచేసింది.

✦ ఆగస్టు వరకు తన ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేతన బకాయిలన్నింటినీ స్పైస్‌జెట్ చెల్లించినట్లుగా సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. తాజాగా రూ.3,000 కోట్ల నిధులను సమీకరించడంతో, వేతన చెల్లింపులను చేసిందని ఆ వర్గాలు అంటున్నాయి.

✦ చిన్న నగరాలు, పట్టణాలకు తన కార్యకలాపాలను విస్తరించే యోచనలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్... 2025 చివరికల్లా 10,000 విక్రయ, సేవల కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది.

✦ కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజరేషన్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) రెండో రోజుకు 58.14 రెట్ల స్పందన లభించింది. 1,09,93,000 షేర్లను సంస్థ ఆఫర్ చేయగా.. 63,91,84,780 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. చిన్న మదుపర్ల విభాగంలో 55.50 రెట్ల స్పందన లభించింది.

✦ ఇండిగో చీఫ్ ఆపరేటింగ్ అధికారిగా ఇసిడ్రో పోర్‌క్యూరాస్‌ను నియమించినట్లు **ఇండిగో** తెలిపింది. నియంత్రణ సంస్థల అనుమతులు లభిస్తే నవంబరు 1 నుంచి ఈ నియామకం అమల్లోకి వస్తుందని పేర్కొంది.

✦ **డిఫ్యూజన్ ఇంజినీర్స్** తొలి పబ్లిక్ ఆఫర్‌కు మొదటి రోజున 7.15 రెట్ల స్పందన లభించింది. 65,98,500 షేర్లను ఆఫర్ చేయగా.. 4,71,77,240 షేర్లకు బిడ్‌లు వచ్చాయి. రిటైల్ మదుపర్ల విభాగంలో 11.23 రెట్ల స్పందన లభించింది.

✦ స్వీడన్‌కు చెందిన ఫ్యాషన్ దిగ్గజ సంస్థ **హెచ్‌అండ్ఎం** ఉత్పత్తులను తన అజియో ప్లాట్‌ఫామ్ ద్వారా విక్రయించనున్నట్లు రిలయన్స్ రిటైల్ తెలిపింది.

వయాకామ్ బోర్డులోకి నీతా, ఆకాశ్


వాల్ట్ డిస్నీ భారత వ్యాపారం, వయాకామ్ 18 సంస్థల విలీనం జరగనుండటంతో.. వయకామ్ 18 బోర్డులోకి రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ఛైర్మన్ ఆకాశ్ అంబానీ చేరారు. ప్రతిపాదిత విలీనానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), జాతీయ కంపెనీల చట్టం ట్రైబ్యునల్ అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో ఈ నియామకాలు జరిగాయి. విలీన సంస్థకు నీతా అంబానీ నేతృత్వం వహించనున్నారు.

రూ.6.5 లక్షల కోట్లకు ఐటీసీ మార్కెట్ విలువ

హోటళ్ల నుంచి ఎఫ్ఎంసీజీ వరకు వివిధ వ్యాపారాలను నిర్వహిస్తున్న ఐటీసీ మార్కెట్ విలువ తొలిసారి రూ.6.5 లక్షల కోట్ల మైలురాయిని తాకింది. దేశీయ కంపెనీల్లో మార్కెట్ విలువ పరంగా 9వ స్థానంలో నిలిచింది. గురువారం ఈ సంస్థ షేరు ఇంట్రాడేలో రూ.523.75 వద్ద రికార్డు గరిష్ఠాన్ని తాకింది. చివరకు 1.01% లాభంతో రూ.522.70 వద్ద ముగిసింది. ఇదిలా ఉంటే ప్రొట్‌లైఫ్ ఫుడ్స్‌లో తన వాటాను ఐటీసీ పెంచుకుంది.

ఈనాడు సినిమా

భిన్న సంస్కృతులతో పాట


రామ్‌చరణ్

శ్రీకాకుళం నుంచి రాయలసీమ వరకూ జానపద కళాకారుల్ని ఒక చోటకు చేర్చి 'గేమ్ ఛేంజర్'లోని రా మచ్చా మచ్చా... పాటని స్వరపరిచినట్టు తెలిపారు తమన్. పలు రాష్ట్రాల సంస్కృతులు, సంగీతం ఈ పాటలో కనిపిస్తూ, వినిపిస్తాయని తెలిపారు దర్శకుడు శంకర్. రామ్‌చరణ్ కథానాయకుడిగా, శంకర్ దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'రా మచ్చా మచ్చా...' పాటని ఈ నెల 30న విడుదల చేయనున్నారు. ఈ పాట ప్రత్యేకతని దర్శకుడు శంకర్, సంగీత దర్శకుడు తమన్ ఓ వీడియోద్వారా బయట పెట్టారు. "తెలుగు రాష్ట్రాల్లోని గుస్సాడి, కొమ్ము కోయ, తప్పెట గుళ్ల లాంటి కళారూపాల్ని ఇందులో భాగం చేయాలనుకున్నాం. ప్రేక్షకులకు మరింత అనుభూతిని పంచడం కోసం ఒడిశా, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి పలు నృత్య రీతుల్ని ఇందులో చూపించే ప్రయత్నం చేశాం. స్వతహాగా మంచి డ్యాన్సర్ అయిన రామ్‌చరణ్, ఓ పూర్తిస్థాయి బీజీఎమ్‌కి సింగిల్ షాట్‌లో చేసిన డ్యాన్స్ మరింత ప్రత్యేకంగా నిలుస్తుంది" అన్నారు. క్రిస్మస్ సందర్భంగా ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

సూర్య 45 కుదిరిందా?


సూర్య


కథానాయకుడు సూర్య నటించిన 'కంగువా' నవంబరులో తెరపైకి రానుంది. అలాగే ప్రస్తుతం కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో చేస్తున్న రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రీకరణ దశలో ఉంది. ఇది పూర్తయిన వెంటనే దర్శకుడు వెట్రిమారన్‌తో 'వాడివాసల్' చేయాల్సి ఉంది. అయితే ఇప్పుడీ వరసలో మార్పులు చేర్పులు జరగనున్నట్లు తెలుస్తోంది. వెట్రిమారన్ సినిమా పట్టాలెక్కించే లోపు సూర్య మరో కొత్త ప్రాజెక్ట్‌ను సెట్స్‌పైకి తీసుకెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. దీనికి నటుడు, దర్శకుడు ఆర్.జె.బాలాజీ దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. ఇది 'సూర్య 45'గా సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్, వేల్స్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థలు నిర్మించనున్నట్లు ప్రచారం సాగుతోంది. బాలాజీ ఇప్పటికే నయనతార 'అమ్మోరు తల్లి' చిత్రంతో తెలుగులోనూ గుర్తింపు తెచ్చుకున్నారు.

'దేవర' ఆయుధపూజ


ఎన్టీఆర్

దేవరతో థియేటర్లలో మాస్ యాక్షన్ హంగామా రుచి చూపించనున్నారు కథానాయకుడు ఎన్టీఆర్. ఆయన తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేసిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని కొరటాల శివ తెరకెక్కించారు. యువసుధ ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. జాన్వీ కపూర్ కథానాయిక. సైఫ్ అలీ ఖాన్ ప్రతినాయకుడిగా నటించారు. ఈ సినిమా శుక్రవారం థియేటర్లలోకి వస్తున్న సందర్భంగా గురువారం ''ఆయుధపూజ'' అనే గీతాన్ని విడుదల చేశారు. తారక్, సైఫ్‌ల మధ్య సాగే యాక్షన్ నేపథ్యంలో వచ్చే పాటిది. అనిరుధ్ స్వరాలు సమకూర్చిన ఈ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యమందించగా.. కాలభైరవ ఆలపించారు. పాటలో ఎన్టీఆర్ వేసిన మాస్ స్టెప్పులు.. ఆయన యాక్షన్ హంగామా అంచనాలు పెంచేలా ఉన్నాయి.

ఆమిర్.. నాలుగు రోజుల జీవితం


ఆమిర్ ఖాన్

'అందాజ్ అప్నా అప్నా'.. బాలీవుడ్ అగ్రకథానాయకుడు ఆమిర్ ఖాన్, దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి కలయికలో వచ్చిన చిత్రమిది. 1994లో విడుదలైన ఈ యాక్షన్ కామెడీ మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడీ హిట్ కాంబినేషన్‌లో మరో చిత్రం రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఆమిర్ ప్రధాన పాత్రలో రాజ్‌కుమార్ సంతోషి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. "కొన్ని రోజులుగా ఈ ప్రాజెక్టు గురించి చర్చలు జరుగుతున్నాయి. వీరిద్దరి కలయికలో దాదాపు 30ఏళ్ల తరవాత రాబోతున్న చిత్రమిది. దీన్ని టైమ్ ట్రావెల్ నేపథ్యంలో తీర్చిదిద్దుతున్నారు. ఆమిర్ గత సినిమాల పరాజయాలను దృష్టిలో ఉంచుకొని ఈ కథను సిద్ధం చేస్తున్నారు దర్శకుడు. ఈ ప్రాజెక్టుకు 'చార్ దిన్ కీ జిందగీ' అనే పేరును ఖరారు చేశారు. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నార'ని ఆమిర్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 'సితారే జమీన్ పర్'తో బిజీగా ఉన్నారు ఆమిర్.

లారెన్స్ సరసన ప్రియాంక


ప్రియాంక మోహన్

'సరిపోదా శనివారం'తో ఇటీవలే తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది కథానాయిక ప్రియాంక అరుల్ మోహన్. ఇప్పుడామె మరో కొత్త ప్రాజెక్టుకు సంతకం చేసినట్లు తెలుస్తోంది. తమిళ హీరో రాఘవ లారెన్స్ ప్రధాన పాత్రలో 'బెంజ్' అనే చిత్రంలో నటిస్తున్నట్లు ఇటీవలే ప్రకటించింది చిత్రబృందం. 'రెమో' ఫేమ్ బక్కియరాజ్ కన్నన్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రానికి లోకేశ్ కనగరాజ్ కథను అందిస్తున్నారు. తాజాగా ఇందులో రాఘవ సరసన నటించడానికి ప్రియాంకను ఎంపిక చేసిందట చిత్రబృందం. ఇందులో నటించడానికి ఆమె ఉత్సాహంగా ఉన్నట్లు, త్వరలో ఈ విషయాన్ని ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. తెలుగులో విష్వక్‌సేన్ హీరోగా కె.వి.అనుదీప్ దర్శకత్వంలో ఓ సినిమా పట్టాలెక్కనుంది. దీనికోసం నాయికగా ప్రియాంక పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

విక్రమ్ తనయుడితో సినిమా?


అజయ్ భూపతి

'ఆర్ఎక్స్ 100' సినిమాతో తొలి అడుగులోనే సత్తా చాటిన దర్శకుడు అజయ్ భూపతి.. గతేడాది 'మంగళవారం'తో మరో విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు. కానీ, దీని తర్వాత ఇంత వరకు మరో కొత్త కబురు వినిపించలేదు. అయితే ఇప్పుడాయన విక్రమ్ తనయుడు ధృవ్‌తో ఓ సినిమా పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనిపై సంప్రదింపులు పూర్తయినట్లు తెలుస్తోంది. దీన్ని తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో నిర్మించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. త్వరలోనే నిర్మాణ సంస్థతో పాటు ఇతర వివరాలపై స్పష్టత రానుంది. అజయ్ ప్రస్తుతం 'మంగళవారం 2' స్క్రిప్ట్‌ను కూడా సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. ఇక ధృవ్ ప్రస్తుతం తమిళంలో 'బైసన్' అనే చిత్రం చేస్తున్నారు.

సితార సంకల్పమే నాకు స్ఫూర్తి

"ఈ ఆధునిక యుగంలో కుటుంబ బంధాల విలువల్ని, స్త్రీల గొప్పతనాన్ని ప్రేక్షకులకు కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది మా 'లవ్ సితార చిత్రం'" అని అంటోంది శోభితా ధూళిపాళ్ల. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. వందనా కటారియా దీన్ని తెరకెక్కించారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్, పోస్టర్లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఓ పంజాబీ చెఫ్‌తో ప్రేమలో పడిన సితార వివాహం చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. రోనీ స్క్రూవాలా నిర్మిస్తున్న ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఇందులోని తన పాత్ర గురించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది. "ఈ చిత్రంలో ప్రతి పాత్ర సవాలుగా, కొత్తగా ఉంటుంది. ఇందులో నేను ప్రేమ గొప్పతనాన్ని తెలిపే సితార అనే అమ్మాయిగా కనిపిస్తాను. ఈమె చాలా తెలివైనది. ప్రతి విషయంలో సూటిగా, నిజాయతీగా ఉంటుంది. ఆమె ధైర్యం, సంకల్పం నాకెంతో స్ఫూర్తినిచ్చాయి. ఈ అంశాలే నేను ఈ పాత్రలో నటించడానికి ముఖ్య కారణం. ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, కుటుంబ విలువల్ని తెలియజేస్తుందీ చిత్రం" అని చెప్పుకొచ్చింది శోభిత.


శోభిత ధూళిపాళ్ల

తమ్ముడి రక్షణకై మరణాన్నే ఎదిరిస్తా!


అలియా

'నేనెప్పుడు అన్ని విలువలు తెలిసిన వ్యక్తినని చెప్పుకోలేదు. నేను అంకుర్‌కి సోదరిని మాత్రమే. అతణ్ని కాపాడుకోవడానికి మరణాన్ని సైతం ఎదిరిస్తా" అని అంటోంది బాలీవుడ్ నాయిక అలియా భట్. ఆమె చెప్పే ఈ మాటలన్నీ తన రాబోయే సినిమా 'జిగ్రా' కోసమే. ఆమె ప్రధాన పాత్రలో వాసన్ బాలా తెరకెక్కిస్తున్న చిత్రమిది. వేదాంగ్ రైనా కీలక పాత్ర పోషిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "సత్య, అంకుర్..ఇలాంటి తోబుట్టువుల కథ వెయ్యిలో ఒకటి మాత్రమే ఉంటుంది" అని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో డ్రగ్స్ కేసులో ఇరుక్కొని జైలుకెళ్లిన తన సోదరుడిని కాపాడుకునే అక్కగా కనిపించనుంది అలియా. వచ్చే నెల 11న విడుదల కానుందీ చిత్రం.

'భక్షక్' దర్శకుడితో మరోసారి?


భూమి పెడ్నేకర్

కెరీర్‌లో వచ్చిన ప్రతి గొప్ప అవకాశాన్ని తన కలల్ని నెరవేర్చుకోవడానికే ఉపయోగిస్తా అంటూ కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలతో ముందుకు సాగుతోంది బాలీవుడ్ తార భూమి పెడ్నేకర్. ఈ ఏడాది 'భక్షక్' చిత్రంలో జర్నలిస్ట్ వైశాలీ సింగ్ పాత్రలో కనిపించి తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై గౌరీ ఖాన్ నిర్మించిన ఈ చిత్రాన్ని పుల్కిత్ తెరకెక్కించారు. ఇప్పుడామె తన రాబోయే సినిమా కోసం మరోసారి ఈ దర్శకనిర్మాతలతో చేతులు కలిపినట్లు తెలుస్తోంది. "ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన స్క్రిప్ట్ పనులు ప్రారంభ దశలో ఉన్నాయి. 'భక్షక్'తో భూమికి మంచి హిట్ ఇచ్చిన దర్శకుడు.. ఈ సారి ఆమెను దృష్టిలో ఉంచుకొని కథను సిద్ధం చేస్తున్నారు. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నారు" అని భూమి సన్నిహిత వర్గాలు తెలిపాయి.

మనసును కట్టిపడేసే చిత్రమిది


రచిత

రచిత మహాలక్ష్మీ, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో వి.శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'తల్లి మనసు'. దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మిస్తున్నారు. రఘుబాబు, శుభలేఖ సుధాకర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర బృందం గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. "ఓ మధ్యతరగతి తల్లి కుటుంబ కథ ఇది. ఆమె సంఘర్షణ అందరి మనసుల్ని హత్తుకుంటుంది" అన్నారు. "మనసును కట్టిపడేసే అద్భుత చిత్రంగా దీన్ని మలిచాం. నిర్మాణానంతర పనులు పూర్తి చేసి విడుదల తేదీ ప్రకటిస్తాం" అన్నారు నిర్మాత. ఈ చిత్ర సమర్పకుడు ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ.. "నిజ జీవితానికి అద్దం పట్టే చిత్రమిది. ఓ మంచి సినిమా అందించాలనే తపనతో నిర్మించాం" అన్నారు.

గ్యాంగ్‌స్టర్ వేట


చంద్రశేఖర్, కాశ్వీ కాంచన్

చంద్రశేఖర్ రాథోడ్ కథానాయకుడిగా నటిస్తూ, ఆయనే దర్శకనిర్మాతగా తెరకెక్కిస్తున్న చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. కాశ్వీ కాంచన్ కథానాయిక. అభినవ్ జనక్, అల్ల సతీశ్ కుమార్, సూర్య నారాయణ ఇతర పాత్రధారులు. అక్టోబరు 25న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. ఈ సందర్భంగా సినిమా విడుదల తేదీ పోస్టర్‌ని ప్రముఖ రచయిత సాయిమాధవ్ బుర్రా విడుదల చేశారు. కథానాయకుడు, దర్శకనిర్మాత మాట్లాడుతూ "రెండు గ్యాంగ్స్ చుట్టూ సాగే చిత్రమిది. వాటి మధ్య వార్ దేనికోసం అనేది ఆసక్తికరం. భయం, బాధ, కోపంలాంటి భావోద్వేగాలు లేని ఓ గ్యాంగ్‌స్టర్ వేట ఎవరి కోసం సాగిందన్నది ఇందులో ఆసక్తికరం. తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది" అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: జి.ఎల్.బాబు.

మిస్టర్ వస్తున్నాడు


సుదర్శన్, శ్రీదీక్ష

సుదర్శన్ పరుచూరి కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం... 'మిస్టర్ సెలెబ్రిటీ'. వరలక్ష్మీ శరత్‌కుమార్, శ్రీదీక్ష, నాజర్, రఘుబాబు ముఖ్య పాత్రలు పోషించారు. చందిన రవికిశోర్ దర్శకుడు. చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు నిర్మాతలు. ఈ చిత్రం వచ్చే నెల 4న రానుంది. ఈ సందర్భంగా సినిమా విడుదల తేదీ పోస్టర్‌ని ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "మా మనవడు సుదర్శన్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిది. కొత్త దర్శకుడైనా రవికిశోర్ అందరినీ ఆకట్టుకునేలా చిత్రాన్ని మలిచార'న్నారు. పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ "ప్రేక్షకులు మమ్మల్ని నలభయ్యేళ్లుగా ఆదరిస్తున్నారు. అదే ఆదరణ మా మనవడు పరుచూరి సుదర్శన్‌కీ దక్కుతుందని మా నమ్మకం" అన్నారు.

పొట్టేల్ పటేల్


అజయ్

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రధారులుగా... సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్ కుమార్ సడిగె నిర్మాతలు. అజయ్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. అజయ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన పాత్రకి సంబంధించిన లుక్‌ని విడుదల చేశారు. పటేల్ అనే శక్తిమంతమైన పాత్రలో అజయ్ కనిపించనున్నారు. ఆయన లుక్, నటన ఇందులో ప్రత్యేకంగా ఉంటాయని సినీ వర్గాలు తెలిపాయి.

సిరి

పాలసీని వాపసు ఇచ్చేస్తున్నారా?



బీమా పాలసీని తీసుకున్న తర్వాత, అది మీ అవసరాలకు ఏమాత్రం సరిపోదు అని తెలిస్తే? అందులో పేర్కొన్న నిబంధనలు మీకు నచ్చకపోతే? దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు అనుకూలంగా లేదని తేలితే.. ఇబ్బందేమీ లేదు. తీసుకున్న పాలసీని 30 రోజుల్లోగా వాపసు ఇచ్చేయొచ్చు. దీని గురించి మరిన్ని వివరాలు తెలుసుకుందామా..

పాలసీదారులకు మరింత రక్షణ కల్పించే లక్ష్యంతో భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఎప్పటికప్పుడు పలు మార్పులు తీసుకొస్తూనే ఉంది. ఇందులో కీలకమైనది బీమా పాలసీ పత్రాలు అందిన 30 రోజుల్లోగా (ఫ్రీ-లుక్ వ్యవధి) వాపసు ఇవ్వడం లేదా రద్దు చేసుకునేందుకు అవకాశం కల్పించడం. కొత్తగా పాలసీ తీసుకున్నప్పుడు దాన్ని నిశితంగా పరిశీలించేందుకు పాలసీదారులకు ఇచ్చిన వ్యవధి అన్నమాట. తాను తీసుకున్న పాలసీలో ఉన్న నిబంధనలు, షరతులను సమీక్షించుకోవడానికి ఈ గడువు తోడ్పడుతుంది. పాలసీ నచ్చకపోతే ఈ వ్యవధిలోగా దాన్ని ఇచ్చేసి, ప్రీమియాన్ని తిరిగి పొందవచ్చు. ఈ వ్యవధిలో మీరు పాలసీని రద్దు చేస్తే, మీరు చెల్లించిన ప్రీమియంలో నుంచి కొన్ని ఖర్చులను మినహాయించుకొని, ప్రీమియం తిరిగి ఇస్తారు.

ఏయే సందర్భాల్లో..

ఫ్రీ-లుక్ వ్యవధిలో బీమా పాలసీని రద్దు చేసుకునేందుకు అనేక కారణాలు ఉండొచ్చు. పాలసీ గురించి వివరించినప్పుడు తెలిపిన వివరాలకూ, పాలసీ పత్రం చేతికందినప్పుడు అందులో పేర్కొన్న వాటికి వ్యత్యాసం ఉండొచ్చు. లేదా మీకు తప్పుడు సమాచారం ఇచ్చి, పాలసీని అంటగట్టొచ్చు. ఇలాంటప్పుడు పాలసీని మీరు వెనక్కి ఇచ్చేయొచ్చు.

- మీ ఆర్థిక పరిస్థితులకు ఆ పాలసీ సరైనది కాకపోవచ్చు. ఉదాహరణకు పూర్తి రక్షణకే పరిమితమయ్యే టర్మ్ పాలసీని ఎంచుకోవాలనుకున్నారు. కానీ, ఎండోమెంట్ పాలసీని తీసుకున్నారు. దీనికి అధిక ప్రీమియం ఉంటుంది. ఇలాంటప్పుడు పాలసీని వాపసు ఇవ్వొచ్చు.
- పాలసీ నిబంధనలను తప్పుగా అర్థం చేసుకోవచ్చు. ఈ షరతుల వల్ల భవిష్యత్తులో మీకు ఇబ్బందులు ఎదురవుతాయని భావించినప్పుడు పాలసీని గడవు లోగా రద్దు చేసుకోవచ్చు.
- బీమా సంస్థ లేదా సలహాదారు సేవలతో మీరు సంతృప్తి చెందకపోయినా, నిర్ణీత గడువులోగా పాలసీని పూర్తిగా వెనక్కి ఇచ్చే అంశాన్ని పరిశీలించవచ్చు.

ఏం చేయాలి?

పాలసీని రద్దు చేసుకోవాలనుకున్నప్పుడు ముందుగా బీమా పత్రాన్ని పూర్తిగా చదవండి. వాపసు ఇచ్చేయడానికి బీమా సంస్థ షరతులు విధించిందా చూడండి. దాని ప్రకారం బీమా కంపెనీకి మీ నిర్ణయాన్ని తెలియజేయండి. కొన్ని బీమా సంస్థలు రద్దుకు సంబంధించిన దరఖాస్తు పత్రాన్ని అందిస్తున్నాయి. దీన్ని పూర్తి చేసి, ఇవ్వాలి.

మీ పాలసీ సంఖ్య, పేరు, చిరునామా, పాలసీ పత్రం అందుకున్న తేదీ, రద్దుకు కారణంవంటి ముఖ్యమైన వివరాలన్నీ చెప్పండి. రద్దు దరఖాస్తుతో పాటు పాలసీ అసలు పత్రం (ఒరిజినల్ డాక్యుమెంట్) జత చేయడం మర్చిపోవద్దు. బీమా సంస్థ సేవా కేంద్రానికీ, ఏజెంటుకూ పాలసీ రద్దుకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వండి. ఈ వివరాలన్నీ జాగ్రత్త చేసుకోండి.

ఖర్చులు మినహాయించుకొని..

మీ పాలసీ రద్దు సమాచారం అందిన తర్వాత బీమా సంస్థ దరఖాస్తును పరిశీలిస్తుంది. నిబంధనల మేరకు ప్రీమియంలో కొన్ని రుసుములు మినహాయించుకొని (వైద్య పరీక్షలు, స్టాంప్ డ్యూటీ, అప్పటి వరకూ రిస్కు ప్రీమియం) మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తుంది.

ఫ్రీ-లుక్ వ్యవధిలో బీమా పాలసీని రద్దు చేసుకునే వీలు.. పాలసీదారులకు బీమా నియంత్రణ సంస్థ అందించిన హక్కు. మీ బీమా అవసరాలను తిరిగి అంచనా వేసుకొని, పాలసీని ఎంచుకునేందుకు ఇది దోహదం చేస్తుంది.

రక్షణ రంగ కంపెనీల్లో

గ్రో మ్యూచువల్ ఫండ్ రెండు కొత్త పథకాలను తీసుకొచ్చింది. ఇందులో ఒకటి గ్రో నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఈటీఎఫ్, మరోటి గ్రో నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్). ఈ రెండు పథకాల ఎన్ఎఫ్ఓల ముగింపు తేదీ వచ్చే నెల 4. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.500 చొప్పున పెట్టుబడి పెట్టాలి. నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఇండెక్స్ టీఆర్ఐ సూచీతో ఈ పథకాల పనితీరును పోల్చి చూస్తారు. నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఇండెక్స్ టీఆర్ఐ సూచీలో భాగంగా ఉన్న కంపెనీల షేర్లపై అదే ప్రాధాన్యంతో పెట్టుబడులు పెట్టటం ద్వారా గ్రో నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఈటీఎఫ్ పథకం పోర్ట్‌ఫోలియోను రూపొందిస్తారు. కానీ గ్రో నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్) కొంత భిన్నమైనది. గ్రో నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఈటీఎఫ్ పథకం యూనిట్లలో పెట్టుబడి పెట్టటం గ్రో నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్) పథకం ప్రధాన వ్యూహం. అంటే, పరోక్షంగా ఇది గ్రో నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఈటీఎఫ్ మాదిరిగానే ఉంటుందనుకోవచ్చు. ఈటీఎఫ్ పథకంపై నిర్వహణ వ్యయాలు తక్కువగా ఉంటాయి. ఒకరకంగా 'ప్యాసివ్ ఫండ్' అనొచ్చు. ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ పథకం మాత్రం 'యాక్టివ్ ఫండ్' తరగతికి చెందుతుంది. నిర్వహణ వ్యయాలూ ఎక్కువగా ఉంటాయి. ప్రధానంగా మనదేశంలో రక్షణ రంగంలో వస్తున్న వృద్ధి అవకాశాలను వివిధ కంపెనీలు అందుకొని అధిక ఆదాయాలు, లాభాలను ఆర్జిస్తున్నాయి. ఇలాంటి కంపెనీలను గుర్తించి పెట్టుబడులు పెట్టటం లక్ష్యంగా ఈ రెండు పథకాలు మదుపరుల ముందుకు వచ్చాయి.

ఉత్పత్తి రంగంపై ఆసక్తి ఉంటే

దేశంలో ఉత్పత్తి రంగం అధిక వృద్ధి సాధిస్తూ జీడీపీలో తన వాటా పెంచుకుంటోంది. ప్రస్తుతం ఉత్పత్తి రంగం వాటా జీడీపీలో దాదాపు 17 శాతం వద్ద ఉండగా, త్వరలో ఇది 20 శాతాన్ని మించిపోతుందని, దాదాపు 24 శాతం వాటాను పొందే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ తరుణంలో ఉత్పత్తి రంగానికి చెందిన కంపెనీలపై పెట్టుబడి పెట్టటం ఎంతో లాభదాయకమనే ఆలోచనను పెట్టుబడి నిపుణులు ప్రస్తావిస్తున్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకొని ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్.. ఎల్ఐసీ మాన్యుఫ్యాక్చరింగ్ ఫండ్ అనే కొత్త పథకాన్ని ఆవిష్కరించింది. ఈ పథకం ఎన్ఎఫ్ఓ వచ్చే నెల 4 వరకూ అందుబాటులో ఉంటుంది. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.5,000 పెట్టుబడి పెట్టాలి. నిఫ్టీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ ఇండెక్స్ (టీఆర్ఐ)ను ఈ పథకానికి కొలమానంగా పరిగణిస్తారు. దీని కింద సేకరించిన నిధులను ఆటోమొబైల్, ఫార్మా, కెమికల్స్, ఇంజినీరింగ్, మెటల్స్, నౌకా నిర్మాణం, పెట్రోలియం ఉత్పత్తులు... సంబంధిత ఇతర విభాగాలకు చెందిన కంపెనీలపై పెట్టుబడి పెడతారు.

కొత్త పథకం

బ్యాంకింగ్ షేర్లపై పెట్టుబడికి

మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ పీఎస్‌యూ బ్యాంక్ ఈటీఎఫ్ పథకాన్ని తీసుకొచ్చింది. మిరే అసెట్ నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఈటీఎఫ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 30 వరకూ అందుబాటులోకి ఉంటుంది. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.5,000 పెట్టుబడి పెట్టాలి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ టీఆర్ఐ సూచీ ఈ పథకానికి కొలమానంగా ఉంటుంది. ఈ సూచీలో ఉన్న కంపెనీలపై అంతే ప్రాధాన్యంలో పెట్టుబడులు పెట్టటం ద్వారా మిరే అసెట్ నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఈటీఎఫ్ పోర్ట్‌ఫోలియో నిర్మిస్తారు. ఈటీఎఫ్ పథకం కాబట్టి నిర్వహణ వ్యయాలు తక్కువగా ఉంటాయి. దీర్ఘకాలిక మదుపరులకు ఈ పథకం అనుకూలంగా ఉంటుంది. బ్యాంకులు ఆకర్షణీయమైన వృద్ధి నమోదు చేస్తున్న నేపథ్యంలో వచ్చే కొన్నేళ్ల పాటు బ్యాంకుల షేర్లపై పెట్టుబడి లాభదాయకంగా మారుతుందనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ పథకంపై పెట్టుబడి పెట్టే అంశాన్ని మదుపరులు పరిగణించవచ్చు.

సాంకేతిక రంగంలో

డిజిటల్ టెక్నాలజీలపై పనిచేసే కంపెనీల మీద పెట్టుబడి పెట్టి అధిక లాభాలు ఆర్జించే లక్ష్యంతో ఒక కొత్త పథకం వచ్చింది. వైట్ ఓక్ కేపిటల్ మ్యూచువల్ ఫండ్ ఈ పథకాన్ని ఆవిష్కరించింది. వైట్ ఓక్ కేపిటల్ డిజిటల్ భారత్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ వచ్చే నెల 4 వరకూ అందుబాటులో ఉంటుంది. ఎన్ఎఫ్ఓలో కనీస పెట్టుబడి రూ.500. బీఎస్ఈ టెక్ టీఆర్ఐ సూచీ ఈ పథకానికి కొలమానంగా ఉంటుంది. ప్రధానంగా టెక్నాలజీ కంపెనీలపై విశ్వాసం ఉంటే, ఈ పథకాన్ని పెట్టుబడి కోసం పరిశీలించవచ్చు. ముఖ్యంగా క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్, ఆటోమేషన్ వల్ల విద్య, వైద్యం, వ్యవసాయం, లాజిస్టిక్స్ రంగాల్లో అనూహ్యమైన మార్పులు వస్తున్నాయి. అందువల్ల ఈ రంగాల్లోని కంపెనీలు అధిక ఆదాయాలు ఆర్జించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. దీన్ని పరిగణనలోకి తీసుకొని వైట్ ఓక్ కేపిటల్ ఈ కొత్త పథకాన్ని ఆవిష్కరించింది. ఇది దీర్ఘకాలిక మదుపరులకు అనుకూలంగా ఉంటుంది.

తొందరపడితే డబ్బు కాజేస్తారు.. జాగ్రత్త

ఒక వస్తువు మార్కెట్ ధరకంటే తక్కువ ధరకు వస్తుందంటే ఏం చేస్తాం.. అదీ పరిమితంగానే ఉందని చెబితే.. వెంటనే కొనేయాలని చూస్తుంటాం. ఇలాంటి తరహా మోసాలు ఇప్పుడు పెరిగిపోయాయి. ఇలాంటి సందర్భాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై బ్యాంక్‌బజార్.కామ్ కొన్ని సూచనలు చేసింది.

ఏం చేస్తారంటే: పండగలు, ఇతర ముఖ్యమైన సందర్భాల్లో ఎక్కడ చూసినా రాయితీలు కనిపిస్తూనే ఉంటాయి. ఇలాంటివే అని భ్రమించేలా మనకు ఇ-మెయిల్, సంక్షిప్త సందేశాలు వస్తుంటాయి.



ఉదాహరణకు.. విక్రమ్‌కు ఒక ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ నుంచి ప్రత్యేక డిస్కౌంటు ఇస్తున్నట్లుగా ఇ-మెయిల్ వచ్చింది. ఆఫర్ కేవలం రెండు గంటల పాటే అందుబాటులో ఉంటుందని, అదీ పరిమితంగానే వస్తువులు అందుబాటులో ఉన్నాయని దాని సారాంశం. మంచి అవకాశం కదా.. చేజారి పోతుందని భావించాడు విక్రమ్. అందులో పేర్కొన్న లింకును తెరిచి, తన క్రెడిట్ కార్డు వివరాలన్నీ ఇచ్చేశాడు. కార్డులో నుంచి డబ్బు పోయిన తర్వాతే అతనికి తెలిసింది. తాను మోసపోయానని, ఇలాంటి ఆఫర్లేమీ ఆ ప్రముఖ సంస్థ అందించడం లేదని.

ఏం చేయాలి?

పరిమిత కాలపు ఆఫర్లు అంటూ వచ్చే ఇ-మెయిల్, సందేశాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

- ఇ-మెయిల్‌లో వచ్చిన లింకును ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవకూడదు. దీనికి బదులుగా ఆయా సంస్థల అధికారిక వెబ్‌సైట్లలోకి వెళ్లడం మేలు.
- ముఖ్యంగా పరిమిత కాలం ఆఫర్లు అంటూ వచ్చే సందేశాలను పట్టించుకోవద్దు.
- మోసపూరిత మెయిళ్లలో కంపెనీల పేర్లకు సంబంధించి అక్షర దోషాలు ఉంటాయి. వీటిని కాస్త జాగ్రత్తతోనే గుర్తించగలం.
- చెల్లింపుల విషయానికి వస్తే రెండంచెల భద్రతను (టు-ఫ్యాక్టర్ అథెంటికేషన్) వినియోగించాలి. దీనివల్ల అదనపు రక్షణ ఉంటుంది.
- ఆన్‌లైన్ కొనుగోళ్లకు తక్కువ పరిమితి ఉన్న వాటిని వాడాలి.
- ఆఫర్ల గురించి ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకున్నాకే, కొనుగోలు నిర్ణయం తీసుకోవాలి. మోసపోయినట్లు గుర్తిస్తే, వెంటనే బ్యాంకుకు, సైబర్ క్రైమ్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేయాలి.

ఆర్థిక ప్రణాళిక

పొరపాట్లు లేకుండా



మిగతా విషయాల మాట ఎలా ఉన్నా.. ఆర్థిక ప్రణాళికలో చేసే చిన్న పొరపాట్లు భారీ నష్టమే కలిగిస్తాయి. పిల్లల చదువులు, పదవీ విరమణ, ఇల్లు కొనడం, బీమా తీసుకోవడం ఇలా ప్రతి విషయానికీ ఒక వ్యూహం ఉండాలి. దీన్ని సరైన క్రమంలో అమల్లో పెట్టకపోతే ఆర్థిక విజయానికి ఆటంకాలు ఎదురవుతాయి.

దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించేందుకు ఆర్థిక ప్రణాళిక ఎంతో కీలకం. చాలామంది దీన్ని అంతగా పట్టించుకోరు. సంపాదించిన మొత్తంలో కొంత ఖర్చుల నిర్వహణ, కొంత పెట్టుబడి ఇదే సరైన ప్రణాళిక అనుకుంటారు. నిజానికి జీవితంలో వివిధ దశలను ముందుగానే ఊహించి, దానికి తగ్గట్లుగా ఆర్థికంగా సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. దీనికి ఉపయోగపడేదే సమగ్ర ఆర్థిక ప్రణాళిక.

లక్ష్యం లేకుండా

ఆర్థిక ప్రణాళికల్లో అత్యంత సాధారణ తప్పుల్లో ఒకటి.. స్పష్టమైన లక్ష్యం లేకుండా పెట్టుబడి పెట్టడం. ఎలాంటి అనుభవం లేకుండా మార్కెట్లో పెద్ద మొత్తంలో మదుపు చేయడంలాంటివి ఇందుకు ఉదాహరణలు. పదవీ విరమణ కోసం పొదుపు చేయడం, ఇల్లు కొనడం, పిల్లల చదువులకు నిధులను సమకూర్చడం వంటి లక్ష్యాలను స్పష్టంగా తెలుసుకోవాలి. దీనికోసం ఎలాంటి పథకాలు ఉపయోగపడతాయనేది అర్థం చేసుకోవాలి. ఈ స్పష్టత లేకుండా అనవసరమైన రిస్కులు తీసుకొని, దీర్ఘకాలిక లక్ష్య సాధనకు ఉపయోగపడని పథకాలను ఎంచుకుంటే, నష్టపోయే ఆస్కారం ఉంటుంది.

నిర్ణీత, వాస్తవిక, సాధించగల లక్ష్యాలను నిర్ణయించుకోండి. వీటికోసం ఎంత డబ్బు అవసరం అవుతుంది, ఎంత వ్యవధి ఉంది లాంటివాటిని బట్టి, పెట్టుబడి పథకాలను ఎంచుకోండి. మీ వ్యూహం సరైన క్రమంలోనే సాగుతోందని తెలుసుకునేందుకు క్రమం తప్పకుండా వీటిని సమీక్షిస్తూ ఉండాలి. అవసరమైన మేరకు సర్దుబాట్లు చేయాలి.

నిర్లక్ష్యం చేయొద్దు..

బడ్జెట్‌ను రూపొందించడంలో ఆలస్యం చేయొద్దు. ఆర్థిక ప్రణాళికలో బడ్జెట్ ఎంతో ప్రధానం. మీ ఆదాయం, ఖర్చులు, రుణ వాయిదాలు, ఇతర వ్యయాలపై కచ్చితమైన అంచనా ఉండాలి. బడ్జెట్ వేసుకోకపోతే అధిక రుణాలు తీసుకునేందుకు కారణం అవుతుంది. దీనివల్ల అప్పుల ఊబిలో చిక్కుకుపోతాం.

మీ ఆదాయం, ఖర్చులన్నింటినీ ఒక చోట రాసి పెట్టుకోవడం మంచిది. వార్షిక బడ్జెట్‌ను రూపొందించుకోండి.

జీతం కోసం ఎదురుచూపు..

ఆర్థిక విజయం సాధించాలంటే.. మన దగ్గర ఖర్చులకు మించిన ఆదాయం ఉండాల్సిందే. జీతం రాగానే ఖర్చు చేసి, మళ్లీ జీతం కోసం ఎదురుచూసే పరిస్థితులు ఎప్పుడూ రాకూడదు. సాధారణ ఖర్చులతోపాటు, ఊహించని వ్యయాలకూ సిద్ధంగా ఉండాలి. లేకపోతే అప్పులు చేయాల్సి రావచ్చు. ఫలితంగా ఆర్థికంగా నిలదొక్కుకోవడం ఎప్పటికీ సాధ్యం కాదు.

వృథా వ్యయాలను తగ్గించుకోవడం ద్వారా మిగులు మొత్తాన్ని పెంచుకునే ప్రయత్నం చేయాలి. ముందుగా పెట్టుబడులు, ఆ తర్వాతే ఖర్చులు అనే సూత్రాన్ని పాటించాలి.

పన్ను ఆదా కోసం...

ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే పన్ను ప్రణాళిక ప్రారంభం కావాలి. కానీ, చాలామంది దీన్ని విస్మరిస్తారు. జనవరి తర్వాతే పన్ను ఆదా కోసం మదుపు చేయడం ప్రారంభిస్తారు. ఫలితంగా ఆర్థిక సంవత్సరం చివరి మూడు నెలల్లో ఒత్తిడి ఎదురవుతుంది. పథకాల ఎంపికలోనూ రాజీ పడాల్సి రావచ్చు.

దీన్ని నివారించేందుకు ఏప్రిల్ నుంచి పెట్టుబడులను ప్రారంభించాలి. లేదా కనీసం ఆరు నెలల ముందు అంటే అక్టోబరు నుంచైనా పన్ను మినహాయింపుల గురించి ఆలోచించాలి. కొత్త పన్ను విధానం ఎంచుకునే వారు పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం లేదు. కానీ, పాత పన్ను విధానంలో కొనసాగుతున్న వారు తక్కువ లాకిన్ ఉన్న పథకాల్లో మదుపు చేసేందుకు ప్రయత్నించాలి.

అత్యవసర నిధి ఉందా?

ఆర్థిక ప్రణాళికల విషయంలో చాలామంది చేసే పొరపాటు అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోకపోవడం. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆరోగ్య అత్యవసర నిధీ ఎంతో కీలకంగా మారింది.

ఆరు నెలలకు సరిపోయే ఖర్చును అత్యవసర నిధిగా.. రూ.లక్ష వరకూ ఆరోగ్య నిధిగా ఉంచుకోవాలి. ఈ రెండు నిధులూ లేకపోతే అత్యవసరాల్లో ఇబ్బందులు తప్పవు.

తక్కువ నష్టభయంతో..

తక్కువ నష్టభయం ఉండాలని చాలామంది ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారంలాంటి వాటిల్లో ఎక్కువగా పెట్టుబడులు పెడుతుంటారు. కానీ, ఇవి దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధికి సహకరించవు. నష్టభయం ఉన్నప్పటికీ మార్కెట్ ఆధారిత పథకాలను ఎంచుకునే ప్రయత్నం చేయాలి. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణానికి మించిన రాబడి అందుతుందని చరిత్ర చెబుతోంది. పెట్టుబడులు వైవిధ్యంగా ఉండేలా చూసుకోవాలి. ఆర్థిక లక్ష్యాలు, నష్టభయం భరించే సామర్థ్యం, పెట్టుబడి వ్యవధిని బట్టి, పోర్ట్‌ఫోలియోను నిర్మించుకోవడం మంచిది.

కనీసం ఏడాదికోసారైనా మీ ప్రణాళికను సమీక్షించుకోవాలి. అవసరమైన మార్పులు చేర్పులు చేసుకుంటూ ఉండాలి. అప్పుడే ఆర్థికంగా విజయం సాధించేందుకు ఇది తోడ్పడుతుంది.

అనుకోని ఆర్థిక అవసరాలు తలెత్తినప్పుడు చాలామంది వ్యక్తిగత రుణాల(పర్సనల్ లోన్) వైపు చూస్తుంటారు. బ్యాంకులతోపాటు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, డిజిటల్ రుణ యాప్‌లు వీటిని వేగంగా అందిస్తున్నాయి. వైద్య ఖర్చులు, విహార యాత్రలు, చిన్న రుణాలను తీర్చడానికి ఒక పెద్ద అప్పు ఇలా పలు సందర్భాల్లో ఈ రుణాలను తీసుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. తక్షణ అవసరాలను తీర్చుకునేందుకు ఇవి ఆకర్షణీయంగానే కనిపిస్తుంది. కానీ, దీర్ఘకాలిక ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. కాబట్టి, వ్యక్తిగత రుణం తీసుకునేటప్పుడు కొన్ని విషయాలను పరిశీలించి, ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.

వ్యక్తిగత రుణం ఇవి తెలుసుకున్నాకే



ఎలాంటి హామీ అవసరం లేకుండా, వెంటనే లభించేవి వ్యక్తిగత రుణాలు. గృహ, వాహన రుణాలతో పోలిస్తే వీటికి కాస్త అధిక వడ్డీ వర్తిస్తుందని చెప్పాలి. క్రెడిట్ స్కోరు 750కి పైగా ఉన్నప్పుడు చాలా రుణ సంస్థలు ఈ అప్పు ఇవ్వడానికి ముందుకు వస్తుంటాయి. ముఖ్యంగా ప్రస్తుతం పండగల సీజన్ నడుస్తోంది. ఈ దశలో కాస్త అధిక వడ్డీతోనైనా రుణం తీసుకునేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తుంటారు. బ్యాంకులూ ఇప్పుడు రుణాలను ఇచ్చేందుకు కొన్ని ప్రత్యేక పథకాలనూ అందుబాటులోకి తెస్తుంటాయి. ఈ నేపథ్యంలో పరిగణించాల్సిన ప్రధాన అంశాలూ కొన్ని ఉన్నాయి.

రుణ మొత్తం: వ్యక్తిగత రుణాన్ని తీసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు ఎంత మేరకు రుణం తీసుకోవాలన్నది ముఖ్యం. మీకు అవసరమైన మేరకే అప్పు తీసుకునేందుకు ప్రయత్నించండి. నిధుల అవసరాన్ని బట్టి, అప్పు చేయండి. ఇస్తున్నారు కదా అని అధిక మొత్తం తీసుకుంటే, వడ్డీ భారం మోయక తప్పదు.

కాల వ్యవధి: రుణం తీసుకునేటప్పుడు వీలైనంత తొందరగా రుణాన్ని తిరిగి చెల్లించేందుకు ప్రయత్నించండి. వ్యక్తిగత రుణం గరిష్ఠంగా 36 నెలల వ్యవధికి మించకుండా చూసుకోవాలని నిపుణులు చెబుతుంటారు. కాస్త ఈఎంఐ అధికంగా ఉన్నప్పటికీ, తొందరగా రుణ విముక్తులు అవుతారు.

ఎక్కడ?: వ్యక్తిగత రుణం ఎక్కడ తీసుకుంటున్నారన్నదీ చాలా ముఖ్యం. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అందించే రుణాల విషయంలో చిక్కులు అంతగా ఉండవు. కానీ, రుణ యాప్‌ల విషయంలో ఒకటికి రెండు సార్లు ఆలోచించాలి. వీలైనంత వరకూ వీటి నుంచి తీసుకోకపోవడమే ఉత్తమం.

క్రెడిట్ స్కోరు: మంచి క్రెడిట్ స్కోరున్నప్పుడు వ్యక్తిగత రుణం సులభంగా లభిస్తుంది. కాబట్టి, రుణానికి దరఖాస్తు చేసేముందు మీ క్రెడిట్ స్కోరును ఒకసారి పరిశీలించండి. కనీసం 750కి తగ్గకుండా స్కోరుంటే, రుణం తొందరగా లభిస్తుంది.

వడ్డీ రేటు: ప్రస్తుతం వ్యక్తిగత రుణాల వడ్డీ రేటు 12-23 శాతం వరకూ ఉంటోంది. కాబట్టి, రుణం తీసుకునేముందు కచ్చితంగా వడ్డీ రేటును పరిగణనలోకి తీసుకోండి. ఒకటికి రెండు బ్యాంకుల వడ్డీ రేటును పోల్చి చూసుకున్నాకే అప్పు తీసుకోండి.

వాయిదాలు: మీరు తీసుకున్న రుణం, వడ్డీ, వ్యవధిని బట్టి, వాయిదా ఆధారపడి ఉంటుంది. క్రమం తప్పకుండా చెల్లించేందుకు ఇబ్బంది లేకుండా ఉండేలా వాయిదా మొత్తం ఉండాలి. గడువు లోపు చెల్లించకపోతే క్రెడిట్ స్కోరుపై ప్రభావం పడుతుందన్న సంగతి మర్చిపోవద్దు.

ముందే చెల్లిస్తే: గడువుకు ముందే తీర్చేస్తే కొన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు చెల్లించాల్సిన అసలుపై 3-6 శాతం వరకూ ముందస్తు చెల్లింపు రుసుములను విధిస్తాయి. వీటి గురించి ముందే తెలుసుకోవాలి.

40 శాతం మించకుండా: అన్ని రుణాలకూ కలిపి చెల్లిస్తున్న వాయిదాలు మీ మొత్తం ఆదాయంలో 40 శాతానికి మించకుండా ఉండేలా చూసుకోండి. అధికంగా వాయిదాలు చెల్లిస్తుంటే.. ఇతర బాధ్యతలకు డబ్బు మళ్లించడం కష్టం అవుతుంది.

ప్రత్యామ్నాయాలు: వ్యక్తిగత రుణం తీసుకునే ముందు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలు చూసుకోవాలి. తాత్కాలికంగా డబ్బు సర్దుబాటు చేసుకునేందుకు అత్యవసర నిధిని వాడుకోవచ్చు. వీలైనంత తొందరగా దాన్ని తిరిగి భర్తీ చేయాలి. బంగారాన్ని హామీగా ఉంచి రుణం తీసుకోవచ్చు. ఇలా మిగతా వాటినీ పరిశీలించిన తర్వాత, తప్పదు అనుకున్నప్పుడే వ్యక్తిగత రుణం వైపు చూడాలి.

డెట్ ఫండ్లలో మదుపు చేయొచ్చా?

మార్గదర్శి

నా వయసు 67. పూర్తి ఆరోగ్యంగా ఉన్నాను. ఇప్పుడు నేను కనీసం రూ.50లక్షలకు టర్మ్ పాలసీ తీసుకునే వీలుందా? - భాస్కర్

❑ సాధారణంగా బీమా సంస్థలు 65 ఏళ్ల వారి వరకూ టర్మ్ పాలసీని ఇస్తున్నాయి. కొన్ని కంపెనీలు 70 ఏళ్ల వారికీ పాలసీ అందిస్తున్నాయి. ఈ వయసులో టర్మ్ పాలసీ తీసుకునేందుకు కొన్ని నిబంధనలు ఉంటాయి. ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి. తగినంత ఆదాయమూ ఉండాలి. బీమా సంస్థ విచక్షణ మేరకు పాలసీ లభిస్తుంది. ప్రీమియమూ కాస్త అధికంగానే ఉంటుంది.

మాకు ఇద్దరు అమ్మాయిలు. వారి పేరు మీద నెలకు రూ.15వేల వరకూ మదుపు చేయాలని అనుకుంటున్నాను. ఇందుకోసం ఎలాంటి పథకాలను ఎంచుకోవాలి? - ప్రభాకర్

❑ ముందుగా మీ అమ్మాయిల భవిష్యత్ అవసరాలకు తగిన భద్రత కల్పించండి. ఇందుకోసం మీ పేరుపై వార్షికాదాయానికి 12 రెట్ల వరకూ జీవిత బీమా పాలసీ తీసుకోండి. చదువుల ఖర్చులు రోజురోజుకూ ఎలా పెరుగుతున్నాయో చూస్తూనే ఉన్నాం. భవిష్యత్తులో ఇంకా పెరుగుతాయి. కాబట్టి, ఈ ఖర్చులను తట్టుకునేలా రాబడి వచ్చేలా చూసుకోవాలి. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవడం ఇందుకు ఒక మార్గం. 10 ఏళ్లపాటు నెలకు రూ.15వేల చొప్పున మదుపు చేస్తూ వెళ్తే సగటు వార్షిక రాబడి 12 శాతం అంచనాతో రూ.31,58,772 అయ్యేందుకు అవకాశం ఉంది.

నేను నెలకు రూ.25వేల వరకూ రికరింగ్ డిపాజిట్ చేస్తున్నాను. తక్కువ నష్టభయంతో మంచి రాబడిని ఆర్జించేందుకు డెట్ మ్యూచువల్ ఫండ్లు బాగుంటాయని అంటున్నారు. నిజమేనా? - శ్రీధర్

❑ ప్రస్తుతం రికరింగ్ డిపాజిట్లపై 7 నుంచి 7.5 శాతం వరకూ రాబడి వస్తోంది. మంచి క్రెడిట్ నాణ్యత ఉన్న డెట్ మ్యూచువల్ ఫండ్లలోనూ ఇదే విధంగా రాబడి అందుతోంది. కాబట్టి, పెద్దగా వ్యత్యాసం లేదనే చెప్పాలి. స్వల్పకాలం కోసం మీరు రికరింగ్ డిపాజిట్లలోనే కొనసాగడం మేలు. కనీసం ఆరేళ్లకు పైగా పెట్టుబడిని కొనసాగిస్తా అనుకుంటే బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్, హైబ్రిడ్ ఈక్విటీ ఫండ్లను పరిశీలించవచ్చు.

- తుమ్మ బాల్‌రాజ్

భారతదేశంలో జనాభా పెరుగుదల - కారణాలు

ఐక్యరాజ్య సమితి గణాంకాల ప్రకారం ప్రస్తుతం భారత్ జనాభా పరంగా ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. మరణాల రేటు క్రమేణా తగ్గి, జననాల రేటు అధికంగా ఉండటమే దేశంలో జనాభా వేగంగా పెరగడానికి కారణం. ఇదే జనాభా విస్ఫోటనానికి దారి తీసింది. ఇది ఒక ఆర్థిక, సాంఘిక సమస్య. అధిక జనాభా ఆర్థికాభివృద్ధికి అవరోధం. అయితే కొంతమంది ఆర్థికవేత్తలు జనాభా వృద్ధి రేటు చాలా నెమ్మదిగా జరిగితే వరంగా, వేగంగా జరిగితే ఆర్థికాభివృద్ధికి అవరోధంగా పేర్కొన్నారు. భారతదేశంలో జనాభా పెరుగుదలకు కారణాలు, వాటి నివారణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.



టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

తక్కువగా ఉంటే వరం.. ఎక్కువైతే ఆర్థిక వృద్ధికి అవరోధం!

అధిక జననాల రేటుకు కారణాలు

దేశంలో జననాల రేటు అధికంగా ఉంది. ఆర్థిక, సాంఘిక అంశాలే దీనికి కారణాలుగా ఉన్నాయి.

ఆర్థిక కారణాలు

ఆర్థికపరంగా జనాభా పెరుగుదలకు మూడు రకాల కారణాలు ఉన్నాయి. అవి: 1. వ్యవసాయానికి ప్రాధాన్యం 2. నగరీకరణ 3. పేదరికం

వ్యవసాయానికి ప్రాధాన్యం: భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయంతో అనుసంధానమై ఉంటుంది. ఇక్కడ రైతులు ఎక్కువ. వ్యవసాయరంగంలో ఉత్పాదక కార్యక్రమాలు ఉద్ధృతంగా ఉన్న కాలంలో శ్రామికుల అవసరం అధికం. దీంతో వ్యవసాయదారుల కుటుంబాల్లో అధిక సంతానమే ఉంటుంది.

నగరీకరణ: దేశంలో పారిశ్రామికీకరణ నిర్విరామంగా, వేగంగా జరగకపోవడం వల్ల నగరీకరణ ప్రక్రియ కూడా మందగమనంలో ఉంది. దీంతో భారత్‌లో కుటుంబ నియంత్రణపై ప్రజల్లో అంతగా అవగాహన ఏర్పడలేదు.

పేదరికం: అల్ప అభివృద్ధి చెందిన దేశాల్లో పేదరికం కారణంగా జననాల రేటు అధికంగా ఉంది. తక్కువ ఆదాయ స్థాయి కలిగిన కుటుంబాల వారు ఎంత ఎక్కువ సంతానం ఉంటే అంత ప్రయోజనమని భావిస్తారు.

- ఎందుకంటే పేదవారికి వారి శ్రమ మినహా ఇతర ఆర్థికపరమైన ఆస్తులు ఏమీ ఉండవు. కాబట్టి కుటుంబంలో ఎక్కువ మంది శ్రామికులు ఉంటే కుటుంబ సంపాదన కూడా ఎక్కువగా ఉంటుందని వారు భావిస్తారు.
- పేదవర్గాల వారు కుటుంబ నియంత్రణ పథకాలను అంగీకరించకపోవడానికి పేదరికమే ముఖ్య కారణం.

జనాభా విస్ఫోటనాన్ని ఎదుర్కొనే అంశాలు

పారిశ్రామిక రంగ విస్తరణ – ఉపాధి కల్పన: ఉద్యోగాలు సాధించడంలో ఉన్న సమస్యలు పారిశ్రామిక శ్రామికులకు తెలుసు. కాబట్టి వారు కుటుంబ పరిమాణాన్ని తగ్గించుకోవాల్సిన అవసరాన్ని గుర్తిస్తారు.

- నగరీకరణ, పారిశ్రామికీకరణ పరస్పరం ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉంటాయి. పట్టణాల్లో ఇంటి అద్దె, పిల్లల పెంపకం, ఇతర అవసరాలన్నీ ఎక్కువ ఖర్చుతో కూడుకుని ఉంటాయి. దీంతో నగరాల్లోని ప్రజలు సహజంగానే చిన్న కుటుంబాలపై ఆసక్తి చూపిస్తారు.

సమత్వంతో కూడుకున్న ఆదాయ పంపిణీ, పేదరిక నిర్మూలన: పేదలకు కనీస జీవన సదుపాయాలు లభిస్తే ఎక్కువ సంతానాన్ని కోరుకునే ఆర్థిక నిర్బంధం (Economic Compulsion) ఉండదు. కుటుంబ పరిమాణం విషయంలో ప్రజల దృక్పథం కూడా మారుతుంది.

- ఎంతమంది పిల్లలు కలిగి ఉండాలో ఆలోచించడమే కాకుండా, వారికి సౌకర్యవంతమైన జీవనాన్ని అందించే ప్రయత్నం చేస్తారు.
- ఈ మార్పు కోసం సమానత్వంతో కూడిన ఆదాయ పంపిణీ, జీవనానికి తగిన వేతనంతో కూడిన పని హక్కు (Right to Work) ఉండాలి.

విద్య: కుటుంబం, వివాహం, సంతానం మొదలైన విషయాల్లో వ్యక్తి ఆలోచనా సరళిని విద్య మారుస్తుంది.

- చదువుకున్నవారిలో ఎక్కువమంది ఆలస్యంగా పెళ్లి చేసుకుని, చిన్న కుటుంబాలకు ప్రాధాన్యం ఇస్తారు.
- సంప్రదాయాలు, మూఢనమ్మకాలను వదిలి, ప్రజలు కుటుంబ నియంత్రణ పాటించేలా విద్య ప్రేరేపిస్తుంది. బాలబాలికలు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా వివాహాలు ఆలస్యంగా జరిగి, తద్వారా స్త్రీలలో పునరుత్పత్తి కాలం తగ్గుతుంది. స్త్రీల అక్షరాస్యతకు, జననాల రేటుకు అవినాభావ సంబంధం ఉంటుంది.

జనాభా పెరుగుదలను నియంత్రించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు

ప్రస్తుతం భారతదేశంలోని అధిక జనాభా ఆర్థికాభివృద్ధికి అవరోధంగా మారుతోంది. అయితే ఆర్థికవేత్తల్లో ఈ విషయమై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ప్రభుత్వం జనాభా నియంత్రణకు చర్యలు తీసుకుంది.

సాంఘిక కారణాలు

దేశంలో జనాభా పెరుగుదలకు ఉన్న సాంఘిక కారణాలను ఆరు రకాలుగా విభజించారు. అవి:

- వివాహానికి సర్వజన అంగీకారం
- తక్కువ వయసులో వివాహం
- మతపరమైన సాంఘిక మూఢనమ్మకాలు
- ఉమ్మడి కుటుంబం
- విద్యా రాహిత్యం
- గర్భనిరోధక పద్ధతులను పరిమితంగా ఉపయోగించడం (Contraceptive methods)

వివాహానికి సర్వజన అంగీకారం: వివాహం మతపరంగా, సామాజికంగా తప్పనిసరి. విద్యా వ్యాప్తి వల్ల వివాహంపై ప్రజల దృక్పథం మారి కొందరు పెళ్లి చేసుకోవద్దనే నిర్ణయానికి రావొచ్చు.

- అయితే దేశంలో విద్యావ్యాప్తి వేగంగా జరగకపోవడం, మారుతున్న సమాజ పోకడలతో ఈ ఫలితాన్ని ఆశించలేం.

తక్కువ వయసులో వివాహం: దేశంలో జననాల రేటు ఎక్కువగా ఉండటానికి ముఖ్యకారణం తక్కువ వయసులో పెళ్లిళ్లు జరగడమే. ప్రస్తుతం భారతదేశంలో స్త్రీ సగటు వివాహ వయసు 18 ఏళ్లు ఉంటే, పురుషుడి వివాహ వయసు 21 ఏళ్లుగా ఉంది. దీంతో ప్రసూతి రేటు ఎక్కువగా ఉంది.

- సగటు వివాహ వయసు పెంచాలంటే ప్రజల్లో సామాజిక స్పృహ, విద్యా వ్యాప్తి తప్పనిసరి. ప్రస్తుతం ఉన్న స్త్రీ, పురుషుల వివాహ వయసును పెంచితే ప్రసూతి రేటు తగ్గి, జననాల రేటు కూడా తగ్గుతుంది.

మతపరమైన సాంఘిక మూఢనమ్మకాలు: మతపరమైన నమ్మకాలు కూడా కొన్ని వర్గాల ప్రజలు ఎక్కువ సంతానాన్ని కోరుకోవడానికి కారణంగా నిలుస్తున్నాయి.

- సాంఘికపరమైన మూఢనమ్మకాల కారణంగా ఎక్కువ మంది ప్రజలు తమ ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా పిల్లలను కనడానికి ప్రాధాన్యం ఇస్తారు. పిల్లలను భగవంతుడు ఇచ్చినట్లుగా, ముందే నిర్ణయించినట్లుగా పరిగణించడం ఆ మత విశ్వాసాల్లో భాగంగా ఉంటాయి.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ: యుక్త వయసులోని భార్యాభర్తలకు పిల్లలను పోషించే ఆర్థికస్తోమత ఉండదు. అయితే వీరు సంతానాన్ని కనేలా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రోత్సహిస్తుంది. ఎందుకంటే వారి ఆర్థిక భారాన్ని ఆదాయాన్ని పొందే కుటుంబ సభ్యులు భరిస్తారు. అయితే ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో ఈ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైంది.

విద్యా రాహిత్యం: 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో మొత్తం అక్షరాస్యత రేటు 73% ఉంది. ఇందులో పురుషుల అక్షరాస్యత రేటు 80.9% ఉండగా, స్త్రీల అక్షరాస్యత రేటు 64.6శాతంగా ఉంది. అంటే పురుషుల కంటే స్త్రీల అక్షరాస్యత రేటు తక్కువగా ఉంది.

- 2017లో దేశంలో మొత్తం అక్షరాస్యత రేటు 77.7% ఉండగా; ఇందులో పురుషుల అక్షరాస్యత రేటు 84.7%, స్త్రీల అక్షరాస్యత రేటు 70.3%. అప్పుడు కూడా పురుషుల కంటే స్త్రీల అక్షరాస్యత రేటు తక్కువగా ఉంది.
- 1951లో దేశంలో మొత్తం అక్షరాస్యత రేటు 18.3% ఉండగా; పురుషుల అక్షరాస్యత రేటు 27.2%, స్త్రీల అక్షరాస్యత రేటు 8.9శాతంగా ఉంది.
- కుటుంబం, వివాహం, పిల్లల జననాల విషయంలో ప్రజల దృక్పథం కేవలం విద్యతోనే మారుతుంది. నిరక్షరాస్యులకు హేతుబద్ధ ఆలోచనలు ఉండవు. విద్యకు, ప్రసూతి రేటుకు మధ్య విలోమ సంబంధం (Inverse relation) ఉంటుంది.

గర్భనిరోధక పద్ధతులు పరిమితంగా ఉపయోగించడం: ప్రభుత్వం కుటుంబ నియంత్రణ పథకాలను అమలు చేస్తూ, గర్భనిరోధక పద్ధతులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. అయినప్పటికీ విద్యారాహిత్యం, మూఢనమ్మకాల కారణంగా కొన్ని వర్గాల ప్రజలు వీటికి దూరంగా ఉంటున్నారు.

- విద్యా వ్యాప్తి బాగా జరిగితే ప్రజలు తప్పకుండా చిన్న కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తారు.

కుటుంబ నియంత్రణ పథకం

కేంద్ర ప్రభుత్వం 1952లో కుటుంబ నియంత్రణ పథకాన్ని (Family Planning Programme) ప్రవేశపెట్టింది. దీని ఉద్దేశం జనాభా పెరుగుదలను అరికట్టడం. ఇందులో నాలుగు భాగాలు ఉంటాయి. అవి:

1. ప్రభుత్వ సమాచార పథకం
2. ప్రోత్సాహకాలు (Incentives), నిరుత్సాహకాలు (Disincentives)
3. కుటుంబ నియంత్రణ కేంద్రాలు
4. పరిశోధన

ప్రభుత్వ సమాచార పథకం: పునరుత్పత్తి దశలో ఉన్న వివాహిత జంటలకు కుటుంబ నియంత్రణ పథకం వల్ల ఉపయోగాలను తెలియజేసి, వారిలో సామాజిక స్పృహ స్థాయిని పెంచడం.

- కుటుంబ నియంత్రణకు ఉన్న ప్రాధాన్యతలను తెలిపేందుకు ప్రభుత్వం అన్ని రకాల సమాచార సాధనాలను ఉపయోగిస్తోంది.
- ఒకసారి ప్రజలు ఆలోచనలు కుటుంబ నియంత్రణ వైపు మళ్లితే వారే స్వచ్ఛందంగా దీన్ని పాటిస్తారు.

ప్రోత్సాహకాలు, నిరుత్సాహకాలు: కుటుంబ నియంత్రణ పాటించిన వారికి ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహకాలను ఇస్తుంది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్నవారికి నగదు బహుమతులను అందిస్తోంది.

కుటుంబ నియంత్రణ కేంద్రాలు: కుటుంబ నియంత్రణ పథకంలో కుటుంబ నియంత్రణ కేంద్రాల స్థాపన తప్పనిసరి భాగం.

- కుటుంబ నియంత్రణకు అవసరమయ్యే వివిధ వైద్య సదుపాయాలను ఈ కేంద్రాలు కల్పిస్తాయి.
- గర్భనిరోధక సాధనాల పంపిణీ కేంద్రాలు కూడా కుటుంబ నియంత్రణలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి.

పరిశోధన: జనాభా సంబంధ విషయాలు, సమాచార సేకరణ, పునరుత్పత్తి, ప్రసూతి నియంత్రణ మొదలైన అంశాలపై పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

- భారత ప్రభుత్వం ఈ పరిశోధనల ద్వారా గరిష్ఠ ప్రయోజనం పొందవచ్చని గుర్తించింది.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

423 Word of the Day

Scintillate

Telugu meaning: మెరవడం, మిరుమిట్లుగొలపడం

English meaning: The word 'scintillate' is a verb that describes emitting flashes of light; to sparkle or shine brightly.

Synonyms: Twinkle, Shine

Antonyms: Fade, Tarnish

Usage: 1. The diamond on her ring scintillated under the ballroom lights, catching everyone's attention.
2. During his speech, his wit and humour seemed to scintillate, captivating the audience with every word.

నోటిఫికేషన్స్

ఎంటీపీఎఫ్, అంబర్‌నాథ్

ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్ఎల్)కు చెందిన మహారాష్ట్ర థానే జిల్లా అంబర్‌నాథ్‌లోని మెషిన్ టూల్ ప్రొటోటైప్ ఫ్యాక్టరీ (ఎంటీపీఎఫ్) ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ మేనేజర్, డిప్లొమా టెక్నీషియన్, అసిస్టెంట్, జూనియర్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ఆఫ్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 81. దరఖాస్తులకు చివరి తేదీ 11 అక్టోబరు 2024.

సీటెట్ డిసెంబరు - 2024

డిసెంబరు - 2024 ఏడాదికి సంబంధించిన సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్షను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు 2024, అక్టోబరు 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

నాన్ టీచింగ్ పోస్టులు

రాంచీలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఝార్ఖండ్ (సీయూజే) డైరెక్ట్ ప్రాతిపదికన 33 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దరఖాస్తు ఫీజు రూ.1000. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 8 అక్టోబరు 2024.

ఇస్రో- హెచ్ఎస్ఎఫ్‌సీ

ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)కు చెందిన బెంగళూరులోని హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ (హెచ్ఎస్ఎఫ్‌సీ) తాత్కాలిక ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్, డ్రాఫ్ట్స్‌మ్యాన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం ఖాళీల సంఖ్య 103. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 9 అక్టోబరు 2024.

దరఖాస్తు చేశారా..?

ఈ ఉద్యోగాలకు నేడే (సెప్టెంబరు 27) ఆఖరు తేదీ

- బీఐఎస్‌లో 97 కన్సల్టెంట్ ఉద్యోగాలు. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు. ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ఎస్ అండ్ పీ గ్లోబల్‌లో అసోసియేట్ పోస్టులు. ఎంబీఏ (ఫైనాన్స్) ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

లేటెస్ట్ నోటిఫికేషన్స్, కరెంట్ అఫైర్స్ మిస్ కాకుండా.. ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఈనాడు ఈప్రతిభ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి..

Kadimi Chettu was written by..?

Current Affairs

1. Which of the following persons has been appointed as India's Ambassador to Croatia?
A) Arun Goel B) Charan Tej
C) Mukesh D) Surya Prakash

2. Government initiates .... investigation into steel imports from Vietnam.
A) anti B) anti-riding
C) anti-polity D) anti-dumping

3. The Vishvasya-Blockchain Technology Stack, launched by which of the following organizations?
A) MeitY B) ReitY
C) leitY D) geitY

4. Which of the following missions of India has achieved a significant milestone by becoming the first lunar mission to detect over 250 seismic signals?
A) Chandrayaan-4 B) Chandrayaan-1
C) Chandrayaan-2 D) Chandrayaan-3

5. Which of the following persons has been chosen to carry the Indian flag during the closing ceremony of the Paris Paralympics?
A) Riyansh B) Satish
C) Harvinder Singh D) Raja Gopal

6. 75 Great Revolutionaries of India, book authored by which of the following persons?
A) Ram Nadh B) Bhim Singh
C) Murali D) Gobind

7. Which of the following persons received Lifetime Award at Locarno Film Festival?
A) Shah Rukh Khan B) Salman Khan
C) Imran Khan D) Amir Khan

8. On which of the following days, the world observes the International Day of Police Cooperation?
A) September 7 B) August 7
C) November 7 D) April 7

History

9. .... was the British Governor general during the 1857 sepoy revolt.
A) Lord Wavell B) Lord Lytton
C) Lord Mayo D) Lord Canning

10. .... was India's First Law member of the Governor-General's Council.
A) Lord Amherst B) Lord Macaulay
C) Lord Ripon D) James Mill

11. Kadimi Chettu (story of Mayur Sharma) was written by which author?
A) Vajradatta
B) Veeranarayana C) Amoghavarsha
D) Visawanatha Satyanarayana


SSC Exams Special
General Awareness

12. Which of the following was the capital of Kosala kingdom in ancient India?
A) Rajgrih B) Pataliputra
C) Shravasti D) Vajji

Polity

13. Which of the following articles of the Constitution empowers the President to summon and prorogue either house of Parliament or to dissolve the Lok Sabha?
A) Article 80 B) Article 78
C) Article 75(2) D) Article 85(1)

14. Which state has maximum Rajya Sabha seats?
A) Uttar Pradesh B) Maharashtra
C) Tamilnadu D) Madhya Pradesh



Shah Rukh Khan

15. Which of the following parts of the Indian Constitution deals with relations between the Union and the States?
A) Part VIII B) Part XI
C) Part X D) Part IX

16. The Right of Children to Free and Compulsory Education Act 2009 is an act of Parliament which came into force in which year?
A) 2010 B) 2009 C) 2012 D) 2014

Geography

17. Dudhsagar waterfall is a four-tiered waterfall located on which river?
A) Mandovi B) Pennar
C) Mahanadi D) Ganga

18. Which of the following is the second-largest moon in our solar system?
A) Titan B) Atlas
C) Europa D) Ganymede

19. Which of the following is the longest river of both China and Asia?
A) Amur river B) Pearl river
C) Yellow river D) Yangtze river

20. Which of the following is the leading cotton growing State in India?
A) Tamil Nadu
B) Madhya Pradesh
C) Gujarat
D) Maharashtra

Scan the QR code for Key

*These model questions were prepared by subject experts of **QnA Academy**, Hyderabad*

ప్రాక్టీస్ బిట్లు

ఇండియన్ హిస్టరీ

1. 'స్వస్తిక' అంటే..
   1) ఇది ఒక మతపరమైన గుర్తు.
   2) గోధుమ, బార్లీని వర్షాకాలంలో 60 రోజుల్లో పండించడం.
   3) వరిని వర్షాకాలంలో 60 రోజుల్లో పండించడం.
   4) వరిని వేసవిలో 60 రోజుల్లో పండించడం.
2. శతపథ బ్రాహ్మణం ప్రకారం వరి నాట్లు వేసి పండించడాన్ని ఏమంటారు?
   1) కినుక 2) నెల్లూకా 3) స్వస్తిక 4) ప్లసుక
3. జనపదాల కాలంలో 'కుసుదిన్' అంటే..
   1) అప్పు ఇచ్చిన వ్యక్తి 2) అప్పు తీసుకున్న వ్యక్తి 3) మధ్యవర్తి 4) వర్తకుడు
4. జనపదాల కాలంలో బ్రాహ్మణులకు గౌరవంగా ఇచ్చే బంగారు నాణెం?
   1) శతమానం 2) సువర్ణ 3) నిష్కా 4) కృష్ణాల
5. కిందివాటిలో జనపదాల కాలంలో ప్రముఖ వర్తక కేంద్రం కానిది?
   1) రాజగృహ 2) చంప 3) కాశీ 4) బోధన్
6. జనపదాల కాలంలో రేవు పట్టణం కానిది?
   1) తక్షశిల 2) బరుకచ్చం 3) వైశాలి 4) కాశీ
7. కిందివాటిలో జనపదాల కాలం నాటి రహదారి మార్గం కానిది?
   1) కౌశాంబి నుంచి గంగా మైదానాల ద్వారా ఇరాన్, మధ్య ఆసియాకు
   2) రాజగృహ నుంచి కౌశాంబి, ఉజ్జయిని ద్వారా పశ్చిమ దేశాలకు
   3) గంగా మైదానాల ద్వారా రష్యాకు
   4) గంగా మైదానాల నుంచి దక్షిణ తూర్పు ప్రాంతాలకు

సమాధానాలు: 1-3; 2-4; 3-2; 4-1; 5-4; 6-4; 7-3.

కాలుష్యానికి పరిష్కారం.. శిలాజాలకు ప్రత్యామ్నాయం!

జీవద్రవ్యాల నుంచి ఉత్పత్తి అయ్యే ఇంధనాలే జీవ ఇంధనాలు. పెట్రోలియం లాంటి శిలాజ ఇంధనాలు సహజ ప్రక్రియలో చాలా నెమ్మదిగా తయారవుతాయి. కానీ జీవ ఇంధనాలను మాత్రం మొక్కలు, వ్యవసాయ, గృహ, పారిశ్రామిక జీవవ్యర్థాల నుంచి తక్కువ వ్యవధిలోనే ఉత్పత్తి చేయవచ్చు. అటు కాలుష్య సమస్యకు పరిష్కారంగా, ఇటు శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా వినియోగంలోకి వస్తున్న ఈ పునరుత్పాదక ఇంధన వనరుల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ప్రధానంగా రవాణా రంగంలో వినియోగం అధికమవుతున్న ఈ జీవఇంధనాల రకాలు, ఉత్పత్తి వనరులు, అందుకు అవసరమైన సాంకేతికతలు, వాటి వినియోగం తీరుతెన్నులు, ఆర్థిక, పర్యావరణపరమైన ఉపయోగాలను తెలుసుకోవాలి.



జనరల్ స్టడీస్ - పర్యావరణ అంశాలు

జీవ ఇంధనాలు

జీవ ఇంధనాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జీవద్రవ్యరాశి వనరుగా ఉంటుంది. మొక్కల సంబంధిత పదార్థాలు/ జంతువుల వ్యర్థాలతోనే జీవద్రవ్యరాశి తయారవుతుంది. జీవ ఇంధనాలు 1) ఘన 2) ద్రవ 3) వాయువు రూపాల్లో ఉంటాయి.

ప్రాథమిక జీవ ఇంధనాలు: ఇందులో సేంద్రియ పదార్థం ప్రత్యక్షంగా జీవ ఇంధనంగా ఉపయోగపడుతుంది.
ఉదా: వంటచెరకు, వుడ్‌చిప్స్, బ్రికెట్స్

ద్వితీయ జీవ ఇంధనాలు: ఈ ఇంధనాల్లో జీవ ద్రవ్యరాశికి చెందిన ప్రాసెస్ చేసిన పదార్థాలు ఉంటాయి. **ఉదా:** ఇథనాల్, బయోడీజిల్.

జీవఇంధనం తరాలు:

1) మొదటి తరం జీవ ఇంధనాలు: ఆహార పంటల ఉత్పన్నాలైన పిండిపదార్థాలు, చక్కెరలు, వెజిటబుల్ ఆయిల్స్, జంతువుల కొవ్వును ఉపయోగించి మొదటితరం జీవ ఇంధనాలను తయారుచేస్తారు. అంటే మొదటితరం జీవ ఇంధనాలు కిణ్వప్రక్రియ ద్వారా తయారవుతాయి. వీటి ఉత్పత్తి వనరులుగా మొక్కజొన్న, గోధుమ, చెరకు, షుగర్ బీట్, వేరుశనగ, సోయాబీన్స్, రాప్సీడ్ లాంటి వాటిని ఉపయోగిస్తారు. మొదటితరం జీవ ఇంధనాలకు **ఉదా:** బయోగ్యాస్, బయోడీజిల్, ఇథనాల్.

- ★ మొదటితరం జీవ ఇంధనంగా ఉత్పత్తి చేసిన ఇథనాల్‌ను వాహనాల ఇంజిన్ భాగాలను మార్పు చేసి ప్రత్యక్షంగానైనా ఉపయోగించవచ్చు లేదా పెట్రోలియంలో కలిపి కూడా వాడవచ్చు.
- ★ 1 లీటర్ ఇథనాల్ = 1 లీటర్ పెట్రోల్ ద్వారా విడుదలయ్యే శక్తిలో 2/3వ వంతుకు సమానం.
- ★ పెట్రోలియంతో కలిపి ఇథనాల్‌ను ఉపయోగించడం వల్ల వెలువడే కార్బన్, సల్ఫర్ ఉద్గారాలు తక్కువగా ఉంటాయి.

బయోగ్యాస్: మొదటి తరం జీవ ఇంధనాలకు ఉదాహరణ. ఇందులో 60 శాతం మీథేన్, 40 శాతం కార్బన్ డయాక్సైడ్, కొన్ని అరుదైన వాయువులు ఉంటాయి.

కిణ్వన ప్రక్రియ: కిణ్వన ప్రక్రియను జీవక్రియ ప్రక్రియగా నిర్వచించవచ్చు. దీనిలో బ్యాక్టీరియా, ఈస్ట్ ఆక్సిజన్ లేనప్పుడు గ్లూకోజ్‌ను యాసిడ్, ఆల్కహాల్ లేదా వాయువుగా మారుస్తుంది. ★ వాణిజ్యపరమైన ఇథనాల్ ఉత్పత్తికి 'సాకరోమైసెస్' అనే ఈస్ట్‌ను ఉపయోగిస్తారు.

కొన్ని ముఖ్యమైన జీవ ఇంధనాలు:

బయో-ఇథనాల్: పిండిపదార్థం, చక్కెర పంటల లాంటి మూలాల నుంచి కిణ్వ ప్రక్రియ ద్వారా దీన్ని ఉత్పత్తి చేస్తారు. సాధారణంగా పెట్రోల్‌తో కలుపుతారు.

గమనిక: 2022, జూన్‌లో ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ కార్యక్రమం కింద దేశంలో పెట్రోల్‌లో సగటున 10% ఇథనాల్ కలపాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం సాధించింది. ఈ లక్ష్యం 2022, నవంబరు నాటికి సాధించాల్సి ఉండగా 5 నెలల ముందే సాధ్యమైంది.

బయోడీజిల్: కూరగాయలు/ మొక్కలు/జంతువుల నూనెల నుంచి ట్రాన్స్‌స్టెరిఫికేషన్ ప్రక్రియ ద్వారా దీన్ని తయారుచేస్తారు.

బయోగ్యాస్: వృక్ష, జంతు సంబంధ వ్యర్థాలను వాయురహితంగా కుళ్లబెట్టడం ద్వారా బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తారు.

బయోఇథనాల్: బయో ద్రవ్యరాశిని కిణ్వప్రక్రియకు గురిచేసి బయో-బ్యూటనాల్ తయారు చేస్తారు.

- ★ లూయిపాశ్చర్ 1857లో కిణ్వప్రక్రియను కనుక్కున్నాడు. ★ 1857లో లాక్టిక్ యాసిడ్ క్షయం సూక్ష్మజీవుల వల్ల సంభవిస్తుందని నిరూపించాడు. ★ 1860లో సూక్ష్మజీవుల పని పాశ్చరైజేషన్‌ను ప్రేరేపించిందని గుర్తించాడు.

2) రెండో తరం జీవఇంధనాల వెలికితీతకు ఉపయోగించే సాంకేతికత: మొదటితరం జీవ ఇంధనాలకు ఉపయోగించే ముడిసరకునే రెండోతరం జీవ ఇంధనాలకూ వాడతారు. అయితే అన్నిరకాలూ రెండో తరం జీవ ఇంధనాలకు ఉపయోగపడకపోవచ్చు, అందుకే ప్రత్యేకించి కొన్ని మొక్కలను పెంచి వాటి ప్రత్యక్ష జీవద్రవ్యరాశిని వినియోగించవచ్చు. ఇవి సాధారణంగా ఆహారేతర పంటలు. **ఉదా:** గడ్డిమారండి, జట్రోఫా, కానుగ.

★ ఈ ముడిసరకు లిగ్నో సెల్యులోజ్‌తో నిర్మితమై ఉంటుంది. అందుకే వీటి నుంచి ఇంధనాలు పొందాలంటే అనేక ప్రాసెసింగ్ దశలు అవసరమవుతాయి. **ఉదా:** 1) థర్మోకెమికల్ మార్పిడి (ఇందులో పైరోలైసిస్, గ్యాసిఫికేషన్ లాంటి చర్యలు ఇమిడి ఉంటాయి) 2) జీవరసాయన మార్పిడి (ఇందులో ట్రాన్స్‌స్టెరిఫికేషన్ లాంటి చర్యలు ఇమిడి ఉంటాయి)

3) మూడోతరం జీవ ఇంధనాలు: ఈ జీవఇంధనాలను ఆల్గల్ ఆయిల్/ఆల్గా ఆయిల్ అంటారు. ఎందుకంటే శైవల వర్గానికి చెందిన వాటితోనే ఈ జీవఇంధనాలను ఉత్పత్తి చేస్తారు. **ఉదా:** బోట్రియోకోకస్, స్కిజోకైట్రియం లాంటివి. వీటి పొడి బరువులో సుమారుగా 80% లిపిడ్లు ఉంటాయి. క్లోరెల్లా, డునాలియెల్లా లాంటి శైవలాల్లోనూ లిపిడ్లు కలిసి ఉంటాయి. ట్రాన్స్‌స్టెరిఫికేషన్ ప్రక్రియను ఉపయోగించి లిపిడ్లను బయోడీజిల్‌గా మార్చవచ్చు.

బయోడీజిల్ లేదా జీవ ఇంధనాల ఉత్పత్తికి శైవలాలే ఎందుకు?: ★ భూమిపైన అతివేగంగా పెరిగే మొక్కలు శైవలాలు. కాలానుగుణంగా పండే పంటల మాదిరి కాకుండా వీటిని సంవత్సరమంతా పెంచవచ్చు. ఒక హెక్టారులో పండించే శైవలం ఉత్పాదకత.. సోయాబీన్స్, జట్రోఫా, మొక్కజొన్న మొక్కల కంటే 10 - 100 రెట్లు ఎక్కువ. ★ శైవలాల జీవ ద్రవ్యరాశి మొత్తం అంత్య ఉత్పన్నంలో వినియోగమవుతుంది. ఇతర మొక్కల్లో ఈ విధమైన అనుకూలత ఉండదు. కానుగలో విత్తనాలు మాత్రమే జీవ ఇంధనాల తయారీకి ఉపయోగిస్తారు. ★ జట్రోఫా మొక్క విత్తనాలు దిగుబడి ఇవ్వాలంటే 2-3 ఏళ్లు పడుతుంది. అదే శైవలం దిగుబడి 2-3 రోజుల్లోనే వస్తుంది.



4) నాలుగో తరం జీవ ఇంధనాలు: విద్యుత్తు-జీవ ఇంధనాలు/ సూక్ష్మజీవుల ఇంధన కణాలు- MFC సాంకేతికతను ఉపయోగించి వీటిని ఉత్పత్తి చేస్తారు.

వ్యర్థాల నుంచి శక్తి ఉత్పత్తి చేయడం: క్షీణత చెందే ప్రతి సేంద్రియ వ్యర్థం శక్తి ఉత్పత్తికి ముడివనరుగా ఉపయోగపడుతుంది. సాంకేతికతతో ఘన, ద్రవ వ్యర్థాల ద్వారా కలిగే దుష్ప్రభావాలను తగ్గించవచ్చు. వ్యర్థాలను పలు విధాలుగా వర్గీకరించవచ్చు. 1) పట్టణ వ్యర్థాలు 2) పారిశ్రామిక వ్యర్థాలు 3) జీవ ద్రవ్యరాశి వ్యర్థాలు 4) బయో మెడికల్ వ్యర్థాలు.

వ్యర్థాల నుంచి శక్తిని పొందే సాంకేతికతలు: జీవక్షయం చెందే, చెందని వ్యర్థాల నుంచి పలు పద్ధతుల్లో శక్తిని పొందవచ్చు.

1) ఉష్ణమార్పిడి: ఇందులో దహన ప్రక్రియ ప్రధాన ఎంపికగా ఉంటుంది. ప్రస్తుతం ఈ విధానంపై దృష్టి సారించడం లేదు.

2) థర్మోకెమికల్ మార్పిడి: సేంద్రియ జీవక్షయం చెందని, తక్కువ తేమ ఉండే వ్యర్థాలను శక్తిగా మార్చడానికి ఈ విధానాన్ని ఉపయోగిస్తారు.

3) బయో కెమికల్ మార్పిడి: వాయురహిత జీర్ణక్రియ, కిణ్వప్రక్రియలు ఈ వర్గంలో ప్రధాన సాంకేతిక ఎంపికలు.

4) విద్యుత్తు కెమికల్ మార్పిడి: ఈ విధానంలో సూక్ష్మఇంధన కణాల (MFCs)ను ఉపయోగించి వ్యర్థాల నుంచి శక్తిని పొందుతారు.

జీవ ఇంధనాల ప్రయోజనాలు

జీవ ఇంధనాలు ప్రస్తుత ఇంజిన్ డిజైన్లకు అనుగుణంగా ఉంటాయి. విభిన్న పరిస్థితుల్లో బాగా పనిచేస్తాయి. ★ ఇవి మెరుగైన లూబ్రికేటింగ్ లక్షణాలతో ఉంటాయి. ఇది వాహన ఇంజిన్ జీవిత కాలాన్ని పెంచుతుంది. ఇంజిన్‌ను ఎక్కువసేపు పనిచేసే విధంగా చేస్తుంది. తక్కువ నిర్వహణ వ్యయం, కాలుష్యాన్ని తగ్గిస్తుంది.

తక్కువ కార్బన్ ఉద్గారాలు: జీవ ఇంధనం పునరుత్పాదక వనరుల నుంచి తయారవుతుంది. శిలాజ డీజిల్‌తో పోలిస్తే తక్కువ మండే సామర్థ్యం ఉంటుంది. ★ ప్రామాణిక డీజిల్‌తో పోలిస్తే జీవఇంధనం తక్కువ హానికరమైన కార్బన్ ఉద్గారాలను వెలువరిస్తుంది. ★ జీవ ఇంధనాలు హరిత గృహ వాయువులను 65 శాతం వరకు తగ్గిస్తాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ★ జీవ ఇంధనాలకు ముడి సరకు సులువుగా లభ్యమవుతుంది.

ఆర్థిక భద్రత: ఎక్కువమంది ప్రజలు జీవ ఇంధనాల వైపు మొగ్గు చూపితే, ఒక దేశం శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చు. పెరుగుతున్న జీవ ఇంధన పరిశ్రమతో మరిన్ని ఉద్యోగాల సృష్టి సాధ్యమవుతుంది. ఇది మన ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుంది.

తక్కువ స్థాయి కాలుష్యం: జీవ ఇంధనాలు జీవక్షయం చెందుతాయి. ఫలితంగా వీటి రవాణా, నిల్వ లేదా ఉపయోగం సమయంలో నేల కాలుష్యం, భూగర్భజలాలు కలుషితమయ్యే అవకాశం తగ్గుతుంది.

ఖర్చు ప్రయోజనం: ప్రస్తుతానికి, బయో ఇంధనాల ధర మార్కెట్‌లో గ్యాసోలిన్ ధరతో సమానం. అయితే వీటిని ఉపయోగించడం వల్ల మొత్తం ఖర్చు-ప్రయోజనం చాలా ఎక్కువ. అవి స్వచ్ఛ ఇంధనాలు. అంటే మండేటప్పుడు తక్కువ కర్బన, సల్ఫర్ ఉద్గారాలను విడుదల చేస్తాయి. పారిస్ ఒప్పందంలోని లక్ష్యాల అమలుకు వీటికి డిమాండ్ ఏర్పడవచ్చు. భవిష్యత్తులో ఇవి చౌకగా మారే అవకాశం ఉంది.

టీజీపీఎస్సీ
భారతదేశ చరిత్ర
సింధు నాగరికత

డీఎస్సీ/టెట్ - 2024
బయాలజీ కంటెంట్



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

ఆ రాష్ట్రంలో గంజాయి సాగుకు చట్టబద్ధత!

దేశంలో ధనిక రాష్ట్రాలుగా దిల్లీ, తెలంగాణ, కర్ణాటక నిలిస్తే, పేదరికంలో బిహార్, ఝార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్‌లు ఉన్నాయని కేంద్రం నివేదిక విడుదల చేసింది. హిమాచల్ ప్రదేశ్‌లో గంజాయి సాగును ఆమోదిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అతిపెద్ద హిందూ దేవాలయమైన కంబోడియాలోని అంగ్‌కోర్ వాట్ 'మోస్ట్ ఫొటోజెనిక్ హెరిటేజ్ సైట్'గా గుర్తింపు పొందింది. దిల్లీకి మూడో మహిళా ముఖ్యమంత్రిగా ఆతిశీ బాధ్యతలు చేపట్టారు. ఈ విధమైన ఆసక్తిని కలిగించే అంశాలతోపాటు సమాచారపూరితంగా ఉండే దేశ, విదేశీ వర్తమాన విశేషాలను పరీక్షార్థులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులు, క్రీడలు జరిగిన ప్రదేశాలు, వాటి విశేషాలు, దేశ, విదేశీ రాజకీయ పరిణామాలు, రక్షణ రంగంలో నూతన ఆవిష్కరణలు, అంతరిక్ష ప్రయోగాలు, వార్తల్లో నిలిచిన వ్యక్తులు, విడుదలైన పుస్తకాలు, కీలక నియామకాలు, భారత విదేశీ వ్యవహారాలకు సంబంధించిన పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.



నమో భారత్ ర్యాపిడ్ రైల్‌ను ప్రారంభిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

కరెంట్ అఫైర్స్



ఆసియన్ ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ 2024 విజేత భారత్

మాదిరి ప్రశ్నలు

1. 2024, సెప్టెంబరు 14న 'చమ్రాన్-1' అనే ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి విజయవంతంగా ప్రయోగించిన దేశం?
   1) ఇరాక్ 2) జపాన్ 3) ఇరాన్ 4) కెనడా
2. 'ప్రాచీ వృక్ష ఆయుర్వేద చికిత్స' (పురాతన చెట్లను సంరక్షించే) కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్రం?
   1) గుజరాత్ 2) కేరళ 3) గోవా 4) మహారాష్ట్ర
3. కిందివాటిలో సరైంది?
   ఎ) ప్రతిష్ఠాత్మక కాళోజీ నారాయణరావు సాహితీ పురస్కారం (2024) నలిమెల భాస్కర్‌కు వచ్చింది.
   బి) నలిమెల భాస్కర్ 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు.
   సి) తెలంగాణ ప్రభుత్వం 2015లో కాళోజీ నారాయణరావు పురస్కారాన్ని ఏర్పాటు చేసింది.
   డి) 2023కు ఈ పురస్కారం విజేత జయరాజ్.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి 3) ఎ, సి, డి 4) ఎ, బి, డి
4. గంజాయి సాగును చట్టబద్ధం చేసేలా ఏ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం ఆమోదించింది?
   1) రాజస్థాన్ 2) గుజరాత్ 3) హరియాణా 4) హిమాచల్‌ప్రదేశ్
5. ప్రపంచంలోనే మొదటి ట్రై-ఫోల్డ్ స్మార్ట్‌ఫోన్‌ను 'హువావే మేట్ ఎక్స్‌టీ' పేరుతో ఏ దేశానికి చెందిన హువావే కంపెనీ ఆవిష్కరించింది?
   1) అమెరికా 2) రష్యా 3) జపాన్ 4) చైనా
6. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (పీఎంఈఏసీ) ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం భారత్‌లో తొలి ఐదు ధనిక రాష్ట్రాలు, తొలి ఐదు పేద రాష్ట్రాలు వరుసగా..?
   1) ధనిక రాష్ట్రాలు - దిల్లీ, తెలంగాణ, కర్ణాటక, హరియాణా, తమిళనాడు
      పేద రాష్ట్రాలు - బిహార్, ఝార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, మణిపుర్, అస్సాం
   2) ధనిక రాష్ట్రాలు - దిల్లీ, తెలంగాణ, హరియాణా, తమిళనాడు, కర్ణాటక
      పేద రాష్ట్రాలు - బిహార్, ఝార్ఖండ్, అస్సాం, మణిపుర్, ఉత్తర్‌ప్రదేశ్
   3) ధనిక రాష్ట్రాలు - దిల్లీ, తెలంగాణ, తమిళనాడు, హరియాణా, కర్ణాటక
      పేద రాష్ట్రాలు - ఝార్ఖండ్, అస్సాం, మణిపుర్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్
   4) ధనిక రాష్ట్రాలు - దిల్లీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, హరియాణా
      పేద రాష్ట్రాలు - బిహార్, అస్సాం, ఉత్తర్‌ప్రదేశ్, మణిపుర్, ఝార్ఖండ్
7. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భోగాపురం విమానాశ్రయానికి ఏ పేరు పెడుతూ నిర్ణయం తీసుకుంది?
   1) పొట్టి శ్రీరాములు విమానాశ్రయం
   2) ఎన్టీఆర్ విమానాశ్రయం
   3) అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం
   4) గిడుగు రామ్మూర్తి విమానాశ్రయం
8. కిందివాటిలో సరైంది?
   ఎ) 1949లో గ్లోరియా టైఫూన్ తర్వాత 75 ఏళ్లలో చైనాలో పెను తుపాను 'బెబింకా' టైఫూన్ వచ్చింది.
   బి) మయన్మార్, లావోస్, వియత్నాంలో టైఫూన్ 'యాగి' విధ్వంసం సృష్టించింది. ఈ దేశాలను ఆదుకునేందుకు భారత్ 'సద్భవ్' పేరిట సహాయక ఆపరేషన్ చేసింది.
   సి) మధ్య, తూర్పు యూరప్ దేశాల్లో ఇటీవల 'బోరిస్' తుపాను వచ్చింది.
   1) ఎ, బి, సి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి
9. 'ఫైవ్ డికేడ్స్ ఇన్ పాలిటిక్స్' పుస్తక రచయిత?
   1) సుశీల్ కుమార్ షిండే 2) వెంకయ్య నాయుడు 3) నరేంద్ర మోదీ 4) ద్రౌపది ముర్ము
   నోట్: సహ రచయిత - రషీద్ కిద్వాయి
10. ఏ దేశంలో భారత రాయబారిగా డాక్టర్ స్వాతి విజయ్ కులకర్ణి నియమితులయ్యారు?
    1) ఫిజి 2) జింబాబ్వే 3) జాంబియా 4) అల్జీరియా
11. జీ20 వ్యవసాయ మంత్రుల సదస్సు ఇటీవల ఎక్కడ జరిగింది?
    1) కుయాబ (బ్రెజిల్) 2) బీజింగ్ (చైనా) 3) న్యూదిల్లీ (ఇండియా) 4) మెక్సికో సిటీ (మెక్సికో)
12. దేశంలో తొలి వందేభారత్ మెట్రో సర్వీస్ అయిన 'నమో భారత్ ర్యాపిడ్ రైల్'ను ఏ నగరాల మధ్య ఇటీవల మోదీ ప్రారంభించారు?
    1) ముంబయి - అహ్మదాబాద్ 2) భుజ్ - అహ్మదాబాద్ 3) హైదరాబాద్ - చెన్నై 4) చెన్నై - బెంగళూరు
    నోట్: మొదట ఈ రైలు పేరు 'వందే మెట్రో'
13. 2026లో కామన్వెల్త్ క్రీడలు ఎక్కడ జరుగుతాయి?
    1) గ్లాస్గో 2) న్యూదిల్లీ 3) ఆక్లాండ్ 4) హామిల్టన్
    నోట్: విక్టోరియా (ఆస్ట్రేలియా)లో జరగాలి కానీ, ఈ క్రీడల నిర్వహణ నుంచి వైదొలగుతున్నట్లు విక్టోరియా ప్రభుత్వం 2023, జులై 18న ప్రకటించింది.
14. ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ 2024 (8వ ఎడిషన్) విజేత ఎవరు?
    1) చైనా 2) జపాన్ 3) మలేసియా 4) ఇండియా
15. కిందివాటిలో సరైంది?
    ఎ) దిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ఆతిశీ మర్లెనా సింగ్ నియమితులయ్యారు.
    బి) ఆతిశీ దిల్లీకి మూడో మహిళా ముఖ్యమంత్రి.
    సి) దిల్లీ మొదటి మహిళా ముఖ్యమంత్రి సుష్మా స్వరాజ్, రెండోవారు షీలా దీక్షిత్.
    డి) భారతదేశంలో ఎక్కువ కాలం సీఎంగా పనిచేసిన మహిళ షీలా దీక్షిత్.
    1) ఎ, బి, డి 2) ఎ, బి, సి 3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి
16. జాఫర్ హసన్ ఏ దేశ నూతన ప్రధానిగా నియమితులయ్యారు?
    1) సౌదీ అరేబియా 2) ఖతర్ 3) ఒమన్ 4) జోర్డాన్
17. 'వరల్డ్ లిటరేచర్ ఇన్ ది న్యూ రియాలిటీ: డైలాగ్ ఆఫ్ ట్రెడిషన్స్, నేషనల్ వ్యాల్యూస్ అండ్ కల్చర్స్' అనే థీమ్‌తో బ్రిక్స్ లిటరేచర్ ఫోరం 2024 సదస్సు ఎక్కడ జరిగింది?
    1) ఇండియా (న్యూదిల్లీ) 2) రష్యా (కజాన్) 3) బ్రెజిల్ (రియోడిజిరో) 4) దక్షిణాఫ్రికా (కేప్‌టౌన్)
18. ఇటీవల వార్తల్లో నిలిచిన 'జొరావర్' అనేది?
    1) తేలికపాటి యుద్ధవిమానం 2) తేలికపాటి యుద్ధట్యాంకు 3) ఆధునిక ఏఐ రోబో 4) తేలికపాటి మానవ ప్రయాణ విమానం
19. 4వ గ్లోబల్ రెన్యూవబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్ ఎక్స్‌పో ఎక్కడ జరిగింది?
    1) ముంబయి 2) దిల్లీ 3) గాంధీనగర్ 4) చెన్నై
20. ఇటీవల వార్తల్లో నిలిచిన సకార్, పియాండే గిరిజన తెగలు ఏ దేశానికి చెందినవి?
    1) ఫిజి 2) నౌరు 3) పపువా న్యూగినియా 4) తువాలు
    నోట్: పోర్గెరా బంగారు గని కోసం ఈ రెండు తెగల మధ్య వివాదం మొదలైంది.
21. కిందివాటిలో సరైంది?
    ఎ) 18 ఏళ్ల లోపు వారి కోసం ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రత్యేకంగా టీన్ అకౌంట్స్‌ను మెటా సంస్థ తీసుకొచ్చింది.
    బి) మెల్‌బోర్న్ యూనివర్సిటీ దిల్లీలో తన గ్లోబల్ సెంటర్‌ను ఇటీవల ప్రారంభించింది.
    సి) అమెరికాలోని నోట్రడామ్ యూనివర్సిటీ మెదడు క్యాన్సర్‌ను గంటలోనే నిర్ధరించే పరికరాన్ని అభివృద్ధి చేసింది.
    డి) అమెరికాలోని డ్రెక్సెల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు హార్మోన్ చికిత్సతో ఇన్సులిన్ నిరోధకతను తగ్గించవచ్చని తెలిపారు.
    1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి 3) ఎ, బి, సి 4) ఎ, డి
22. ఆసియాలోనే మోస్ట్ ఫొటోజెనిక్ యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా టైమ్స్ ట్రావెల్ దేన్ని గుర్తించింది?
    1) తాజ్‌మహల్ 2) ఎల్లోరా 3) అంగ్‌కోర్ వాట్ 4) అజంతా గుహలు
23. భారత ఓడరేవులు, షిప్పింగ్ అండ్ వాటర్ వేస్ మంత్రిత్వ శాఖ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎవరిని నియమించింది?
    1) నీరజ్ చోప్రా 2) మను బాకర్ 3) సచిన్ 4) ధోని
24. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ ఎక్స్‌టెండెడ్ రియాలిటీ రంగంలో జాతీయ నైపుణ్య కేంద్రాన్ని ఎక్కడ ఏర్పాటు చేయడానికి కేంద్ర కేబినెట్ ఇటీవల ఆమోదం తెలిపింది?
    1) దిల్లీ 2) చెన్నై 3) ముంబయి 4) కోల్‌కతా
25. కిందివాటిలో సరైంది?
    ఎ) 2024 జాతీయ హిందీ దినోత్సవం థీమ్: హిందీ - ద బ్రిడ్జ్ బిట్వీన్ ట్రెడిషనల్ నాలెడ్జ్ అండ్ ఏఐ (సెప్టెంబరు 14)
    బి) 2024 అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం థీమ్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాజ్ ఏ టూల్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సెప్టెంబరు 15)
    సి) 2024 ఓజోన్ దినోత్సవం థీమ్: మాంట్రియల్ ప్రొటోకాల్: అడ్వాన్సింగ్ క్లైమేట్ యాక్షన్స్ (సెప్టెంబరు 16)
    1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, సి
26. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం సందర్భంగా అతిపొడవైన మానవహారం 2500 కి.మీ. (25 లక్షల మంది) ఏర్పాటు చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. ఇది ఏ రాష్ట్రంలో జరిగింది?
    1) కర్ణాటక 2) కేరళ 3) మహారాష్ట్ర 4) గుజరాత్
27. బయోటెక్ ఇన్నోవేషన్ అండ్ బయో-మాన్యుఫ్యాక్చరింగ్ థీమ్‌తో 4వ గ్లోబల్ బయో ఇండియా సదస్సు-2024 ఎక్కడ జరిగింది?
    1) హైదరాబాద్ 2) ముంబయి 3) న్యూదిల్లీ 4) చెన్నై
28. భారత్ కింది ఏ దేశంతో దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఇటీవల విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ప్రత్యేక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు.
    1) బల్గేరియా 2) రొమేనియా 3) క్రొయేషియా 4) అల్బేనియా
29. ఇటీవల తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి ఆవిష్కరించిన శ్రీ రామ ఇన్ తమిళగమ్ - యాన్ ఇన్‌సెపెరబుల్ బాండ్ పుస్తక రచయిత?
    1) డి.కె.హరి 2) డి.కె.హేమ హరి 3) నిధితా దాస్ 4) 1, 2



రచయిత: బి.ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-3; 2-3; 3-1; 4-4; 5-4; 6-1; 7-3; 8-1; 9-1; 10-4; 11-1; 12-2; 13-1; 14-4; 15-3; 16-4; 17-2; 18-2; 19-3; 20-3; 21-1; 22-3; 23-2; 24-3; 25-3; 26-1; 27-3; 28-2; 29-4.

అమ్మకానికి ఉక్కు భూములు

24.99 ఎకరాల విక్రయానికి ఏర్పాట్లు

విశాఖపట్నం(ఉక్కునగరం), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారం సొంత నిధులతో కొనుగోలు చేసిన 24.99 ఎకరాల భూమిని విక్రయించుకునేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో నగరం నడిబొడ్డున మద్దిలపాలెం సమీప హెచ్‌బీ కాలనీలో ఉన్న 22.90 ఎకరాలు, ఆటోనగర్‌లోని 2 ఎకరాలు, పెదగంట్యాడలో ఉన్న కొంత భూమిని అమ్మేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. వాటి విలువ బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం రూ.400 కోట్లు ఉండొచ్చని అంచనా. గతంలోనే ఈ భూముల్ని ఓ ప్రైవేటు సంస్థ ద్వారా విక్రయించేందుకు ప్లాట్లుగా విభజించి, బ్రోచర్‌ను విడుదల చేశారు. అప్పట్లో చదరపు గజం విలువ... హెచ్‌బీ కాలనీలో రూ.74వేల నుంచి రూ.81 వేలు, ఆటోనగర్‌లో రూ.30వేల నుంచి రూ.32 వేలు, పెదగంట్యాడలో రూ.20,500గా నిర్ణయించారు. ఇప్పుడు ఆయా ధరలను సమీక్షించి విక్రయించనున్నారు.

ఏఆర్ డెయిరీ ఫుడ్స్‌పై నిఘా ఉంచండి

కేంద్ర ప్రభుత్వ అధికారుల ఆదేశం

చెన్నై (ఆర్కేనగర్), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించిన నేపథ్యంలో దిండుక్కల్ ఏఆర్ డెయిరీ ఫుడ్స్ కంపెనీ సరఫరా చేసే ఉత్పత్తులపై నిఘా ఉంచాలని కేంద్రప్రభుత్వ అధికారులు ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ఆహారభద్రతా శాఖ అధికారులు ఇదివరకే ఏఆర్ డెయిరీకి వెళ్లి అక్కడి ఉత్పత్తుల నమూనాలు తీసుకెళ్లి పరిశీలించారు. దిండుక్కల్ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు కూడా అక్కడి వ్యర్థాల నమూనాలను తీసుకెళ్లి పరీక్షలు చేశారు. ఈ క్రమంలో కేంద్ర, ఏపీ, తమిళనాడు ఆహారభద్రతా శాఖ అధికారులు సంయుక్తంగా వీసీ ద్వారా సమావేశం నిర్వహించారు. ఏఆర్ డెయిరీ ఫుడ్స్ నుంచి వచ్చే పాలు, పెరుగు, వెన్న, పన్నీర్, నెయ్యి తదితర వాటిని పర్యవేక్షించాలని, కంపెనీ చర్యలపై నిఘా ఉంచాలని ఈ సమావేశం ద్వారా దిండుక్కల్ అధికారులను ఆదేశించారు.

కశ్మీరీ ప్రజలకు ఓఐసీ మద్దతు: పాక్

- దూరంగా ఉంటే మంచిది: భారత్

ఇస్లామాబాద్: జమ్మూ కశ్మీర్ ప్రజలకు మద్దతుగానే ఉంటామని కశ్మీర్‌పై ఏర్పాటైన ఓఐసీ కాంటాక్ట్ గ్రూపు మరోసారి పునరుద్ఘాటించిందని పాకిస్థాన్ వెల్లడించింది. ఐక్యరాజ్య సమితి తీర్మానాలకు అనుగుణంగా ఈ సమస్యను పరిష్కరించాలని ఆ గ్రూపు కోరుకుంటోందని తెలిపింది. అయితే ఈ విషయంలో జోక్యం చేసుకోకుండా దూరంగా ఉంటే మంచిదని 57 దేశాల ఓఐసీ గ్రూపునకు భారత్ హితవు పలికింది.

✦ న్యూయార్క్‌లో బుధవారం సర్వప్రతినిధి సభ భేటీ సందర్భంగా కశ్మీర్ అంశంపై ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ (ఓఐసీ) భేటీ అయిందని, కశ్మీరీల పోరాటానికి మద్దతుగా నిలుస్తామని తీర్మానించిందని పాకిస్థాన్ విదేశాంగశాఖ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రకటనను భారత్ ఖండించింది. కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేసింది.

అమెరికాలో పెరిగిన ఆత్మహత్యలు

న్యూయార్క్: గడచిన రెండేళ్లలో అమెరికాలో ఆత్మహత్యలు పెరిగాయి. 2022లో 49,500కు కాస్త తక్కువగా ఆత్మహత్యలు జరగ్గా.. 2023లో 49,300 కేసులు నమోదయ్యాయి. కొవిడ్ 19 మొదలైన తరవాత రెండేళ్లపాటు ఆత్మహత్యలు తగ్గినా, అమెరికాలో మొత్తం మీద 20ఏళ్ల నుంచి ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. 2022లో అమెరికన్ల మరణాలకు కారణాల్లో ఆత్మహత్యలు 11వ స్థానంలో ఉన్నాయి. ఆ సంవత్సరం జరిగిన ఆత్మహత్యల్లో 55 శాతం తుపాకులతోనే జరిగాయి. బాలికలు, మహిళలకన్నా బాలురు, పురుషుల్లోనే ఎక్కువ ఆత్మహత్యలు జరుగుతున్నాయి.

పదుల సంఖ్యలో ఆయుధాల కోసం యురేనియం సిద్ధం

సియోల్: పదుల సంఖ్యలో అణ్వస్త్రాలను తయారు చేయడానికి కావాల్సిన యురేనియంను ఉత్తర కొరియా శుద్ధి చేసి సిద్ధం చేసుకుని ఉండొచ్చని దక్షిణ కొరియా గూఢచార సంస్థ నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (ఎన్‌ఐఎస్) వెల్లడించింది. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఈ నెల 13న రహస్య యురేనియం శుద్ధి కర్మాగారాన్ని సందర్శించారని, అణు బాంబుల తయారీకి కావాల్సిన స్థాయిలో యురేనియంను శుద్ధి చేసే సత్తా ఆ కర్మాగారానికి ఉందని తెలిపింది. ఈ నెల 18న ఉత్తర కొరియా 2 కొత్త క్షిపణులతో ప్రయోగాలను నిర్వహించింది. వాటిలో ఒకటి అణ్వస్త్రాన్ని ప్రయోగించగలదు.

ముందుగా అణ్వస్త్రాలను వాడం: చైనా

బీజింగ్: ముందుగా అణ్వస్త్రాలను వాడబోమన్న నిబంధనకు గట్టిగా కట్టుబడి ఉన్నామని చైనా మరోసారి పునరుద్ఘాటించింది. 'చైనా అణు విధానం స్థిరత్వంతో కూడుకున్నది. మేం అణ్వస్త్ర దేశాలపైగానీ, అణ్వస్త్రాలు లేని దేశాలపైగానీ ముందుగా అణ్వస్త్రాలను ప్రయోగించబోమన్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం' అని చైనా సీనియర్ కర్నల్ జాంగ్ జియాగాంగ్ తెలిపారు. బుధవారం పరీక్షించిన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణితో దీనికి సంబంధం లేదని తేల్చి చెప్పారు.

రాహుల్ పౌరసత్వంపై అలహాబాద్ హైకోర్టులో విచారణ ఏ స్థాయిలో ఉందో తెలపండి

- కేంద్రానికి దిల్లీ హైకోర్టు ఆదేశం

దిల్లీ: ఒకే అంశంపై ఏకకాలంలో రెండు కోర్టుల్లో విచారణ సరికాదని దిల్లీ హైకోర్టు అభిప్రాయపడింది. రాహుల్ గాంధీ పౌరసత్వ వివాదంపై సుబ్రమణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ మన్మోహన్, జస్టిస్ తుషార్ రావు గేదెల ధర్మాసనం గురువారం ఈ వ్యాఖ్యలు చేసింది. రాహుల్‌కు బ్రిటన్ పౌరసత్వంతో పాటు భారత పౌరసత్వం ఉందని, దీనిపై కేంద్ర హోంశాఖ చర్యలు తీసుకోవాలని కోరుతూ భాజపా కార్యకర్త ఎస్.విఘ్నేశ్ శిశిర్ దాఖలు చేసిన వ్యాజ్యంపై అలహాబాద్ హైకోర్టులోని లఖ్‌నవూ ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఇదే అంశంపై సుబ్రమణ్య స్వామి దాఖలు చేసిన మరో పిటిషన్ గురువారం దిల్లీ హైకోర్టు ముందుకు వచ్చింది. ఒకే అంశంపై ఏకకాలంలో రెండు కోర్టుల్లో విచారణ తగదని పేర్కొన్న దిల్లీ హైకోర్టు.... ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టులో ఉన్న పిటిషన్‌పై విచారణ ఏ స్థాయిలో ఉందో తమకు నివేదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.



వాహనంలో కృత్రిమ అవయవాలను తయారు చేస్తారిలా..

కృత్రిమ అవయవాలు దివ్యాంగుల చెంతకే

ప్రత్యేక వాహనాల్లోనే తయారీ

- క్యాంపుల్లో అక్కడికక్కడే అమరిక
- మెడ్‌టెక్ జోన్ నుంచి వాహనం కొనుగోలుకు అధికారుల నిర్ణయం

ఈనాడు - అమరావతి

కృత్రిమ అవయవాల కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నా అవి అందడానికి నెలల తరబడి జాప్యం జరుగుతూ ఉంటుంది. ఈ జాప్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దివ్యాంగుల వద్దకు వెళ్లి అక్కడికక్కడే కృత్రిమ అవయవాలను తయారు చేసి ఒక్క రోజులోనే వారికి ఉచితంగా అమర్చేలా కార్యాచరణ రూపొందించింది. దీని కోసం ప్రత్యేక వాహనం 'మొబైల్ ప్రోస్థటిక్స్ అండ్ ఆర్థోటిక్స్ వ్యాన్'ను అందుబాటులోకి తీసుకురానుంది. విశాఖలోని మెడ్‌టెక్ జోన్ నుంచి ఈ వాహనాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఇప్పటికే సీఎం చంద్రబాబు ఆదేశించారు.

జాప్యాన్ని అరికట్టేలా..

గతంలో కృత్రిమ అవయవాలను కేంద్రప్రభుత్వ సంస్థ అయిన అలిమ్‌కో నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకునేది. అవసరమైన వారి నుంచి దరఖాస్తులు, కొలతలు తీసుకుని, అవయవాలను తయారుచేసి అందించేవారు. ఇందుకు దాదాపుగా 6 నెలల నుంచి ఏడాది వరకు సమయం పట్టేది. చిన్నపిల్లలకు కొలతల్లో తేడా వచ్చి అవయవాలు సరిపోయేవి కాదు. తాజా విధానంలో చిన్నపిల్లలకు జాప్యం లేకుండా కృత్రిమ అవయవాలను రూపొందించి ఇవ్వొచ్చు.

వాహనం ఖరీదు రూ.42 లక్షలు

తొలివిడతలో పైలట్ ప్రాజెక్టు కింద ఒక వాహనాన్ని కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ వాహనం ఖరీదు రూ.42 లక్షలు. ఇందులోనే కృత్రిమ అవయవాలను తయారుచేసే పరికరాలు, వాటి తయారీకి నిపుణులు ఉంటారు. దివ్యాంగుల వద్ద వారే కొలతలు తీసుకుని కృత్రిమ అవయవాలను తయారుచేస్తారు. వాటిని అమర్చిన తర్వాత వినియోగంపై శిక్షణ ఇస్తారు. ఒకటి, రెండు గ్రామాల్లో పరిశీలన తర్వాత దరఖాస్తుదారుల సంఖ్యకు అనుగుణంగా మరిన్ని వాహనాలు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. వైద్య ఆరోగ్యశాఖ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనుంది.

ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి అమరిక

ప్రస్తుతం రూ.3వేల నుంచి రూ.10వేల విలువైన కృత్రిమ అవయవాలు అందిస్తుండగా నూతన సాంకేతికతతో ఉండే తేలికైన వాటిని దివ్యాంగులకు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వాటి విలువ రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుందని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు ప్రభుత్వానికి త్వరలో ప్రతిపాదనలు పంపనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగుల విభాగంలో ప్రస్తుతం 8 లక్షల మంది పింఛన్లు తీసుకుంటున్నారు. వీరిలో కృత్రిమ చేతులు, కాళ్లు అవసరమైనవారి వివరాలను వైద్య, ఆరోగ్యశాఖ, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సేకరించనున్నారు. ఆ తర్వాత వాహనం ఏ ప్రాంతానికి వెళుతుందో అక్కడి వారికి ముందస్తుగా సమాచారమిస్తారు. కృత్రిమ అవయవాలు అమర్చుకునేవారి సంఖ్యకు అనుగుణంగా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు.

తితిదేకు తొలిసారిగా పలాస జీడిపప్పు



జెండా ఊపి లారీని ప్రారంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానానికి తొలిసారిగా శ్రీకాకుళం జిల్లా పలాస జీడిపప్పును గురువారం పంపించారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జీడిపప్పు సరఫరా చేసేందుకు కాశీబుగ్గ పారిశ్రామికవాడలోని ఎస్ఎస్ఎస్ ఇంటర్నేషనల్ ఆగ్రో ఉత్పత్తుల సంస్థకు ఇటీవల టెండర్ ఖరారైంది. ఈ మేరకు 10 టన్నుల సరకును పంపించారు. నాణ్యతలో రాజీపడకుండా మేలురకం పంపిస్తామని సంస్థ యజమాని సంతోష్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

లడ్డూ కల్తీకి తితిదే బోర్డు సభ్యులే బాధ్యత వహించాలి

జగన్ నుంచి డిక్లరేషన్ తీసుకోవడం అధికారుల బాధ్యత: పవన్‌కల్యాణ్



ఈనాడు డిజిటల్, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో తయారుచేసి అపవిత్రం చేయడానికి కారకులు, అలాంటి నెయ్యి సరఫరాకు అనుమతులు ఇచ్చిన తితిదే బోర్డులోని నాటి సభ్యులే బాధ్యత వహించాలని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. నాడు తితిదే బోర్డులను నియమించినవాళ్లు కూడా ఈ వ్యవహారంపై సమాధానం చెప్పాలని గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 'తిరుమల అపవిత్రం కావడం, ఆలయ ఆచారాలకు భంగం వాటిల్లేలా తితిదే బోర్డు నిర్ణయాలు తీసుకోవడం హిందువుల అంతర్గత విషయాలు. హిందూ ధర్మాన్ని కాపాడతామని బాధ్యత తీసుకున్న వారే అందుకు విరుద్ధంగా వ్యవహరించినందుకు వారినే ప్రశ్నించాలి. వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, ధర్మారెడ్డి తిరుమలలో ధర్మాన్ని కాపాడతామని బాధ్యతలు స్వీకరించారు. లడ్డూ అపవిత్రతపై వీరే ముందు సమాధానం చెప్పాలి. శిక్ష ఎవరికి పడాలో విచారణలో తేలుతుంది. ఆపై శిక్షలు వేంకటేశ్వరస్వామి చూసుకుంటారు' అని పేర్కొన్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్ తిరుమల వెళ్లాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో ఆయన మతాన్ని, పర్యటనను లక్ష్యంగా చేసుకొని ఎవరూ మాట్లాడొద్దని పవన్ సూచించారు. 'జగన్ నుంచి డిక్లరేషన్ తీసుకోవడం తితిదే అధికారుల బాధ్యత. దీనిపై ఎవరూ ప్రత్యేకంగా మాట్లాడాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో ఆ వ్యక్తి తరపు వాళ్లు కోరుకునేది గొడవలే. వైకాపా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తుని, అధికారంలోకి వచ్చాక కోనసీమ అల్లర్లు సృష్టించింది. ఇప్పుడు మతాల మధ్య మంటలు రేపాలని చూస్తోంది. వైకాపా వ్యవహార శైలిపై పోలీసులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని పవన్‌కల్యాణ్ సూచించారు.

కన్నడనాట సీబీఐకి నో!

- సాధారణ సమ్మతి ఉపసంహరణ
- మంత్రివర్గం కీలక తీర్మానం

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక పరిధిలో ఏదైనా కేసులో విచారణ కోసం వచ్చేందుకు సీబీఐకి ప్రస్తుతం ఉన్న సాధారణ సమ్మతిని ఉపసంహరించుకోవాలని కర్ణాటక మంత్రివర్గం తీర్మానించింది. గురువారం ఆ రాష్ట్ర శాసనసభ వ్యవహారాల మంత్రి హెచ్.కె.పాటిల్ దీనిపై మాట్లాడుతూ.. ఇకపై రాష్ట్రంలో చేపట్టే సీబీఐ విచారణకు ప్రతి కేసునూ పరిశీలించాకే అనుమతివ్వాలని నిర్ణయించామని పేర్కొన్నారు. దాంతో దిల్లీ స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం-6వ సెక్షన్ ప్రకారం రాష్ట్రంలో సీబీఐ నేరుగా విచారించే స్వేచ్ఛను కోల్పోనుంది. ఈ నిర్ణయానికి కారణాలను మంత్రి వివరించారు. 'సీబీఐ పక్షపాతిగా వ్యవహరిస్తోంది. రాష్ట్రం అనుమతించిన చాలా కేసుల్లో అది ఛార్జ్‌షీట్ కూడా తెరవలేదు. అక్రమ మైనింగ్‌కు సంబంధించిన చాలా కేసులను విచారించేందుకు నిరాకరించింది. చాలా కేసుల్లో దానితీరు నిష్పక్షపాతంగా లేదని గుర్తించాం. గాడి తప్పుతున్న సీబీఐని నియంత్రించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. ఈ నిర్ణయం వెనుక సీఎం సిద్ధరామయ్య 'ముడా' అక్రమాల కేసు నేపథ్యం లేదు' అని వివరించారు. అలాగే ఇకపై వివరణ కోరుతూ సీఎస్‌కు గవర్నర్ పంపే ప్రతి ఆదేశాన్నీ మంత్రివర్గం దృష్టికి తీసుకురావాలని తీర్మానించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ముడా అక్రమాల కేసులో విచారించాలని ప్రజాప్రతినిధుల కోర్టు లోకాయుక్తకు ఆదేశించగా.. విచారణను సీబీఐకి అప్పగించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయాలు చర్చనీయాంశమయ్యాయి.

సీఎం పదవిపై ఆశలేదు: షర్మిల



ఈనాడు డిజిటల్, అమరావతి: 'నాకు ముఖ్యమంత్రి అవ్వాలని కోరికలేదు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యం' అని కాంగ్రెస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల వ్యాఖ్యానించారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. దేశానికి రాహుల్ ప్రధాని కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. అప్పుడే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని, విభజన సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్సే ప్రతిపక్షమని స్పష్టం చేశారు. కొత్తగా నియమించిన రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులతో గురువారం విజయవాడలో ఆమె సమావేశం నిర్వహించారు. 'నేను వైతెపాను కాంగ్రెస్‌లో విలీనం చేసినప్పుడు రాజ్యసభ స్థానం తీసుకొని ఉండొచ్చు. కానీ, తెలంగాణలో ప్రస్తుతం నా అవసరం లేదు. అక్కడ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చాం. ఇప్పుడు ఏపీలో మనం అధికారంలోకి రావాల్సి ఉంది. నా అవసరం ఇక్కడే ఉంది. బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్‌నిర్మించాలి' అని నేతలకు సూచించారు. 'త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సవాలుగా స్వీకరించాలి. చాలాచోట్ల గెలవాలి' అని షర్మిల స్పష్టం చేశారు. వైకాపాలోని నాయకులు, కార్యకర్తలను చేర్చుకుని ఆ పార్టీని ఖాళీ చేయించాలని ఈ సందర్భంగా పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. వైకాపాలో ప్రస్తుతం ఉన్న వారంతా కాంగ్రెస్ నుంచి వెళ్లిన వారేనని...తిరిగి వారిని వెనక్కి తీసుకొచ్చే బాధ్యత నేతలు తీసుకోవాలని కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్కం ఠాగూర్ సూచించారు. కేంద్ర మాజీ మంత్రులు పల్లంరాజు, జేడీ శీలం, పార్టీ సీనియర్ నేతలు రఘువీరారెడ్డి, శైలజనాథ్, గిడుగు రుద్రరాజు, కేవీపీ రామచంద్రరావు మాట్లాడారు.

రామాయణం పాఠ్యాంశంగా రావాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- వాల్మీకి రామాయణ పరిశోధన కేంద్రం ప్రారంభం





రామనారాయణంలో ఏర్పాటు చేసిన పరిశోధన కేంద్రం ● వెంకయ్యనాయుడిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఈనాడు, విజయనగరం: శ్రీరాముడి జీవితం యువతరానికి ఆదర్శనీయమని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఆయన బాటలో నేటితరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా కేంద్రం సమీపంలోని రామనారాయణంలో ఏర్పాటు చేసిన వాల్మీకి రామాయణ పరిశోధన కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. రామాయణంలోని మానవీయ విలువలను భావితరాలకు అందించడానికి ఈ పరిశోధన కేంద్రం ద్వారా కృషిచేయాలని కోరారు. నారాయణ నరసింహమూర్తి కృషికి ప్రతిరూపంగా ఈ కేంద్రం ఏర్పాటుచేసిన ఆయన కుమారులు, కుటుంబసభ్యులను ప్రశంసించారు. దేశంలోని అన్ని పాఠశాలల్లో రామాయణం పాఠ్యాంశంగా రావాలని, ఇంటింటా పారాయణం కావాలని ఆకాంక్షించారు. చిలుకూరి బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకుడు సౌందరరాజన్ రంగరాజన్ స్వామి, ఆచార్య జీఎస్ఆర్.కృష్ణమూర్తి, మాజీ ఎంపీ టీజీ.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

12 వేల గ్రంథాలు, పుస్తకాలు..

రామాయణాన్ని నేటి సమాజానికి పరిచయం చేయడమే వాల్మీకి పరిశోధన కేంద్రం ప్రధాన లక్ష్యం. ఇక్కడ 12 వేల గ్రంథాలు, పుస్తకాలు అందుబాటులో ఉంచనున్నారు. భవిష్యత్తులో ఈ సంఖ్యను లక్షకు పెంచుతారు. సంస్కృతం, తెలుగు, హిందీ, ఆంగ్లంతో పాటు ఇతర ప్రముఖ భాషల్లో పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు, యువత, ఆధ్యాత్మికవేత్తలు, పండితులు, ప్రవచనకర్తలు, గురూజీలు నిరంతరం అధ్యయనం చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామని ధర్మకర్తలు నారాయణం నాగేశ్వరరావు, శ్రీనివాస్ తెలిపారు. పరిశోధనలు (పీహెచ్‌డీ) చేసేవారికి ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.


భారీ పరిశ్రమలకూ మూలధన రాయితీ!

ఇప్పటి వరకు 'కియా'కు మాత్రమే ఇది వర్తింపు

పొరుగు రాష్ట్రాలతో పోటీపడి పెట్టుబడులు ఆకర్షించేలా ప్రణాళిక

నూతన పారిశ్రామిక విధానంపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష

ఈనాడు - అమరావతి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులతో వచ్చేవారికి మూలధన రాయితీ (క్యాపిటల్ సబ్సిడీ) ఇచ్చేలా కొత్త నిబంధన తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. పొరుగు రాష్ట్రాలతో పోటీపడి పెట్టుబడులను ఆకర్షించడానికి ఇది తప్పనిసరని యోచిస్తోంది. ఆ మేరకు కొత్త పారిశ్రామిక విధానం ద్వారా కీలక నిర్ణయాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు తెలిసింది. పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా కొత్త పారిశ్రామిక విధానం ఉండాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. నూతన పారిశ్రామిక విధానంలో తీసుకురావాల్సిన కీలక అంశాలపై సచివాలయంలో పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో సీఎం గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కొత్త పాలసీ ఎలా ఉండాలి? ఇతర రాష్ట్రాలతో పోటీపడి పెట్టుబడుల ఆకర్షణకు అనుసరించాల్సిన విధానాలు ఏమిటి? తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ వంటి పోటీ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న పాలసీ నిబంధనలు ఏమిటి? వంటి వివరాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముసాయిదా పారిశ్రామిక విధానంలో కొన్ని మార్పులను సూచించారు. త్వరలో మరోసారి సమీక్షించి నూతన పారిశ్రామిక విధానానికి తుది రూపాన్ని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం..

పొరుగు రాష్ట్రాలు పరిశ్రమలకు మూలధన రాయితీ కింద 20 నుంచి 40 శాతం వరకు ఇస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటి వరకు అమలైన పారిశ్రామిక విధానాల ప్రకారం భారీ పరిశ్రమలకు మూలధన రాయితీ ఇచ్చేలా నిబంధనలు లేవు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలు ఎప్పటి నుంచో ఈ విధమైన రాయితీని పారిశ్రామికవేత్తలకు అందిస్తున్నాయి. దీంతో పెట్టుబడిదారులు ఆయా రాష్ట్రాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయా రాష్ట్రాలతో పోటీ పడి.. పెట్టుబడులను ఆకర్షించాలంటే మూలధన రాయితీ నిబంధన తీసుకురావాలని అధికారులు సీఎంకు సూచించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కియా కార్ల తయారీ పరిశ్రమకు మాత్రమే ఈ రకమైన రాయితీని ప్రభుత్వం ఇచ్చింది. అలాగే ఎంఎస్ఎంఈలు మూలధన రాయితీ పొందుతున్నాయి. ఇక మీదట భారీ, మెగా పరిశ్రమలకు కూడా ఈ రాయితీ ఇచ్చేలా కొత్త పారిశ్రామిక పాలసీలో నిబంధనలను తీసుకురావాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. పరిశ్రమ ఏర్పాటు చేసి.. ఉత్పత్తిలోకి వచ్చిన 10 ఏళ్ల పాటు మూలధన రాయితీ ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఒకవేళ 20 శాతం రాయితీ కింద పరిశ్రమకు చెల్లించాలని భావిస్తే.. ఆ మొత్తాన్ని ఏటా 2 శాతం చొప్పున 10 ఏళ్లలో ప్రభుత్వం ఇవ్వాలనుకుంటున్నట్లు తెలిసింది. ప్రస్తుతం కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు 40 శాతం, గుజరాత్ 30 శాతం చొప్పున పారిశ్రామికవేత్తలకు మూలధన రాయితీలను అందిస్తున్నాయి. దీన్ని పరిగణనలోకి తీసుకుని ఎంత మొత్తాన్ని అందించాలనే దానిపై సీఎం అధికారులతో చర్చించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న నైపుణ్య మానవ వనరులు, ముడిసరకు, మార్కెట్ అంశాలను కూడా పరిగణనలో ఉంచుకుని రాయితీగా ఎంత మొత్తాన్ని ఇవ్వాలనే దానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. దీనికి సంబంధించిన విధివిధానాలను తయారు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

- ప్రస్తుత పారిశ్రామిక విధానంలో అందిస్తున్న విద్యుత్ సబ్సిడీ, జీఎస్టీ తిరిగి చెల్లింపు, ఇతర రాయితీలు కొనసాగించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం.
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది.

గోధ్రా రైలు దహనం కేసులో ఇకపై వాయిదాలు కోరవద్దు

- గుజరాత్ ప్రభుత్వ న్యాయవాదికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: గోధ్రా రైలు దహనం కేసులో 11 మంది దోషులకు విధించిన జీవిత ఖైదు శిక్షను మరణ దండనగా మార్చాలని కోరుతూ గుజరాత్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. మరో ధర్మాసనం ముందు వేరే కేసులో వాదనలు వినిపించాల్సి ఉన్నందున ఈ కేసు విచారణను ఇంకో రోజుకు వాయిదా వేయాలన్న గుజరాత్ ప్రభుత్వ న్యాయవాది స్వాతి ఘిల్డియాల్ వినతిపై జస్టిస్ జె.కె.మహేశ్వరీ, జస్టిస్ రాజేశ్ బిందాల్ తీవ్రంగా స్పందించింది. తదుపరి విచారణ తేదీ నుంచి ఈ కేసులో వాయిదాలు కోరరాదని స్పష్టం చేసింది. గోధ్రా రైలు కేసు తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 15వ తేదీకి వాయిదా వేసింది. 2002 ఫిబ్రవరి 27నాటి గోధ్రా రైలు దహనం ఘటనలో 59 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసులో ట్రయల్ కోర్టు 11 మందికి మరణ దండన విధించగా గుజరాత్ హైకోర్టు 2017 అక్టోబరులో ఆ శిక్షలను జీవిత ఖైదుగా మార్చింది. దీనిని సవాల్ చేస్తూ గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది.

కల్తీ నెయ్యి సరఫరాపై విచారణకు సిట్

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరాపై గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సారథ్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ బృందంలో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టి, వైఎస్సార్ జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, తిరుపతి అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకటరావు, డీఎస్పీలు జి.సీతారామరావు, శివనారాయణస్వామి, అన్నమయ్య జిల్లా ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ టి.సత్యనారాయణ, ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ఇన్‌స్పెక్టర్ కె.ఉమామహేశ్వర్, చిత్తూరు జిల్లా కల్లూరు సీఐ ఎం.సూర్యనారాయణను సభ్యులుగా నియమించారు. విచారణలో భాగంగా ప్రభుత్వ శాఖల నుంచి సిట్ సమాచారం కోరవచ్చు. లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా కారణంగా కోట్లమంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ప్రభుత్వం పేర్కొంది. తిరుమల పవిత్రతను కాపాడేందుకు.. ఈ వ్యవహారంపై సిట్ ఆధ్వర్యంలో సమగ్ర విచారణ చేయించాలని నిర్ణయించినట్లు వివరించింది. తిరుపతి తూర్పు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఈ కేసుపై బృందం విచారిస్తుంది. సిట్‌కు సహకారం అందించాలని తితిదే ఈవోను ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులిచ్చారు.

పంజాబ్ సీఎంకు స్వల్ప అస్వస్థత

ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న వైద్యులు

చండీగఢ్: రక్త ప్రసరణలో హెచ్చు తగ్గులు, ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫ్లమేషన్ సమస్యలతో బాధపడుతున్న పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు ఆసుపత్రిలో చికిత్స చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. సాధారణ ఆరోగ్య తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన మొహాలీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫ్లమేషన్ వల్ల గుండెపై ఒత్తిడి పెరిగిందని, తద్వారా రక్త ప్రసరణలో హెచ్చుతగ్గులు వస్తున్నాయని పరీక్షల్లో గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. భగవంత్ మాన్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన అవసరంలేదని సాయంత్రం విడుదల చేసిన బులెటిన్‌లో ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి ఆరోగ్యానికి సంబంధించి వివిధ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపాయి. శుక్రవారం ఉదయం ఆయా పరీక్షల ఫలితాలు వస్తాయని వివరించాయి.

బెంగాల్ సీఎస్‌కు మరోసారి జూడాల లేఖ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో 42 రోజుల ఆందోళనల అనంతరం తిరిగి పాక్షికంగా విధుల్లో చేరిన జూనియర్ వైద్యులు ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్‌కు మరోసారి లేఖ రాశారు. ఈ నెల 18న జరిగిన చర్చల్లో అంగీకరించి ఇప్పటికీ నెరవేర్చని వాగ్దానాలను గుర్తుచేస్తూ రెండు పేజీల లేఖను పంపారు. 'చర్చల్లో ప్రతిపాదించి.. అంగీకరించిన కీలకమైన డిమాండ్లకు సంబంధించి ఎటువంటి చర్యలుగానీ, ఎలాంటి ఆదేశాలుగానీ ఇప్పటి వరకూ జారీ చేయలేదని మీ దృష్టికి తీసుకొస్తున్నాం' అని పశ్చిమ బెంగాల్ జూనియర్ వైద్యుల ఫోరం (డబ్ల్యూజేడీఎఫ్) లేఖలో పేర్కొంది.

'బ్యాడ్ టచ్' చేస్తున్నారు.. బడికెళ్లను

- ఉపాధ్యాయుడి అకృత్యంపై ఓ చిన్నారి ఆవేదన
- తల్లి ఫిర్యాదుతో అరెస్టు



గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన కృష్ణా జిల్లా గుడివాడ మండలంలో చోటుచేసుకుంది. 'సార్ నన్ను రోజూ బ్యాడ్ టచ్ చేస్తున్నారు.. బడికి వెళ్లను' అని ఆ చిన్నారి మారాం చేయడంతో ఈ ఘటన వెలుగుచూసింది. గురువు వికృత చేష్టలకు ఆ చిన్నారి కొంతకాలంగా వేదనకు గురవుతోంది. బడికి వెళ్లాలంటేనే భయంతో మొండికేస్తోంది. తల్లిదండ్రులు బతిమాలి, బెదిరించి పంపిస్తున్నారు. ఉపాధ్యాయుడి వెకిలి చేష్టలను ఇంట్లో చెప్పలేక ఇంట్లోనే ఓ మూల కూర్చొని రోదిస్తోంది. దిగాలుగా ఉన్న చిన్నారిని గురువారం ఉదయం ఎందుకు బడికి వెళ్లనంటున్నావని తల్లి ప్రశ్నించింది. ఆ చిన్నారి బావురుమని ఏడుస్తూ తల్లికి అసలు విషయం చెప్పింది. గుడివాడ మండలం చౌటపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.చంద్రశేఖర్ (42) కొంతకాలంగా నాలుగో తరగతి విద్యార్థినిని అసభ్యంగా తాకుతున్నాడని.. దీంతో బడికి వెళ్లాలంటే భయపడుతోందని ఆమె తల్లి గుడివాడ తాలుకా పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. తాలూకా ఎస్సై ఎన్.చంటిబాబు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.